ఈనాడు 2026

విజయవాడ 1-1-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 142

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఛాంపియన్

కిక్కిచ్చే 2026

ఆటల ప్రపంచాన్ని ఊపేసి, క్రీడాభిమానులకు మిశ్రమానుభూతులను మిగిల్చి మరో ఏడాది వెళ్లిపోయింది. కానీ కొత్త సంవత్సరంలో వినోదానికి ఢోకా ఏమీలేదు. రసవత్తర సమరాలు, ఉత్కంఠభరిత పోరాటాలతో 2025 కన్నా రెట్టింపు కిక్కించేందుకు 2026 రెడీ. హాకీ నుంచి బ్యాడ్మింటన్ వరకు.. టెన్నిస్ నుంచి షూటింగ్ దాకా ఎన్నో ఆటలు.. ఎన్నో టోర్నీలు. క్రీడల క్యాలెండర్ కిక్కిరిసిపోయింది. కొత్త ఏడాదిలో హైలైట్ మాత్రం ఫుట్‌బాల్ ప్రపంచకప్పే. నంబర్‌వన్ స్పోర్ట్స్ ఈవెంట్‌గా భావించే ఈ టోర్నీ కోసం ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. వాళ్లకిది పండగే. మరో వైపు క్రికెట్ ప్రేమికులను ఉర్రూతలూగించడానికి భారత్ వేదికగా టీ20 ప్రపంచ కప్ ముస్తాబవుతోంది. మరి ఈ ఫుట్‌బాల్, టీ20 ప్రపంచకప్‌తో పాటు కొత్త ఏడాదిలో వివిధ ఆటల్లో ముఖ్యమైన టోర్నీలే మున్నాయి. వాటి విశేషాలేంటి? ఎక్కడ, ఎప్పుడు జరుగుతాయి. తెలుసుకుందాం పదండి!


సూర్యకుమార్

ధనాధన్ వినోదం — టీ20 ప్రపంచకప్, ఫిబ్రవరి 7-మార్చి 8

టీమ్ఇండియా 2026 లోనూ తీరిక లేకుండా గడపనుంది. హైలైట్ మాత్రం టీ20 ప్రపంచకప్పే. సొంతగడ్డపై జరగనుండడంతో ఈ టోర్నీపై ఆసక్తి మరింత పెరిగింది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది. 2024 టీమ్ఇండియా రోహిత్ శర్మ సారథ్యంలో కప్పును అందుకుంది. శ్రీలంక కూడా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ ఫిబ్రవరి 7న మొదలవుతుంది. అదే రోజు అమెరికాతో పోరుతో టీమ్ఇండియా కప్పువేటను ఆరంభిస్తుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా న్యూజిలాండ్, శ్రీలంకల్లో భారత్ టెస్టు సిరీస్ ఆడనుంది. మరోవైపు భారత మహిళల జట్టు జూన్-జులైలో టీ20 ప్రపంచకప్‌లో పోటీపడనుంది. ఈ రెండు మెగా టోర్నీల కంటే ముందు జనవరి 15 నుంచి ఐసీసీ పురుషుల అండర్-19 ప్రపంచకప్ జరగనుంది.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ — మార్చి 26- మే 31


కోహ్లి

వేసవిలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ అభిమానులను అలరించనుంది. మార్చి 26 నుంచి మే 31 వరకు టోర్నీ జరగనుంది. 10 ఫ్రాంఛైజీలు 84 మ్యాచ్‌లు ఆడతాయి. ఆర్సీబీ డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. వేలం తర్వాత ఫ్రాంఛైజీలు కొంచెం కొత్తగా కనిపిస్తున్నాయి.


రొనాల్డో


మెస్సి

ఫుట్‌బాల్ ప్రపంచకప్ — జూన్ 11 - జులై 19




ఎంబాపె

ఈనాడు క్రీడావిభాగం

ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మంది అభిమానులను ఆకర్షించే ఆట ఫుట్‌బాల్. దాదాపు ప్రతి దేశమూ ఆడుతుంది. ఎన్నో దేశాల్లో సాకర్ అంటే జనాలకు పిచ్చి. ఓ రొనాల్డో.. ఓ మెస్సి.. ఓ ఎంబాపె.. ఇలా స్టార్ ఆటగాళ్ల ప్రదర్శనను కళ్లారా, తనివితీరా చూడాలని అభిమానులు ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. కానీ భారత జట్టు టాప్-100లో కూడా లేదు, అసలు మనం అర్హతకు దగ్గరగా కూడా వెళ్లలేదు.. మరి ఈ టోర్నీతో మనకేంటి అన్న ప్రశ్న ఉదయించవచ్చు. కానీ మన జట్టు ప్రపంచకప్‌లో లేకపోయినా.. టోర్నీ కోసం తపిస్తోన్న అభిమానులెందరో! భావోద్వేగాలకూ తక్కువ లేదు. ఇటీవల మెస్సి వచ్చినప్పుడు జనం ఎలా తరలివచ్చారో చూశారు కదా! కొందరికి మెస్సి ఇష్టం.. కొందరికి రొనాల్డో ఇష్టం. కొందరు బ్రెజిల్ అంటే పడిచస్తారు.. ఇంకొందరు అర్జెంటీనా కోసం ఆరాటపడతారు! కాబట్టి సాకర్ ప్రపంచకప్పు భారతీయులకూ మానసికంగా చేరువైందే. జూన్ 11 నుంచి జులై 19 వరకు జరిగే ఈ టోర్నీకి అమెరికా, కెనడా, మెక్సికో ఉమ్మడిగా ఆతిథ్యమిస్తున్నాయి. ఫైనల్ సహా అత్యధిక మ్యాచ్‌లు జరిగేది అమెరికాలోనే. చరిత్రలో తొలిసారి 48 జట్లతో టోర్నమెంట్ జరగనుంది. కిందటి టోర్నీ వరకు ఈ సంఖ్య 32. ఈసారి ఏకంగా 16 జట్లను పెంచారు. మొత్తం గ్రూపులు 12. 16 నగరాలు 104 మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వడానికి ముస్తాబయ్యాయి. ఉత్కంఠలో ఊగిపోవడానికి, గోల్స్ వర్షంలో తడిసి ముద్దవడానికి మనమూ సిద్ధమవుదాం.!

టెన్నిస్‌లో ఇలా..


సినర్ | అల్కరాస్

ఎప్పటిలాగే ఈ ఏడాది నాలుగు గ్రాండ్ స్లామ్ టోర్నీలు టెన్నిస్ అభిమానులను అలరించనున్నాయి. ఏడాదిలో మొట్టమొదటి గ్రాండ్ స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ జనవరి 12 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరుగుతుంది. ఆ తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ (మే-జూన్), వింబుల్డన్ (జూన్-జులై), యుఎస్ ఓపెన్ (ఆగస్టు-సెప్టెంబరు) ఉంటాయి. నవంబరులో ఏటీపీ ఫైనల్స్ జరుగుతుంది.

ఆసియా క్రీడలు — సెప్టెంబరు 19- అక్టోబరు 4



ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడలు కూడా ఈ ఏడాదే జరగనున్నాయి. ఆసియా ఖండానికే పరిమితమైనప్పటికీ ఒలింపిక్స్ తర్వాత అంతటి ప్రాధాన్యమున్న బహుళ దేశాల క్రీడలు ఇవే. సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 4 వరకు జపాన్‌లోని అయిచి-నగోయా ఈ క్రీడలకు ఆతిథ్యమివ్వనుంది. దాదాపు 45 దేశాలు పోటీపడతాయి. 42 క్రీడల్లో పోటీలు నిర్వహిస్తారు.. క్రికెట్‌కు కూడా ఈ క్రీడల్లో చోటుంది. ఆసియా క్రీడల్లో క్రికెట్ టోర్నీ జరగనుండడం ఇది నాలుగోసారి. 2022 ఆసియా క్రీడల్లో భారత్ 28 స్వర్ణాలు సహా 107 పతకాలు సాధించింది. చైనా, జపాన్, దక్షిణ కొరియా తర్వాత పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది.

కామన్వెల్త్ గేమ్స్ — జులై 23- ఆగస్టు 2



2026లో అతిపెద్ద బహుళ క్రీడల ఈవెంట్ కామన్వెల్త్ గేమ్స్. గ్లాస్గో (స్కాట్లాండ్) వేదికగా ఈ క్రీడలు జులై 23 నుంచి ఆగస్టు 2 వరకు జరగనున్నాయి. భారత్ సహా 74 కామన్వెల్త్ దేశాలు ఇందులో పోటీపడతాయి. నిజానికి ఈ క్రీడలు విక్టోరియా (ఆస్ట్రేలియా) నగరంలో జరగాలి. కానీ ఆర్థిక భారాన్ని తట్టుకోలేమంటూ ఆ నగరం వైదొలగడంతో గ్లాస్గో ముందుకొచ్చింది. గ్లాస్గో నిర్వాహకులు కూడా ఖర్చు తగ్గించుకోవడం చాలా తక్కువ ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. 10 నుంచి 13 క్రీడల్లో పోటీలు ఉండొచ్చు. బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ భారత్‌కు పతకాలు ఎక్కువగా వచ్చే అవకాశమున్న క్రీడలు.

డైమండ్ లీగ్ ఫైనల్ — సెప్టెంబరు 4-5


నీరజ్

అథ్లెటిక్స్‌లో డైమండ్ లీగ్ ఫైనల్ ప్రతిష్ఠాత్మకమైంది. ఇది ఈ ఏడాది బ్రసెల్స్ (బెల్జియం)లో జరుగుతుంది. 14 డైమండ్ లీగ్ మీట్స్‌లో ప్రదర్శన ఆధారంగా అథ్లెట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. మే 8న దోహా డైమండ్ లీగ్‌తో సీజన్ మొదలవుతుంది. 32 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారు.

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ — ఆగస్టు 17-23


సింధు

ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ భారత్‌లో 17 ఏళ్ల విరామం తర్వాత జరగనుంది. ఆగస్టులో ఈ టోర్నీకి దిల్లీ ఆతిథ్యమివ్వనుంది. ప్రపంచ బ్యాడ్మింటన్ మనదేశంలో తొలిసారి 2009లో జరిగింది. అప్పుడు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియం ఈ టోర్నీకి వేదికైంది. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కొన్నేళ్లుగా భారత్ నిలకడగా రాణిస్తోంది. 2011 నుంచి ప్రతి టోర్నీలో కనీసం ఒక్క పతకమైనా గెలుస్తూ వస్తోంది. ఇప్పటివరకు ఒక స్వర్ణం సహా 15 పతకాలు గెలుచుకుంది. ప్రకాశ్ పదుకొనె 1983లో కాంస్యంతో భారత్ పతకాల ఖాతా తెరిచాడు. సింధు స్వర్ణం సహా అయిదు పతకాలు సాధించింది. భారత్ తరఫున ప్రపంచ బ్యాడ్మింటన్‌లో ఆమే అత్యంత విజయవంతమైన ప్లేయర్. 2026లో ఆమెతో పాటు భారత షట్లర్లపై మంచి అంచనాలే ఉన్నాయి.

హాకీ ప్రపంచకప్ — ఆగస్టు 14-30


హర్మన్‌ప్రీత్

హాకీ అభిమానులను ఈ ఏడాది ప్రపంచకప్ అలరించనుంది. ఆగస్టులో జరిగే ఈ టోర్నీకి నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. భారత్ సహా 16 జట్లు పోటీపడతాయి. 2025 ఆసియాకప్ నెగ్గడం ద్వారా భారత జట్టు ఈ టోర్నీకి అర్హత సాధించింది. మహిళల ఎఫ్ఐహెచ్ ప్రపంచకప్ కూడా ఆగస్టు 14 నుంచి 30 బెల్జియం, నెదర్లాండ్స్‌లో జరగనుంది. ఈ టోర్నీకి భారత మహిళల జట్టు నేరుగా అర్హత సాధించలేకపోయింది. దీంతో అర్హత కోసం సొంతగడ్డపై ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో ఆడనుంది. ఈ టోర్నీ మార్చి 8 నుంచి 14 వరకు హైదరాబాద్‌లో జరగనుండడం విశేషం. మరో క్వాలిఫయర్ చిలీలో జరుగుతుంది. కిందటి ప్రపంచకప్‌లో భారత పురుషుల జట్టు 9వ స్థానంలో నిలిచింది. మహిళల జట్టు కూడా తొమ్మిదో స్థానమే సాధించింది.

ప్రపంచ షూటింగ్ — నవంబరు 1–15

ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ నవంబరులో ఖతార్‌లో జరగనుంది. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు ఇది తొలి ఒలింపిక్ కోటా ఈవెంట్. 36 కోటా స్థానాలు అందుబాటులో ఉన్నాయి. 12 విభాగాల్లో పోటీలు జరుగుతాయి. భారత వీలైనన్ని ఎక్కువ కోటా స్థానాలు సాధించాలనే లక్ష్యం ఉంది. పారిస్‌లో మన దేశం నుంచి 22 మంది షూటర్లు పోటీపడ్డారు. ఒలింపిక్ చరిత్రలో అత్యధిక భారత షూటర్లు పాల్గొన్న క్రీడలవే.

ఫిడే క్యాండిడేట్స్ టోర్నీ — మార్చి 28- ఏప్రిల్ 16


హంపి

చెస్‌లో బలమైన శక్తిగా ఎదిగిన భారత్‌కు 2026 చాలా ముఖ్యమైంది. ఈ ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నమెంట్లో భారత ప్లేయర్లపై భారీ అంచనాలే ఉన్నాయి. ఈ టోర్నీ మహిళల విభాగంలో ఏకంగా ముగ్గురు భారత క్రీడాకారిణులు.. దివ్య దేశ్‌ముఖ్, కోనేరు హంపి, వైశాలి బరిలోకి దిగుతున్నారు. ఓపెన్ విభాగంలో ప్రజ్ఞానంద ఒక్కడే భారత్ ఆశలను మోస్తున్నాడు. క్యాండిడేట్స్ విజేతలు ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్స్‌ను ఢీకొంటారు. ఓపెన్‌లో గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ అన్న సంగతి తెలిసిందే.

వరుసగా నాలుగో ఓటమి

- హైదరాబాద్‌కు మరో పంచ్
- విజయ్ హజారే ట్రోఫీ

రాజ్‌కోట్: విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ పరాజయ పరంపర కొనసాగుతోంది. మిలింద్ సారథ్యంలోని జట్టుకు వరుసగా నాలుగో ఓటమి ఎదురైంది. బుధవారం ఎలైట్ గ్రూప్-బి మ్యాచ్‌లో 37 పరుగుల తేడాతో బరోడా చేతిలో ఓడింది. మొదట బరోడా 4 వికెట్లకు 417 పరుగుల భారీ స్కోరు చేసింది. నిత్య పాండ్య (122; 110 బంతుల్లో 12×4, 1×6), అమిత్ పాసి (127; 93 బంతుల్లో 12×4, 7×6), కెప్టెన్ కృనాల్ పాండ్య (109 నాటౌట్; 63 బంతుల్లో 18×4, 1×6) సెంచరీలతో అదరగొట్టారు. ఛేదనలో హైదరాబాద్ పోరాడినా.. ఓటమి తప్పలేదు. ఆ జట్టు 49.5 ఓవర్లలో 380 పరుగులకు ఆలౌటైంది. అభిరథ్ రెడ్డి (130; 90 బంతుల్లో 18×4, 2×6), ప్రజ్ఞయ్ రెడ్డి (113; 98 బంతుల్లో 11×4, 1×6) మెరుపులు జట్టును గెలిపించలేకపోయాయి. అతీత్ సేథ్ (3/73), మహేశ్ (3/64), రాజ్ లంబాని (2/96), కరణ్ (2/84) హైదరాబాద్‌ను కట్టడి చేశారు.

ఆంధ్ర కూడా..: ఆంధ్ర సైతం ఓటమి బాటలోనే ఉంది. బెంగళూరులో సౌరాష్ట్రతో గ్రూప్-డి పోరులో 74 పరుగుల తేడాతో ఓడింది. మొదట సౌరాష్ట్ర 7 వికెట్లకు 254 పరుగులు చేసింది. రుచిత్ (76), చిరాగ్ (69), హర్విక్ (61) రాణించారు. సత్యనారాయణ రాజు (3/45), కలిదిండి రాజు (2/64), నితీశ్ కుమార్ రెడ్డి (1/59), రామ్ (1/30) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఛేదనలో ఆంధ్ర 47.2 ఓవర్లలో 180 పరుగులకే ఆలౌటైంది. అంకుర్ పన్వర్ (5/27) ఆంధ్రను దెబ్బ తీశాడు. నాలుగు మ్యాచ్‌ల్లో ఆంధ్రకు ఇది మూడో ఓటమి.

సర్ఫరాజ్ విధ్వంసం: విజయ్ హజారేలో సర్ఫరాజ్ ఖాన్ (157; 75 బంతుల్లో 9×4, 14×6) అదరగొడుతున్నాడు. జైపూర్‌లో గోవాతో గ్రూప్-సి మ్యాచ్‌లో అతడు చెలరేగడంతో ముంబయి 87 పరుగుల తేడాతో గెలిచింది. మొదట ముంబయి 8 వికెట్లకు 444 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో గోవా పోరాడినా.. 357/9కే పరిమితమైంది. అభినవ్ (100), దీప్‌రాజ్ (70), లలిత్ (64) పోరాటం ఆ జట్టును గెలిపించలేకపోయింది. శార్దూల్ ఠాకూర్ (3/20), యశస్వి (2/52) ప్రత్యర్థిని కట్టడి చేశారు.

పడిక్కల్ మూడో శతకం: కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (132; 124 బంతుల్లో 15×4, 2×6), దేవ్‌దత్ పడిక్కల్ (113; 116 బంతుల్లో 10×4, 4×6) శతకాలు సాధించడంతో అహ్మదాబాద్‌లో పాండిచ్చేరితో గ్రూప్-ఎ మ్యాచ్‌లో కర్ణాటక 67 పరుగుల తేడాతో గెలిచింది. మొదట కర్ణాటక 4 వికెట్లకు 363 పరుగులు చేసింది. పడిక్కల్‌కు గత నాలుగు ఇన్నింగ్స్‌ల్లో ఇది మూడో సెంచరీ కావడం విశేషం. కరుణ్ నాయర్ (62 నాటౌట్) కూడా రాణించాడు. బదులుగా పాండిచ్చేరి నిర్ణీత ఓవర్లలో 296 పరుగులకే ఆలౌటైంది.

అఫ్గాన్‌కు రషీద్ సారథ్యం


రషీద్

కాబుల్: భారత్, శ్రీలంక ఆతిథ్యమిచ్చే టీ20 ప్రపంచకప్‌లో తలపడే అఫ్గానిస్థాన్ జట్టుకు లెగ్‌స్పిన్నర్ రషీద్ ఖాన్ సారథ్యం వహించనున్నాడు. ఫిబ్రవరి 7న ఆరంభమయ్యే ఈ మెగా టోర్నీలో బరిలోకి దిగే 15 మంది సభ్యుల అఫ్గాన్ జట్టును బుధవారం సెలక్టర్లు ఎంపిక చేశారు. ఈ జట్టుకు ఇబ్రహీం జద్రాన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. భుజం గాయం నుంచి కోలుకున్న పేసర్ నవీనుల్ హక్‌తో పాటు లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఫజల్‌హక్ ఫారూఖీని కూడా టీమ్‌లోకి ఎంపిక చేశారు. ఆల్‌రౌండర్ గుల్బాదిన్ నైబ్, ఆఫ్ స్పిన్నర్ ముజీబ్ రెహ్మాన్ పునరాగమనం చేశారు. మిస్టరీ స్పిన్నర్ గజన్‌ఫర్ రిజర్వ్‌గా ఎంపికయ్యాడు. జనవరి 19న వెస్టిండీస్‌తో ఆరంభమయ్యే మూడు టీ20ల సిరీస్‌లోనూ ఇదే అఫ్గాన్ జట్టు ఆడుతుంది.

అఫ్గానిస్థాన్ జట్టు: రషీద్ ఖాన్ (కెప్టెన్), ఇబ్రహీం జద్రాన్ (వైస్ కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్, మహ్మద్ ఇషాక్, సెదిఖుల్లా అటల్, డార్విష్ రసూల్, షాహిదుల్లా కమల్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, గుల్బాదిన్ నైబ్, మహ్మద్ నబి, నూర్ అహ్మద్, ముజీబ్ రెహ్మాన్, నవీనుల్ హక్, ఫజల్‌హక్ ఫారూఖీ, అబ్దుల్లా అహ్మద్‌జాయ్ **రిజర్వ్‌లు:** గజన్‌ఫర్, ఇజాజ్ అహ్మద్‌జాయ్, జియావుర్ రెహ్మాన్.

అర్జున్.. యువతకు స్ఫూర్తి: ప్రధాని

దిల్లీ: ప్రపంచ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన అర్జున్ ఇరిగేశిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. అతడు సాధించిన పతకాలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన అన్నారు. "చెస్‌లో భారత్ దూసుకెళ్తోంది. దోహాలో ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యాలు గెలిచిన అర్జున్‌కు అభినందనలు. ఆట పట్ల అతడి అంకితభావం, ప్రేమ అందరికి ఆదర్శం. అర్జున్ విజయాలు యువతకు స్ఫూర్తినిస్తాయి. అతడికి అభినందనలు" అని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఒకే ప్రపంచ టోర్నీలో ర్యాపిడ్, బ్లిట్జ్‌లో పతకాలు గెలిచిన ఘనత అర్జున్‌దే. దోహా టోర్నీలో తెలుగమ్మాయి కోనేరు హంపి ర్యాపిడ్‌లో కాంస్యం సాధించింది.

ఈనాడు

2026

విజయవాడ 1-1-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 142

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



దగ్గరైతే పోయేదేం లేదు.. చలి తప్ప

ఈ బుజ్జి పక్షుల పేరు గ్రీన్ బీ ఈటర్స్. చలి నుంచి రక్షించుకునేందుకు ఇలా తీగపై ఒక దానితో ఒకటి అతుక్కుని కూర్చున్నాయి. చలికాలంలో శరీర ఉష్ణోగ్రతలు పెంచుకునేందుకు పిచుకలు చేసే ఈ విన్యాసాన్ని హడ్లింగ్ అంటారని జంతుశాస్త్ర ఆచార్యులు డా.బక్షి రవీందర్‌రావు తెలిపారు. నల్గొండ శివారు పానగల్‌లో వేకువజామున ఈ దృశ్యం కనిపించింది.

- ఈనాడు, నల్గొండ

రమణీయం.. శ్రీవారి ఆలయం



నూతన సంవత్సర వేడుకల వేళ అమరావతి కళ సంతరించుకుంది. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల అలంకరణలు ఆకట్టుకున్నాయి. వెంకటపాలెంలో తితిదే ఆధ్వర్యంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం రాత్రి వేళ ఇలా వెలుగుల్లో రమణీయంగా కనిపించింది. – ఈనాడు, అమరావతి

తాళపత్రాలపై ముత్యాల వరుసలా..



తప్పులు, కొట్టివేతలు లేకుండా రాయడం ఎంతటి వారికైనా కష్టమే. అలాంటిది సుమారు 300 ఏళ్ల క్రితం ఐనప ఘంటములతో తాళపత్రాలపై ముత్యాల్లాంటి అక్షరాలు రాశారు అప్పటి కవులు. వాటిని భద్రపరుస్తూ నేటితరానికి చూపిస్తోంది ఉస్మానియా యూనివర్సిటీలోని మను స్క్రిప్ట్ గ్రంథాలయం. నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఇటీవలే ముగిసిన 38వ పుస్తక ప్రదర్శనలో తాళపత్రాలపై సంస్కృతంలో రాసిన భగవద్గీత, శ్రీమద్భాగవతం, అపరకర్మలు తదితరాలను ప్రదర్శించారు. పుస్తక ప్రియులు వాటిని ఆసక్తిగా తిలకించారు. – ఈనాడు, హైదరాబాద్

'హోప్ ఫర్ లైఫ్'..
పేద విద్యార్థుల హ్యాపీ లైఫ్



రామదుర్గంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ లైబ్రరీ

పోటీ పరీక్షల్లో సత్తాచాటి ప్రభుత్వ కొలువు సాధించాలని ఉన్నా ప్రతి నెలా డబ్బు కోసం ఇంట్లో అడగలేని వారికి.. ప్రతిభ ఉన్నా ఉన్నత చదువు ఆపేస్తున్న పేద విద్యార్థులకు అండగా నిలుస్తోంది హైదరాబాద్‌కు చెందిన 'హోప్ ఫర్ లైఫ్' ఫౌండేషన్. 7 వేల మందికి పైగా విద్యార్థులను చదివిస్తున్న ఈ సంస్థ.. భవిష్యత్తులో ఈ సంఖ్య 7 లక్షలకు చేరాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. నల్గొండ జిల్లా చండూరు మండలం లక్కినేనిగూడేనికి చెందిన హిమజ చిన్నతనంలోనే తల్లిదండ్రులకు దూరంగా బాలసదన్‌లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం డిగ్రీ పూర్తి చేసిన కొన్నాళ్లకు అదే బాలసదనం నుంచి వచ్చిన ఓ ఫోన్ కాల్ ఆమె ఆలోచనను మార్చింది. ఇద్దరు అమ్మాయిలకు ఫీజు కట్టడం వీలవుతుందా అని నిర్వాహకులు అడగ్గా అప్పటి ఆమె ఆర్థిక పరిస్థితి మేరకు ఒకరి బాధ్యతను తీసుకున్నారు. తర్వాత మరో ఇద్దరి బాధ్యతను తీసుకున్నారు. ఇలా ముగ్గురు అమ్మాయిలను దత్తత తీసుకోవడంతో మొదలైన ప్రయాణం హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ స్థాపన వరకు సాగింది. ఈ సంస్థ ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 7,132 మంది విద్యార్థులను చదివిస్తోంది. ఇందులో 90% అనాథలు, 10% ఒంటరి తల్లిదండ్రుల సంరక్షణలో ఉన్నవారున్నారు. ఉన్నత విద్యకు సాయం అందించిన 18 మందిలో ఏడుగురు ప్రభుత్వ, 11 మంది ప్రైవేటు కొలువులు సాధించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి హాస్టల్ ఫీజులు, స్టడీ మెటీరియల్ ఖర్చులు భరిస్తోంది.

గ్రామీణ ప్రాంతాల్లో పఠనాసక్తి పెంచేలా, యువత పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యేలా సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనిటీ లైబ్రరీలను ప్రారంభిస్తున్నారు. 2018లో మహబూబ్‌నగర్ జిల్లా చిన్న ధన్వాడలో తొలి గ్రంథాలయాన్ని.. 2019లో హైదరాబాద్‌లోని చర్లపల్లిలో రెండోది. . ఇటీవల ఏపీలోని నంద్యాల జిల్లా డోన్ మండలం రామదుర్గంలో మూడో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. త్వరలో నిజామాబాద్ జిల్లాలో గ్రంథాలయం ఏర్పాటు చేయనున్నట్లు ఆమె వివరించారు. –ఈనాడు, హైదరాబాద్

అర్జునా.. అదరగొడుతున్నావ్!



80 ఏళ్లు దాటితే చాలా మంది తమ పనులు చేసుకోవడానికి కూడా ఇతరులపై ఆధారపడుతుంటారు. అలాంటిది 86 ఏళ్ల వయసులో ఉన్న ఓ వృద్ధ యువకుడిలా ఉత్సాహంగా కొబ్బరి చెట్లు ఎక్కుతూ అబ్బురపరుస్తున్నారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పల్లెకోనకు చెందిన అర్జునరావు చిన్న వయసు నుంచే కాయలు దింపుతున్నారు. ఈ వయసులో కూడా పూర్తి ఆరోగ్యంగా ఉండటంతో కుమార్తె, మనవరాళ్లకు నాలుగు డబ్బులు ఇవ్వాలని కొబ్బరి కాయలు దింపే పని చేస్తున్నారు. ఏ మాత్రం అలసట లేకుండా చకచకా చెట్టు ఎక్కి, కాయలు దించేస్తారు. పరిసర గ్రామాల్లోని చెట్లు ఎక్కేవారు తగ్గిపోవడంతో కాయలు దించాలన్నా, మట్టలు కొట్టాలన్నా అర్జునరావునే పిలుస్తుండటం గమనార్హం. రోజుకు ఒకసారి భోజనం చేస్తానని, తర్వాత ఆకలి వేస్తే పండ్లు తీసుకుంటానని చెబుతున్నారు. – ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-రేపల్లె అర్బన్

ఇథియోౌందయ్యో!

ఆదిత్య 369 సినిమాలో హీరో బాలకృష్ణ టైం మెషీన్‌లో ప్రయాణించి శ్రీకృష్ణ దేవరాయల కాలానికి వెళ్లడం మీకు గుర్తుందా? మనమూ అలా వెనకటి కాలానికి వెళ్లొచ్చు. ఆ సినిమాలో చూపించినట్లుగా శ్రీకృష్ణ దేవరాయల కాలానికి వెళ్లలేం కానీ, ఏడెనిమిదేళ్ల వెనక్కు వెళ్లొచ్చు. ఇందుకోసం మనకు ఆ సినిమాలో చూపించినట్లు టైం మెషీన్ అవసరం లేదు. ఆరు నుంచి తొమ్మిదిన్నర గంటలు విమానంలో ప్రయాణిస్తే 2018 సంవత్సరానికి వెళ్లొచ్చు. తూర్పు ఆఫ్రికా దేశమైన 'ఇథియోపియా'కు వెళితే చాలు మనకు ఇది అనుభవంలోకి వస్తుంది.

ఇథియోపియాలో 9 నెలల తర్వాతే నూతన సంవత్సర వేడుకలు

దాదాపు ప్రపంచమంతా ఆంగ్ల నూతన సంవత్సరం-2026 గురువారం నుంచి ప్రారంభం అవుతుండగా.. తూర్పు ఆఫ్రికా దేశమైన 'ఇథియోపియా'లో నూతన సంవత్సర వేడుకలకు 9 నెలలు ఆగాల్సిందే. ఆ దేశంలో సెప్టెంబరులో కొత్త సంవత్సర వేడుకలు జరగనున్నాయి. అదీ కూడా 2026 కాదు, 2019 నూతన సంవత్సర వేడుకలు.

ఉగాది రోజున మనం తెలుగు నూతన సంవత్సర వేడుకను ఎలా చేసుకుంటున్నామో.. . ఇథియోపియాలో వారి క్యాలెండర్ ప్రకారం సెప్టెంబరు 11న (లీప్ సంవత్సరం అయితే సెప్టెంబరు 12న) నూతన సంవత్సరం నిర్వహించుకుంటారు. ఇథియోపియన్ క్యాలెండర్‌లో మొత్తం 13 నెలలు ఉంటాయి. మొదటి 12 నెలలు ఒక్కోటి 30రోజుల చొప్పున చివరిదైన 13వ నెలను పాగ్యుమ్ అంటారు. ఆ నెలలో మాత్రం 5రోజులు (లీప్ సంవత్సరమైతే 6 రోజులు) ఉంటాయి.

1582లో పోప్ గ్రెగొరీ XIII ప్రవేశపెట్టిన గ్రెగోరియన్ క్యాలెండర్ కంటే ఏడెనిమిది సంవత్సరాల తర్వాత ఇథియోపియా క్యాలెండర్‌ను గుర్తించారు. ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాల్లో ఎక్కువ భాగం గ్రెగోరియన్ క్యాలెండర్‌ను పూర్తిస్థాయిలో స్వీకరించినప్పటికీ, ఇథియోపియా దాని సొంత క్యాలెండర్‌ను కొనసాగిస్తోంది. ''మేము ఎప్పుడూ వలస రాజ్యం కాలేదు. మాకు మా సొంత క్యాలెండర్, సొంత వర్ణమాల, సొంత సాంస్కృతిక సంప్రదాయాలు ఉన్నాయి'' అనేది ఇథియోపియా వాదన. వారి క్యాలెండర్ ప్రకారమే పంటల సీజన్లు, సాంస్కృతిక వేడుకలు నిర్వహిస్తుంటారు.

–ఈనాడు, అమరావతి



అందరి భవిష్యత్తు రంగుల మయం కావాలనే ఆలోచనతో 2026కు మొక్కలతో ఇలా ఆహ్వానం పలుకుతున్నారు తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీ నిర్వాహకులు. పల్లా వెంకన్న నర్సరీలో లక్షన్నర దేశ విదేశీ మొక్కలతో ఇలా తీర్చిదిద్దారు. ఇందుకు వారం పాటు శ్రమించామని నర్సరీ అధినేత సత్తిబాబు తెలిపారు.

– న్యూస్‌టుడే, కడియం

పారేస్తే వృథా... మగ్గంపై నేస్తే పర్సు!

వృథా ప్లాస్టిక్ కవర్లతో పర్సులు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నారు.. గుజరాత్‌లోని భుజ్‌ఖచ్ ప్రాంతానికి చెందిన రాజీబెయిన్. విశాఖలో ఇటీవల నిర్వహించిన పెసా మహోత్సవ్‌లో తమ స్టాల్‌లో కవర్లను అప్పటికప్పుడు పర్సులుగా మార్చేసి సందర్శకులను ఆలోచింపజేశారు. కవర్లను రెండు అంగుళాల వెడల్పుతో పొడవుగా కట్ చేసి.. వాటిని సన్నని దారంలా మార్చారు. ఈ దారాలను చిన్న మగ్గంపై పేర్చి వస్త్రంలా నేశారు. దాంతో పర్సులను చేసి, విక్రయించారు.

– ఈనాడు, విశాఖపట్నం



పర్సులు



ప్లాస్టిక్ కవర్ల దారంతో వస్త్రంలా నేస్తూ..

దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్ల సమ్మె

దిల్లీ: చెల్లింపులు పెంచాలని, మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని కోరుతూ దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు బుధవారం సమ్మె నిర్వహించారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్(టీజీపీడబ్ల్యూయూ), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ (ఐఎఫ్ఏటీ) సంయుక్తంగా ఇచ్చిన ఈ సమ్మె పిలుపునకు స్పందన అంతగా కనిపించలేదు. తమ సభ్యుల్లో చాలా మంది విధులకు దూరంగా ఉన్నారని ఈ సంఘాలు పేర్కొన్నాయి. అయితే ఈ-కామర్స్, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్



ముంబయిలోని ఓ దుకాణం వద్ద వేచి ఉన్న గిగ్ వర్కర్లు

లపై సమ్మె ప్రభావం అంతగా లేదని తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో గిగ్ వర్కర్లు ప్రదర్శనలు నిర్వహించారు. సమ్మెకు ఏఐటీయూసీ మద్దతిచ్చింది. గిగ్ వర్కర్లనూ ఫ్యాక్టరీ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేసింది. సమ్మె ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ-కామర్స్, ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లు.. ప్రోత్సాహకాలు ప్రకటించాయి. సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల మధ్య సరఫరా చేసే ఒక్కో ఆర్డర్‌కు రూ.120 నుంచి రూ.150 వరకు ఇస్తామని జొమాటో పేర్కొంది. దీంతో రోజుకు రూ.3వేల వరకు ఆదాయం ఉంటుందని హామీ ఇచ్చింది. ఆర్డర్ రద్దు, తిరస్కరణలపై జరిమానాలు ఉండవని పేర్కొంది. స్విగ్గీ కూడా చెల్లింపులను పెంచింది. డిసెంబరు 31, జనవరి 1 తేదీల మధ్య తమ అనుబంధ డెలివరీ బాయ్స్ దాదాపు రూ.10 వేల వరకు ఆర్జించొచ్చని ఆ సంస్థ వర్గాలు తెలిపాయి.



ద్రవరూప క్యాలరీలను తగ్గించండి

ఈ నూతన సంవత్సరంలో ఈ చిన్న అలవాట్లను నేర్చుకోండి. అవి..
✦ ప్రోటీన్‌కు ప్రాధాన్యం ఇవ్వండి
✦ ప్రతి రోజూ చురుగ్గా ఉండండి
✦ మీ భోజనానికి ముందస్తు ప్రణాళిక వేసుకోండి
✦ మీ ఆహారంలో సగం భాగం కూరగాయలు ఉండేలా చూసుకోండి
✦ ద్రవరూపంలో అందే క్యాలరీలను తగ్గించుకోండి

– మానస, ఉమెన్ హెల్త్ కోచ్

ప్రధాని మెచ్చిన కొరియా తేనె..
సమష్టి ఉత్పత్తిలో రైతులు



ఇటాలియన్ తేనెటీగలు ఛత్తీస్‌గఢ్‌లోని కొరియా జిల్లా రైతులను సంపన్నులుగా మారుస్తున్నాయి. చాలా మంది సంప్రదాయ సాగును వదిలి తేనెటీగల పెంపకం వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ జిల్లాలోని రట్గా, కేశ్‌గవాన్ గ్రామాల్లో ఉత్పత్తి చేస్తున్న 'సోన్' సేంద్రియ తేనె గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రస్తావించారు. దీంతో స్థానిక రైతులకు జాతీయ గుర్తింపు వచ్చింది. మార్కెట్లో డిమాండు కూడా పెరిగింది. ఈ రెండు గ్రామాల్లోని దాదాపు 45 రైతు కుటుంబాలు సమష్టిగా తేనెను ఉత్పత్తి చేస్తున్నాయి. తేనెటీగలు చుట్టూ ఉన్న అడవుల్లో కనిపించే పూల నుంచి మకరందం సేకరిస్తాయి. ఝార్ఖండ్ నుంచి దిగుమతి చేసుకున్న ఇటాలియన్ జాతి తేనెటీగలు అధిక ఉత్పాదకత, శరవేగంగా తేనె ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంటాయి. స్థానిక రైతులకు ఈ తేనెటీగల పెంపకం, మార్కెటింగ్‌పై హరియాణాలోని కురుక్షేత్రలో శిక్షణ ఇప్పించినట్లు జిల్లా కృషివిజ్ఞాన కేంద్రం ఇన్‌ఛార్జి కమలేశ్ సింగ్ తెలిపారు. కొరియా రైతుల తేనె బెనెలీ పోర్టల్ సహా పలు ప్రముఖ ఆన్‌లైను వేదికల ద్వారా అందుబాటులో ఉంది.

దూసుకెళ్లిన ప్రళయ్ క్షిపణులు

విజయవంతమైన ప్రయోగం



దిల్లీ: భారత్ విజయవంతంగా ప్రళయ్ క్షిపణి పరీక్షలను బుధవారం నిర్వహించింది. ఒడిశా తీరం నుంచి వరుసగా ఒకదాని వెంట ఒకటి రెండు ప్రళయ్ మిసైళ్లను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ప్రయోగించింది. ఈ రెండూ.. నిర్దేశిత లక్ష్యాలను ఛేదించాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్షిపణులను డీఆర్‌డీవో అభివృద్ధి చేసింది. ఉపరితలం నుంచి ఉపరితలానికి దూసుకెళ్లే ప్రళయ్.. 500 నుంచి 1,000 కేజీల వరకు పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. బహుళ వార్‌హెడ్‌లను తీసుకెళ్లే సామర్థ్యం ఉన్న దీని పరిధి 150 నుంచి 500 కిలోమీటర్లు. పరీక్ష విజయవంతంగా నిర్వహించిన డీఆర్‌డీవోకు, భారత వాయుసేనకు, సైన్యానికి, రక్షణరంగంలోని ప్రభుత్వసంస్థలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందనలు తెలిపారు.

హెచ్1బీకి లాటరీయే.. కానీ!

- వేతనాన్ని, నైపుణ్యాన్ని బట్టి నాలుగు కేటగిరీలు
- అత్యంత ప్రతిభావంతులకు అధిక అవకాశం

వాషింగ్టన్: భారతీయ వృత్తి నిపుణులకు అత్యధిక ప్రయోజనం కలిగించే హెచ్1బీ వీసాల్లో కొత్త ఏడాది నుంచి మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇక నుంచీ వేతనాలు, నైపుణ్యాల ఆధారంగా వీసాలను కేటాయించనున్నారు. అయితే ఈ కేటాయింపులోనూ గతంలో మాదిరిగానే లాటరీ విధానాన్ని అనుసరిస్తారు. 2027 సంవత్సరానికిగానూ 2026 మార్చిలో తీసుకునే దరఖాస్తుదారులకు కొత్త నిబంధనలు వర్తించనున్నాయి.



ఇందుకు సంబంధించిన నిబంధనలను ఫెడరల్ రిజిస్టరులో డిసెంబరు 29వ తేదీన అమెరికా పౌర, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) ప్రచురించింది. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టం ప్రకారం.. ఏటా విదేశీ వృత్తి నిపుణులకు 85,000 హెచ్1బీ వీసాలను జారీ చేస్తారు. అందులో అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించిన వారికి 20,000 వీసాలను ఇస్తారు. హెచ్1బీ వీసాలకు విదేశీయుల నుంచి అత్యధిక డిమాండు ఉంటుంది. 85,000 వీసాల కోసం ఏటా 7.5 లక్షల మంది దరఖాస్తు చేస్తుంటారు. వీరికి లాటరీ పద్ధతిలో కేటాయిస్తుంటారు.

కొత్త విధానంలో..

అమెరికాలో హెచ్1బీ ఉద్యోగుల వేతనాలను కార్మికశాఖ (డీవోఎల్) నియంత్రిస్తుంటుంది. ఆ సంస్థ ఇప్పుడు లోకేషన్, వృత్తి ఆధారంగా వేతన సర్వేను నిర్వహించి హెచ్1బీ వీసా దరఖాస్తుదారులను నాలుగు కేటగిరీలు విభజిస్తుంది.

■ అతి తక్కువ వేతనం ఉన్న వారిని లెవెల్-1గా వర్గీకరిస్తుంది. ఇందులో రొటీన్ వర్క్, సూపర్‌విజన్, శిక్షణ పనుల్లోని ప్రవేశ స్థాయి ఉద్యోగులుంటారు. వీరికి హెచ్1బీ లాటరీలో ఒక్కసారే పాల్గొనే అవకాశం లభిస్తుంది. వీరికి వీసా లభించే అవకాశం 15 శాతంగా ఉండనుంది.

■ లెవెల్-1 వారి కంటే కాస్త అధిక వేతనం కలిగిన ఉద్యోగులను లెవెల్-2గా వర్గీకరిస్తారు. వీరు రెండుసార్లు హెచ్1బీ లాటరీలో పాల్గొనే అవకాశముంటుంది. వీరికి వీసాలు లభించే అవకాశం 31 శాతంగా ఉండనుంది. ఇందులో క్వాలిఫైడ్ మధ్య స్థాయి ఉద్యోగులుంటారు. వీరికి కొంత అనుభవంతోపాటు సాధారణ సూపర్‌విజన్ అధికారం ఉంటుంది. ■ లెవెల్-3 ఉద్యోగులు మూడు సార్లు హెచ్1బీ లాటరీలో పాల్గొనవచ్చు. వీరికి వీసాలు పొందే అవకాశం 46 శాతం లభిస్తుంది. ఇందులో సీనియర్ లెవెల్ అధికారులుంటారు. వీరు సంక్లిష్టమైన విధులను నిర్వహించేవారై ఉంటారు. సొంత నిర్ణయాలు తీసుకోవడంతోపాటు బాధ్యతలను నిర్వహించే గలిగేవారు ఈ కేటగిరీలో ఉంటారు. ■ అత్యధిక వేతనం కలిగిన లెవెల్-4 ఉద్యోగులు నాలుగు సార్లు హెచ్1బీ లాటరీలో పాల్గొనవచ్చు వీసాలకు ఎంపికయ్యే అవకాశం వీరికి 61 శాతం ఉంటుంది. ఇందులో అత్యున్నత స్థాయి అధికారులుంటారు. అధిక అనుభవంతో పాటు సొంతంగా కంపెనీ నిర్వహణ సామర్థ్యం కలిగి ఉంటారు.

'నాలుగో కేటగిరీకి హెచ్1బీ అవసరం లేదు'

కొత్త హెచ్1బీ నిబంధనలను కోర్టులో సవాలు చేయవచ్చని ఇమ్మిగ్రేషన్ అటార్నీ ఎమిలీ న్యూమన్ తెలిపారు. హెచ్1బీ వీసాలపై నిబంధనలను అమలు చేయాలని చూడటం ట్రంప్ ప్రభుత్వానికి కొత్త కాదని, అనేకసార్లు కోర్టులు ఆయన ప్రయత్నాలను అడ్డుకున్నాయని స్పష్టం చేశారు. దీంతోపాటు లెవెల్-4 నిపుణులకు హెచ్1బీ వీసాలు అవసరం లేదని, అత్యున్నత ప్రతిభావంతులకు ఇప్పటికే ఓ-1 వీసాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. హెచ్1బీకి బ్యాచిలర్ డిగ్రీ సరిపోతుందని తెలిపారు.

నాసిక్-శోలాపూర్ మార్గంలో 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే

- కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామికవాడలకు పెరగనున్న అనుసంధానం

ఈనాడు, దిల్లీ: మహారాష్ట్రలోని నాసిక్-శోలాపూర్ మధ్య రూ.19,142 కోట్ల వ్యయంతో 374 కిలోమీటర్ల మేర 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ యాక్సెస్ కంట్రోల్డ్ హైవే నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకొంది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఇందుకు ఆమోదముద్ర వేసింది. సూరత్ నుంచి చెన్నై వరకు నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌లో భాగంగా ఇప్పుడు ఈ భాగాన్ని నిర్మిస్తున్నట్లు కేంద్ర సమాచార, ప్రసారశాఖల మంత్రి అశ్వినీవైష్ణవ్ విలేకర్లకు వెల్లడించారు. ప్రస్తుతం నాసిక్ నుంచి శోలాపూర్ సమీపంలోని అక్కల్‌కోట్ వరకు నిర్మించే ఈ రహదారిని వాధ్వాన్‌పోర్టు వద్ద దిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేతో అనుసంధానం చేస్తారు. అలాగే నాసిక్ వద్ద ఆగ్రా-ముంబయి కారిడార్‌తో కలుపుతారు. మొత్తంగా ఈ కారిడార్ తూర్పు, పడమర కోస్తా తీరాలను అనుసంధానిస్తుంది.

తగ్గనున్న దూరం.. పెరగనున్న వేగం

చెన్నై పోర్టు వైపు నుంచి తిరువళ్లూరు, రేణిగుంట, కడప, కర్నూలు మీదుగా మహారాష్ట్ర సరిహద్దుల్లోని హసపుర్ వరకు 700 కిలోమీటర్ల 4 వరుసల కారిడార్ నిర్మాణం ఇప్పటికే పురోగతిలో ఉంది. దీనివల్ల 'జాతీయ పారిశ్రామిక నడవా అభివృద్ధి సంస్థ' ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న కొప్పర్తి, ఓర్వకల్లులకు రవాణా అనుసంధానం మెరుగుపడుతుంది. ఇప్పుడు నాసిక్-శోలాపూర్ మధ్య నిర్మిస్తున్న రహదారితో ఆ రెండు నగరాల మధ్య దూరం 14% తగ్గనుంది. వాహనాల వేగం గంటకు 60 కి.మీ. నుంచి 100 కి.మీ.కి పెరుగుతుంది. సూరత్-చెన్నైల మధ్య ప్రయాణ సమయం 31 గంటల నుంచి 17 గంటలకు (45%) తగ్గనుంది. సూరత్, వడోదర, ముంబయి నుంచి కర్నూలు, బెంగళూరు, చెన్నైల మధ్య భారీగా ఉండే రద్దీ తగ్గుతుంది.

ఆ ఔషధం 100 ఎంజీకి మించి ఇవ్వొద్దు

- 'నిముసులైడ్' తయారీ, విక్రయం, సరఫరాలపై కేంద్రం ఆంక్షలు

దిల్లీ: నొప్పి నివారిణి (పెయిన్ కిల్లర్) ఔషధం నిముసులైడ్ తయారీ, విక్రయాలపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. నోటి ద్వారా తీసుకునే ఈ ఔషధం అధిక డోసులపై నిషేధం విధించింది. ఆరోగ్యపరమైన భద్రతా కారణాల రీత్యా నిముసులైడ్ 100-మిల్లీగ్రాముల(ఎంజీ)కు మించి డోసు ఉండే ఔషధాల ఉత్పత్తి, అమ్మకాలను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటి నుంచి 100 ఎంజీ కంటే ఎక్కువ డోసు ఉన్న నిముసులైడ్ మాత్రలను తయారు చేయకూడదని స్పష్టం చేసింది. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుందని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. నిముసులైడ్ అనేది ఒక నాన్ స్టెరాయిడ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్ లాంటిది. సాధారణంగా నొప్పిని, వాపును తగ్గించడానికి వాడుతుంటారు. 100 ఎంజీ కంటే ఎక్కువ మోతాదులో దీనిని తీసుకుంటే మనుషుల ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదం కలిగే అవకాశం ఉంది. ఈ ఔషధం అధిక డోసు వల్ల కాలేయం దెబ్బతింటుందని నిపుణులు ఎప్పటి నుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి బదులుగా మార్కెట్లో ఇతర సురక్షితమైన ప్రత్యామ్నాయ ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. భారత వైద్య పరిశోధన మండలి సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

భారీ భద్రత నడుమ ఖాలిదా అంత్యక్రియలు

భారత్ నుంచి హాజరైన జైశంకర్



ఖాలిదా జియా అంత్యక్రియలకు భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖాలిదా జియా అంత్యక్రియలు ఢాకాలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగాయి. దేశవ్యాప్తంగా లక్షల మంది ఆమెకు నివాళులర్పించారు. ఖాలిదా అంత్యక్రియలకు భారత్ తరఫున విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ హాజరయ్యారు. ప్రధాని మోదీ రాసిన లేఖను ఆమె కుమారుడు తారిఖ్ రహ్మాన్‌కు అందజేశారు. ఢాకా చేరుకున్న వెంటనే తారిఖ్ రహ్మాన్‌ను జైశంకర్ కలిశారు. భారత్ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మంగళవారం మరణించిన ఖాలిదా అంత్యక్రియలు ఢాకాలోని మాణిక్ మియా ఎవెన్యూలో బుధవారం ఆమె భర్త జియావుర్ రహ్మాన్ సమాధి పక్కనే జరిగాయి. బైతుల్ ముకరం జాతీయ మసీదు ఉపదేశకుడు (ఖతీబ్) ముఫ్తీ మహమ్మద్ అబ్దుల్ మాలెక్.. అంత్యక్రియలకు సంబంధించిన ప్రార్థన నిర్వహించారు. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) స్టాండింగ్ కమిటీ సభ్యుడు నజ్రుల్ ఇస్లాం ఖాన్.. ఖాలిదా జీవిత చరిత్రను క్లుప్తంగా చదివి వినిపించారు.

బంగ్లాదేశ్ ప్రధాన పాలకుడు మహమ్మద్ యూనస్, ఖాలిదా కుమారుడు తారిఖ్ రహ్మాన్ తదితరులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఖాలిదా ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ దేశమంతటా కోసం ప్రార్థనలు జరిగాయి. ఖాలిదా అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వేల మంది బస్సులు, రైళ్లు, వాహనాల్లో ఢాకా చేరుకున్నారు. రాత్రంతా చలిని లెక్కచేయకుండా చాలా మంది అంత్యక్రియల ప్రదేశంలోనే ఉండిపోయారు.

ఈనాడు

విజయవాడ 1-1-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 142
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈనాడు
పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు
2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు
- ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

నూతన సంవత్సర కానుక



2026 క్యాలెండర్
నేటి సంచికతో ఏజెంట్ / హాకర్ ద్వారా ఉచితంగా పొందండి

స్వేచ్ఛగా ఆడనివ్వండి..



- తల్లిదండ్రులూ.. మీ కుమార్తెలను ప్రోత్సహించండి
- మా జట్టు విజయం బాలికలకు స్ఫూర్తినిచ్చింది
- గెలిచాక మా నాన్న ఒడికి చేరడమే స్వచ్ఛమైన ఆనందం
- నా కుటుంబం అండతోనే ఈ స్థాయికి..
- 'ఈనాడు' ఇంటర్వ్యూలో మహిళా క్రికెట్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్

మహిళల క్రికెట్లో ప్రపంచకప్ గెలవాలని గతంలో ఎన్నో జట్లు, దిగ్గజ కెప్టెన్లు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఆ అద్భుతం 2025లో సాధ్యమైంది. అతిగొప్ప ప్రదర్శనతో మన జట్టు ఆ కలను నెరవేర్చుకుంది. స్ఫూర్తి నింపే నాయకత్వంతో జట్టును నడిపించి భారత్‌కు మొట్టమొదటి వన్‌డే ప్రపంచకప్‌ను అందించింది హర్మన్‌ప్రీత్ కౌర్. ఇటు బ్యాటర్‌గా, అటు జట్టు కెప్టెన్‌గా మహిళల క్రికెట్‌పై ఆమె బలమైన ముద్ర వేసింది. క్రీడల్లోకి రావాలనుకునే అమ్మాయిలకు ఆమె ఇచ్చే సూచనలేంటి?.. **హర్మన్‌తో 'ఈనాడు' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆ విశేషాలు తెలుసుకుందాం..**

2025 వన్‌డే ప్రపంచకప్ విజయంతో మార్పు

ఈ విజయం స్ఫూర్తితో చిన్న పిల్లలు అకాడమీల్లో చేరుతున్నారని.. అమ్మాయిలను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారని మాకు సందేశాలు వస్తున్నాయి. సొంత గడ్డపై మేం ట్రోఫీని ముద్దాడటం చూసి.. తాము కూడా సాధించగలమనే నమ్మకం అమ్మాయిల్లో కలిగింది. ఇది దేశంలో ఒక గొప్ప మార్పునకు నాంది. ఇప్పుడు మరింత మంది అమ్మాయిలు నీలి రంగు జెర్సీని ధరించాలని కలలు కనడం ఖాయం.

అమ్మాయిలకు అండగా..




బాలికల కోసం పాఠశాలల్లో ప్రత్యేక జట్లు ఏర్పాటు చేయాలి. కిట్లు, శిక్షణ అందించాలి. ఉపాధ్యాయులు, యాజమాన్యాలు ప్రోత్సహించాలి. క్రీడా సంఘాలు సురక్షితమైన అకాడమీలను, అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. (మిగతా 3లో)

విమర్శలను దాటి.. ఆత్మవిశ్వాసం వైపు

'నీ వల్ల కాదు' లాంటి విమర్శలెదుర్కొనే అమ్మాయిలకు నాలాంటి వారి కథలను చెప్పాలి. నేను పంజాబ్‌లోని మోగా అనే ప్రాంతం నుంచి వచ్చా. నాతో ఆడుకోవడానికి అమ్మాయిల్లేకపోవడంతో అబ్బాయిలతోనే క్రికెట్ ఆడటం మొదలుపెట్టా. ఆడపిల్లలు బయటకు వెళ్లడం కష్టమైన రోజుల్లోనే అమ్మానాన్నలు నన్ను ప్రోత్సహించారు. తల్లిదండ్రులూ.. మీ కుమార్తెల కలలను, వారి ఆత్మవిశ్వాసాన్ని నమ్మండి. వారు ఏ రంగాన్ని ఇష్టపడినా ప్రోత్సహించండి. అమ్మాయిల సామర్థ్యానికి ఆకాశమే హద్దు. దాన్ని అన్వేషించే అవకాశం వారికి ఇవ్వండి. స్వేచ్ఛగా ఆడుకోనివ్వండి.

ఎస్సీల అభ్యున్నతికి.. ఉపాధి | వడ్డీ భారం లేకుండా.. ఉన్నతి

- రూ.50 వేల రాయితీ
- 4,400 మందికి లబ్ధి.. జనవరి నెలాఖరుకు ఎంపిక పూర్తి
- రూ.63.26 కోట్లు విడుదల



ఈనాడు, అమరావతి: ఎస్సీల జీవనోపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. వారు సొంతంగా కుటుంబాన్ని పోషించుకునేందుకు వీలుగా ఎస్సీ కార్పొరేషన్, సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి రాయితీ రుణ పథకం అమలుకు చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద 4,400 మంది లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఎస్సీల జనాభాకు అనుగుణంగా జిల్లాల వారీగా లబ్ధిదారుల సంఖ్యను ఇప్పటికే విభజించారు. జనవరి మొదటి వారంలో ఎంపిక ప్రక్రియ ప్రారంభించి నెలాఖరు నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ పథకానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.63.26 కోట్లు విడుదల చేసింది. కేంద్ర పథకమైన పీఎం అజయ్ భాగస్వామ్యంతో దీన్ని అమలు చేయనున్నారు.

56 ఉపాధి యూనిట్లు

స్వయం ఉపాధి కింద లబ్ధిదారులు ఎంపిక చేసుకునేందుకు ప్రభుత్వమే 56 యూనిట్లను ప్రతిపాదించింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల్ని అనుసరిస్తూ ప్యాసింజర్ ఆటోల నుంచి ఫుట్‌వేర్ బిజినెస్ వరకు, బేకరీ దుకాణం నుంచి మొబైల్ షాపు వరకు టిఫిన్ సెంటర్ నుంచి ఫుడ్ స్టాల్ వరకు ఇలా పలు ఉపాధి మార్గాలను సూచించింది. ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకాలు, బిస్కెట్ల తయారీ, జీడిపప్పు వ్యాపారాలనూ ఎంపిక చేసుకోవచ్చు.

■ యూనిట్ విలువ రూ.లక్ష లేదా అంత కంటే ఎక్కువ ఉండాలి. ■ యూనిట్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.50 వేలు (మిగతా 3లో)

ముందురోజే 93% మందికి పింఛన్లు

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద జనవరి నెలకు సంబంధించిన సామాజిక భద్రత పింఛన్లను బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 59 లక్షల (93 శాతం) మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేసింది. ఉదయం 7 గంటల నుంచే గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఒక రోజు ముందుగానే డిసెంబరు 31న లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేపట్టిన విషయం తెలిసిందే. (మిగతా 3లో)

కొత్త ఏడాదిలో ప్రజలకు రెట్టింపు సంతోషం, సంక్షేమం, అభివృద్ధి

రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించిన గొప్ప మలుపు 2025 3లో

సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

ఆమనీ... హాయిగా సాగనీ!



ఒకప్పుడు
స్థిరమైన ఉద్యోగమున్నా...
సొంత ఇల్లున్నా... పిల్లలు బాగా చదువుతున్నా...
జీవితం సాఫీగా సాగుతుందనే భరోసా!
కానీ ఇప్పుడు...
ఉద్యోగాలున్నా... అవి శాశ్వతం కాదు...
ఆదాయం పెరిగినా... అది సరిపోదు...
ఆధునిక వైద్యం ముందు...
లక్షల పొదుపు అంగుష్ఠమాత్రం
చదువుల ఖర్చు... ఆదాయాన్ని తూచ్ అంటోంది.
ద్రవ్యోల్బణం... జీతాన్ని, జీవితాన్ని నిశ్శబ్దంగా తినేస్తోంది...
అందుకే... అందరికీ కావాల్సిందిప్పుడు ఆర్థిక భద్రత!
అంటే డబ్బు ఎక్కువగా ఉండటం కాదు..
ఎలాంటి పరిస్థితి వచ్చినా కుటుంబం నిలబడగలగటం...
ఉద్యోగం పోయినా, అనారోగ్యం వచ్చినా...
అప్పు చేయాల్సిన అవసరం రాకపోవటం...
పిల్లల చదువులకు భయపడకపోవటం
ఒక్కమాటలో చెప్పాలంటే...
ఆర్థిక భద్రత అనేది విలాసం కాదు.
జీవన రక్షణ కవచం!

ప్రత్యేక కథనం 6 లో

రికార్డు స్థాయిలో 'జీవన్‌దాన్'

2025లో 301 మంది జీవితాల్లో వెలుగులు

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 'జీవన్‌దాన్' ద్వారా 2025లో 301 మందికి పునర్జన్మ లభించింది. రాష్ట్ర విభజన తర్వాత అవయవదానంలో 'జీవన్‌దాన్' సరికొత్త రికార్డు సృష్టించింది. జీవన్మృతులైన 93 మంది నుంచి సేకరించిన అవయవాలతో 301 మంది జీవితాల్లో వెలుగులు నింపింది. రాష్ట్రంలో జీవన్‌దాన్ కార్యక్రమాన్ని 2015లో ప్రారంభించారు. అప్పటినుంచి ఇప్పటి వరకు 1,296 అవయవాలు సేకరించారు. ఈ పదేళ్లలో జీవన్మృతులైన 403 మంది నుంచి 703 కిడ్నీలు, 316 కాలేయాలు, 181 ఊపిరితిత్తులు, 91 గుండెలు తదితరాలు సేకరించారు. రాష్ట్రంలో జీవన్‌దాన్ ప్రారంభించి పదేళ్లయినా.. గత రెండేళ్లుగానే అవయవదానానికి (మిగతా 3లో)

వందేభారత్ స్లీపర్ » స్పీడ్ సూపర్

- 180 కి.మీ. గరిష్ఠ వేగం... సీఆర్ఎస్ సంతృప్తి



దిల్లీ: దేశీయంగా రూపొందించిన వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగాన్ని సాధించగలిగింది. రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్ఎస్) సమక్షంలో దీనికి సంబంధించిన తుది పరీక్షలను బుధవారం నిర్వహించారు. కోటా (రాజస్థాన్) నుంచి నాగ్దా (మధ్యప్రదేశ్) మధ్య ఈ వేగాన్ని చేరుకోవడం ద్వారా మరో మైలురాయిని అధిగమించినట్లయిందని రైల్వే మంత్రిత్వశాఖ పేర్కొంది. గాజుగ్లాసుల్లో నీళ్లు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్లో ఉంచినా.. గరిష్ఠ వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం తొణక్కపోవడాన్ని వీడియో తీశారు. దీనిని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. రైలు గమనంలో స్థిరత్వం, కుదుపులు, ప్రకంపనలు, బ్రేకుల పనితీరు, భద్రత ప్రమాణాలు వంటివన్నీ పరీక్షించారు. రైలు పనితీరు సంతృప్తికరంగా ఉందని, ప్రయోగపరీక్ష విజయవంతమైనట్లు సీఆర్ఎస్ ప్రకటించారని రైల్వేశాఖ తెలిపింది. రైల్లో 16 పెట్టెలు ఉన్నాయి. వీటిలో ఆకర్షణీయమైన (ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్ వ్యవస్థ, ఆధునిక మరుగుదొడ్లు, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి. ప్రయాణికులు ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఈ రైళ్లను ఎప్పటినుంచి ప్రవేశపెట్టబోయేదీ ప్రకటించలేదు. సీఆర్ఎస్ అనుమతితో దీనికి మార్గం సుగమం అయిందని మాత్రం రైల్వేశాఖ పేర్కొంది.





ఎస్వీ విద్యాదాన ట్రస్టుకు రూ.కోటి విరాళం



తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడికి విరాళం డీడీ అందిస్తున్న విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య దంపతులు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే ఎస్వీ విద్యాదాన ట్రస్టుకు విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య రూ.కోటి విరాళంగా అందజేశారు. బుధవారం తితిదే ఛైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడికి విరాళం డీడీని ఇచ్చారు.

21.80 లక్షల పాసుపుస్తకాల పంపిణీకి చర్యలు: మంత్రి అనగాని

ఈనాడు, అమరావతి: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జనవరి 2 నుంచి 9 వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైకాపా ప్రభుత్వంలో జగన్ బొమ్మలతో భూమి హక్కుపత్రాలిచ్చి, యజమానుల్ని ఆందోళనకు గురిచేశారని గుర్తుచేశారు. వాటి స్థానంలో రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో కొత్త పాసుపుస్తకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. మొత్తం 21.80 లక్షల పుస్తకాల పంపిణీకి చర్యలు చేపట్టామని వెల్లడించారు.

మధురవాడ సెజ్ నుంచి 11.59 హెక్టార్ల డీనోటిఫికేషన్

ఈనాడు, దిల్లీ: మధురవాడ సెజ్‌లో ప్రస్తుతం ఉన్న 31.25 హెక్టార్ల నుంచి 11.59 హెక్టార్లను డీనోటిఫై చేస్తూ కేంద్ర వాణిజ్యశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్పెషల్ ఎకనమిక్ జోన్ యాక్ట్-2005ను అనుసరించి ఏపీఐఐసీ 2006 డిసెంబర్ 28న మొత్తం 36 ఎకరాల్లో ఈ సెజ్‌ను ఏర్పాటు చేసింది. 2015లో దీని నుంచి 6.37 ఎకరాలను మినహాయించింది. 2018లో 1.62 హెక్టార్లను జతచేసింది. దీంతో సెజ్ విస్తీర్ణం 31.25 హెక్టార్లకు చేరింది. తాజాగా సెజ్ పరిధిలోకి 0.31 హెక్టార్లను చేర్చి, 11.59 హెక్టార్లను డీనోటిఫై చేయాలని దరఖాస్తు చేయడంతో కేంద్ర వాణిజ్య శాఖ ఆమోదం తెలిపింది. దీంతో ప్రస్తుతం ఈ సెజ్ విస్తీర్ణం 19.97 హెక్టార్లకు తగ్గింది.




రుణరాహిత్యంతో ప్రశాంతత

అనుసరణీయ జీవిత సూత్రాలు..
- ✦ రుణరాహిత్యంతో మానసిక ప్రశాంతత
- ✦ సొంత ఇంటిని కలిగి ఉండాలి
- ✦ గాఢమైన కుటుంబ మద్దతు పొందాలి
- ✦ నైపుణ్యాలు నేర్చుకునేందుకు డబ్బు వినియోగించాలి
- ✦ కాలం గడిచే కొద్దీ మీ హోదా తగ్గొచ్చు కానీ నిజమైన స్నేహితులు మిమ్మల్ని విడిచిపెట్టరు
- ✦ జీవితం ఎల్లప్పుడూ ప్రణాళిక ప్రకారం సాగదు
- ✦ మంచి ఆరోగ్యం మీ గొప్ప బలం
- ✦ ఎల్లప్పుడూ మీకు మద్దతుగా ఉండే మీ తల్లిదండ్రుల పట్ల ప్రేమతో ఉండాలి.

– బాలు గొరాడే, పెట్టుబడి నిపుణుడు

ఇదీ సంగతి!



'కమాండ్'తో దర్శనాల్లో వేగం

- తిరుమల కొండపై గంటలకొద్దీ నిరీక్షణకు చెక్
- స్లాట్ విధానంతో సులువుగా దర్శన భాగ్యం
- భారీగా భక్తులు వచ్చినా కనిపించని ఇబ్బందులు

ఈనాడు డిజిటల్, తిరుపతి: వైకుంఠ ఏకాదశి అంటేనే భక్తుల రద్దీ.. గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షణ సరేసరి. కానీ ఈసారి తిరుమలలో ఆ పరిస్థితి లేదు. ఆధునిక సాంకేతికతను జోడించి, పక్కా ప్రణాళికతో తితిదే చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలనిచ్చాయి. రికార్డు స్థాయిలో భక్తులు తరలివచ్చినా ఎక్కడా తోపులాటలు, గంటల తరబడి వేచిచూసే ఇబ్బందులు లేకుండా దర్శనం లభించింది. ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ సిబ్బందికి దిశానిర్దేశం చేయడం వల్లే ఇది సాధ్యమైందని తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి బుధవారం వెల్లడించారు. ఆ వివరాలు ఇలా..

స్లాట్ విధానం సూపర్‌హిట్..

సుమారు 70 వేలమంది భక్తులు దర్శనానికి వస్తారని అంచనా వేసిన తితిదే అందుకు తగ్గట్టుగా స్లాట్ విధానాన్ని అమలు చేసింది. ఎక్కడ రిపోర్ట్ చేయాలి? ఏ సమయానికి రావాలి? అనే సమాచారాన్ని భక్తులకు ముందే మెసేజ్‌లు పంపించింది. దీంతో వైకుంఠ ఏకాదశి (డిసెంబరు 30) రోజు రికార్డు స్థాయిలో 67,000 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా.. మరుసటి రోజు (డిసెంబరు 31) అదే స్థాయిలో భక్తులకు దర్శన భాగ్యం కలిగింది. ఇంత పెద్దసంఖ్యలో భక్తులు వచ్చినా స్లాట్ విధానం అద్భుతంగా పనిచేసింది.



కమాండ్ కంట్రోల్ కేంద్రంలోని వ్యవస్థ.. చివరనున్న డిస్‌ప్లేలో త్రీడీ రూపంలో ఆలయ నమూనా ఉండగా అందులో ఎరుపు రంగులో కనిపించేది రద్దీ ప్రాంతం. 500 మందికి పైగా భక్తులు గుమికూడితే ఆ రంగు చూపి అప్రమత్తం చేస్తుంది. పచ్చరంగు 500 లోపల ఉన్నది. పసుపు రంగులో ఉన్నది సాఫీగా సాగే క్యూలైన్‌ను సూచిస్తుంది.



డ్యాష్‌బోర్డులో భక్తుల రద్దీని పరిశీలిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

సమయపాలన: భక్తులు 98% మంది కేటాయించిన స్లాట్ సమయానికే రిపోర్ట్ చేశారు.

తప్పిన నిరీక్షణ: నాలుగు గంటలకు మించి క్యూలైన్లో వేచి ఉండాల్సిన అవసరం రాలేదు. చాలామందికి గంటన్నర నుంచి రెండు గంటల్లోనే దర్శనం పూర్తయింది.

వికేంద్రీకరణ: ఒకేచోట రద్దీ ఏర్పడకుండా మూడు వేర్వేరు ప్రాంతాల్లో (ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం) రిపోర్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేయడంతో క్యూలైన్ల నిర్వహణ సులభమైంది.

అడుగడుగునా నిఘానేత్రం..

◆ దర్శనాల నిర్వహణకు సాంకేతికతను జోడించడం వల్లే ఈ విజయం సాధ్యమైంది.

◆ టికెట్ జారీ దగ్గరి నుంచి లగేజ్ డిపాజిట్, బాడీ స్కానింగ్, దర్శనం పూర్తయ్యే వరకూ ప్రతిదశనూ రియల్ టైమ్‌లో (ఐసీసీసీ) డాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షించారు. ◆ దాదాపు 300కు పైగా సీసీ కెమెరాలు, కొత్తగా ఏర్పాటు చేసుకున్న 42 ఎఫ్.ఆర్.ఎస్ (ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్) కెమెరాల ద్వారా రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేశారు. క్యూలైన్లలో ఎక్కడైనా రద్దీ పెరిగితే వెంటనే ఆన్‌లైన్ ద్వారా గుర్తించి సిబ్బందిని అప్రమత్తం చేశారు.

భక్తుల సహకారంతోనే..

పోలీసులు, జిల్లా యంత్రాంగం, మీడియా సహకారం తోడు భక్తులు తితిదే సూచనలు పాటించడం వల్లే వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు విజయవంతమయ్యాయని తితిదే భావిస్తోంది. భవిష్యత్తులోనూ క్యూలైన్ల నిర్వహణలో ఏఐ టెక్నాలజీని మరింత విస్తృతంగా వినియోగించనుంది.

త్వరలో లడ్డూ కౌంటర్లకూ 'ఏఐ'

లడ్డూ ప్రసాద వితరణలోనూ త్వరలో ఈ టెక్నాలజీని వాడనున్నారు. ఎంతమంది భక్తులు క్యూలో ఉన్నారు? దానికి తగ్గట్టుగా ఎన్ని కౌంటర్లు తెరవాలి? అనే విషయాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే తెలుసుకోవచ్చు.

జనవరి 2 నుంచి సర్వదర్శనం..

జనవరి 2 నుంచి సామాన్య భక్తుల కోసం సర్వదర్శనం (ఉచిత దర్శనం) ప్రారంభించనున్నారు. ప్రస్తుతం అనుసరించిన క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానాన్నే అందులోనూ కొనసాగిస్తారు.

వైభవంగా వైకుంఠ ద్వాదశి చక్రస్నానం



చక్రస్నానం మహోత్సవంలో అర్చకులు, తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: వైకుంఠ ద్వాదశిని పురస్కరించుకుని తిరుమలలో బుధవారం చక్రస్నానం క్రతువును వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్‌ను శ్రీవారి ఆలయం నుంచి శ్రీ భూవరాహస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. శ్రీవారి పుష్కరిణిలో తెల్లవారుజామున స్నపన తిరుమంజనం, శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్లకు చక్రస్నాన మహోత్సవం చేపట్టారు. తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఎస్పీ సుబ్బరాయుడు, తితిదే సీవీఎస్‌వో మురళీకృష్ణ, పారుపత్తేదారు బాల, బొక్కసం ఇన్‌ఛార్జి గురురాజారావు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి రోజున 67,053 మందికి శ్రీవారి దర్శనం

తిరుమల, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని 67,053 మంది భక్తులు దర్శించుకున్నారు. ద్వాదశి రోజైన బుధవారం సాయంత్రం వరకు 51,534 మంది వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. ఇప్పటి వరకు వైకుంఠ ద్వారం నుంచి 1.18 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మంగళవారం శ్రీవారి హుండీ కానుకలు రూ.2.25 కోట్లు వచ్చాయి.

ప్రధానోపాధ్యాయ సంఘం 75 ఏళ్ల ఉత్సవాలకు సీఎంకు ఆహ్వానం



చంద్రబాబును ఆహ్వానిస్తున్న సంఘం అధ్యక్షుడు సీహెచ్ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు, సత్యనారాయణ

ఈనాడు, అమరావతి: ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం స్థాపించి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా త్వరలో నిర్వహించనున్న ఉత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబును ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ రవి, గుత్తా శ్రీనివాసరావు, నాయకులు సీవీవీ సత్యనారాయణ ఇటీవల ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం డైరీ, క్యాలెండర్‌ను సీఎం ఆవిష్కరించారు.

పవన్‌కల్యాణ్ చొరవతో అరకులో బ్లడ్‌బ్యాంక్

సికిల్‌సెల్ ఎనీమియా బాధితుల కోసం దాతల సహకారంతో నిర్మాణం

ఈనాడు, అమరావతి: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో సికిల్‌సెల్ ఎనీమియా బాధితుల కోసం అరకు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయనున్నారు. దాతల సహకారంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. సికిల్‌సెల్ ఎనీమియా నుంచి గిరిజన మహిళల్ని కాపాడేందుకు ఇది ఉపయోగపడనుంది. "అడవితల్లి బాట కార్యక్రమం ప్రారంభోత్సవానికి వెళ్లినప్పుడు కురిడి గ్రామంలో ఓ మహిళ సికిల్‌సెల్ ఎనీమియాతో ఎదురవుతున్న సమస్యలను పవన్‌కల్యాణ్‌కు వివరించారు. దీంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని పవన్ హామీ ఇచ్చారు. గిరిజన మహిళలకు నూతన సంవత్సర కానుకగా ఈ బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకానుంది" అని ఉపముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

మార్కాపురం, పోలవరంలో తాత్కాలిక కలెక్టరేట్ల ప్రారంభం

- బాధ్యతలు స్వీకరించిన ఇన్‌ఛార్జి కలెక్టర్లు

మార్కాపురం, రంపచోడవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మార్కాపురం, పోలవరం జిల్లా కేంద్రాల్లో బుధవారం నుంచే పాలన మొదలైంది. ఈ మేరకు ఇన్‌ఛార్జి కలెక్టర్లను నియమించడంతో పాటు తాత్కాలిక కలెక్టరేట్లను ప్రారంభించారు. ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సమక్షంలో ఉత్సాహ భరితంగా వేడుకలు నిర్వహించారు. మార్కాపురం జిల్లా తాత్కాలిక కలెక్టరేట్‌ను మార్కాపురం-తర్లుపాడు రహదారిలోని వెలిగొండ నిర్వాసితుల కాలనీలోని పాఠశాల భవనంలో ఏర్పాటు చేశారు. దీన్ని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ఎం.అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసి ప్రజల ఆకాంక్ష నెరవేర్చామని పేర్కొన్నారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టడానికే మార్కాపురం జిల్లాలో దొనకొండ, కురిచేడు మండలాలు లేవని వైకాపా రెచ్చగొడుతోందని విమర్శించారు.

◆ పోలవరం జిల్లా తాత్కాలిక కలెక్టరేట్‌ను రంపచోడవరంలో ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే శిరీషాదేవి, ఇన్‌ఛార్జి కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 'రంపచోడవరం నియోజకవర్గ ప్రజలు ఇంతవరకు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 350 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చింది. వీరి ఇబ్బందులు తీర్చడానికి కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చి నిలబెట్టుకున్నారు. పోలవరం జిల్లా ఏర్పాటుతో పాలన సులభతరం అవుతుంది' అని శిరీషాదేవి వెల్లడించారు.



మార్కాపురం జిల్లా తాత్కాలిక కలెక్టరేట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బాల వీరాంజనేయ స్వామి, ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఎం.అశోక్‌రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి



పోలవరం జిల్లా తాత్కాలిక కలెక్టరేట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి, ఇన్‌ఛార్జి కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి, జేసీ శ్రీపూజ తదితరులు

కంటతడి పెట్టిన కందుల



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు మార్కాపురంను జిల్లా చేశారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి భావోద్వేగంతో కంటతడి పెట్టుకున్నారు. దీన్ని చంద్రన్న మార్కాపురం జిల్లాగా పిలుచుకుంటామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు వద్ద ఆయనకు గుడి కట్టిస్తామని తెలిపారు.

జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల పునర్విభజనపై గెజిట్

ఈనాడు, అమరావతి: కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లతోపాటు ఇతర మార్పులు, చేర్పులకు సంబంధించిన నోటిఫికేషన్లు జిల్లాల వారీగా గెజిట్‌లో ప్రచురించారు. జిల్లా, రెవెన్యూ డివిజన్లు, అందులోని మండలాల వివరాల్ని అందులో పేర్కొన్నారు. బుధవారం నుంచి కొత్త జిల్లా కేంద్రాలు, రెవెన్యూ డివిజన్లలో పాలన ప్రారంభమైంది.

జనసేన కార్యకర్త హత్యకేసులో బొజ్జల విచారణ?

కోట దంపతుల వాంగ్మూలం, రాయుడి వీడియో ఆధారంగానే!

ఈనాడు-తిరుపతి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాళెం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త శ్రీనివాసులు ఎలియాస్ రాయుడు హత్యకేసులో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని చెన్నై పోలీసులు త్వరలో విచారించే అవకాశం ఉందని తెలుస్తోంది. రాయుడి హత్యలో తమ ప్రమేయం లేదని, కావాలనే కుట్రచేసి ఇరికించారని కేసులో నిందితులైన శ్రీకాళహస్తి జనసేన మాజీ ఇన్‌ఛార్జి కోట వినుత, ఆమె భర్త చంద్రబాబు గతంలో ఆరోపించారు. బొజ్జల సుధీర్‌రెడ్డే ఇందుకు కారణమని వారన్నారు. మరణానికి ముందు రాయుడు చిత్రీకరించిన 19.42 నిమిషాల వీడియోలోనూ సుధీర్‌రెడ్డి తనను ప్రలోభపెట్టారని, కోట దంపతులను రోడ్డుప్రమాదంలో చంపేందుకు యత్నించాలని ఆయన అనుచరుడు సుజిత్‌రెడ్డితో చెప్పించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే త్వరలో బొజ్జలకు సమన్లు జారీచేసి విచారించనున్నారని సమాచారం. గతేడాది జులై 7న రాయుడు హత్యకు గురయ్యారు. మర్నాడు అతడి శవం చెన్నై కూవం నదిలో కనపడింది. అప్పట్లో ఈ కేసులో కోట వినుత దంపతులు, వారి సహాయకుడు గోపి, కారుడ్రైవర్ షేక్ దాసన్, శివకుమార్‌లను చెన్నై పోలీసులు అరెస్టు చేశారు. రాయుడి హత్యతో తనకు సంబంధం లేదని బొజ్జల సుధీర్‌రెడ్డి గతంలోనే స్పష్టం చేశారు. ఈ కేసులో ఇటీవల జనసేనకు చెందిన పేట చంద్రశేఖర్‌ను పోలీసులు విచారించారు.

స్వర్ణ వార్డులపై ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: వార్డు సచివాలయాల పేరును స్వర్ణ వార్డులుగా మార్చి అమలు చేసేందుకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను స్వర్ణ గ్రామాలు, వార్డులుగా మార్చాలన్న ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో స్వర్ణ వార్డు పేరు అమల్లోకి వచ్చిందని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ పేర్కొన్నారు.

కొత్త జిల్లాల వారీగా ఆర్టీసీ డిపోల విభజన

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రెండు కొత్త జిల్లాలు ఏర్పాటు కావడంతోపాటు కొన్ని జిల్లాల్లో మార్పులు, చేర్పులు జరిగిన నేపథ్యంలో.. ఆర్టీసీ కూడా డిపోలను జిల్లాల వారీగా విభజించింది. ఈ మేరకు సంస్థ ఎండీ ఆదేశాలు జారీచేశారు. పోలవరం జిల్లాలో ఒక్క డిపో కూడా లేదు. ఇక మార్కాపురం జిల్లా పరిధిలో పొదిలి, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు డిపోలు వచ్చాయి. మార్పులు, చేర్పులన్నీ బుధవారం నుంచే అమల్లోకి వచ్చినట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు.

పొరుగు జిల్లాల డీపీటీవోలకు బాధ్యతలు

◆ కొత్తగా ఏర్పడిన పోలవరం, మార్కాపురం జిల్లాలకు.. జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి (డీపీటీవో) పోస్టులు సృష్టించారు. ◆ రంపచోడవరం కేంద్రంగా ఏర్పడిన పోలవరం జిల్లాకు సంబంధించి డీపీటీవోగా.. తూర్పుగోదావరి జిల్లా డీపీటీవో వైఎస్ఎన్ మూర్తి బాధ్యతలు చూడనున్నారు. ◆ మార్కాపురం డీపీటీవోగా.. ప్రకాశం డీపీటీవో జి.సత్యనారాయణ వ్యవహరించనున్నారు. ◆ రంపచోడవరం బస్‌స్టాండ్ ఇంతకాలం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉండేది. ఇప్పుడు పోలవరం జిల్లా పరిధిలోకి వచ్చింది. దీంతో తూర్పుగోదావరి జిల్లాలోని గోకవరం డిపో మేనేజర్‌కు ఆ బస్టాండ్‌ను ఎటాచ్ చేశారు.◆ అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నుంచి మదనపల్లెకి మారింది. ఆరు నెలలుగా చిత్తూరు డీపీటీవో రాము.. అన్నమయ్య జిల్లా డీపీటీవోగా బాధ్యతలు చూస్తున్నారు. ఆయన్నే ఇప్పుడు మదనపల్లె కేంద్రంగా ఆ జిల్లా బాధ్యతలు చూడాలని ఆదేశించారు.

జిల్లాల పునర్విభజనతో డిపోల పరిధి మార్పులు ఇలా..

జిల్లా	డిపోలు
బాపట్ల	బాపట్ల, రేపల్లె, చీరాల
ప్రకాశం	ఒంగోలు, అద్దంకి, కందుకూరు
మార్కాపురం	మార్కాపురం, పొదిలి, కనిగిరి, గిద్దలూరు
నెల్లూరు	నెల్లూరు-1, 2, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, రాపూరు, గూడూరు
తిరుపతి	వాకాడు, సూళ్లూరుపేట, వెంకటగిరి, తిరుపతి, మంగళం, అలిపిరి, తిరుమల, శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు
చిత్తూరు	చిత్తూరు-1, 2, పలమనేరు, కుప్పం
అన్నమయ్య	పీలేరు, మదనపల్లె-1, 2, రాయచోటి, పుంగనూరు
వైఎస్సార్ కడప	కడప, బద్వేల్, మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల, రాజంపేట

మారిన డిపోలివే..

9 డిపోలు.. ఇప్పటివరకు ఉన్న జిల్లాల నుంచి వేరొక జిల్లా పరిధిలోకి మారాయి.

డిపో	ఇప్పటివరకు ఉన్న జిల్లా	కొత్త జిల్లా
కందుకూరు	నెల్లూరు	ప్రకాశం
అద్దంకి	బాపట్ల	ప్రకాశం
కనిగిరి	ప్రకాశం	మార్కాపురం
గిద్దలూరు	ప్రకాశం	మార్కాపురం
మార్కాపురం	ప్రకాశం	మార్కాపురం
పొదిలి	ప్రకాశం	మార్కాపురం
గూడూరు	తిరుపతి	నెల్లూరు
పుంగనూరు	చిత్తూరు	అన్నమయ్య
రాజంపేట	అన్నమయ్య	వైఎస్సార్ కడప

అల్లూరి జిల్లాలో ఒక్క డిపోయే..

◆ తాజాగా జరిగిన మార్పులతో.. రాష్ట్రంలో ఒక్క డిపో కూడా లేని జిల్లాగా పోలవరం నిలిచింది.

◆ అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు డిపో ఒక్కటే ఉంది. ◆ రెండేసి డిపోల చొప్పున విజయనగరం జిల్లాలో విజయనగరం, ఎస్.కోట, అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం.. ఉన్నాయి.

◆ అత్యధికంగా తిరుపతి జిల్లాలో 10 డిపోలు ఉన్నాయి.◆ ఆ తర్వాత వైఎస్సార్ కడప, నంద్యాల, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో ఏడేసి డిపోలు చొప్పున ఉన్నాయి.

గ్రహం అనుగ్రహం

1-1-2026 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్యమాసం, శుక్లపక్షం

త్రయోదశి: రా. 8-47 తదుపరి చతుర్దశి; **రోహిణి:** రా. 9-53 తదుపరి మృగశిర
వర్జ్యం: మ. 2-26 నుంచి 3-55 వరకు, తిరిగి తె. 3-06 నుంచి 4-36 వరకు
అమృత ఘడియలు: సా. 6-54 నుంచి 8-23 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-13 నుంచి 10-57 వరకు, తిరిగి మ. 2-36 నుంచి 3-20 వరకు, **రాహుకాలం:** మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6.34; **సూర్యాస్తమయం:** సా.5.32


చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.2	31.3
మెదక్	9.3	29.2
హైదరాబాద్	13.8	29.8
విజయనగరం	14.0	24.0
నల్గొండ	15.2	28.0
కరీంనగర్	16.0	30.0
ఖమ్మం	16.4	29.8
కర్నూలు	16.6	31.5
రాజమహేంద్రవరం	17.0	34.0
విశాఖపట్నం	18.8	27.8
శ్రీకాకుళం	19.0	28.0
కడప	20.0	30.0
నరసాపురం	20.8	30.6
విజయవాడ	21.0	29.7
గుంటూరు	21.0	31.0
అనంతపురం	21.2	32.0
ఒంగోలు	21.4	29.5
నెల్లూరు	21.8	30.3
తాడేపల్లిగూడెం	22.0	30.0




గణతంత్ర కవాతులో తొలిసారిగా జంతుదళం

ఇంటర్నెట్ డెస్క్: దిల్లీలోని కర్తవ్యపథ్‌లో జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ కవాతులో ఈసారి ఓ అరుదైన దళం చేరనుంది. తొలిసారిగా జంతు దళాన్ని ఈ వేడుకలోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకొంటున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రీమౌంట్ అండ్ వెటర్నరీ కార్ప్స్ విభాగానికి చెందిన శిక్షణ పొందిన జంతువులను ఈ కవాతులో ప్రదర్శించనున్నట్లు అధికారులు తెలిపారు. దేశంలో అత్యంత సవాళ్లతో కూడిన సరిహద్దుల వద్ద భద్రత విధుల్లో భాగంగా సైనికులు ఉపయోగించే బాక్ట్రియన్ జాతికి చెందిన రెండు ఒంటెలు, నాలుగు గుర్రాలు, నాలుగు డేగలు, ఆర్మీకి చెందిన పది స్వదేశీ జాగిలాలు, ఇప్పటికే సేవల్లో ఉన్న మరో ఆరు జాగిలాలు ఈ దళంలో ఉంటాయి.



కొత్త ఏడాదిలో ప్రజలకు రెట్టింపు సంతోషం, సంక్షేమం, అభివృద్ధి అందిస్తాం

- రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించిన గొప్ప మలుపు 2025
- నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రజలకు 2026 సంవత్సరంలో రెట్టింపు సంతోషం, సంక్షేమం, అభివృద్ధి అందిస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ' లక్ష్యం చేరుకోవడంలో ఈ ఏడాది మరెన్నో అడుగులు పడాలని ఆకాంక్షించారు. ఎక్స్ వేదికగా బుధవారం ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. "2025లో కూటమి ప్రభుత్వ పాలన మరిచిపోలేని విజయాల్ని అందించింది. ఎన్నో మైలురాళ్లను చేరుకుంది. అనేక సంక్షేమ, అభివృద్ధి పనులకు నాంది పలికింది. ఇది ఒక సంవత్సరం కాదు.. నాటి విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించిన గొప్ప మలుపు. ఎన్నో సంక్షోభాలు, సమస్యలు, సవాళ్లను అధిగమించాం. ఇదే స్ఫూర్తి 2026లోనూ కొనసాగనుంది. ప్రజల జీవితాల్లో కొత్త కాంతులు నింపాలి" అని వెల్లడించారు.

ముందురోజే 93% మందికి పింఛన్లు

(మొదటి పేజీ తరువాయి)

మిగతా వారికి జనవరి 2న అందజేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

సిబ్బందికి సీఎం అభినందనలు

రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రభుత్వాధికారులు, గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది, గ్రామ స్థాయి ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా పేదల ఇళ్లల్లో సంతోషం నింపేందుకు ఒకరోజు ముందుగానే పింఛన్లు ఇవ్వాలన్న ప్రభుత్వ ఆలోచనను చక్కగా అమలు చేశారని ఎక్స్ వేదికగా బుధవారం కొనియాడారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద పేదలకు ఆర్థిక భరోసా ఇవ్వాలనేదే ప్రభుత్వ సంకల్పమని వెల్లడించారు.

పింఛన్ల పంపిణీతో అత్యధిక సంతృప్తి

పేదల జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించే పింఛన్ల పంపిణీ తనకు అత్యంత సంతృప్తినిచ్చే సంక్షేమ కార్యక్రమమని సీఎం చంద్రబాబు తెలిపారు. నూతన సంవత్సరం ఆరంభానికి ఒకరోజు ముందే పింఛన్ల సొమ్ము అందజేసినట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. పింఛనుదారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. "మీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.50 వేల కోట్లకు పైగా పింఛన్లకు ఖర్చుపెట్టాం. డిసెంబరుకు గాను 63.12 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేసేందుకు రూ.2,743 కోట్లు విడుదల చేశాం" అని వెల్లడించారు.

అసాధారణం.. వాతావరణ సంక్షోభం!

ఈనాడు, విశాఖపట్నం: తీవ్రమవుతున్న వాతావరణ సంక్షోభం.. ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. విధ్వంసకర తుపాన్లు, వరదలు, వడగాడ్పులు వివిధ దేశాలను కలవరపెడుతున్నాయి. వాతావరణ సంక్షోభం అసాధారణ స్థాయికి చేరుకుంటుందని కొన్నేళ్లుగా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలు స్పష్టం చేస్తున్నాయి. 2025లోనూ ప్రపంచవ్యాప్తంగా సంభవించిన 157 ప్రకృతి వైపరీత్యాలు కోట్ల మంది ప్రజలను ఇబ్బంది పెట్టినట్లు వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్ సంస్థ నివేదిక పేర్కొంది. 2024లో నెలకొన్న ప్రపంచ ఉష్ణోగ్రత రికార్డును అధిగమించకపోయినా.. 2025 అత్యంత వేడి సంవత్సరాల్లో ఒకటిగా నిలిచింది. చరిత్రలో తొలిసారిగా మూడేళ్ల సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీలు దాటింది. వేసవిలో వేడి, శీతకాలంలో చలి తీవ్రత అధికమైంది.

తొమ్మిదో స్థానంలో భారత్

- ప్రపంచవ్యాప్తంగా 1995-2024 మధ్యలో 9,700 ప్రకృతి వైపరీత్యాలు సంభవించినట్లు ఇటీవల జర్మన్‌వాచ్‌సంస్థ విడుదల చేసిన 'క్లైమేట్ రిస్క్ ఇండెక్స్-2026' పేర్కొంది. వాటి వల్ల ప్రత్యక్షంగా 8,32,000 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించింది.
- గత మూడు దశాబ్దాల్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా ప్రభావితమైన దేశాల జాబితాలో భారత్ తొమ్మిదో స్థానంలో ఉండడం గమనార్హం. ఆ సమయంలో దేశంలో 430 వరకు



ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. వాటి కారణంగా దాదాపు 80 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. 130 కోట్ల మంది ప్రభావితమయ్యారు. రూ.12 లక్షల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా.

- 2024లో తీవ్ర వరదలు, కొండ చరియలు విరిగిపడడంతో 80 లక్షల మందికి పైగా ప్రజలు ప్రభావితమయ్యారు. గుజరాత్, మహారాష్ట్ర, త్రిపుర రాష్ట్రాల్లో తీవ్రత ఎక్కువగా ఉంది. అంతర్జాతీయ విపత్తుల డేటాబేస్ ప్రకారం 52 శాతం ఎక్కువ వడగాడ్పులు జపాన్, భారత్, పాకిస్థాన్, అమెరికా, ఫ్రాన్స్, బెల్జియం, బ్రిటన్, స్పెయిన్, జర్మనీ దేశాల్లో సంభవించాయి.
- 2025లో 14 తీవ్ర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినట్లు అంతర్జాతీయ విపత్తుల డేటాబేస్‌లో పొందుపరిచారు. వీటి కారణంగా మొత్తం 570 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ ఏడాది భారీ వర్షాలు వివిధ రాష్ట్రాలను అతలాకుతలం చేశాయి. దేశవ్యాప్తంగా 19 లక్షల మందికి పైగా ప్రభావితమయ్యారు.
- మే, జూన్ నెలల్లో వర్షాల కారణంగా.. అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం, మణిపుర్, సిక్కిం, మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో 14 లక్షల మంది ప్రభావితమయ్యారు.

దేశంలో పెరుగుతున్న ప్రకృతి వైపరీత్యాలు

మరో వేడి సంవత్సరంగా నిలిచిన 2025

వాతావరణ మార్పులతో

ప్రకృతి వైపరీత్యాల కారణంగా భారత్‌లో అత్యధిక మరణాలు, అధిక ఆర్థిక నష్టాలు సంభవిస్తున్నాయి. వరదలు, వడగాడ్పులు, తుపాన్లు, కరవుల కారణంగా దేశం ప్రభావితమవుతోంది. మానవ ప్రేరేపిత వాతావరణ మార్పుల కారణంగా ఆయా ఘటనల తరచుదనం, తీవ్రత పెరుగుతుందని వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2025లో అరేబియా సముద్రంలో ఒక తుపాను, బంగాళాఖాతంలో మూడు ఏర్పడ్డాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా, సెనియార్, దిత్వా తుపాన్లు దిశ, గమనం, వివిధ లక్షణాల పరంగా విభిన్నంగా ప్రవర్తించాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో తుపాన్ల లక్షణాలు మారిపోతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

తాగి తూలుతుంటే ఇంటి వద్ద దిగబెడతాం

- కర్ణాటక హోంమంత్రి

ఈనాడు, బెంగళూరు: నూతన సంవత్సర సంబరాల్లో మద్యం తాగి మత్తులో తూలుతున్న వారిని ఇంటి దగ్గర దించేలా బెంగళూరులో ఏర్పాట్లు చేసినట్లు కర్ణాటక హోంశాఖ మంత్రి జి.పరమేశ్వర్ బుధవారం వెల్లడించారు. బాగా మత్తులో ఉండి స్పృహలో ఉండలేని వారి కోసం నగరంలో 15 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మత్తు దిగే వరకు వారు అక్కడే విశ్రాంతి తీసుకోవచ్చని వెల్లడించారు. మొత్తం 20 వేల మంది పోలీసులు, ప్రత్యేక మహిళా పోలీసులను భద్రత కోసం నియమించినట్లు మంత్రి తెలిపారు. బాగా మత్తులో ఉన్న వారిని ఇంటి వద్ద దించేందుకు 1,000 వరకు ప్రైవేట్ టెంపోలను సిద్ధంగా ఉంచామని పోలీసుఉన్నతాధికారులు వెల్లడించారు.

రూ.15,000 తగ్గిన కిలో వెండి

ఈనాడు వాణిజ్య విభాగం: బంగారం, వెండి ధరల్లో తీవ్ర ఒడుదొడుకులు నమోదవుతున్నాయి. సోమవారం భారీగా దిగొచ్చిన వెండి ధర, మంగళవారం మళ్లీ దూసుకెళ్లింది. మళ్లీ బుధవారం ఈ ధర దిగొచ్చింది. హైదరాబాద్ బులియన్ విపణిలో బుధవారం రాత్రి 11.30 గంటలకు వెండి కిలో ధర రూ.2,35,000కు దిగొచ్చింది. 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,37,000కు పరిమితమైంది. గురువారం ఆభరణాల విపణిలో ఈ ధరలనే పరిగణనలోకి తీసుకుంటారు. మంగళవారం వెండి కిలో ధర రూ.2.50 లక్షలు, 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1.38 లక్షలుగా ఉంది. సోమవారం ఈ ధరలు రూ.2.28 లక్షలు, రూ.1.37 లక్షలుగా నమోదయ్యాయి.

స్వేచ్ఛగా ఆడనివ్వండి..

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులనూ ప్రోత్సహిస్తూ.. అమ్మాయిల విజయాలను వేడుకగా జరుపుకోవాలి.

మహిళల కోసం మార్పులు

వేతన సమానత్వం, డబ్ల్యూపీఎల్‌తో మహిళల క్రికెట్లో చాలా మార్పొచ్చింది. కానీ అమ్మాయిల కోసం మరిన్ని వసతులు, రెసిడెన్షియల్ అకాడమీలు, మెరుగైన శిక్షణ అవసరం. అమ్మాయిలూ క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవచ్చనే ఆలోచనా ధోరణి సమాజంలో పెరగాలి. క్రీడలు సహా అన్ని రంగాల్లో అమ్మాయిలకు మౌలిక సదుపాయాలు, మద్దతు లభించినప్పుడే నిజమైన మార్పు సాధ్యం.

క్రీడలతో ఆడపిల్లల్లో స్వతంత్రత

ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, జట్టుగా పనిచేయడం వంటి విషయాల్ని క్రీడల్లో నేర్చుకోవచ్చు. ఇవి అమ్మాయిలను స్వతంత్రంగా ఉండేలా.. మంచి నిర్ణయాలు తీసుకునేలా.. దృఢంగా నిలిచేలా తీర్చిదిద్దుతాయి. క్రికెట్ నాకు ఒక వేదికను, లక్ష్యాన్ని అందించింది. ప్రతి అమ్మాయికి ఆ అవకాశం రావాలి. ఇది కేవలం క్రీడాకారిణులనే కాదు.. బలమైన మహిళలను తయారు చేసే సాధనం.

విమర్శల నుంచి ప్రేరణ..

పరాజయాల తర్వాత విమర్శలు సహజం. అవి కష్టంగా అనిపించినా.. మేం మానసికంగా దృఢంగా తయారయ్యాం. నా పనిపైనే దృష్టి సారిస్తా. విమర్శలను ఇంధనంగా మార్చుకుంటా. ప్రపంచకప్ ప్రారంభంలో ఎదురుదెబ్బలు తగిలినా మేం పాజిటివ్‌గానే ఉన్నాం. మైదానంలో నిరూపించుకోవడానికి విమర్శలే ప్రేరణనిస్తాయి.

మానసిక బలమే కీలకం

క్రీడల్లో 70-80 శాతం పాత్ర మానసిక బలానిదే. ప్రపంచకప్ ఫైనల్, నాకౌట్ వంటి తీవ్ర ఒత్తిడి మ్యాచ్‌ల్లో మనసు.. మెదడే గెలిపిస్తాయి. జట్టులోని ప్రతి క్రికెటర్ జీవితంలో ధ్యానం, రికవరీ, మానసిక ప్రశాంతత అంతర్భాగం. ప్రపంచకప్ కష్టకాలంలో మా నమ్మకమే ముందుకు నడిపించింది.

భావితరాలు.. విలువలు

కష్టపడి పనిచేయడం, వినయం, గౌరవం, మూలాలను ఎప్పటికీ మర్చిపోకపోవడం అత్యంత ముఖ్యం. క్రమశిక్షణతో ఉంటూ, కుటుంబానికి విలువనిస్తూ, నిజాయతీతో ఆడాలి. గెలిచినా, ఓడినా శాయశక్తులా ప్రయత్నించి అందరికీ స్ఫూర్తిగా నిలవాలి. భారత జట్టు నుంచి అమ్మాయిలు నేర్చుకోవాల్సింది ఇదే.



నాన్న స్వయంగా తయారు చేసిచ్చిన బ్యాట్..

కఠోర శ్రమ, క్రమశిక్షణ, పట్టుదల, దృఢ సంకల్పం నన్ను ఈ స్థాయికి చేర్చాయి. అబ్బాయిలతో ఆడుతున్నప్పుడు.. అమ్మాయిలు కూడా ప్రొఫెషనల్ క్రికెట్ ఆడతారని నాకు తెలియదు. అప్పట్నుంచి ఈ రోజు వరకు లక్ష్యంపై దృష్టి పెట్టడం.. తప్పుల నుంచి నేర్చుకోవడమే నా ఉన్నతికి కారణాలు. రోజువారీ సాధన, కుటుంబ ఆప్యాయత, నన్ను నేను నమ్మడం వంటి లక్షణాలూ దోహదపడ్డాయి. వీటన్నిటికీ మించి మా నాన్న మద్దతు.. ఆయన నాకు స్వయంగా తయారు చేసిచ్చిన మొదటి బ్యాట్ నా క్రీడా ప్రయాణానికి పునాది.

భారత కెప్టెన్‌గా.. కుమార్తెగా..

కుటుంబం నన్ను ఎప్పుడూ సాధారణంగా ఉంచుతుంది. సారథ్యం ఒక బాధ్యత. ఇంట్లో నేను కుమార్తెను మాత్రమే. కుటుంబసభ్యులతోనే ఎక్కువ సమయం గడుపుతా. ప్రపంచకప్ గెలిచిన తర్వాత నేరుగా మా నాన్న ఒడిలోకి చేరడం నా జీవితంలో స్వచ్ఛమైన ఆనందం. మనకు ఏది ముఖ్యమో దానికి ప్రాధాన్యమివ్వడం ద్వారా సమతౌల్యం కుదురుతుంది.

నిజాయతీ, హుందాతనం

నిబంధనల ప్రకారం ఆడటం, తప్పులను అంగీకరించడం, ఆదర్శంగా ప్రవర్తించడమే నిజాయతీ. గెలిచినప్పుడు వినయంగా ఉండటం, ఓడిపోయినపుడు సాకులు చెప్పకుండా స్వీకరించడమే హుందాతనం. ప్రాక్టికల్‌గా ఉంటూ, అందరినీ గౌరవిస్తూ మన మూలాలను గుర్తుంచుకోవడం అన్నిటికంటే ముఖ్యం.

సోషల్ మీడియా ఒత్తిడి

సోషల్ మీడియా కామెంట్లు కఠినంగా ఉండొచ్చు. అవి ఇతరుల అభిప్రాయాలు మాత్రమే. వాటిని పట్టించుకోకుండా ఆటపైనే దృష్టి సారించాలి. సోషల్ మీడియా వేదికలు ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా ఉండాలే తప్ప మానసిక ప్రశాంతతను దెబ్బతీయకూడదు. మేమందరం ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నాం. అలాంటి ఎకౌంట్లను బ్లాక్ చేసి.. కష్టపడి పనిచేస్తూనే ఉండాలి.

- ఈనాడు, హైదరాబాద్

రూ.50 పందెం కట్టి.. పెన్ను మింగిన విద్యార్థి

మూడేళ్లుగా కడుపులోనే..

శస్త్రచికిత్స లేకుండా బయటకు తీసిన గుంటూరు జీజీహెచ్ వైద్యులు



విద్యార్థి మింగిన పెన్ను | సీటీ స్కాన్‌లో కనిపిస్తున్న పెన్ను

గుంటూరు(నగరంపాలెం), న్యూస్‌టుడే: పందెం కోసం పెన్ను మింగిన ఓ విద్యార్థి ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు. తొమ్మిదో తరగతి చదువుకునే రోజుల్లో సహచర విద్యార్థులతో రూ.50 పందెం కట్టి పెన్ను మింగేశాడు. మూడేళ్ల తర్వాత తీవ్రమైన కడుపునొప్పితో ఇబ్బందిపడ్డాడు. గుంటూరు సర్వజనాసుపత్రిని ఆశ్రయించగా గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు శస్త్రచికిత్స అవసరం లేకుండా పెన్ను బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. జీజీహెచ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ వివరాలు వెల్లడించారు. గుంటూరులోని కొత్తపేటకు చెందిన శ్రీనివాసరావు, లక్ష్మీ సుజాతల కుమారుడు మురళీకృష్ణ(16) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తొమ్మిదో తరగతి చదివే రోజుల్లో రూ.50 కోసం స్నేహితులతో పందెం కట్టి పెన్ను మింగాడు. ఇటీవల కడుపునొప్పి వస్తున్నా తల్లిదండ్రులకు చెప్పకుండా దాచాడు. డిసెంబరు 18న తీవ్ర కడుపునొప్పితో విలవిల్లాడుతుండడంతో.. మూడేళ్ల కిందట పెన్ను మింగిన విషయాన్ని స్నేహితులు తల్లిదండ్రులకు చెప్పారు. చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌లోని వైద్యులకు చూపించగా వారు విద్యార్థికి సీటీ స్కాన్ చేసి కడుపులో పెన్ను ఉన్నట్లు నిర్ధారించారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి కవిత, అసోసియేట్ ప్రొఫెసర్ నాగూర్‌బాషా, అసిస్టెంట్ ప్రొఫెసర్ శివరామకృష్ణ బుధవారం విజయవంతంగా పెద్దపేగులోని పెన్నును బయటకు తీశారు. రెట్రో గ్రేడ్ ఎంటెరోస్కోపీ విత్ ఓవర్ ట్యూబ్‌తో శస్త్రచికిత్స లేకుండా పెన్నును తొలగించారు. వైద్యుల బృందాన్ని సూపరింటెండెంట్ అభినందించారు.



విద్యార్థి మురళీకృష్ణతో జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ, వైద్యులు

రికార్డు స్థాయిలో 'జీవన్‌దాన్'

(మొదటి పేజీ తరువాయి)

ముందుకొస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. అపోహలు తొలగించేలా రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో పుట్టెడు దుఃఖంలోనూ బాధిత కుటుంబసభ్యులు అవయవదానానికి ముందుకొస్తున్నట్లు జీవన్‌దాన్ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ కె.రాంబాబు పేర్కొన్నారు. ప్రభుత్వ లాంఛనాలతో దాత దహనసంస్కారాల నిర్వహణ, ఆర్థికసహాయం అందించేందుకు ప్రభుత్వం జీవోను తీసుకొచ్చి ప్రోత్సహించిందన్నారు.

ఆరోగ్యశాఖ మంత్రి అభినందన: జీవన్‌దాన్ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ఆరోగ్యశాఖ చరిత్రలోనే తొలిసారిగా 301 అవయవాలను సేకరించడంపై రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. ఎక్స్ వేదికగా జీవన్‌దాన్ బృందాన్ని అభినందించారు. ఆరోగ్యశాఖలోని అధికారులు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో ఈ ఘనత సాధ్యమైందని, ఏడాదిలో 301మంది జీవితాల్లో వెలుగులు నింపడం అభినందనీయమని కొనియాడారు.

పదేళ్లలో సేకరించిన అవయవాలు

సంవత్సరం	దాతలు	అవయవాలు
2015	28	91
2016	39	128
2017	33	104
2018	38	121
2019	21	56
2020	2	6
2021	16	67
2022	26	86
2023	41	126
2024	66	210
2025	93	301

ఎస్సీల అభ్యున్నతికి.. ఉపాధి వడ్డీ భారం లేకుండా.. ఉన్నతి

(మొదటి పేజీ తరువాయి)

రాయితీగా ఇస్తారు

ఉన్నతి పథకం కింద వడ్డీ లేని రుణం..

రాయితీ రుణ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించి నెల వాయిదాల్లో చెల్లించే విధానం అమల్లో ఉంది. వారు తీసుకున్న రుణానికి వడ్డీ భారం పడేది. అయితే ఎస్సీలపై వడ్డీ భారం కూడా లేకుండా చేసేందుకు రాయితీ రుణ పథకానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ(సెర్ప్) పరిధిలో అమలవుతున్న 'ఉన్నతి' పథకాన్ని అనుసంధానించారు. యూనిట్ విలువలో రాయితీపోగా మిగతా మొత్తాన్ని ఈ పథకం కింద డ్వాక్రా సంఘాల్లోని ఎస్సీ మహిళలకు వడ్డీ లేని రుణాలుగా అందిస్తారు. ఫలితంగా వారిపై వడ్డీ భారం ఉండదు. రుణ మొత్తాన్ని నెల వాయిదాల్లో చెల్లించాలి.

జిల్లాల వారీగా ఎంపిక చేయాల్సిన లబ్ధిదారుల సంఖ్య ఇలా...

జిల్లా	లబ్ధిదారులు	జిల్లా	లబ్ధిదారులు	జిల్లా	లబ్ధిదారులు	జిల్లా	లబ్ధిదారులు
		అనకాపల్లి	83	కృష్ణా	181	కర్నూలు	208
శ్రీకాకుళం	99	కాకినాడ	172	ఎన్టీఆర్	211	నంద్యాల	177
విజయనగరం	108	అంబేడ్కర్		గుంటూరు	211	అనంతపురం	175
పార్వతీపురం మన్యం	57	కోనసీమ	219	బాపట్ల	183	శ్రీసత్యసాయి	130
అల్లూరి		తూర్పుగోదావరి	191	పల్నాడు	194	వైఎస్సార్ కడప	175
సీతారామరాజు	11	పశ్చిమగోదావరి	156	ప్రకాశం	280	అన్నమయ్య	120
విశాఖపట్నం	87	ఏలూరు	234	నెల్లూరు	263	చిత్తూరు	205
						తిరుపతి	270

ఎస్సీలకు తీపికబురు

ఈనాడు, అమరావతి: స్వయం ఉపాధి పథకాల కింద రుణాలు తీసుకుని వడ్డీ భారం మోయలేక ఇబ్బందిపడుతున్న ఎస్సీలకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. 11,479 మంది లబ్ధిదారులు జాతీయ ఎస్సీ ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్ఎఫ్‌డీసీ), జాతీయ సఫాయి కర్మచారీ ఆర్థికాభివృద్ధి సంస్థ(ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ)ల పథకాల కింద లబ్ధిదారులు తీసుకున్న రుణంపై వడ్డీని మాఫీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు వారు ఇది వరకు ఆయా పథకాల కింద తీసుకున్న రుణాన్ని నాలుగు నెలల్లో చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వ పాఠశాలలకు ఐచ్ఛిక సెలవు నేడు

ఈనాడు, అమరావతి: నూతన సంవత్సరం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు ఐచ్ఛిక సెలవు (ఆప్షనల్ హాలిడే)ను పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఏడాదిలో వినియోగించుకునే అవకాశం ఉన్న ఐదు ఐచ్ఛిక సెలవుల్లో జనవరి 1న ఒకటి వినియోగించుకోవచ్చని సూచించింది.

నీ భర్తకు మాజీ సీఎం, ఎంపీలను ఎదిరించేంత ధైర్యం ఉందా?



విలేకర్లతో మాట్లాడుతున్న సునీల్‌యాదవ్

- వివేకా హత్య కేసు నిందితుడు సునీల్‌యాదవ్ భార్యకు బెదిరింపు

పులివెందుల, న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డిలను ఎదిరించేంత ధైర్యం నీ భర్తకు ఉందా అంటూ పులివెందులకు చెందిన గుర్తు తెలియని వ్యక్తి బెదిరించాడని మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో నిందితుడు సునీల్‌యాదవ్ భార్య ధనలక్ష్మి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. అనంతరం సునీల్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ.. తన భార్య, కుమార్తెను తన సోదరుడు పట్టణంలోని ఓ ఆసుపత్రికి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా గుర్తుతెలియని ఓ వ్యక్తి వారిని నిలువరించాడన్నారు. జగన్, అవినాష్‌రెడ్డిలను ఎదిరించేంత ధైర్యం సునీల్‌కు ఉందా? నిన్ను, నీ బిడ్డను చంపితే ఏం చేస్తాడో చూస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపించారు. తననేమీ చేయలేక తన కుటుంబసభ్యులను బెదిరించడం సిగ్గుచేటన్నారు.


ఈనాడు

కాలపురుషుడి కొత్త సంతకం

కాల ప్రవాహంలో పడి వడివడిగా సాగిపోయే బతుకు పడవకు అడపాదడపా రేవుల్లో లంగరేసి, ప్రవాహం జోరును, ప్రయాణం తీరును మదింపు చేయడం - ప్రతి నావికుడికీ అవసరం. ఆ విరామాల కోసం కాలపురుషుడు కల్పన చేసే రేవులే- కొత్త సంవత్సరాలు! ఆ కల్పనే - కలనం! కలనం చేస్తుంది కాబట్టి అది కాలం అయింది. మార్పు- దాని విలక్షణ తీర్పు. కాలగతిలోని మలుపులు- నిజానికి సృజన పౌరుషవంతులకు తీయని పిలుపులు. 'ప్రపంచాన్ని మూకుడుగా చేసి, సూర్యచంద్రులనే ఇంధనం సాయంతో కాలం తయారు చేసే వంటకాలే - జీవులు' అంటాడు యక్షుడితో ధర్మజుడు. ఆ కాలాన్ని కొలిచేందుకు ఏర్పడినవే సౌర, చాంద్ర మానాలు. కాలంలో మార్పులు - ఆ పదార్థాలకు తాలింపులు. 'నిను కొంగ్రొత్తలు తేర్చు గుంఫనల వర్ణింపంగ ఊహింతును' అంటూ విశ్వనాథ, 'నా వినుతించే నా విరుతించే నా వినిపించే నవీన రీతుల..' కోసం శ్రీశ్రీ, ఆరాటపడింది - ఆ తాలింపులతో వచ్చే కమ్మని రుచుల కోసమే! నిన్నటి కన్నా చురుగ్గా.. చేస్తున్న పని మరింత మెరుగ్గా ఉండాలన్న ఆలోచన 'కైజెన్ టెక్నిక్'లో భాగం. జపాన్ తలరాతను మార్చిన పరమాద్భుత ప్రక్రియ అది. దాని కోసం మనలోని సృజన శక్తులను సమీకరించడమే ప్రతి రేవులోనూ జరగాల్సిన పని.

నిన్న నేడు రేపు - కాలమంటే ఈ మూడూ! 'వాడిన సుమాలు సువాసనలను పంచుతాయి, తాజాగా విచ్చుకుంటున్నవి వికాసాన్ని విరజిమ్ముతాయి, మొగ్గలుగా ఉన్నవి ఆశలను రేకెత్తిస్తాయి' అని కవులు వర్ణించే కుసుమాలు - కాలానికి సంకేతాలు. 'కొత్త పాతల మేలు కలయిక' అంటూ గురజాడ గుర్తు చేసిందీ ఈ త్రిపుటినే. సవ్యమైన దారుల్లో నవ్యమైన యోచనతో ఆ త్రిపుటిని మదింపు చేసే వాడే విజేతగా నిలుస్తాడు. జీవితాన్ని గెలుస్తాడు. నిజానికి జీవితమంటే - గాయం కనపడని యుద్ధం. విజయమని భ్రమపెట్టే పరాజయం. యుద్ధం అందరూ చేస్తారు. గెలిచేది మాత్రం- రాజొక్కడే. ఆ ఒక్కడూ మనమే కావాలి. 'జీవితంలో ఒక తలుపు మూసుకుపోతే - మరో తలుపు తెరుచుకుంటుంది. మూతపడిన దాని గురించే చింతిస్తూ కూర్చుంటే, తెరుచుకున్న తలుపు సంగతి తెలియదు' అన్నారు అలెగ్జాండర్ గ్రహంబెల్. తెరుచుకున్న తలుపుల గురించిన మేలు తలపులే - ఈ మేలి మలుపులకు గమ్యాలు!

'కొత్త చిగురు తొడుగుతోంది కోరి వచ్చు కాలం, చిత్తంలో నింపుతోంది హర్షానికి మూలం' అన్నారు అయాచితం నటేశ్వర శర్మ. 'కానిది లేదు మానవుడు గాఢతరమ్ముగ దీక్ష పూనుచో' అని సూచించారు గరికిపాటి. ఈ అవధాన కవుల భావనలు - బలమైన జీవితేచ్ఛకు ఆనవాళ్లు. ఆ దృఢ సంకల్పంతో, స్ఫుటమైన లక్ష్యాలతో సంతోషంగా, సమున్నతంగా కాలపురుషుణ్ని స్వాగతించినప్పుడే- అది 'కొత్త' సంవత్సరం అవుతుంది. లేకుంటే ఆయుర్దాయంలో ఓ ఏడాది వృథా అవుతుంది. మార్పంటే ఒక వ్యసనం నుంచి మరోదానికి కాదు. ఆ విషయంలో 'ఆస్ట్రిచ్ మెకానిజం' దోషం అంటారు మనస్తత్వవేత్తలు. ఉష్ట్రపక్షి భారీగా ఉంటుంది. ఎగరలేదు. ఏదైనా ప్రమాదం ఎదురైతే - అది ఇసుకలో తలను దూర్చి 'హమ్మయ్య! ఇక సమస్యలేదు' అనుకుంటుందట. అలా మనల్ని మనం వంచించుకుంటూ పోతే కాలపురుషుడి చేయూత దక్కదు. తొలిపొద్దు తొందర పెడుతోంది- 'కుంకుమంబద్దిన భంగి మింట(నింగిని)నదె - నిద్దుర మేలుకొమ్ము' అన్నాడు శృంగారనైషధంలో శ్రీనాథుడు. 2026 తొలిపొద్దులోకి మేలుకొందాం! గెలుపు దారి పడదాం!



ఉన్నత విద్యలో సంప్రదాయ బోధనావిధానం మారిపోవాలి. చదువంతా వివిధ మాధ్యమాల ద్వారా తరగతి బయట ఎక్కువ జరగాలి. విద్యార్థులు క్లాస్‌రూమ్‌ని తోటివారితో ఆలోచనలు పంచుకోవడానికి, ఉపాధ్యాయులతో లోతైన చర్చలు జరపడానికి, సందేహనివృత్తికి, ప్రయోగాలు చేసి నేర్చుకోవడానికి మాత్రమే ఉపయోగించాలి.

– చైతన్యమొయ్ గంగూలి, అణు శాస్త్రవేత్త

చెలిమి విలువ

జీవితంలో తీయని అనుబంధం స్నేహం. అందుకే 'పరమ మిత్రుండున్న బంధువర్గం బేల' అని అడిదము సూరకవి అన్నాడు. 'సాధు సంగంబు సకలార్థ సాధనంబు' అని భర్తృహరి భావిస్తాడు. అన్నమయ్య కూడా ఒక సంకీర్తనలో 'నారాయణుడు మంచి మనసులున్నవారితో స్నేహం కోరుకుంటాడు' అని ప్రకటించాడు.

చెలిమిని మించిన కలిమి లేదు. కలిమి లేని కుచేలుడు కృష్ణుడి చెలిమి వల్ల భాగ్యవంతుడయ్యాడు. ఆ మాటకొస్తే ఏ సంపత్తితో నిమిత్తం లేకుండానే బుద్ధిమంతులు మైత్రి ద్వారా స్వకార్యం సాధించుకుంటారు. పంచతంత్రంలోని మిత్రలాభం మొదటి కథే ఇందుకు ఉదాహరణ. కౌరవసభలో ధర్మరాజుకు ఒక్క శత్రువూ కనిపించలేదు. దుర్యోధనుడికి మిత్రుడు కనిపించలేదు. స్నేహ దృష్టితో చూస్తే లోకమంతా సన్నిహితులతోనే నిండి ఉంటుంది. హృదయ కవాటం తెరిచి ఉంచితే.. ఆ ప్రేమ వాటికలోకి నేల ఈనినట్లు ఆప్తులు చొచ్చుకొస్తారు. అందుకే హృదయ కంబానికి పాకే చెలిమి తీగను ద్వేషమనే కొడవలితో తెంచకూడదు.



అంతర్యామి

స్నేహం విలువను తెలిపే అద్భుతమైన కథ ఒకటి గ్రీకు పురాణాల్లో ఉంది. డామన్, పితియస్ అనే ఇద్దరు స్నేహితుల్లో పితియస్ మీద ఏవో ఆరోపణలు వచ్చి మరణశిక్ష పడుతుంది. కొన్ని ముఖ్యమైన పనులు ముగించుకుని వస్తానని గడువివ్వమని అడుగుతాడు. అయితే నీ స్నేహితుణ్ని నీ స్థానంలో ఉంచి వెళ్లమంటాడు ప్రభువు. డామన్ అందుకు అంగీకరించి పితియస్ వచ్చేవరకు జైల్లో ఉంటాడు. వారి స్నేహబంధం చూసి అచ్చెరువొందిన రాజు ఇద్దరినీ విడిచిపెడతాడు. అంతెందుకు... తొలి తెలుగు కావ్యం స్నేహ సంబంధే. భారత రచనలో తనకు అడుగడుగునా మిత్రుడు నారాయణభట్టు తోడ్పాటు అందించినట్లు నన్నయ ప్రస్తుతించాడు. మనిషి ఒక ద్వీపం అయితే ఆ ద్వీపాలను కలిపే తంత్రి స్నేహం. చెలికాడితో మాట్లాడటం అంటే మనతో మనం ముచ్చటించుకున్నట్లే. సన్నిహిత మిత్రుడు రహస్యాలను భద్రంగా దాచుకునే లాకర్‌తో సమానం. సుఖసంతోషాలను పంచుకునేందుకు అందరూ సిద్ధంగా ఉంటారు కానీ కష్టం, దుఃఖం పంచుకునేది మాత్రం మిత్రుడొక్కడే. శ్రీకృష్ణుడి నిర్యాణం తరవాత అర్జునుడు తాను ప్రియస్నేహితుణ్ని కోల్పోయినట్లు ఆవేదన చెందుతాడు. సప్త సుగుణాలలో స్నేహ సౌఖ్యం ప్రముఖమైందని పెద్దలు చెబుతారు. కాలం గడిచినా స్నేహం మెరుపు తగ్గదు సరికదా ఊరగాయలా రుచి పెరుగుతుంది. ఆస్ట్రియా సామాజిక శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం, మైత్రీబంధం వల్ల కలిగే ఆత్మానందం మరే బంధం వల్లా పొందలేం. దేహాన్ని ఒక ప్రమిద అనుకుంటే ఆ ప్రమిదలోని దీపం వెలగడానికి స్నేహమనే నూనె అవసరం. సమాజ దీప్తికి స్నేహదీపమే ఆధారమని రాయప్రోలు భావిస్తారు. స్నేహం కాలాన్ని పట్టించుకోదు. దూరాన్ని మనసు దరికి రానీయదు. జీవితగణితంలో స్నేహం సంతోషాన్ని హెచ్చవేస్తే, దుఃఖాన్ని విభజిస్తుంది. అమృతం సాధించడానికి బద్ధశత్రువులైన దేవదానవులు కలిసి పాలసముద్రాన్ని మధించారు. స్నేహామృతాన్ని సాధించడానికి జాతి, కుల, మత, భాష, ప్రాంతాల అడ్డుగోడలను మనం పడగొట్టలేమా?

– కర్లపాలెం హనుమంతరావు



భద్రంగా వెళ్లొస్తాం!

భారతదేశం గగన్‌యాన్ యాత్రకు సమాయత్తమవుతోంది. 2027లో చేపట్టే ఈ మానవ సహిత అంతరిక్ష యాత్రలో వ్యోమగాములను కక్ష్యలోకి పంపనుంది. తొలి భారతీయ వ్యోమగామి రాకేశ్ శర్మ 1984లో సోవియట్ వ్యోమనౌకలో అంతరిక్షంలోకి దూసుకెళ్లారు. తరవాత నాలుగు దశాబ్దాలు గడిచిపోయాయి. ఇప్పుడు అమెరికా, రష్యా, ఫ్రాన్స్‌ల సహకారంతో సొంతంగా భారతీయులను అంతరిక్షంలోకి పంపడానికి మన అంతరిక్ష పరిశోధన సంస్థ- ఇస్రో సిద్ధమవుతోంది. గగన్‌యాన్ కోసం వ్యోమగాముల ఎంపికలో భాగంగా ఇస్రోతో కలిసి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ పలువురు పైలట్లను పరీక్షించింది. ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ ఒకరు. వ్యోమగాములను సమీప భూకక్ష్యలోకి పంపి, యాత్ర ముగిసిన తరవాత వారిని క్షేమంగా సముద్రంలో దింపడం గగన్‌యాన్ మిషన్ ఉద్దేశం. ఈ యాత్రలో పాలుపంచుకోబోతున్న నాయర్‌తో 'ఈటీవీ భారత్' ప్రతినిధి సురభి గుప్తా ముఖాముఖి...

? అంతరిక్షంలో ప్రవేశించగానే మీరు చేపట్టే సంక్లిష్ట బాధ్యత ఏంటి? దానికి ఎలా సిద్ధమయ్యారు?

సమీప భూకక్ష్యలో గురుత్వాకర్షణ శక్తి దాదాపు ఉండదనే చెప్పాలి. ఆ భార రహిత స్థితిలో మనల్ని మనం నిభాయించుకుంటూ పనులు చేయడం ఒక సవాలే. అది శారీరకంగా కష్టమైన పని అనిపించవచ్చు కానీ, నా వరకు నేను దాన్ని శారీరకంగా కన్నా మానసికంగా క్లిష్టమైన బాధ్యతగా పరిగణిస్తాను. అదే సమయంలో శారీరక పటిమ, రోదసిలో వైద్యపరమైన మద్దతు కూడా కీలకమే. వాటి సాయంతో అంతరిక్షంలో తేలిగ్గా ఇమిడిపోయి సమర్థంగా పనులు చేయగలుగుతాం.

? అంతరిక్షంలో మన సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని ఇస్రో చెబుతోంది. ఆ విషయంలో మీరు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారా?

భద్రతాపరమైన శిక్షణ ఓ నిరంతర ప్రక్రియ. సిబ్బంది క్షేమంగా అంతరిక్షంలోకి వెళ్లి తమ కార్యక్రమాలను నిర్వహించి సురక్షితంగా భూమి మీదికి తిరిగి రావడానికి అన్నిరకాల జాగ్రత్తలూ తీసుకుంటున్నారు. సిబ్బంది భద్రత అన్నింటికన్నా ముఖ్యమని ఇస్రో ఛైర్మన్ ఇంతకుముందే స్పష్టం చేశారు. ఎంపికైన వ్యోమగాములకు ఇచ్చే శిక్షణ కార్యక్రమంలో కూడా ప్రతి దశలో అదే స్ఫూర్తి కనిపిస్తుంటుంది.

? గగన్‌యాన్ కోసం శిక్షణ పొందేటప్పుడు మీకు ఇది చాలా కఠినంగా ఉందని ఎప్పుడైనా అనిపించిందా?

శిక్షణలో ఫలానా అంశం లేదా ఫలానా భాగం కఠినంగా అనిపించిందని ప్రత్యేకంగా చెప్పలేను. అలాంటి భావన ఎప్పుడూ కలగలేదు. శిక్షణ కార్యక్రమంలో ప్రతి అంశాన్నీ ఎంతో జాగ్రత్తగా, దూరదృష్టితో రూపొందిస్తారు. శారీరక శిక్షణ మొదలుకుని వైద్య పరీక్షలు, సిద్ధాంత పాఠాలు, సందర్శన యాత్రల వరకు ప్రతిదీ ఆసక్తికరంగా, ఆహ్లాదకరంగా సాగింది.

? మీరు ఫైటర్ పైలట్‌గా, టెస్ట్ పైలట్‌గా, ఫ్లైట్ శిక్షకుడిగా రాణించారు. మీ ఈ అనుభవం గగన్‌యాన్ యాత్రకు ఏ విధంగా ఉపయోగపడుతోంది?

నా అనుభవం గగన్‌యాన్ యాత్రకు నన్ను మెరుగ్గా సంసిద్ధుణ్ని చేసింది. ఒక కొత్త వ్యోమనౌకను కక్ష్యలో ప్రవేశపెట్టేటప్పుడు దాన్ని మొదటి నుంచి చివరి వరకు చక్కగా నడిపి, మధ్యలో ఎలాంటి అవాంతరమైనా లేదా అత్యవసర స్థితి వంటివేమైనా ఎదురైనా సమర్థంగా నిభాయించుకోగలగాలి. టెస్ట్ పైలట్‌కు ఈ విషయంలో మంచి అనుభవం ఉంటుంది. అదే సమయంలో ఫైటర్ జెట్‌ను నడపడం వ్యోమనౌకను నడపడం ఒక్కటి కాదని గుర్తుంచుకోవాలి. ఈ తేడాను మేం గమనించి వ్యోమనౌకను సమర్థంగా నడపడానికి వీలుగా ఇస్రో మాకు అవసరమైన రీతిలో శిక్షణ ఏర్పాట్లు చేసింది. రష్యాతో పాటు భారతదేశంలోనూ సమగ్ర శిక్షణ ఇచ్చింది. అమెరికా, జపాన్, ఐరోపా అంతరిక్ష సంస్థల ఛత్రంలోనూ శిక్షణ పొందే ఏర్పాటు చేసింది. మా శిక్షణ ఇప్పటికీ కొనసాగుతోంది.

భారత వాయుసేనలో 1998లో చేరిన ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ సుఖోయ్-30 ఎంకెఐ, మిగ్-21, ఆంటొనొవ్-32 విమానాల పైలట్‌గా రాణించారు. ఆయనకు రష్యాలోని యూరీ గగారిన్ కాస్మోనాట్ శిక్షణ సంస్థలో ప్రాథమిక శిక్షణ ఇచ్చారు. బెంగళూరులోని ఇస్రో వ్యోమగామి శిక్షణ సంస్థలో గగన్‌యాన్ కోసం ప్రత్యేక తర్ఫీదు పొందారు. నాయర్ బెంగళూరు ఐఐఎస్‌సీ నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. ప్రైవేట్ యాగ్జియోమ్ అంతరిక్ష యాత్రలో వ్యోమగామి శుభాంశు శుక్లాకు ప్రత్యామ్నాయంగా ఆయన అమెరికాలోని నాసా జాన్సన్ అంతరిక్ష కేంద్రంలో శిక్షణ పొందారు.





? అంతరిక్షంలో మానవ కండరాలు కృశిస్తాయనీ, పోషకాలు అందవనీ అంటారు. దీన్ని ఎలా అధిగమిస్తున్నారు?

శారీరక శిక్షణ మొదలుకుని మానవ సన్నద్ధత, పోషక విలువలు సమకూర్చడం వరకు అన్నీ శాస్త్రీయంగా సాగిపోతున్నాయి. యాత్రలో ఆద్యంతం సమర్థంగా కార్యకలాపాలు సాగించేలా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు వివిధ ప్రొటోకాల్స్‌ను అమలు చేస్తున్నారు.

? అంతరిక్షంలోకి దూసుకెళ్లాలని కలలు కనే యువ భారతీయులకు మీరిచ్చే సూచనలు ఏంటి?

భారత్ అనే మహత్తర దేశం పట్ల నమ్మకం ఉంచి, ఎవరి వ్యక్తిగత ధర్మాన్ని వారు పకడ్బందీగా ఆచరించాలని మాత్రమే చెప్పగలను. మనకు ఎప్పుడు ఏది లభించాలో అప్పుడు అది కచ్చితంగా మన చేతికొస్తుంది. వ్యోమగామి మనస్తత్వంతో ఆ నమ్మకం, ఆత్మవిశ్వాసం, లక్ష్య శుద్ధి ప్రోది చేసుకుంటాయి. అలాంటి మనఃస్థితిని మన యువతరమూ అలవర్చుకోవాలి. ●

- **గగన్‌యాన్:** గగనం అంటే ఆకాశం, యానం అంటే ప్రయాణం. ఆకాశయాత్ర అనే అర్థంతో మిషన్‌కు ఈ పేరు పెట్టారు.
- **మిషన్:** వ్యోమగాములను 400 కి.మీ. కక్ష్యలోకి పంపి, సురక్షితంగా తీసుకురావడం. ఇప్పటికే కొన్ని పరీక్షలు విజయవంతమయ్యాయి.
- **ప్రత్యేకత:** భారతదేశపు తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర.
- **లక్ష్యాలు:** భవిష్యత్తులో అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, చంద్రుడిపైకి మానవ సహిత యాత్రలు. మానవ అంతరిక్ష యాత్రలను స్వతంత్రంగా నిర్వహించే దేశంగా భారత్‌ను నిలబెట్టడం.



21 డేస్ ఫార్ములా...

కొత్త సంవత్సరం వచ్చేసింది. ఎప్పటిలాగే ఈ ఏడాదీ ఏవేవో చేసేయాలని నిర్ణయాలు తీసుకునే ఉంటారు. తీసుకున్న నిర్ణయాలను కచ్చితంగా అమలు చేసేవాళ్లతో ఏ గొడవా లేదు. అలా చేయకుండా ఏ ఏడాదికాయేడాది తీర్మానాలు చేసుకుంటూ వదిలేస్తూ ఉండేవారితోనే సమస్య!

ఫోర్బ్స్ హెల్త్ సర్వే ప్రకారం న్యూ ఇయర్ రిజల్యూషన్స్ తీసుకున్నవాళ్లలో 10 నుంచి 12 శాతం మాత్రమే చివరివరకూ వాటికి కట్టుబడి ఉంటున్నారట. ఎనిమిది శాతం మంది నెల లోపు, 21 శాతం రెణ్నెల్ల లోపు, మరో 22 శాతం మూణ్నెల్ల లోపు, 13 శాతం నాలుగునెలల్లోపు, ఆ తరవాత మిగిలినవాళ్లు... ఇలా నెమ్మది నెమ్మదిగా కొత్త సంవత్సరం తీర్మానాలను గాలికి వదిలేస్తున్నారని ఆ సర్వే తేల్చి చెప్పింది. ప్రారంభించినప్పటి ఉత్సాహం అంత తొందరగా ఆవిరైపోవడానికి కారణాలు చాలానే ఉన్నాయి. అవేంటంటే... ఎంచుకున్న లక్ష్యాలు అస్పష్టంగా ఉండటం, అసాధ్యమైనవి కావడం, లక్ష్యం చేరడానికి స్పష్టమైన ప్రణాళిక లేకపోవడం, ఉత్సాహం తగ్గిపోవడం... అని ఆ సర్వే విశ్లేషించింది. మరి దీనికి పరిష్కారం లేదా అంటే కచ్చితంగా ఉంది. అదే 21 డేస్ ఫార్ములా.

అమెరికన్ రచయిత, మానసిక శాస్త్రవేత్త అయిన డాక్టర్ మాక్స్‌వెల్ మాల్ట్జ్ సుదీర్ఘ అనుభవంతో 'సైకో సైబర్నెటిక్స్' అనే పుస్తకం రాశారు. దాంట్లో ప్రతిపాదించిన 21 రోజుల విజయ సిద్ధాంతం బహుళ ప్రాచుర్యం పొందింది. దీని ప్రకారం పట్టుదలగా ఏదైనా ఒక కొత్త హాబీనో, పనినో అలవర్చుకోవాలంటే దానికి మనసు అలవాటు పడటానికి, అది మన దినచర్యలో ఇమిడిపోవడానికి 21 రోజులు పడుతుంది. ఆ తరవాత మరికొందరు దీన్ని ఇంకా అభివృద్ధి చేశారు. ప్రధానంగా ఇందులో మూడు దశలుంటాయి. మొదటి ఏడు రోజులు అవగాహన దశ. టామ్ బార్తో దీన్ని 'హనీమూన్ దశ' అంటారు. పెట్టుకున్న లక్ష్యం గురించి తెలుసుకుంటూ ఉంటాం కాబట్టి ఈ తొలి దశ ఉత్సాహంగానే ఉంటుంది. చేయగలమా అని కొంత సందేహం ఉన్నప్పటికీ ఈ దశలో మనసు మార్పును అంగీకరించడానికి ప్రయత్నిస్తుంది. తరవాత ఏడు రోజులు కీలకమైన క్రమశిక్షణా దశ. ఇందులో మనసు కొంత ప్రతిఘటిస్తుంది. ఆచరణలో కష్టాలు అనుభవంలోకి వస్తాయి కాబట్టి మానేయడానికి ఎక్కువగా అవకాశాలుంటాయి. ఆ పరిస్థితిని అధిగమించడానికి వచ్చే లాభాలను తలచుకుంటూ ఉత్సాహంగా ఉండాలి. పట్టు వదలకుండా కొనసాగాలి. చివరి ఏడు రోజులను స్థిరత్వ దశ అంటారు. కొత్త పని అలవాటుగా మారి, రొటీన్‌లో భాగం అయిపోతుంది.

చూశారుగా, ఇంక ఆలస్యం ఎందుకు?! ఈసారి కొత్త సంవత్సరం తీర్మానాల అమలుకు ఈ విధానాన్ని ఎంచుకోండి. ఒక్కో తీర్మానం తీసుకుని పట్టుదలగా మూడుదశలూ దాటేయండి. ఒక తీర్మానం సక్సెస్‌ఫుల్‌గా అమలుచేశాక రెండోదాని జోలికి వెళ్లండి. ఒకేసారి నాలుగైదు తీర్మానాలను అమలు చేయాలని చూస్తే మాత్రం మొదటికే మోసం వస్తుందని గుర్తుంచుకోండి. ఆల్ ద బెస్ట్!!

– పున్నమరాజు



పెద్ద మనసుతో...

పేద, వర్ధమాన దేశాల్లో పేదరిక నిర్మూలన, విద్య, వైద్యం, మానవతా సాయం, విపత్తు నిర్వహణ తదితరాలకు సంపన్న రాజ్యాలు ఆర్థిక సాయం అందిస్తుంటాయి. 2023లో 6,200 కోట్ల డాలర్ల విదేశీ సాయంతో అమెరికా అగ్రభాగాన నిలిచింది. తరవాతి స్థానాల్లో జర్మనీ (3,800 కోట్ల డాలర్లు), జపాన్ (1,900 కోట్ల డాలర్లు) వంటివి ఉన్నాయి. ఆ ఏడాది ఆయా దేశాలు వాటి స్థూల జాతీయ ఆదాయంలో ఎంతశాతం విదేశీ సాయానికి కేటాయించాయంటే...

నార్వే	1.1
జర్మనీ	0.82
నెదర్లాండ్స్	0.66
తుర్కియే	0.62
యూకే	0.58
ఫ్రాన్స్	0.50
జపాన్	0.44
కెనడా	0.38
ఇటలీ	0.27
అమెరికా	0.24

(ఆధారం: ఓఈసీడీ నివేదిక)

కుర్రకారులో కాన్సర్ట్ జోష్!

కొత్త ఏడాది సంబరాల్లో సంగీత కార్యక్రమాలదే జోష్. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడిదే ట్రెండ్. జెన్‌జీలైతే సంగీతంలో తడిసిముద్దవుతూ నిరుటికి వీడ్కోలు పలికారు. మన దేశానికి సంబంధించి 2025ను కాన్సర్ట్ నామ సంవత్సరంగా చెప్పవచ్చు. గత ఏడాది దేశీయంగా 34 వేలకుపైగా ఈవెంట్లు జరిగినట్లు అంచనా. జెన్‌జీ, మిలీనియల్స్‌తోపాటు అన్ని తరాల ఆదరణతో కాన్సర్ట్ టూరిజం ఊపందుకుంటోంది. కాన్సర్ట్‌ల కోసమే అయిదున్నర లక్షల మందికిపైగా ప్రయాణాలు చేయడం విశేషం.

ఇప్పుడు దేశంలో బహుళ ఆదరణ పొందుతున్న రంగం సంగీత పర్యాటకమే. సంగీత నృత్యాలకు ఘన వారసత్వం కలిగిన మన దేశంలో మ్యూజిక్ కాన్సర్ట్‌లు టూరిజం ట్రెండ్స్‌నే మార్చేస్తున్నాయి. ప్రపంచస్థాయి అనుభవాల కోసం యువ శ్రోతల ఆరాటం, యువత ఆదాయ స్థాయులు పెరగడం సంగీత పర్యాటక పరిశ్రమకు కొత్త కళను తెస్తోంది. ఫలితంగా, లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో భారత్ ప్రపంచస్థాయి గమ్యస్థానాల్లో ఒకటిగా పేరు పొందుతోంది. ఇండియాలో కాన్సర్ట్ ఎకానమీకి బోలెడు అవకాశాలు ఉన్నాయని ప్రధాని మోదీ ఇంతకుముందే స్పష్టం చేశారు. 2032 నాటికి కాన్సర్ట్ ఎకానమీ 1.2కోట్ల ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉన్నట్లు ఒక అధ్యయనంలో వెల్లడైంది. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో సైతం డిమాండు ఊపందుకుంటోంది. దిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ వంటి మహానగరాలను దాటేసి ఇటానగర్, గువాహటి, షిల్లాంగ్ వంటి ప్రాంతాలకూ ఈట్రెండ్ పాకుతోంది. దేశంలో 2023లో 26 వేలకుపైగా లైవ్ ఈవెంట్లు జరగ్గా, నిరుడు ఆ సంఖ్య 30 వేలను దాటేసింది. వ్యవస్థీకృత లైవ్ ఈవెంట్ రంగం వచ్చే మూడేళ్లలో 19శాతం సీఏజీఆర్ సాధించనున్నట్లు అంచనా. అందుకే దిల్లీ ప్రభుత్వం ఒక ప్రఖ్యాత లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్లాట్‌ఫాంతో ఎంవోయూనే కుదుర్చుకుంది. అస్సాం తదితర రాష్ట్రాలు ప్రత్యేక పాలసీలనే తీసుకొచ్చాయి.

అనుబంధ పరిశ్రమలకు గిరాకీ...

'ఎక్స్‌పీరియన్స్ ఎకానమీ' భావన పెరుగుతుండటంతో సంగీత, పర్యాటక ప్రియుల్లో ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ప్రయాణించడం, అక్కడి అనుభూతులను ఆస్వాదించడంపై ఆసక్తి అధికమవుతోంది. ఈ రంగంలో ప్రపంచస్థాయి వినోద బ్రాండ్లు, కంపెనీల భాగస్వామ్యం కూడా పెరుగుతోంది. దేశంలో విస్తృతమవుతున్న మౌలిక సదుపాయాలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. జెన్‌జీ తరం తమ అభిమాన కళాకారులను




లైవ్ ప్రదర్శనల్లో చూసేందుకు ఎంత ఖర్చుకైనా వెనకాడటం లేదు. యువత సామాజిక మాధ్యమాల్లో తమ సంగీత పర్యాటక అనుభవాలను స్నేహితులు, ఫాలోవర్లతో పంచుకోవడంతో కాన్సర్ట్‌లకు ఆదరణ అధికమవుతోంది. ప్రపంచస్థాయి ఈవెంట్స్ నిర్వహణతో స్థానిక ఆర్థిక వ్యవస్థలకు లాభం కలుగుతోంది. పర్యాటక అనుబంధ పరిశ్రమలకూ గిరాకీ పెరుగుతోంది. సంగీత ప్రియులు కాన్సర్ట్ టికెట్లతోపాటు వసతి, ఆహారం, స్థానిక పర్యటనల కోసం భారీగా ఖర్చు పెడుతున్నారు. అంతర్జాతీయ టూరిస్టులు పెరుగుతున్నారు. 2025లో కోల్డ్‌ప్లే, దిల్జీత్ దోసాంజ్, ఎడ్‌షీరన్ తదితర మ్యూజిక్ స్టార్ల పర్యటనలు దేశవ్యాప్తంగా సంగీత ప్రకంపనలే సృష్టించాయి. టికెట్లు హాటుకేకుల్లా అమ్ముడయ్యాయి. ఆయా నగరాల్లో హోటళ్లకూ గిరాకీ పెరిగింది. విమాన ప్రయాణాలూ ఊపందుకున్నాయి. టూరిస్టులు, హోటళ్లు, రవాణా, ప్రయాణాలతో స్థానికంగా పలువురికి ఉపాధి అవకాశాలు దక్కాయి. కోల్డ్‌ప్లే టూర్ సుమారు రూ.641 కోట్ల ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. అహ్మదాబాద్‌లో కోల్డ్‌ప్లే కాన్సర్ట్‌ను సుమారు రెండు లక్షలకుపైగా శ్రోతలు ఆస్వాదించారు.

వృత్తి ఉపాధి అవకాశాల వృద్ధి

భారీ మ్యూజిక్ ఈవెంట్లతో సౌండ్ ఇంజినీర్లు, లైటింగ్ టెక్నీషియన్లు, సింగర్లు, ర్యాపర్లు, డీజేలు ప్రయోజనం పొందుతారు. ప్రొఫెషనల్ బ్యాండ్స్ పుట్టుకొస్తాయి. ప్రొడక్షన్, సౌండ్ డిజైన్, మార్కెటింగ్, క్రౌడ్ మేనేజ్‌మెంట్, ఈవెంట్స్ వంటి రంగాలపై యువతకు ఆసక్తి పెరుగుతుంది. వృత్తి నైపుణ్యాలు ఇనుమడిస్తాయి. క్రియేటివ్ ఎకోసిస్టమ్ అవతరిస్తుంది. సృజనశీల యువతకు వృత్తి, ఉపాధుల పరంగా విభిన్న అవకాశాలు ఆహ్వానం పలుకుతాయి. ఈ నేపథ్యంలో దేశంలో సంగీత పర్యాటకానికి పెరుగుతున్న ఆదరణను ప్రభుత్వాలు అవకాశంగా మార్చుకోవాలి. వ్యవస్థీకృత రంగంగా అవతరించేలా పటిష్ఠ యంత్రాంగంతో తోడ్పాటునివ్వాలి. ఈ వృద్ధి సమ్మిళితంగా, సుస్థిరంగా ముందుకు సాగేలా చర్యలు ఉండాలి. ఈ రంగంలో అవకాశాల్ని అందిపుచ్చుకునేలా యువతకు నైపుణ్య శిక్షణ కల్పించాలి. స్థానిక సంస్థల భాగస్వామ్యాన్ని, సహకారాన్ని పెంచాలి. అనుమతులు, నిర్వహణ, భద్రత, వాణిజ్యానికి సంబంధించిన విధివిధానాలను రూపొందించాలి. ప్రభుత్వ, ప్రైవేట్, క్రియేటివ్ కమ్యూనిటీ కలిసి పురోగతి సాధించాలి. టికెట్ల విషయంలో బ్లాక్‌మార్కెట్ దందాలకు పకడ్బందీగా అడ్డుకట్ట వేయాలి. వేదికల అద్దెలు, సత్వర అనుమతులు, భద్రతా చర్యలు, ఇతరత్రా సౌకర్యాల కల్పనపరంగా మెరుగైన సింగిల్‌విండో వ్యవస్థల్ని తీర్చిదిద్దాలి. స్థానిక ఆర్థిక వ్యవస్థలకు ఊతం కల్పించే సాధనంలా సంగీత పర్యాటకాన్ని వ్యవస్థీకృతంగా ఉపయోగించుకోవాలి.

– డి.శ్రీనివాస్




బజాజ్ ఎలక్ట్రానిక్స్
భారతదేశపు అతిపెద్ద పండుగ ఆఫర్
గెలుచుకోండి ₹ 50 లక్షలు
డ్రా తేదీ: 7 జనవరి, 2026
1 కోటి
నగదు బహుమతి
గెలుచుకోండి 30 ఆల్టో K10 కార్లు
డ్రా తేదీ: 7 జనవరి, 2026
CASHBACK UPTO ₹30,000/-* IDFC FIRST Bank Always You First.
CASHBACK UPTO ₹21,000/-* HDB FINANCIAL SERVICES
CASHBACK UPTO ₹15,000/-* BAJAJ FINSERV
INSTANT DISCOUNT UPTO ₹8,000/-* HDFC BANK
UP TO ₹12,000 INSTANT DISCOUNT# SBI card
#Min. Trxn.: ₹20,000; Max. Discount: ₹12,000 per card. Valid only on EMI trxns. Validity: 24 Dec. 2025 - 11 June 2026 T&C Apply.
SAMSUNG
Super big Republic. Super big TV.
Awesome India Offers* Limited Period Only
Free* Soundbar worth up to ₹92990 (1 unit)
0 Down payment
EMI up to 30 months*
Up to 20% cashback*
Samsung Care+ starting at ₹599* only
Image simulated for representational purposes only. *T&C apply.
SONY
BRAVIA
CINEMA IS COMING HOME
BRAVIA 7 BRAVIA 8II BRAVIA 9
NETFLIX prime video Dolby VISION·ATMOS IMAX ENHANCED
SPECIAL OFFERS!
INSTANT CASHBACK UPTO Rs 25,000
UPTO 30% OFF
TV + SOUNDBAR COMBO OFFER SAVE UPTO Rs. 69,990/- BUY NOW AT Rs. 2,995/-
LG
Thank You India for Making LG Most Trusted Brand
Celebrating a historic Initial Public Offering (IPO) with never-before offers on LG AI TVs.
LG OLED evo AI LG QNED evo AI
Life's Good.
CELEBRATION OFFERS
3 YEAR WARRANTY
Up to 26% CASHBACK Max ₹26000
FIXED EMI Starting from ₹2999
Up to 30% OFF ON LG SOUNDBAR
LG BEST Care ₹18 per day
Haier
QLED
BIG.BOLD.BEYOND
S90 Series
100" (254cm) New
FEATURES Google TV SOUND BY KEF CENTER MAX
OFFERS 25% 0 Down Payment 3 YEARS WARRANTY
AKAI Tokyo Japan
MRP ₹5,49,990/-
Special Offer Price ₹2,75,000*
Flat Cashback upto ₹25,000*
100" (245 cm)
QLED Model: AL100GQU-SFL
Google TV 4K HDR10
Hey Google HANDS-FREE Voice Command MEMC Dolby VISION·ATMOS Chromecast built-in
REFRIGERATORS
RANGE STARTS FROM ₹12,490/-*
LG SAMSUNG Haier Whirlpool IFB
WASHING MACHINES
RANGE STARTS FROM ₹14,990/-*
LG SAMSUNG Haier Whirlpool IFB BOSCH
AIR CONDITIONERS
WIDEST RANGE OF SPLIT Ac's
RANGE STARTS FROM ₹29,990/-*
ATTRACTIVE CASHBACK* NO COST EMI* INSTALLATION FREE*
LG SAMSUNG Haier LLOYD BLUE STAR GENERAL DAIKIN
SAMSUNG
S25 Ultra Galaxy AI Own now at ₹1,17,999*
S25 Galaxy AI Own now at ₹72,999*
A56 Galaxy AI Own now at ₹36,999*
A36 Galaxy AI Own now at ₹28,999*
Awesome Intelligence
*₹3000 Bonus on upgrade on S24U/ S23U
24/0 No Cost EMI Available
24/0, 18/0 No Cost EMI Available
OnePlus 15R
Power On | Limits Off
From ₹44,999* *Incl. of bank discount
Available Now
Apple Days
BEST PRICE
iPhone 17 Pro Max MRP ₹1,49,900 EFFECTIVE PRICE ₹96,900* Monthly EMI ₹8,408
iPhone 17 Pro MRP ₹1,34,900 EFFECTIVE PRICE ₹81,400* Monthly EMI ₹7,117
iPhone Air EFFECTIVE PRICE ₹53,000* Monthly EMI ₹4,750
iPhone 17 EFFECTIVE PRICE ₹38,900* Monthly EMI ₹3,576
iPhone 16 ₹23,990* Monthly EMI ₹1,499
iPhone 15 ₹15,990* Monthly EMI ₹999
Now available on Zero Down Payment Zero Interest Zero Processing Fee
Macbook Air M4 MRP ₹99,900 EFFECTIVE PRICE ₹55,900* Monthly EMI ₹2,746
Macbook Pro M5 MRP ₹1,69,900 EFFECTIVE PRICE ₹1,28,900* Monthly EMI ₹8,579
iPad 11th Gen (A16) MRP ₹34,900 EFFECTIVE PRICE ₹30,500* Monthly EMI ₹1,354
Air Pods Pro 3rd Gen MRP ₹25,900 EFFECTIVE PRICE ₹23,900* Monthly EMI ₹1,079
Watch S11 MRP ₹49,900 EFFECTIVE PRICE ₹39,900* Monthly EMI ₹4,711
Upto ₹10,000* Instant cashback on credit cards of ICICI Bank AXIS BANK | Exchange bonus up to ₹10,000*
Effective prices include store discount, exchange value of old device, exchange bonus and brand cashback available with 6 months No-Cost EMI offer.
vivo V60
Co-engineered with ZEISS
Starts from ₹36,999*
upto ₹3,000 Cashback*
EMI upto 12/0*
oppo
OPPO A6x 5G
Starting From ₹12,499/-
3 Months NO COST EMI
REDMI 15C 5G
NEWLY LAUNCHED
2026 Ka BIG BOSS
Starts from ₹12,499/-
Royale Design

ఆమనీ... హాయిగా సాగనీ!

**ఉద్యోగాలు శాశ్వతం కానప్పుడు... వైద్య ఖర్చులు ఆకాశాన్ని తాకుతున్నప్పుడు...
ఆసుపత్రి బిల్లులు... లక్షల సేవింగ్స్‌ను గంటల్లో మింగేస్తున్నప్పుడు...
కొనుగోలు శక్తిని... ద్రవ్యోల్బణం బ్రేవ్ అంటున్నప్పుడు...
మనల్ని కాపాడేది ఒక్కటే... డబ్బు విషయంలో ప్రాప్తకాలజ్ఞత!**



కుటుంబం 1

రాకేశ్ (35) ప్రైవేటు ఉద్యోగి.
నెల జీతం రూ.50వేలు
సేవింగ్స్ తక్కువ
బీమా లేదు
ఈఎంఐలు... హోమ్‌లోన్, కారు లోన్
అకస్మాత్తుగా ఉద్యోగం పోయింది

ఫలితం...
2 నెలల్లో సేవింగ్స్ ఖాళీ
పిల్లల స్కూల్ ఫీజుల కోసం అప్పులు
క్రెడిట్ కార్డు బిల్లులు...
మానసిక ఒత్తిళ్లు... కుటుంబంలో గొడవలు

సమస్య జీతం కాదు.. సరైన ప్రణాళిక లేకపోవటం...

కుటుంబం 2

రమణ (38) ఉద్యోగి
నెలజీతం రూ.45 వేలు.
ఎమర్జెన్సీ ఫండ్ 6 నెలల ఖర్చులకు సరిపడా
హెల్త్ ఇన్స్యూరెన్స్ రూ.5 లక్షలకు
సిప్‌లు... 5వేలు
ఈఎంఐలు... పరిమితం
6 నెలలు ఉద్యోగానికి దూరమైంది.

అయినా...
అప్పులు చేయాల్సిన పరిస్థితి లేదు పిల్లల చదువు కొనసాగింది.
ఆలోచించుకునే సమయం ఉంది. ఒత్తిడి తక్కువ.

ఆర్థిక భద్రత = మనశ్శాంతి



ఎందుకు విఫలమవుతాం...?

- అవసరానికి మించిన ఖర్చులు
- అధిక ఈఎంఐలు
- ఇబ్బడి ముబ్బడిగా క్రెడిట్ కార్డుల వినియోగం
- ఆస్తులను (ఇల్లు, భూమి...) ఆదాయంగా, భద్రతగా భావించటం... ఎందుకంటే ఇవి అంత త్వరగా డబ్బుగా మారవు
- బీమాను చిన్నచూపు చూడటం.

మూడంచెల కంచె!

ఉన్నప్పుడు అమీరులా ఖర్చు పెట్టేసి... లేనప్పుడు పకీరు అవతారమెత్తకూడదు. డబ్బు సంపాదనతో పాటు దాని నిర్వహణ కూడా తెలిసి ఉండాలి. మదుపు చేసే తెలివి ఉండాలి. కొన్ని అలవాట్లను చేసుకుని, కొన్నిటిని వదిలేసి.... మరికొన్ని నియమాలు పాటించి ఆర్థిక స్థిరత్వాన్ని సాధిద్దాం.

1 జీవన రక్షణ

ఇది లేకుండా ఎంత పెట్టుబడి పెట్టినా, ఎంత ఆదాయం వస్తున్నా అర్థం లేనట్లే! ఎమర్జెన్సీ ఫండ్, హెల్త్, టర్మ్ ఇన్స్యూరెన్స్‌లు...

2 డబ్బుపై నియంత్రణ

ఇక్కడే మనం ఓడేదైనా గెలిచేదైనా... ఎందుకంటే నియంత్రణ లేకుండా భద్రత ఉండదు.

- ఈఎంఐలు... ఆదాయంలో 30శాతం కంటే తక్కువగా ఉంచుకోవటం
- ఫిక్స్‌డ్ ఖర్చులు తగ్గించటం.
- డబ్బు రూపంలో పొదుపు

3 ఛాయిస్

ఆర్థిక స్వేచ్ఛకు సంకేతం ఇది

- ఒక సంవత్సరం భరోసా...
- అదనపు నైపుణ్యం = అదనపు ఆదాయం
- అవసరమైతే కొలువు మారగలగటం

పెట్టుబడి... పట్టు సడలొద్దు!

ఆర్థికంగా మంచి ఫలితాలు కావాలంటే సంపాదన మొదలైన తొలినాళ్ల నుంచే ప్రణాళికబద్ధంగా పొదుపు చేయాలి. కనీసం 30 శాతం పొదుపు, పెట్టుబడులకు కేటాయించుకునే ప్రణాళిక ఉండాలి.

నెలకు రూ.25 వేలు, రూ.50 వేలు, రూ.లక్ష జీతం సంపాదించే వారు తమ ఆదాయంలో 30 శాతం పెట్టుబడి పెట్టారనుకుందాం. 10 ఏళ్లపాటు కొనసాగిస్తే రాబడి ఎలా ఉంటుందంటే..

- రూ.25 వేల జీతం: నెలకు రూ.7,500 చొప్పున పెట్టుబడి పెడితే... పదేళ్లకు 12% రిటర్న్ చొప్పున రూ.16,80,269 పొందొచ్చు. అదే 15 శాతం అయితే రూ.19,72,636 లభిస్తుంది.
- రూ.50 వేల జీతం: నెలకు రూ.15 వేల చొప్పున పెట్టుబడి పెట్టగలిగితే పదేళ్లకు 12 శాతం చొప్పున రూ.33,60,538 వస్తుంది. అదే 15 శాతమైతే రూ.39,45,273 పొందొచ్చు.
- రూ.లక్ష జీతం: రూ.30 వేల చొప్పున పెట్టుబడి పెడితే.. 10 సంవత్సరాలకు కనీస రిటర్న్ 12 శాతం వేసుకుంటే రూ.67,21,077 వస్తుంది. 15 శాతమైతే రూ.78,90,546 చేతికి అందుతుంది.

సిప్‌లో పెట్టుబడులు ఎలా విభజించుకోవాలంటే.. (ఉద్యోగుల జీతాల వారీగా)

పెట్టుబడి రకం	రూ.25 వేలు	రూ.50 వేలు	రూ.లక్ష
లార్జ్ క్యాప్/ఇండెక్స్ ఫండ్	రూ.2,500	రూ.3,000	రూ.6,000
ఫ్లెక్సీ క్యాప్	రూ.2,500	రూ.3,000	రూ.6,000
మిడ్ లేదా స్మాల్ క్యాప్	రూ.2,500	రూ.3,000	రూ.6,000
ఈఎల్ఎస్ఎస్ (ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్‌స్కీమ్స్)	0	రూ.6,000	రూ.6,000
హైబ్రిడ్ ఫండ్	0	0	రూ.6,000

ఆలస్యం వద్దు!


పెట్టుబడులు ఎంత తొందరగా మొదలుపెడితే అంత ప్రయోజనం చేకూరుతుంది. సంపాదిస్తున్న మొత్తంలో కాస్త పెట్టుబడులకు మళ్లించినా చాలు... భవిష్యత్తులో కోటీశ్వరులూ కావచ్చు.

విషయం	గిరి	హరి
పెట్టుబడి ప్రారంభించినప్పుడు వయసు	25	35
నెలకు పెట్టిన మొత్తం రూ.	5,000	15,000
పెట్టుబడి వ్యవధి	35 ఏళ్లు	25 ఏళ్లు
మొత్తం పెట్టుబడి రూ.	21 లక్షలు	45 లక్షలు
60 ఏళ్ల వయసు నాటికి జమైన మొత్తం రూ.	**3,24,76,345**	**2,84,64,526**

(ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో నెలనెలా క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టినప్పుడు. వార్షిక సగటు రాబడి 12% అంచనాతో)

గిరి తన రూ.5,000 మదుపును ఏటా 10% చొప్పున పెంచాడనుకుందాం. అప్పుడు అతని మొత్తం పెట్టుబడి రూ.1,62,61,462 అవుతుంది. దీనిపై అదే 12% రాబడితో వచ్చే మొత్తం ఎంతో తెలుసా... అక్షరాలా రూ.8,88,34,698.

వెంటనే రిటైర్మెంట్ ప్లాన్..



పదవీ విరమణ అనంతరం ఎవరిపైనా ఆర్థికంగా ఆధారపడకుండా జీవించాలని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. కానీ చాలామంది దాని గురించి పదవీ విరమణకు ముందో ఆ తర్వాతో ఆలోచిస్తారు! నిజానికి రిటైర్మెంట్ గురించి సిద్ధం కావల్సింది ఉద్యోగంలో చేరినప్పటి నుంచే! అప్పటి నుంచే ముందస్తు ప్రణాళిక వేసుకోవటం ఉత్తమం!

30-35 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఇంకా విరమణకు చాలా సమయం ఉందని లెక్కచేయరు. కానీ, చిన్న వయసులోనే పొదుపు చేస్తే దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తంలో నిధిని సమకూర్చుకోగలరు.

కాఫీ, టీ... ఇలా కాలక్షేపానికి రోజుకో రూ.100. చిన్న ఖర్చే కదా అనిపిస్తుంది. ఇదే నెలకు రూ.3 వేలు. ఏడాదికి రూ.36 వేలు. కానీ నెలకు రూ.2000 వేలు పొదుపు చేయమన్నా, పాలసీ తీసుకోమన్నా... అమ్మో! బడ్జెట్ ఎక్కడ సహకరిస్తుంది అనేస్తాం. గుర్తుంచుకోండి... అనుకోని ఆపద వచ్చినప్పుడు మనల్ని కాపాడేవి చిల్లర ఖర్చులు కాదు. పొదుపు- మదుపు- పాలసీలే!

నో స్పెండ్ డే



నెలలోనో, వారంలోనో ఒకరోజు లేదా వారంలో అత్యవసరమైతే తప్ప ఎలాంటి వస్తువులను కొనకూడదు అనే నియమం పెట్టుకోండి. దాన్ని ఆచరించండి. ఫలితంగా మీరు చేస్తోన్న అనసవరమైన ఖర్చు మీద ఓ అంచనా వస్తుంది. ఆ వస్తువులు లేకున్నా మీ రోజుపై ఎలాంటి ప్రభావం లేకపోతే ఇకపై వాటిని కొనడం మానేయండి.

కారు... 20/4/10

కారు కొనాలంటే ఆలోచనతోపాటు, ఆర్థికంగా సంసిద్ధతా ఉండాలి. ఏ మోడల్ కొనాలి? ఏ రంగు? పెట్రోలు, డీజిల్, విద్యుత్.. ఎంత బడ్జెట్.. రుణం ఎంత వస్తుంది.. ఇవే కాదు... కారు కొనేముందు ఆలోచించాల్సిన ముఖ్యమైన విషయం.. దాన్ని ఎలా నిర్వహించగలం అని! కారు కొనేందుకు 20/4/10 సూత్రాన్ని అనుసరించాలని నిపుణులు చెబుతారు. అంటే కారు ఆన్ రోడ్ ధరలో కనీసం 20 శాతం నగదును మీరు సొంతంగా చెల్లించాలి. అంటే, కారు ధర రూ.10లక్షలు అనుకుంటే, మీరు అందులో రూ.2లక్షలు డౌన్‌పేమెంట్‌గా కట్టడం మంచి ప్రణాళిక అవుతుంది. కారు రుణం 4 ఏళ్లలోనే తీర్చేందుకు సిద్ధమవ్వాలి. లోన్ కాలాన్ని పెంచితే వడ్డీభారం చాలా ఎక్కువవుతుంది. నెలవారీ ఆదాయంలో కారు ఈఎంఐ 10 శాతానికి మించకూడదు. ఇలా చేస్తే మిగతా ఆర్థిక ప్రణాళికలపై భారం పడదు.



రెండో దారి మంచిదే!

జీవితంలో ఏమాత్రం ఒడుదొడుకులెదురైనా రెండో ఆదాయం కాపాడుతుంది. దీనికి కావాల్సింది కాస్తంత ఓపిక...నైపుణ్యం.

- ఉద్యోగులు తమకు ఉన్న అనుభవం, నైపుణ్యాల ఆధారంగా సలహా సేవలు అందించవచ్చు. డిజైన్ కన్సల్టింగ్, కోడింగ్, మార్కెటింగ్ సేవలకు విపరీతమైన గిరాకీ ఉంది. మనకు నైపుణ్యం ఉంటే, అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. రోజుకు రెండు, మూడు గంటలు పనిచేసినా అదనపు ఆదాయం లభిస్తుంది.



- చిన్న చిన్న హోమ్ బిజినెస్‌లు చేయవచ్చు. వంటలు, బేకరీ, క్లౌడ్ కిచెన్ నిర్వహించవచ్చు. కేటరింగ్ చేయొచ్చు. నైపుణ్యం ఉంటే చేతి వృత్తులు కూడా మంచి అవకాశమే. దుస్తులు డిజైన్ చేయవచ్చు.
- మన వద్ద ఆకర్షణీయమైన వస్తువులు ఉంటే వాటిని అద్దెకు ఇవ్వవచ్చు. ఫర్నిచర్, కార్లు, అరుదైన వస్తువులు ఉంటే వాటిద్వారా కూడా ఆదాయం పొందవచ్చు.
- సామాజిక మాధ్యమాలు విస్తరించిన తర్వాత ఇన్‌ఫ్లుయెన్సర్లు వివిధ రంగాల్లో కీలకంగా మారుతున్నారు. యూట్యూబ్, ఫేస్‌బుక్‌లలో మంచి కంటెంట్ సృష్టించేవారికీ డిమాండ్ ఉంది.
- బీమా పాలసీలు, మ్యూచువల్ ఫండ్లు విక్రయించే ఏజెంట్లుగా నమోదు కావచ్చు. ఎంత అధికంగా పాలసీలు, యూనిట్లు విక్రయిస్తే అంత అధిక ఆదాయం కమిషన్ రూపంలో లభిస్తుంది.
- టూర్ ఆపరేటర్‌గా మారవచ్చు. పర్యాటకులను వివిధ సందర్శనీయ ప్రదేశాలకు తీసుకువెళ్లవచ్చు. ప్రతి టూర్ మీద ఎంతో కొంత సొమ్ము లభిస్తుంది. ట్యాక్సీ ఆపరేటర్ సేవలు అందించడం కూడా మంచి మార్గం.

చూద్దాంలే... ఆ మాట ఖరీదైంది!



1) రమేష్ వయసు 28. ఐటీ ఉద్యోగం. నెలకు రూ.900లతో రూ.కోటి టర్మ్ పాలసీ తీసుకోవాలని ఒక బీమా సలహాదారు చెప్పారు. ఇప్పుడిప్పుడే కదా. ఉద్యోగంలో స్థిరపడుతున్నాను. అయినా నాకేం అవుతుంది. తర్వాత తీసుకుందాం అని వాయిదా వేశారు.

- 38 ఏళ్ల వయసులోకి వచ్చారు.. పెళ్లయ్యింది. ఇద్దరు పిల్లలు. ఇంటి రుణమూ ఉంది. అదే రూ. కోటి టర్మ్ పాలసీకి ఇప్పుడు నెలకు రూ.2,500. అంటే పదేళ్లు వాయిదా వేసినందుకు 4 రెట్ల వరకూ ప్రీమియం భారం పడింది. దీంతో ఇప్పుడు కాదులే అని మళ్లీ వాయిదా వేశారు.
- 40 ఏళ్ల వయసులో: రమేష్‌కు మధుమేహం, బీపీ వచ్చాయి. తప్పదని బీమా కోసం దరఖాస్తు చేశారు. తనకున్న జబ్బుల గురించి దాచి పెట్టి పాలసీ తీసుకుందామని ఆలోచించారు. కానీ, బీమా సంస్థ వైద్య పరీక్షలను చేయించింది. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో.. దరఖాస్తును తిరస్కరించింది.

దీంతో కుటుంబానికి ధీమా కరవైంది.

2) సురేష్ తన 28వ ఏటనే రూ.కోటి రూపాయల టర్మ్ పాలసీ తీసుకున్నారు. అప్పుడు అతని నెలవారీ ప్రీమియం చాలా తక్కువ. దురదృష్టవశాత్తు, ఒక రోడ్డు ప్రమాదంలో సురేష్ మరణించారు. ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేరు, కానీ సురేష్ తీసుకున్న టర్మ్ పాలసీ వల్ల వచ్చిన క్లెయిమ్ మొత్తంతో ఆయన ఇంటి రుణం తీరిపోయింది. పిల్లల చదువులూ సజావుగా సాగుతున్నాయి. ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఆ పాలసీ కాపాడింది.

కుటుంబానికి టర్మ్ ఇన్సూరెన్స్ ఒక కవచంలా పనిచేస్తుంది.

3) వయసు పెరిగే కొద్దీ భారం

కిశోర్ 25 ఏళ్లకే టర్మ్ పాలసీ తీసుకున్నారు. రూ.కోటి పాలసీకి ఏడాదికి రూ.9,600 వరకూ ప్రీమియం పడుతోంది. అశోక్ మాత్రం ఇప్పుడే అవసరమా అని.. 40 ఏళ్ల వయసులో పాలసీ తీసుకున్నారు. ఏటా రూ.30వేల వరకూ ప్రీమియం చెల్లించాల్సి వస్తోంది. ఇద్దరూ 60 ఏళ్ల వరకూ పాలసీని కొనసాగిస్తారు అనుకుంటే.. కిశోర్ 35 ఏళ్లకు రూ.3,36,000 ప్రీమియం చెల్లిస్తారు. అదే అశోక్ 20 ఏళ్ల కాలంలోనే రూ.6,00,000 ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది.

సరైన బీమా సూత్రం... డైమ్!

చాలామంది తమ వార్షికాదాయానికి ఇన్ని రెట్లు అని బీమా తీసుకుంటారు. అన్ని సమయాల్లో అది మాత్రమే సరిపోకపోవచ్చు. దీనికి ప్రత్యామ్నాయ ప్రణాళిక పేరు డైమ్ (డెట్, ఇన్‌కం, మార్టిగేజ్, ఎడ్యుకేషన్) ప్లాన్. బీమా ఎంత తీసుకోవాలో తెలుసుకునేందుకు ఇది ఒక మార్గదర్శిగా నిలుస్తుంది. ఇది కేవలం ఒక అంచనా మాత్రమే కాదు.. మన కుటుంబ అవసరాలను ప్రతిబింబించే ఒక పక్కా లెక్క...

అప్పులు: డైమ్ పద్ధతిలో మొదటి అడుగు మన ప్రస్తుత అప్పులను లెక్కించడం. ఇందులో ఇంటి రుణం మినహా మిగిలిన అప్పులన్నీ ఉంటాయి. మనం లేని సమయంలో ఈ భారం కుటుంబంపై పడకుండా ఆ మొత్తాన్ని బీమా కవరేజీలో చేర్చాలి.

ఆదాయం: నిరంతర ఆదాయ భరోసా రెండో ముఖ్యమైన అంశం. కుటుంబం ప్రస్తుత జీవన ప్రమాణాలను కొనసాగించడానికి ఎంత వార్షిక ఆదాయం అవసరమో అంచనావేయాలి. దాన్ని ఆర్థిక మద్దతు అవసరమైన సంవత్సరాల సంఖ్యతో గుణించాలి. ఉదాహరణకు రూ.12 లక్షల వార్షికాదాయం 10 ఏళ్లపాటు కావాలనుకుంటే రూ.1.20 కోట్లు ఆదాయ భర్తీ కింద ఉండాలి.

ఇంటి రుణం: చాలా కుటుంబాలకు అతిపెద్ద ఆర్థిక బాధ్యత ఇంటి రుణం. మన బీమా మొత్తం ఈ రుణాన్ని తీర్చే విధంగా ఉండాలి. దీనివల్ల ఏదైనా అనుకోని సంఘటన జరిగినా, కుటుంబం సొంతింటిని కోల్పోయే ప్రమాదం ఉండదు.

విద్య: పిల్లల ఆశయాలకు అండగా ఉండేలా, విద్యా ఖర్చులను అంచనా వేయాలి. భవిష్యత్తులో పెరిగే చదువుల ఖర్చులను దృష్టిలో ఉంచుకొని అవసరమైన నిధిని బీమా కవరేజీలో చేర్చాలి.

ఈ నాలుగు అంశాలు (అప్పులు+ ఆదాయం+ ఇంటి రుణం+ విద్య)కలిపితే వచ్చే మొత్తమే మన ఆదర్శవంతమైన బీమా రక్షణ.

ఉదాహరణకు అప్పులు రూ.17 లక్షలు, ఆదాయ అవసరం రూ.1.2కోట్లు, ఇంటి రుణం రూ.40లక్షలు, విద్యా ఖర్చులు రూ.25 లక్షలు ఉందనుకుందాం.. బీమా రక్షణ రూ.2.02 కోట్లు ఉండాలి. దానికి సరిపడా పాలసీని తీసుకోవాలి.

హెల్త్ అయినా, టర్మ్ అయినా... ఏ బీమా అయినా మనం కోరుకున్నప్పుడు తీసుకునేది కాదు. అది మనకోసం మనం చేసుకునే ఓ ఏర్పాటు... ఓ సంసిద్ధత.

దాన్ని వాయిదా వేసుకుంటూ వెళ్తేనో...నిర్లక్ష్యం చేస్తేనో...తర్వాత మనం పూర్తిగా అనర్హులం కావచ్చు.

అర్హత ఉన్నప్పుడు ఎంత తక్కువ వయసులో చేసుకుంటే అంత ఉత్తమం!

గృహప్రవేశం పక్కా...

రాజశేఖర్ ఒక ప్రైవేటు ఉద్యోగి. కుటుంబ ఆదాయం నెలకు రూ.50 వేలు. ఈ సంపాదనతోనే ఆయన హైదరాబాద్‌లో సొంత ఫ్లాట్ కొనుగోలు చేశాడు. లక్ష వేతనం వస్తున్నవాళ్లు సైతం ఇల్లు కొనలేకపోతున్నామని మధనపడుతుంటారు. మరి రాజశేఖర్‌కు ఎలా సాధ్యమైంది?

ఉద్యోగంలో చేరిన ఐదేళ్లకు ఆయనకు పదోన్నతి వచ్చింది. పెరిగిన వేతనాన్ని వీపీఎఫ్‌లోకి మళ్లించారు. సొంతింట్లోకి అడుగుపెట్టే వరకు అద్దె తక్కువగా ఉండేలా సింగిల్ బెడ్‌రూంలోనే నివాసంఉన్నారు. చక్కటి ప్రణాళికతో అప్పు చేయకుండా జాగ్రత్తపడ్డారు. తన బడ్జెట్‌లో ఇల్లు రాగానే వీపీఎఫ్‌లో సొమ్మును డౌన్‌పేమెంట్‌గా చెల్లించి, మిగతా మొత్తాన్ని బ్యాంకు నుంచి రుణం తీసుకుని కొనుకున్నారు. ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తే సొంతిల్లు సమకూర్చుకోవడం అసాధ్యమేం కాదు.

- ఇల్లు కట్టేవారైనా, కొనుగోలు చేసేవారైనా అత్యధికంగా గృహరుణం మీదే ఆధారపడతారు. కొద్దిమంది మాత్రమే తమ వద్ద ఉన్న డబ్బుతో కొంటుంటారు.
- గృహ రుణంతో ఇల్లు కొనుగోలు చేసేవారికి ప్రస్తుతం వడ్డీరేట్లు తక్కువగా ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2025లో 125 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో వడ్డీరేట్లు దిగి వచ్చాయి.
- పరిమిత ఆదాయం.. పెరిగిన ఇళ్ల ధరల నేపథ్యంలో వడ్డీరేట్లు తక్కువ ఉండటంతో ఎక్కువ రుణ లభ్యత వస్తుంది. బ్యాంకులు రుణాలు ఇస్తాయి సరే.. కట్టే స్తోమత ఉండొద్దు అంటారా? ఇటీవల నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం హైదరాబాద్‌లో ఈఎంఐకి ఆదాయ నిష్పత్తి 30 శాతంగా ఉంది. అంటే రుణ కిస్తీకి కుటుంబ ఆదాయంలో 30 శాతం ప్రతి నెలా చెల్లించగలితే చాలు ఇంటి కలను నెరవేర్చుకోవచ్చు.


నేల విడిచి సాము వద్దు...

- మన బడ్జెట్‌లో వచ్చే ఇంటిని వెతకాలి. విలాసవంతమైన, విశాలమైన ఇంటికైతే ఎక్కువ వెచ్చించాల్సి వస్తుంది..
- ఒకవేళ ఎక్కువ విస్తీర్ణంలో ఇల్లు కావాలంటే కాస్త దూరం వెళ్లాల్సి ఉంటుంది.
- ఉన్నచోటనే ఇల్లు కొందామంటే బడ్జెట్ సహకరించకపోవచ్చు. అక్కడికి సమీపంలోని ప్రాంతాల్లో కొనుగోలు చేయవచ్చు.
- ఇల్లు కొనేంత సొమ్ము కూడబెట్టే వరకు ఆగాల్సిన పనిలేదు. శివార్లలో స్థలం కొనుగోలు చేయవచ్చు. ఆ ప్రాంతం నివాసయోగ్యంగా ఉంటే కొద్ది రోజుల తర్వాత అక్కడే ఇల్లు కట్టుకోవచ్చు. లేదంటే విక్రయించి కోరుకున్న ప్రదేశంలో ఫ్లాట్ కొనుగోలు చేయవచ్చు.



ఆపద్బాంధవి... ఇలా ఉండాలి!

చిన్న అనారోగ్యం వస్తే చాలు.. రూ.వేలల్లోనే ఖర్చు. దీనికోసం మన పొదుపు మొత్తం హరించుకుపోతే.. ఎంత కష్టం. అందుకే, ఆరోగ్య బీమా పాలసీ ఒకటి మనకు రక్షణగా నిలవాలి. కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఈ పాలసీ పరిధిలో ఉండాల్సిందే.



- ఆరోగ్యంగా ఉన్నప్పుడే పాలసీ తీసుకోవాలి. లేకపోతే.. అనారోగ్యం వచ్చిన తర్వాత ఆరోగ్య బీమా పాలసీ ఇచ్చేందుకు కంపెనీలు ఇష్టపడవు. ఉద్యోగం చేస్తున్న చోట బృంద బీమా పాలసీ ఉన్నప్పటికీ, సొంతంగా ఒక పాలసీ తీసుకోవడం ఎప్పుడూ శ్రేయస్కరం. జీవన శైలి వ్యాధుల ప్రమాదం ఉంటే.. క్రిటికల్ ఇల్‌నెస్‌లాంటి పాలసీలను తీసుకోవడం మంచిది.
- అధిక బీమా రక్షణ కోసం, ఒకేసారి పెద్ద మొత్తంలో పాలసీ తీసుకుంటే ప్రీమియం అధికంగా ఉంటుంది. దీనికి బదులు పాలసీకి అనుబంధంగా సూపర్ టాపప్ తీసుకోవడం మంచిది.

రీఛార్జీ చూసుకోండి

- వైద్య చికిత్స ఖర్చు రోజురోజుకూ పెరిగిపోతోంది. దీన్ని తట్టుకోవడానికి రీస్టోరేషన్ ప్రయోజనం ఉన్న పాలసీలను ఎంచుకోవాలి. దీన్ని రీఫిల్ బెనిఫిట్ అనీ పిలుస్తుంటారు. ఒక పాలసీ సంవత్సరంలో బీమా మొత్తం క్లెయిం చేసుకున్న తర్వాత, ఆ మొత్తాన్ని రీస్టోర్/రీఛార్జ్ చేసేందుకు ఇది అనుమతిస్తుంది. ఈ ప్రయోజనం ద్వారా ఒకే పాలసీ ఏడాదిలో రెండు సార్లు క్లెయిం చేసుకోవచ్చు. పాలసీ మొత్తం పూర్తయిన తర్వాత తిరిగి భర్తీ చేసే రకం ఒకటి ఉంటుంది. ఉదాహరణకు పాలసీ విలువ రూ.5లక్షలు అనుకుందాం. ఆసుపత్రిలో చేరినప్పుడు మొత్తం 100 శాతం వినియోగించుకుంటే, రీస్టోరేషన్ బెనిఫిట్ ద్వారా తిరిగి రూ.5లక్షల వరకూ క్లెయిం చేసుకోవచ్చు.
- పాలసీ తీసుకోవడం కన్నా ముందే ఏదైనా వ్యాధులుంటే పాలసీ ప్రతిపాదిత పత్రంలో పేర్కొనాలి. నిర్ణీత వ్యవధి తర్వాత అంటే.. పాలసీ నిబంధనలను బట్టి 2-4 ఏళ్ల తర్వాత ఈ వ్యాధుల చికిత్సకూ పరిహారం వర్తిస్తుంది. వ్యాధులు ఉన్నప్పటికీ దాచిపెట్టి పాలసీ తీసుకుంటేనే ఇబ్బంది వస్తుంది. ఇలాంటి సందర్భాల్లో క్లెయింను తిరస్కరించే అవకాశం ఉంటుంది. ఇప్పుడు కొన్ని యాడ్-ఆన్‌లను ఎంచుకోవడం ద్వారా ముందస్తు వ్యాధులకూ పాలసీ తీసుకున్న రోజునుంచే రక్షణ లభిస్తుంది.

ఏ వయసులో ఉన్నా..

ఆరోగ్య బీమా పాలసీ ఏ వయసులో ఉన్న వార్కైనా ఇస్తారు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం, పాలసీ తీసుకునేప్పుడు బీమా సంస్థ కొన్ని వైద్య పరీక్షలను అడగొచ్చు. వీటి ఆధారంగానే సంస్థ పాలసీ ఇస్తుంది.

ప్రాణాంతక వ్యాధులున్నా..

ఆరోగ్య బీమా పాలసీని ఎప్పుడూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే తీసుకోవాలి. ఒక్క జబ్బు వచ్చినా బీమా సంస్థ ఇస్తేనే పాలసీ తీసుకోవాల్సి ఉంటుంది. కొన్ని సంస్థలు గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులు, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధులున్న వారికీ బీమా ఇస్తున్నాయి. వీటన్నిటినీ ముందస్తు వ్యాధులుగా పరిగణించి, కనీసం 3-4 ఏళ్లపాటు వేచి చూసే వ్యవధిని నిర్ణయిస్తున్నాయి. ఒకట్రెండు బీమా సంస్థలు క్యాన్సర్ బాధితులకూ ఇస్తున్నా.. పరిహారం విషయంలో కఠిన నిబంధనలు విధిస్తున్నాయి.

- ఈనాడు బిజినెస్ బ్యూరో, హైదరాబాద్, అమరావతి

వసుంధర

vasundhara@eenadu.in



ప్రతి మార్పు, ఆరంభం మనల్ని మనం విశ్లేషించుకోవడానికి దొరికే అద్భుత అవకాశమే... అలాంటిదే కొత్త ఏడాది కూడా! ఏదైనా మొదలుపెట్టడానికి ముందు... ఇప్పుడు ఎక్కడ ఉన్నామో గుర్తెరిగి... గమ్యం నిర్ణయించుకోవడం ఉత్తమం. అందుకే ముందు మనకెదురయ్యే సమస్యలేంటో గుర్తిద్దాం. వాటినెలా అధిగమించాలో తెలుసుకుందాం. అప్పుడే అనుకున్నది సాధించగలం. అదే ఈ ఏడాది మనకు మనం ఇచ్చుకునే అతిగొప్ప బహుమానం!

మార్పు నామ సంవత్సరం! చేసేద్దాం...

ఆ నాడి పట్టుకోవాలి!



- 42.3% డిగ్రీ పట్టా పొందాక ఉద్యోగాలు సాధించగలుగుతున్న అమ్మాయిల సంఖ్య
- 52% ఉద్యోగం సాధించిన ఏడాదిలో మానేయాలి అనుకుంటున్న వారి సంఖ్య
- 27% కెరియర్ బ్రేక్ తరవాత తిరిగి కొలువులో చేరగలుగుతున్న వాళ్లు

బాగా చదవడం, మార్కులు సాధించడం వరకూ అమ్మాయిలు ముందే. జాబ్ మార్కెట్‌లోకి అడుగు పెట్టడానికి వచ్చేసరికే తడబడుతున్నారు. ఏటా పరిశ్రమలు కోరే నైపుణ్యాలు మారుతుంటాయి. వాటి గురించి తెలుసుకోవాలి. ఇదసలే ఏఐ యుగం. దాని సాయం తీసుకోవడంతోపాటు దాని గురించి అవగాహనా పెంచుకోవాలి. ఇంటర్న్‌షిప్, ఎక్స్‌టర్న్‌షిప్ వంటివి ప్రయత్నించినా సంస్థలు ఏం ఆశిస్తున్నాయన్నది తెలుస్తుంది. ఎంచుకున్న రంగంలో కమ్యూనికేషన్ పెంచుకోవడం, అదనపు కోర్సులు చేయడం, ఉద్యోగ పోకడలను తెలుసుకోవడం వంటివి చేస్తూ ఉండండి... ఏ దశలోనైనా కెరియర్‌లో ముందుకు సాగడం ఖాయం.

బంధాలు పదిలం..!



తెలంగాణలో విడాకుల రేటు 6.7%, ఆంధ్రప్రదేశ్‌లో 5% ఉన్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. లెక్కల్లోకి రాని సైలెంట్ డివోర్స్‌లు ఇంకా ఎన్నో!

'ఇండియా ఇన్ పిక్సెల్' ఇటీవల విడుదల చేసిన డేటా ప్రకారం... తెలుగు రాష్ట్రాల్లో జెన్ జీలు సుమారు 23శాతం. వీళ్లలో సగానికి పైగా అమ్మాయిలు స్వచ్ఛ 'పేరుతో ప్రేమ, పెళ్లి రెండింటికీ దూరమవుతున్నారు.

ప్రేమా పెళ్లీ... ఈ రెండూ లేని జీవితాన్ని ఊహించుకోగలమా? కానీ కొన్నేళ్లుగా ఈ బంధాల్లో అపస్వరాలే దొర్లుతోంది. బాధ్యతలు కొరవడటం, బంధాన్ని దక్కించుకోవడానికి చేసే ప్రయత్నాలన్నీ మహిళలవైపు నుంచే ఉండటం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. చెడు వ్యసనాలు, బెట్టింగ్‌లు, ట్రేడింగ్‌లో డబ్బులు పోగొట్టుకోవడం వంటివి అబ్బాయిల్లో ఎక్కువగా ఉంటే... పార్టీ కల్చర్, వస్తు వ్యామోహం, సామాజిక మాధ్యమాలపై అతి ప్రభావంగా సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు ఆడవాళ్లు. ట్రెండ్ పేరుతో ప్రేమలోనూ వైఫల్యాల్ని ఎదుర్కొంటున్నారు. 'నేనే ఎందుకు ఎప్పుడూ ప్రేమను వ్యక్తపరచాలి' అన్న భావన అమ్మాయిల్లో పెరిగిపోతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. భాగస్వామి ప్రేమను వ్యక్తపరిచే పరిస్థితుల్లో లేనప్పుడు మీరు కేరింగ్‌గా ఉండటం తప్పుకాదు. అలానే నేపథ్యాలు, పెరిగిన వాతావరణం వేర్వేరుగా ఉంటాయి కాబట్టి ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి సమయం పడుతుంది. అప్పటివరకూ ఓపికగా ఉండాలి. అమ్మాయిలు సామాజిక మాధ్యమాలను పక్కనపెట్టి, సమాజ జీవనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పరిస్థితులు చేయిదాటుతున్నాయి అనుకున్నప్పుడు పెద్దవాళ్లను సంప్రదించండి. లేదా కౌన్సెలింగ్‌కి వెళ్లినా మంచిదే. ఇవన్నీ మీ మధ్య బంధాన్ని బలపరుస్తాయి. ప్రేమా పెళ్లి రెండింటికీ ఇవి వర్తిస్తాయి.

అదీ కావాలి... ఇదీ కావాలి!




- 2.2 గం. సగటున ఐదేళ్లలోపు పిల్లలు మొబైల్‌కి కేటాయిస్తున్న సమయం.
- 22% 9-17 ఏళ్లలోపు వారైతే ఏకంగా 6గం. కేటాయిస్తున్నారు.
- 37% సోషల్‌మీడియాకి బానిసలవుతున్న పిల్లల సంఖ్య
- 60% ఇంటర్నెట్, మొబైల్ అడిక్షన్‌కి దగ్గరలో ఉన్న వారి సంఖ్య (5-16 వయసు వాళ్లు)

ఇప్పటి తరం ఎంత స్పీడండీ! ఏడాది లోపు పిల్లలు కూడా ఫోన్ చకచకా వాడేయగలరు. ఒకటీ రెండు తరగతుల్లోనే కోడింగ్ పాఠాలు నేర్చేసుకోగలరు. కంప్యూటర్, వాట్సాప్, యూట్యూబ్, ఇన్‌స్టా రీల్స్... వాళ్లకి పరిచయం లేనిదేది చెప్పండి? సందేహం వస్తే చాలు గూగుల్‌లో వెతికేయడమే! వీళ్లతో మనం పోటీపడలేం అని అనిపిస్తుంది. కానీ దేశీ పరిశోధనలు మాత్రం స్మార్ట్‌ఫోన్, సోషల్‌మీడియాకే, సాంకేతికతకే బానిసలు చేస్తున్నామంటోంది. మొబైల్, టెక్నాలజీకి దూరంగా ఉంచడానికి చాలామంది తల్లిదండ్రులు నిర్ణీత వేళలు నిర్దేశిస్తున్నారు. కానీ అది మాత్రమే సరిపోదు. చాలాసార్లు పెద్దవాళ్లకి ఏం తెలియదు, వీళ్ల గారాబానికి పిల్లలు పాడవుతారు అనుకుంటాం. కానీ ఓ కొత్త టెక్నాలజీ, పరికరం వంటివి తయారవ్వడానికి సాంకేతికత తెలిస్తే చాలదు. మనసు పెట్టి ఆలోచించగలగాలి. ఇవన్నీ ఏ గూగుల్, పుస్తకాల్లో పాఠాలో నేర్పవు. పెద్దవాళ్ల అనుభవాలు, చెప్పే కథలు వంటివాటి ద్వారానే అబ్బుతాయి. కాబట్టి, పిల్లలను పెద్దవాళ్ల దగ్గర గడిపేలా చూడండి. మీ అనుభవాలనీ పంచుకోండి. జీవన నైపుణ్యాలు, సహనమూ, బాధ్యతలు, భావోద్వేగాల నైపుణ్యాలు వంటి ఎన్నో కీలక పాఠాలు మీ పిల్లలు నేర్చుకుంటారు. ఆ బహుమతి వారికి ఇవ్వండి మరి.

సంపాదిస్తే సరిపోదు!

సంపాదిస్తున్నా, లేకున్నా... ఆర్థిక అక్షరాస్యులై ఉండటం ముఖ్యం. ఇది ఆర్థిక స్వతంత్రం దిశగా తొలి అడుగు.



ముందుగా కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకోవడం ముఖ్యం. పిల్లల చదువులు, కుటుంబ విషయాలు, ఉద్యోగ బాధ్యతలు... చాలావాటిలో మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఉంటున్నారు. మరి ఆర్థిక అంశాలకు మాత్రం ఎందుకు దూరంగా ఉండటం!

సంపాదించే వాళ్లు... సంపాదించడం, ఆర్థిక స్వేచ్ఛ ఒక్కటి కాదు. మీ ఆర్థిక లక్ష్యాలు, ఖర్చులకు అవసరమైన మొత్తం మీ దగ్గర ఉండటమే ఆర్థిక స్వేచ్ఛ. ముందు లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని చేరుకోవడానికి ప్రణాళికలు తయారుచేసుకోండి. పిల్లల చదువులు, రిటైర్మెంట్... వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకోండి. అవసరాల్ని ప్రాధాన్య క్రమంలో రాసుకోండి. స్నేహితులతోనే కాదు, సలహాదారులతోనూ మాట్లాడండి.

సంపాదించని వాళ్లు... సంపాదించడంలేదు, మా డబ్బు వ్యవహారం మన పరిధిలో లేదు అనే ఆలోచన వదలాలి. కుటుంబంలో ఏదో కష్టం వచ్చినప్పుడే మీరు ఆర్థిక ప్రయాణం మొదలుపెట్టడం కాదు, ముందుగానే అటుగా అడుగులు వేయండి. మీకు చెందే ఆస్తుల గురించి తెలుసుకోండి. మీ పేర కూడా కొన్ని ఆస్తులు ఉండేలా జాగ్రత్త పడండి. బడ్జెట్, పొదుపు, మదుపు గురించి తెలుసుకోండి. ఇంటి బడ్జెట్ అయినా మీరు వేయండి. చిన్నగానైనా పొదుపు, మదుపు ప్రారంభించడం ముఖ్యం. ఇది ఆత్మవిశ్వాసాన్నీ ఇస్తుంది.

స్నేహాన్ని మరవొద్దు!



వివాహానంతరం 52 శాతం మహిళలు సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనడం తగ్గిపోతుందట.

తరాల అంతరం లేకుండా ఈమధ్య చాలామంది ఎదుర్కొంటోన్న సమస్య... ఫ్రెండ్‌షిప్ రెసిషన్. టైమ్‌యూజ్ సర్వే ప్రకారం- వివాహానంతరం స్త్రీలు సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనడం 52 శాతం తగ్గితే, పురుషుల్లో 23 శాతమే తగ్గింది. ఒక దశలో బెస్టీ ఒక్కరూ లేక డిప్రెషన్ బారినపడుతున్నారట. అదే ఆప్తమిత్రులు ఉంటే కొండంత నిశ్చింత. ఏ కష్టమొచ్చినా పిలిస్తే పలికేవాళ్లున్నారన్న భరోసా... ఎన్ని ఆస్తిపాస్తులున్నా కలగదు మరి. స్నేహితులున్నవాళ్లు ఎక్కువ ఆనందంగా సంతృప్తిగా జీవిస్తున్నట్లు అధ్యయనాలూ చెబుతున్నాయి. అందుకే కెరియర్, కుటుంబంలోపడి స్నేహాన్ని నిర్లక్ష్యం చేయొద్దు. జ్ఞాపకాల్లోకి జారిపోయిన మీ స్నేహితురాళ్లని కలిసేందుకైనా ఫోన్‌లో విషెస్ చెప్పేందుకైనా ఈరోజుని మించినది ఏది?

ఆరోగ్యం మన చేతుల్లోనే...




జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం	
57%	రక్తహీనత(15-49 ఏళ్ల వయసు మహిళల్లో)
70%	గైనిక్ సమస్యలతో...
40%	పోస్ట్ మెనోపాజ్‌లో, 14% ప్రి మెనోపాజ్ దశలోనే మధుమేహం బారినపడుతున్నారు.
86%	మెనోపాజ్ తరవాత, 35-49 ఏళ్ల మధ్య వయసులో 50% ఊబకాయంతో బాధపడుతున్నారు.

అన్నింటా దూసుకుపోతున్నా మన ఆరోగ్యాన్ని మాత్రం మనం పట్టించుకోం. పిల్లలు, భర్త, కుటుంబసభ్యులమీద ఉన్న శ్రద్ధ తమమీద లేకపోవడంవల్లే మహిళల్లో ఎక్కువమంది పోషకాహార లోపం తద్వారా రక్తహీనత బారినపడుతున్నారు. రుతుశుభ్రత పాటించకపోవడం; డిప్రెషన్, యాంగ్జయిటీ.. వంటి సమస్యలకి చికిత్స తీసుకోకపోవడం, రోగనిర్ధారణలో ఆలస్యం... వంటివన్నీ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఆధునిక జీవనశైలితో హృద్రోగాలు, మధుమేహం, క్యాన్సర్లు పెరుగుతున్నాయి.

అందుకే, జీవనశైలి వ్యాధుల్ని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మేలు. కాబట్టి 20-30 ఏళ్లలోపు మహిళలకి ఏడాదికోసారి, నలభై దాటినవాళ్లకి ఆరు నెలలకోసారి పరీక్షలన్నీ తప్పనిసరి. 40 దాటాక ఏటా రొమ్ము, పెల్విక్ స్క్రీనింగ్ టెస్టులూ చేయించుకోవాలి. 15 ఏళ్లు పైబడిన బాలికలకి హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇవ్వాలి. ఆహార, నిద్రవేళల్ని పాటించాలి. విటమిన్-సి, ఇనుము, ప్రొటీన్ ఎక్కువగా ఉండే పండ్లు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, నట్స్... రోజువారీ ఆహారంలో చేర్చాలి. కాల్షియం, డి-విటమిన్ లోపం లేకుండా సప్లిమెంట్లు తీసుకుంటే ఆస్టియోపొరోసిస్ బారినపడకుండా ఉంటారు. 30-60 నిమిషాలపాటు నడక, కసరత్తులు లేదా యోగా వంటివి ప్రతిరోజూ చేయాలి. ప్రి, ప్రొబయాటిక్ పదార్థాలతో పొట్ట ఆరోగ్యం మెరుగవుతుంది. ప్రాథమికంగా ఈ జాగ్రత్తలు తీసుకుంటే మనతోపాటు కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది, దేశం ఆర్థికంగానూ వృద్ధి చెందుతుంది.

వేదిక అనుకుంటున్నారు... కానీ..!





వీళ్లలో సగానికిపైగా బింజ్ వాచింగ్, ఆన్‌లైన్ షాపింగ్, ట్రేడింగ్, డూమ్‌స్క్రోలింగ్ చేస్తున్నవారేనట. ఇంటర్నెట్ వినియోగం రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. దాన్ని ఎప్పుడు, ఎక్కడ, ఎలా వినియోగించాలనేది మన విజ్ఞత మీద ఆధారపడి ఉంటుంది. హద్దులు దాటిన వినియోగంతో నిద్రలేమి, ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి మానసిక సమస్యల్ని ఎదుర్కొంటున్న మహిళలూ ఎక్కువవుతున్నారు.

ఈ మార్పు ఒక్క రోజులో వచ్చినది కాదు. ఇప్పటికిప్పుడు పోవాలనే తీర్మానాలు చేసుకున్నా అన్నీ రెండురోజుల ముచ్చటగానే తయారవుతాయి. కాబట్టి చిన్న లక్ష్యాల్ని పెట్టుకోండి. వారానికి ఒకసారైనా ఫోన్‌కు దూరంగా ఉండాలనే నియమం పెట్టుకోండి. మరీ అవసరం అయితే స్మార్ట్‌ఫోన్లకు బదులుగా కీప్యాడ్‌లను వినియోగిస్తే సరి. షాపింగ్ అప్లికేషన్లు తొలగించండి. అవసరం అయినప్పుడు ఇన్‌స్టాల్ చేసుకుని, తర్వాత అన్‌ఇన్‌స్టాల్ చేసేయండి. డూమ్‌స్క్రోలింగ్‌కు బదులుగా బ్లూమ్‌స్క్రోలింగ్ చేయండి. రీల్స్ చేసే అలవాటు ఉంటే... వాటిని వారంలో కొన్ని రోజులు, లేదా రోజులో గంట అని షెడ్యూల్ వేసుకోండి. తెలియని వాళ్లతో హద్దులు మీరి చాటింగ్ చేయకూడదన్న నిబంధనలు పెట్టుకోండి. నిర్ణీత సమయంలోనే వెబ్‌సిరీస్‌లు, సినిమాలు చూడాలన్న నియమాలను కఠినంగా అమలుచేయండి.


సవాళ్లు తీసుకోండి...



2025 నాటికి మనదేశంలో విమెన్ ఆంత్రప్రెన్యూర్ల సంఖ్య	8 లక్షల పై మాటే
విమెన్ స్టార్టప్‌లు	7000కు పైగానే ఉన్నాయి
మహిళా ఆంత్రప్రెన్యూర్‌లు క్రియేట్ చేసిన ఉద్యోగాలు	2.2-2.7 కోట్లు

అంకెల్లో, లెక్కల్లో... ఆడవాళ్ల పురోగతి దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తున్నా... విఫలమవుతోన్న వ్యాపారాల సంఖ్యా ఎక్కువేనంటున్నారు నిపుణులు. ఇందుకు నైపుణ్యాలు-అవగాహనా లేమి నుంచి పెట్టుబడుల కొరత వరకూ ఎన్నో కారణాలు. అధిగమించాలంటే మీరు అడుగుపెట్టాలనుకునే రంగం గురించి లోతుగా తెలుసుకోండి. మెంటార్‌ను కలవండి. నెట్ వర్క్‌ని ఏర్పరచుకోండి. మూలధనం కోసం కొంత మొత్తాన్ని సేకరించుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలు, స్టార్టప్‌ల్లో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్ల వివరాలు, వారిని చేరుకునే మార్గాలు వంటివి తెలుసుకోండి. ఇవన్నీ చేయడానికి ముందు అభద్రతా భావాన్ని వదిలేయండి. సవాళ్లు తీసుకోవడానికి సిద్ధంగా ఉండండి. మీకు సాయం చేయడానికి రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఎంఎస్‌ఎంఈ, వీహబ్, రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్... వంటి సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. వాళ్లని సంప్రదించండి. ఆత్మవిశ్వాసంతో అడుగేస్తే ఈ ఏడాది విజయం మీదే!

ఆడదాం... ఆడనిద్దాం!



అమ్మాయిల విషయంలో సామాజిక కట్టుబాట్లు, చదువుకే ప్రాధాన్యం ఇవ్వడం, ఎవరో ఏదో అనుకుంటారన్న సందేహాలు.. ఇలాంటివన్నీ వెరసి ఆమెను ఆటకి దూరం చేస్తున్నాయి.

ఆటనీ కెరియర్‌గా తీసుకుంటున్న వారెందరో! సదుపాయాలు, ఆర్థిక సాయం వంటివి అవసరమన్న మాట వాస్తవమే. అయినా ఇంట్లో ప్రోత్సాహమే ప్రధానం. అలాగే ఇది అమ్మాయిలకే కాదు. బాధ్యతలతో ఆటకు దూరమైన వాళ్లకీ వర్తిస్తుంది. చిన్నప్పట్నుంచీ మైదానమంటూ ఎరుగని వాళ్లూ కొత్తగా ప్రారంభించి, పతకాలు సాధిస్తున్నారు. వాళ్లని ఆదర్శంగా తీసుకోండి. అయినా ఆటలు శారీరక, మానసిక ఆరోగ్యాలను పెంచే మార్గం కూడా. ఆత్మవిశ్వాసాన్నీ పెంచుతాయి. కాబట్టి, ధైర్యంగా బరిలోకి దిగేయండి. సాధన మొదలుపెట్టేయండి.

ఆత్మరక్షణతోనే ఆత్మస్థైర్యం!

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) తాజాగా విడుదల చేసిన 2023 నేర గణాంకాల ప్రకారం	
దేశవ్యాప్తంగా మహిళలపైన జరిగిన నేరాల కేసులు	4.48 లక్షలు.
వీటిలో అత్యధికం గృహహింస కేసులు	1.33 లక్షలు
కిడ్నాప్, అపహరణ కేసులు	88వేలు.
పోక్సో(పిల్లలపైన లైంగిక వేధింపులు) కేసులు	66.2వేలు.
లక్షమంది మహిళల్లో నేరాల్ని ఎదుర్కొన్నవారు	66 మంది



మనల్ని మనం రక్షించుకోవడం ప్రథమ కర్తవ్యం. అందుకే ఈ ఏడాది చేయాల్సిన పనుల్లో సెల్ఫ్ డిఫెన్స్‌కు చోటివ్వండి. ఈ విద్య తెలిస్తే... జీవితంలోనూ ఆత్మవిశ్వాసంతో మెలుగుతారు. శారీరకంగా, మానసికంగానూ దృఢంగా తయారవుతారు. బస్టాపులూ, రైల్వేస్టేషన్లూ... వంటి జన సముదాయ ప్రాంతాల్లో ఎవరినుంచైనా ముప్పు ఉండొచ్చు. ఇలాంటి చోట పరిసరాల్ని గమనించాలి. మనం అప్రమత్తంగా ఉన్నప్పుడు ఎదుటవాళ్లూ తమ పరిధిలో ఉంటారు. స్వీయరక్షణలో ఇది ముఖ్యం. చాలా రకాల మార్షల్ ఆర్ట్స్ ఉన్నాయి. నచ్చినవాటిని నేర్చుకోండి. స్కూళ్లూ, కాలేజీలూ, ఆఫీసులూ, కమ్యూనిటీల్లో ఆత్మరక్షణ తరగతులూ నేర్పిస్తుంటారు. తప్పనిసరిగా నేర్వండి. అలాగైతే దాడుల సమయంలో మీరు సులభంగా తప్పించుకోవచ్చు లేదంటే ఎదురుదాడి చేయొచ్చు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటంవల్ల ఇతర అంశాల్లోనూ ఆత్మవిశ్వాసంతో ఉంటారు. ఏది నిజం? ఏది నకిలీ? అన్న విషయాన్ని అంచనావేయగలరు. అది వ్యక్తులు కావచ్చు, స్కామ్‌ల్లాంటి సందర్భాలు కావొచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆత్మరక్షణ... మీకు మీరు తెచ్చుకునే స్వతంత్రం.

సైబర్ వలలో చిక్కొద్దు!



- నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్(ఎన్‌సీఆర్పీ)తాజా నివేదిక ప్రకారం... మహిళలపై ఆన్‌లైన్ నేరాలు 118.4% పెరిగాయట.
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆన్‌లైన్ డీప్‌ఫేక్ వీడియోల్లో 96-98 శాతం నాన్-కన్సెన్స్యువల్ (అనుమతి లేని)సెక్సువల్ కంటెంటేనట.

సాంకేతిక పురోగతి... మనల్ని సాధికారత దిశగా నడిపిస్తుందని నమ్మాం. కానీ, ఇప్పుడది విసురుతోన్న సవాళ్లను దాటుకుని ముందుకెళ్లడమే మన కర్తవ్యం. అంతర్జాలం వేదికగా ఫేక్ ఖాతాలతో, మార్ఫింగ్ చిత్రాలతో నేరగాళ్లు మీపై వల పన్ని కూర్చుంటారు. ఆశలు చూపిస్తూ తమ వలలోకి లాగాలని చూస్తారు. మీ ఒంటరితనాన్నీ, అమాయకత్వాన్నీ అలుసుగా చేసుకుని నమ్మబలికేలా చేస్తారు. మీరంటే నచ్చనివారు మీ పరువు తీయాలని చూస్తారు. అలాగని అతిగా ఆందోళన చెందకండి. జాగ్రత్తగా ఉంటే సరిపోతుంది. మీ వ్యక్తిగత సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దు. ప్రేమించానన్నా, పెళ్లి చేసుకున్న వ్యక్తితో అయినా ఇంటిమేటెడ్ వీడియోలు షేర్ చేయకండి. అవి థర్డ్ పార్టీ కెమెరాలతో రికార్డ్ చేసే ప్రమాదం ఉంది. ఆన్‌లైన్ ప్రేమల్ని నమ్మకండి. మీ చిత్రాలను మార్ఫింగ్ చేసినా, ఏఐతో నకిలీలను సృష్టించినా కంగారు పడిపోవద్దు. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సైబర్ నేరాల నియంత్రణ కోసం పోలీసు వ్యవస్థలు సమర్థంగా పనిచేస్తున్నాయి. 100 నెంబరుకి డయల్ చేసినా సరే మీ రక్షణకోసం ముందుకొస్తారు. ఈ ఆటంకాలు మన లక్ష్యాలను, మన సామర్థ్యాలను దెబ్బతీయకూడదు. కొత్త ఏడాది ఆన్‌లైన్ వాడటంపై పరిధులు నిర్ణయించుకుని అనుకున్న గమ్యాలను చేరుకోండి.

భక్తి కోణం మారింది...

- గూగుల్ ఇటీవల అందించిన నివేదికల ప్రకారం... మన దేశంలో ప్రతి పది మందిలో ఏడు గురు ఆధ్యాత్మిక ప్రయాణాలు చేయడానికి ఇష్టపడుతున్నారు.
- టీఎస్ఆర్ టీసీ ఇటీవల విడుదల చేసిన నివేదికల ప్రకారం... 70-80శాతం మంది మహిళలు ప్రత్యేక రోజుల్లో ఆలయాల సందర్శనకు వెళుతున్నట్లు వెల్లడైంది.

దైవదర్శనం మంచిదే... కానీ కొన్నిచోట్ల ఇది ప్రమాదాలకు కారణమవుతుంది. ఇటీవల ఆలయాల్లో జరిగిన తొక్కిసలాటలు, ప్రాణాలు కోల్పోయిన ఉదంతాలే ఇందుకు ఉదాహరణ. పైగా, ఈ పూజను ఇలానే చేయాలి, ఈ పద్ధతినే పాటించాలంటూ ఎన్ని నియమాలో. దీనివల్ల ఏం జరుగుతుందో అన్న భయంతో ఒత్తిడికి గురవుతున్నారు.



మిలీనియల్, జెన్‌జీ అమ్మాయిల దృష్టికోణం మారింది. పురాణాలకు క్వాంటమ్ ఫిజిక్స్‌ను అనుసంధానించి చదవడం మొదలుపెట్టారు. నైతిక విలువల సాధనకు దీన్నో మెట్టుగా భావిస్తున్నారు. నిర్ణయాలు తీసుకోవడంలో, గందరగోళ పరిస్థితుల్లో ఇది దిక్సూచిగా సహకరిస్తుందని చెబుతున్నారు. అలానే ప్రత్యేక రోజుల్లో ఆలయాల్ని సందర్శించాలి అనుకున్నప్పుడు రద్దీ, దర్శనం వేళలు, సమయం వంటి సమాచారం సేకరించుకుని సమస్యాత్మకం కాదనుకుంటేనే వెళ్లండి. లేదంటే ఇంట్లోనే పూజ చేసుకోండి. తర్వాత ప్రశాంతంగా దర్శనం చేసుకోండి. ఆన్‌లైన్ సలహాల్ని పక్కన పెట్టి మీకు తెలిసిన, మీ పెద్దవాళ్లు పాటిస్తున్న పద్ధతుల్లో పూజ పూర్తి చేస్తే సరి.

మళ్లీ ప్రయత్నిద్దాం!



పట్టువదలని విక్రమార్కురాలిలా... ఎప్పుడూ అనుకునేదే!

'రేపట్నుంచి నేను మారిపోతా. పొద్దునే లేచి తప్పకుండా వ్యాయామం చేస్తా'... ఇలా 31వ తేదీ అర్ధరాత్రి వరకూ ఎన్నిసార్లు అనుకున్నామో కదా! అవును కొత్త ఏడాది వస్తుందంటే చాలు... మనం పెట్టుకున్న లక్ష్యాలతో ఉత్సాహం ఎవరెస్టు అంత ఎత్తున ఉప్పొంగిపోతుంది. కానీ, ఈ రిజల్యూషన్ 1వ తేదీ ఉదయానికే వంటింట్లోకి అడుగుపెడుతూ అటకెక్కించేస్తాం. లేదంటే ఆ విఘ్నాన్ని దాటి మొదటి రెండు రోజులూ బాగానే వెళ్లినా... మూడో రోజు పిల్లాడికి జ్వరం, నాలుగో రోజు ఇంట్లో అతిథులు... అంటూ దానికి చుక్క పెట్టేస్తాం.

పోనీ వ్యాయామం ఎలానూ లేదు... డైట్ అయినా ఫాలో అయిపోదామని మరోసారి గట్టిగా అనేసుకుంటాం. తీరా కిచెన్‌లోకి అడుగుపెట్టేసరికి భర్త మెచ్చేవీ, పిల్లలకు నచ్చేవీ వండి వడ్డించడంతోనే సమయం గడిచిపోతుంది. ఆపై పాత్రలు కడగడం, సర్దడం షరా మామూలే. ఇక డైట్ ఎక్కడ? ప్లాన్ ఎక్కడ?

'డైట్ చేయట్లేదు. బరువు తగ్గడానికి స్వీట్లయినా బంద్ చేసేయాలి' అని మరో శపథం చేసుకున్నా... మనసెక్కడ ఊరుకుంటుంది? ఇవాల్టికేలే అంటూ మనల్ని మనం చీటింగ్ చేసుకునేదాకా ఊరుకోదు. దీంతో బరువు తగ్గాలనే లక్ష్యం పోయి... ఇంకో రెండు కిలోలు అదనంగా పెరిగిపోతాం. సరె సర్లే... ఎన్నెన్నో అనుకుంటాం... అన్నీ నిజమవుతాయా ఏంటి? అయినా సెల్ఫ్‌కేర్ అంటే... సబ్బు మార్చడం వరకే.. మెంటల్ హెల్త్ అనగానే... అదంతా ఓవర్ థింకింగ్‌లే అని సరిపెట్టేసుకోవడం మనకి అలవాటే కదా అంటారా? అయినప్పటికీ... అనారోగ్యాలు ఇబ్బంది పెట్టినప్పుడో, నచ్చిన డ్రెస్ వేసుకోలేనప్పుడో, ఎవరైనా కాస్త బొద్దుగా మారావు అన్నప్పుడో.... మన రిజల్యూషన్ ఫెయిలయ్యిందనే అపరాధ భావం తెగ బాధపెట్టేస్తుంది.

అయితే, ఈ వైఫల్యం అధిక బరువుతో ఆగదు... పోషకాల లోపం, రక్తహీనత, డిప్రెషన్, ఇలా రుతుక్రమం నుంచి మెనోపాజ్ వరకూ ఎన్నెన్నో సమస్యలు మనల్ని ముప్పతిప్పలు పెడతాయి.

మరేం చేయాలి?

ఓ అంతర్జాతీయ అధ్యయనం ప్రకారం... రెజల్యూషన్స్ పెట్టుకున్న మహిళల్లో 88 శాతం మంది వాటిని ఫిబ్రవరి నాటికే వదిలేస్తారట. కారణం? మల్టీ టాస్కింగ్ లైఫ్‌స్టైల్, సామాజిక ఒత్తిళ్లు, సెల్ఫ్-కేర్ ప్రాధాన్యతని గుర్తించకపోవడమే.

- చిన్న చిన్న లక్ష్యాలు పెట్టుకోండి. రోజుకి 10 నిమిషాలు వాకింగ్ అసాధ్యమేమీ కాదుగా. అక్కడితో మొదలుపెట్టి సమయాన్ని పెంచుకోండి.
- ఇంట్లో మీరు మాత్రమే డైటింగ్ చేయాలంటే బోర్‌గా అనిపించొచ్చు. తోడు వెతుక్కోండి. వీలైతే కుటుంబ సభ్యులూ పాటించేలా చూడండి. మీ పని తేలిక అవుతుంది.
- మధ్యలో విరామం వచ్చినా ఏం ఫరవాలేదు. మళ్లీ స్టార్ట్ చేయండి. ఈ సంవత్సరమైనా మీ లక్ష్యాన్ని చేరుకోండి.

రంగవల్లిక

20 చుక్కలు
10 వరుసలు
10 వచ్చేవరకూ

టంగుటూరి శ్రీలక్ష్మి
టంగుటూరు





మీ ముగ్గులు 9154091911కు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా: వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501 512.

జోగి రమేష్‌కు రూ.1.18 కోట్ల లంచం

- జోగి రాము ద్వారా రూ.45.06 లక్షలు అందజేత
- రమేష్‌కు చెందిన స్వర్ణ డెవలపర్స్ ఖాతాలో రూ.72.90 లక్షలు జమ
- నకిలీ మద్యం కేసులో సిట్ అభియోగపత్రం



ఈనాడు, అమరావతి: వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్‌ ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ కేంద్రాల్లో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు నుంచి వివిధ వాయిదాల్లో రూ.1.18 కోట్లు ముట్టినట్లు సిట్ తేల్చింది. అందులో రూ.45.06 లక్షలను జోగి రమేష్ ఆదేశం మేరకు ఆయన సోదరుడు జోగి రాముకు నేరుగా అందజేయగా, మరో రూ.72.90 లక్షలను స్వర్ణ డెవలపర్స్ (జోగి రమేష్ సొంత సంస్థ) బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు గుర్తించింది. సార్వత్రిక ఎన్నికలకు కొద్ది రోజుల ముందు స్వర్ణ డెవలపర్స్ ఖాతా నుంచి జోగి రమేష్ వ్యక్తిగత ఖాతాలోకి భారీ మొత్తాల్లో మళ్లింపులు జరిగినట్లు నిర్ధారించింది. జగన్ హయాంలో జోగి రమేష్ నేతృత్వంలో, ఆయన అండదండలతో అద్దేపల్లి జనార్దనరావు ఇబ్రహీంపట్నం పాత ఏఎన్ఆర్ బార్ ప్రాంగణంలో నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని నడిపించారని, హైదరాబాద్ నుంచి ఏపీలోకి సుంకం చెల్లించని మద్యం తీసుకొచ్చి ఇక్కడి బార్లలో విక్రయించేవారని గుర్తించింది. అందుకు ప్రతిఫలంగానే ఎప్పటికప్పుడు జోగి రమేష్ సొమ్ములు ముట్టజెప్పేవారని వెల్లడించింది. ఆయా బ్యాంకు లావాదేవీల వివరాలు, మనీ ట్రయల్, కాల్ డేటా రికార్డులు, టవర్ లొకేషన్లు, శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో సిట్ ఈ గుట్టు రట్టు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసులో సిట్ అధికారులు బుధవారం అనుబంధ అభియోగపత్రం దాఖలు చేశారు. జోగి రమేష్ (ఏ18), ఆయన సోదరుడు జోగి రాము (ఏ19) సహా మొత్తం 13 మందిపై అభియోగాలు మోపారు. ప్రధానాంశాలివీ.

రూ.18.68 కోట్ల అనుమానాస్పద లావాదేవీలు

◆ వెంగళూరి ఎస్‌బీఐ బ్రాంచ్‌లో జోగి రమేష్ బ్యాంక్ ఖాతాలో 2019 ఆగస్టు 21 నుంచి 2025 అక్టోబరు వరకూ మొత్తం 38 లావాదేవీల ద్వారా రూ.18.68 కోట్లు జమయ్యాయి. ఇవన్నీ అనుమానాస్పద లావాదేవీలే.

◆ స్వర్ణ డెవలపర్స్ ఖాతాలోకి చెక్కులు, ఆర్టీజీఎస్, నెఫ్ట్ ద్వారా 2021 నవంబరు నుంచి 2025 నవంబరు మధ్య రూ.5.61 కోట్లు జమయ్యాయి. ఇవీ అనుమానాస్పదంగానే ఉన్నాయి. ◆ ఇండస్‌ఇండ్ బ్యాంకులోని రమేష్‌కు సంబంధించిన మరో ఖాతాలో రూ.3.81 కోట్లు జమయ్యాయి.

రమేష్ ఆదేశంతో.. రాము తీసుకున్నారు

◆ జనార్దనరావు సోదరుడు జగన్మోహనరావు 2020 అక్టోబరు 25 నుంచి 2025 సెప్టెంబరు వరకూ రూ.45.06 లక్షలు జోగి రమేష్ సోదరుడు రాముకు అందజేశారు.

◆ జోగి రమేష్ సొంత సంస్థ స్వర్ణ డెవలపర్స్ పేరిట విజయవాడ పటమట ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఖాతా ఉంది. 2021 మే 19 నుంచి 2024 మే 28 మధ్య 12 దఫాలుగా రూ.1.02 కోట్లు జమయ్యాయి. ఒక్కో విడతలో రూ.20 లక్షలు, రూ.15 లక్షలు, రూ.10 లక్షల చొప్పున నగదు రూపంలోనే జమయ్యేవి. ఇవన్నీ అసాధారణ డిపాజిట్లే.

అలా విత్‌డ్రా.. ఇలా జమ

◆ స్వర్ణ డెవలపర్స్ ఖాతాలో డబ్బులు జమైన ప్రతి సందర్భంలోనూ అంతకు కొద్ది రోజుల ముందే ఎఎన్‌ఆర్ బార్ బ్యాంక్ ఖాతా నుంచి, అద్దేపల్లి జగన్మోహనరావు వ్యక్తిగత ఖాతా నుంచి డబ్బులు విత్‌డ్రా అయ్యాయి.

◆ 2022 జూన్ 20, 28, సెప్టెంబరు 1, 2024 మార్చి 5వ తేదీల్లో ఎఎన్‌ఆర్ బార్ బ్యాంక్ ఖాతా నుంచి అద్దేపల్లి జనార్దనరావు రూ.42.20 లక్షలు విత్‌డ్రా చేశారు.

◆ 2022 సెప్టెంబరు 5, 13, 15, 21, 2024 మే 28 తేదీల్లో స్వర్ణ డెవలపర్స్ ఖాతాలో రూ.46 లక్షలు జమయ్యాయి. ◆ 2022 ఫిబ్రవరి 9, జూన్ 20, జులై 21, 2023 మార్చి 14, 21 తేదీల్లో అద్దేపల్లి జగన్మోహనరావు రూ.24 లక్షలు విత్‌డ్రా చేశారు. ◆ 2022 మార్చి 9, సెప్టెంబరు 21, 23 తేదీల్లో స్వర్ణ డెవలపర్స్ ఖాతాలో రూ.26.90 లక్షలు జమయ్యాయి.

స్వర్ణ డెవలపర్స్ నుంచి జోగి రమేష్ వ్యక్తిగత ఖాతాలోకి

◆ స్వర్ణ డెవలపర్స్ ఖాతా నుంచి పోరంకిలోని కరూర్ వైశ్యా బ్యాంక్ బ్రాంచ్‌లో జోగి రమేష్ పేరిట ఉన్న ఖాతాలోకి 2024 మే 1 నుంచి మే 9 మధ్య రూ.25 లక్షలు జమయ్యాయి. ఇదే ఖాతాలోకి మరో రూ.15 లక్షలు జోగి రమేష్ బాబాయ్ వెంకటేశ్వరరావు ఖాతా నుంచి జమయ్యాయి. ఎన్నికలకు ముందు ఈ డబ్బంతా వెళ్లింది. జోగి రమేష్ బాబాయ్ పేరిట పటమట బ్రాంచ్‌లో ఉన్న మరో బ్యాంక్ ఖాతాలోకి స్వర్ణ డెవలపర్స్ ఖాతానుంచి రూ.52.60లక్షలు జమయ్యాయి.

◆ జోగి రమేష్, జోగి రాము.. జనార్దనరావు, అద్దేపల్లి జగన్మోహనరావుతో వాట్సప్ కాల్, ఇతర రహస్య మార్గాల ద్వారా మాట్లాడుకునేవారు. జనార్దనరావు (ఏ1) 2023 నవంబరు 28 నుంచి 2025 నవంబరు 1 మధ్య జోగి రాముతో 18సార్లు కాంటాక్ట్‌లో ఉన్నట్లు కాల్ డేటా, టవర్ లొకేషన్ డేటా విశ్లేషణలో వెల్లడైంది.

మొత్తం 13 మందిపై అభియోగపత్రం

నకిలీ మద్యం కేసులో మొత్తం 25 మందిని నిందితులుగా చేర్చారు. వీరిలో 23 మంది అరెస్టయ్యారు. తాజాగా వేసిన మూడో అభియోగపత్రంతో కలిపితే మొత్తం 24 మందిపై అభియోగాలు మోపారు. ఈ ముఠాకు సీసాలు, మూతలు సరఫరా చేసిన మనోజ్‌ను అరెస్టు చేయాల్సి ఉన్నా అతని పాత్రపై అభియోగపత్రం వేశారు.

మాతృభాష ప్రతి ఒక్కరి ఇంటి భాష కావాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని సన్మానించిన సింగపూర్ తెలుగు సమాజం ప్రతినిధులు

ఈనాడు, దిల్లీ: భాష అంటే మాట్లాడే నాలుగు పలుకులు కాదని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మన భాషలో మన సంస్కృతి ఉంటుందని, అందువల్ల మాతృభాషను ప్రతి ఒక్కరూ తమ ఇంటి భాషగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. సింగపూర్‌లో అక్కడి తెలుగు సమాజం బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "మన కట్టు, బొట్టు, భాష, యాస, ప్రాసలను ఎప్పుడూ విడిచిపెట్టొద్దు. మన పద్యం, గద్యం, పండుగలు, ఉత్సవాలన్నింటినీ గౌరవించుకోవాలి. మనం ఎక్కడున్నా వాటిని శ్రద్ధగా జరుపుకోవాలి. భాషా సంస్కృతులను కాపాడుకోవడంతోపాటు నలుగురికీ సాయం చేయడం మరిచిపోవద్దు. విదేశాల్లో కష్టపడండి... సంపాదించండి... తిరిగి మాతృదేశానికి వచ్చి సేవ చేయండి" అని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు.

నూజివీడులో ఐఐపీఎం

౯.౯౬ ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ (ఐఐపీఎం) ఏర్పాటు కోసం ఉద్యాన, పట్టు శాఖకు ప్రభుత్వం ఏలూరు జిల్లా నూజివీడులో 9.96 ఎకరాలు కేటాయించింది. 33 ఏళ్ల లీజు విధానంలో భూమిని ఉచితంగా అప్పగించింది.

◆ వేదాంత లిమిటెడ్‌కు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలంలో 9.88 ఎకరాల్ని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆన్‌షోర్ డ్రిల్లింగ్ కార్యకలాపాల నిమిత్తం మూడేళ్ల కాలానికి లీజు విధానంలో బదిలీచేసింది. ఏడాదికి రూ.15 లక్షల చొప్పున లీజు చెల్లించాలని (ఇది మార్కెట్ విలువలో 10%) సూచించింది.

◆ విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గుడిలోవలో రాష్ట్రసేవా సమితికి 18.57 ఎకరాలు కేటాయిస్తూ రెవెన్యూశాఖ బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఎకరా రూ.80 లక్షల చొప్పున మొత్తం రూ.14.85 కోట్లకు కేటాయించింది.

◆ బాపట్ల జిల్లా పశ్చిమ బాపట్లలో తెదేపా జిల్లా కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం 2 ఎకరాలు కేటాయించింది. ఏడాదికి రూ.1,000 లీజుపై 33 ఏళ్ల కాలానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

హైవే నిర్మాణంలో గిన్నిస్ రికార్డు లక్ష్యం

- 7 రోజులపాటు 6 వరుసలు.. 26 కి.మీ. రోడ్డు నిర్మాణం
- నిర్విరామంగా నిర్మించి రికార్డు సృష్టించేయత్నం
- కోడూరు-ముప్పవరం హైవేలో సన్నద్ధం



గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించేలా తారు రోడ్డు నిర్మించే హైవే ఇదే..

ఈనాడు, అమరావతి: గ్రీన్ ఫీల్డ్ హైవేలో ఏడు రోజులపాటు నిర్విరామంగా రాత్రి, పగలు తేడా లేకుండా పని చేసి 26 కి.మీ. మేర 6 వరుసలలో తారురోడ్డు పూర్తిచేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. శ్రీసత్యసాయి జిల్లాలోని కోడూరు క్రాస్ నుంచి బాపట్ల జిల్లా ముప్పవరం వరకు ఆరు వరుసలతో నిర్మిస్తున్న యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే (బెంగళూరు-కడప-విజయవాడ హైవే)లో రికార్డు స్థాయిలో తారు రోడ్డు పనులు చేసేందుకు రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ అనే గుత్తేదారు సంస్థ సన్నద్ధమైంది. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఓబుళదేవర చెరువు మండలంలోని సాతర్లపల్లి సమీపం నుంచి ములకవేముల క్రాస్ సమీపం వరకు 26 కి.మీ. మేర రోడ్డు నిర్మాణాన్ని ఈనెల 5న ఉదయం ఆరంభించి, 11వ తేదీ నాటికి పూర్తిచేసి రికార్డు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ముందస్తు ఏర్పాట్లతో సన్నద్ధం..

◆ ఇరువైపులా మూడేసి వరుసల చొప్పున మొత్తం ఆరు వరుసలతో ఈ హైవే నిర్మిస్తున్నారు.

◆ 29.5వ కి.మీ. నుంచి 55.5వ కి.మీ. వరకు (26 కి.మీ.) ఒకవైపు మూడు వరుసలతో తారు రోడ్డు వేస్తారు. మళ్లీ రెండోవైపు కూడా అంతేదూరం మూడు వరుసలతో నిర్మిస్తారు. మొత్తంగా మూడేసి వరుసలతో రెండు వైపులా కలిపి 52 కి.మీ. మేర రోడ్డు నిర్మిస్తారు.

◆ ఇప్పటికే అక్కడ డెన్స్ బిటమిన్ మెక్డమ్ (బీడీఎమ్) వరకు పనులు చేశారు. ఈనెల 5 నుంచి చివరి లేయర్ అయిన బిటుమినస్ కాంక్రీట్ (తారు రోడ్డు) వేయనున్నారు.

◆ సెన్సర్ పేవర్ రోడ్డు వేస్తుంటే.. వెనుక రోలింగ్ చేసేందుకు నాలుగు రోలర్లు సిద్ధంచేశారు.

◆ అవసరమైన బిటమిన్ సరఫరా కోసం ఐదు హాట్‌మిక్స్ ప్లాంట్లను అందుబాటులో ఉంచారు.

◆ ఈ ప్లాంట్ల నుంచి నిరంతరం బిటుమినస్‌ను తరలించేందుకు 100 టిప్పర్లను రెడీ చేశారు.

◆ గుత్తేదారు సంస్థ ప్రతినిధులు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో ఈ పనులు ఆరంభించి కొనసాగించనున్నారు.

◆ 11వ తేదీ నాటికి నిర్మాణం పూర్తయ్యాక.. 12న హైవే వద్ద జరిగే కార్యక్రమంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదగా.. గిన్నిస్ రికార్డు అందుకోనున్నట్లు రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రతినిధులు తెలిపారు.

గత రికార్డులను అధిగమించేలా..

రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సంస్థ 2021 మేలో మహారాష్ట్రలోని పుసెగావ్-మహాసుర్నేల మధ్య 24 గంటల్లో 39.69 కి.మీ. మేర ఒక వరుస రహదారిని నిర్మించి గిన్నిస్ బుక్ రికార్డు సాధించింది. తర్వాత మహారాష్ట్రలోనే అమరావతి-అకోలా మధ్య 42.2 కి.మీ. మేర రెండు వరుసల హైవేలో తారు రోడ్డును రికార్డుస్థాయిలో నిర్మించింది. 2022 జూన్ 3న ఉదయం నుంచి 7వ తేదీ రాత్రి 9.30 గంటల వరకు ఈ పనులు చేసి మళ్లీ గిన్నిస్ బుక్‌లోకి ఎక్కింది. తాజాగా కోడూరు-ముప్పవరం హైవేలో 26 కి.మీ. ఆరు వరుసలు ఏడు రోజుల్లో నిర్మించి. తమ రికార్డును తామే అధిగమించేందుకు ఆ సంస్థ సిద్ధమైంది.

పోలవరం పనులు 18 నెలల్లో 13 శాతం పూర్తి చేశాం

- జనవరి మొదటి వారంలో వెలిగొండ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు
- జలవనరులశాఖ మంత్రి రామానాయుడు



ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలవరం ప్రాజెక్టు పనులను 18 నెలల్లో 13 శాతం పూర్తి చేశామని.. నిర్వాసితులకు ఏడాదిలోనే రూ.1,894 కోట్లు విడుదల చేశామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వైకాపా తన ఐదేళ్ల పాలనలో 2 శాతం కూడా పూర్తి చేయలేకపోయినా.. పోలవరం పనులపై మాట్లాడటం, విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ధ్వజమెత్తారు. కేంద్రం రీయింబర్స్ చేసిన రూ.3 వేల కోట్లను కూడా వైకాపా ప్రభుత్వం మళ్లించిందని పేర్కొన్నారు. బుధవారం ఆయన విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 'జనవరి మొదటి వారంలో సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు సందర్శిస్తారు. రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులు ప్రారంభిస్తారు' అని వివరించారు. '2014-19 మధ్య పోలవరం పనులు 72% పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు పరుగులు తీస్తున్నాయి. 2027 చివరికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేసే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేయాలని చంద్రబాబు సూచించారు' అని రామానాయుడు ఈ సందర్భంగా వివరించారు. 'పోలవరం ఎడమకాలువ పనుల్ని పూర్తి చేసి 2026 సంవత్సరంలో అనకాపల్లికి నీరు ఇవ్వబోతున్నాం. రాయలసీమలోని హంద్రీనీవా, ఉత్తరాంధ్రలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టుల్ని నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేస్తాం' అని తెలిపారు. సమావేశంలో జలవనరులశాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి రుణాల్ని కేంద్రం, సీఆర్‌డీఏ తీరుస్తాయి

- జగన్ వాటిని రాష్ట్రప్రభుత్వ అప్పుల్లో ఎలా కలుపుతారు?
- ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ విజయ్‌కుమార్

ఈనాడు, అమరావతి: కేంద్రం పూచీకత్తుతో అమరావతి నిర్మాణానికి సీఆర్‌డీఏ రుణం తీసుకుంటుంటే మీకెందుకంత కడుపు మంట.. అని వైకాపా అధినేత జగన్‌ను ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ విజయ్‌కుమార్ ప్రశ్నించారు. మీలా మూడు రాజధానులంటూ గాల్లో వదిలేయమంటారా? ఒక సంస్థ, కార్పొరేషన్ తన అవసరాల కోసం తీసుకొనే సంస్థాగత అప్పులకు, రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీఐ ద్వారా తీసుకొనే అప్పులకూ తేడా ఉందనే సంగతి మీకు తెలియదా? అని నిలదీశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమరావతి నిర్మాణం కోసం తెస్తున్న రుణాల్లో కొంత కేంద్రం, మరికొంత సీఆర్‌డీఏ తీరుస్తాయని .. వాటిని రాష్ట్ర అప్పుల్లో ఎలా కలుపుతారని ప్రశ్నించారు. '2024 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో వైకాపా ప్రభుత్వం రూ.38,700 కోట్లు అప్పు చేసింది. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన అప్పు రూ.1,19,937 కోట్లు. కానీ రూ.2.93 లక్షల కోట్లు అప్పులు చేసినట్టు జగన్ దుష్ప్రచారం చేస్తున్నారు' అని మండిపడ్డారు.

తెదేపా కార్యకర్త కుటుంబానికి చంద్రబాబు రూ.5 లక్షల సాయం



ఆగయ్య కుమారుడు, కోడలికి చెక్కు అందిస్తున్న బక్కని నర్సింహులు, వంచె శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఈనాడు, హైదరాబాద్: కరీంనగర్‌కు చెందిన తెదేపా కార్యకర్త కళ్యాడపు ఆగయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి పార్టీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌కు వచ్చిన ఆగయ్య కుమారుడు నరేష్, కోడలు రవళికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జాతీయ ప్రధానకార్యదర్శి బక్కని నర్సింహులు రూ.5 లక్షల చెక్కును అందించారు.

6.17% తగ్గిన నేరాలు

- సీసీ కెమెరాల వల్ల 2,514 కేసులు ఛేదించాం
- హోం మంత్రి వంగలపూడి అనిత



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2024తో పోలిస్తే 2025లో నేరాలు 6.17 శాతం మేర తగ్గాయని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అల్లర్లు, ఎస్సీ, ఎస్టీలు, మహిళలపై జరిగే నేరాలు, పోక్సో కేసులు బాగా తగ్గుముఖం పట్టాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.40 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఫలితంగా పోలీసులు 2,514 కేసులు ఛేదించగలిగారని పేర్కొన్నారు. పోలీసు సంక్షేమం కోసం రూ.815 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. ప్రాపర్టీ నేరాల్లో బాధితులు పోగొట్టుకున్న సొత్తులో 55 శాతం మేర రికవరీ చేయగలిగామని చెప్పారు. 2025లో హోంశాఖ పురోగతిపై బుధవారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రధానాంశాలివి.

◆ జైళ్ల శాఖలో ఆన్‌లైన్ విధానంలో ఈ-ములాఖత్‌లు ప్రవేశపెట్టాం. ఏపీ కారాగారాలు, సంస్కరణ సేవల చట్టం-2025కు సంబంధించిన ముసాయిదా బిల్లు మంత్రివర్గం ఆమోదం పొందింది. త్వరలోఅసెంబ్లీలో ప్రవేశపెడతాం. అమరావతిలో రూ.200 కోట్లతో అత్యాధునిక వసతులతో కూడిన కేంద్ర కారాగారాన్ని నిర్మించనున్నాం.

◆ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.252 కోట్లతో అగ్నిమాపక శాఖకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, ఆధునికీకరణ చేస్తున్నాం. అగ్నిమాపక నిరభ్యంతర పత్రాల (ఎన్వోసీ) జారీ వ్యవస్థను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ పోర్టల్‌తో అనుసంధానించి, 10 రోజుల్లోనే జారీ చేయిస్తున్నాం.

◆ ఎస్‌పీఎఫ్‌లో 19 ఎస్సై, 245 పోస్టుల భర్తీ ప్రక్రియ త్వరలోమొదలవుతుంది.

◆ ప్రాసిక్యూషన్ నాణ్యత పెంచటం వల్ల 110 కేసుల్లో దోషులు జీవితఖైదు పడేలా చేయగలిగాం. 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాం.

◆ విశ్రాంత/అమరులైన సైనికుల పిల్లల చదువుల కోసం ప్రధానమంత్రి స్కాలర్‌షిప్ స్కీమ్ కింద 996 మందికి లబ్ధి చేకూర్చాం. ఈ విషయంలో దేశంలో అగ్రగామిగా నిలిచాం. రూ.10 కోట్లతో ఏపీ ఎక్స్ సర్వీస్‌మెన్ కార్పొరేషన్ ఏర్పాటు చేశాం.

డిజిటల్ అరెస్టు భయం.. రూ.1.23 కోట్ల మోసం


అద్దంకిలో వెలుగు చూసిన ఘటన

అద్దంకి, న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు భయంతో అద్దంకి పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి ఎస్.నాగేశ్వరరావు రూ.1.23 కోట్ల నగదును ముంబయికి చెందిన వ్యక్తికి చెల్లించి మోసపోయిన ఘటన బుధవారం అద్దంకిలో వెలుగు చూసింది. అద్దంకి పట్టణానికి చెందిన ఎస్ఐడీబీలో జనరల్ మేనేజరుగా నాగేశ్వరరావు హైదరాబాద్, ముంబయి, చెన్నై లాంటి పట్టణాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం అద్దంకిలోని ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆయన ఫోన్‌కు నవంబరు 25 నుంచి డిసెంబరు చివరి వరకు ముంబయికి చెందిన వ్యక్తి ఫోన్ చేస్తూ ఉన్నాడు. పలు నేరాల్లో పాల్గొన్న నరేష్ గోయల్ అనే వ్యక్తి వద్ద మీ ఆధార్ కార్డు లభించిందని, తక్షణం డబ్బులు చెల్లించాలంటూ ఒత్తిడి చేశాడు. తన వద్ద గల రూ.పది లక్షలతో పాటు బాండ్ల రూపంలో ఉన్న వాటినీ నగదుగా మార్చి డిసెంబరు 3వ తేదీన రూ.53 లక్షలు, 10న రూ.20.74 లక్షలు, 19న రూ.49.94 లక్షలు అపరిచిత వ్యక్తి బ్యాంక్ ఖాతాకు జమ చేశారు. ఇవి చాలదన్నట్లు వెంటనే వీరు నివసించే ఇల్లు అమ్మి ఆ నగదును తమకు జమ చేయాలని కోరారు. 79 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి కావడంతో డిజిటల్ అరెస్టు చేస్తామని, లేనట్లయితే నేరుగా దంపతులిద్దరినీ అరెస్టు చేసి ముంబయి తరలిస్తామంటూ బెదిరించారు. 40 రోజుల పాటు తమ ఆధీనంలో ఉండాల్సి వస్తుందని చెప్పడంతో నాగేశ్వరరావు ఆందోళన చెందారు. ఆ మేరకు కుటుంబ సభ్యుల ద్వారా పోలీసుల్ని ఆశ్రయించగా 1930 నంబరుకు ఫిర్యాదు చేయించారు. దీంతో నగదు లావాదేవీలు జరిగిన 13 బ్యాంక్ ఖాతాలను నిలుపుదల చేశారు.

శిక్షణ కానిస్టేబుళ్లకు స్టైపెండ్ పెంపు

- ఇకపై రూ.12 వేలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికై శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు నూతన సంవత్సరం సందర్భంగా కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వారికి ప్రతి నెలా చెల్లించే స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12 వేలకు పెంచింది. అంటే ఒక్కసారిగా రూ.7,500 పెరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2012లో చివరిసారిగా శిక్షణ కానిస్టేబుళ్లకు స్టైపెండ్ పెంచారు. ఆ తర్వాత గత 13 ఏళ్లుగా మార్పు లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 6,014 కానిస్టేబుల్ పోస్టుల నియామక ప్రక్రియ పూర్తి చేశారు. డిసెంబరు 16న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వారికి నియామక పత్రాలు అందించి శిక్షణకు పంపారు. ఆ సందర్భంగా స్టైపెండ్‌ను రూ.12 వేలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఆ రోజు చెప్పిన మాట నిలబెట్టుకున్నారు.



చక్కటి ఆరోగ్యానికి ముఖ్య సూత్రాలు

✦ పొగ తాగడం, మద్యపానానికి స్వస్తిపలకాలి ✦ వేకువజామునే లేచి కొద్దిసమయం నడవాలి ✦ వారానికి రెండురోజులు బరువులు ఎత్తండి ✦ రోజూ ఏడు గంటలు నిద్రపోవాలి ✦ రాత్రి భోజనాన్ని ఏడు గంటలకు ముగించాలి ✦ వంట నూనె వాడకాన్ని తగ్గించాలి ✦ శీతల పానీయాలు తాగొద్దు ✦ చక్కెర వినియోగాన్ని ఆపేయాలి ✦ కాఫీ, టీలను మితంగా సేవించాలి.

– షాజన్ శామ్యూల్, రన్నర్

పూజారిపై కక్షతోనే శివలింగం ధ్వంసం

- నిందితుడు శివభక్తుడు: ఎస్పీ



పోలీసు అధికారులతో కలిసి మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌మీనా, చిత్రంలో నిందితుడు శ్రీనివాస్

అమలాపురం పట్టణం, ద్రాక్షారామ, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలోని భీమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శివలింగాన్ని ధ్వంసం చేసిన నిందితుణ్ని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం అమలాపురంలో ఎస్పీ రాహుల్ మీనా విలేకర్లకు ఆ వివరాలు వెల్లడించారు. ఈ కేసులో ఎటువంటి రాజకీయ కుట్ర లేదని, ఇంటి పక్కన ఉండే ఆలయ పూజారితో గొడవ కారణంగా నిందితుడు శివలింగాన్ని ధ్వంసం చేశాడన్నారు. 'సీసీ టీవీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా రామచంద్రపురం మండలం తోటపేటకు చెందిన శీలం శ్రీనివాస్ (38)ను నిందితుడిగా గుర్తించారు. శ్రీనివాస్‌కు శివుడిపై విపరీత భక్తి ఉంది. కుడి భుజం మీద శివలింగం, జన్మ నక్షత్రం ప్రకారంగా విష్ణు అనే పేరు తెలుగులో, ఓం వాసుదేవాయ భగవతే అని హిందీలో పచ్చబొట్టు వేయించుకున్నాడు. డిగ్రీ చదివి, ప్రస్తుతం ఇనుప తుక్కు వ్యాపారం చేస్తున్నాడు. గతంలో తన ఇంటి ఆవరణలోని బావిలో డ్రెయిన్ నీరు దిగిపోతోందని కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాడు. పరిష్కారం లభించకపోవడంతో దానిని పూడ్చేశాడు. తర్వాత తన పొలం కేసు విషయమై రామచంద్రపురంలోని ఓ న్యాయవాదికి రూ.3 వేలు ఇచ్చాడు. ఆ కేసు పరిష్కారం కాలేదని కోపం పెంచుకుని న్యాయవాది ఇంటి మెట్లు, గోడను ధ్వంసం చేశాడు. సమస్యల నుంచి బయటపడేలా చేయాలని పక్క ఇంట్లో ఉంటున్న పూజారి కలకొండ సూరిబాబుతో హోమం చేయించాడు. తర్వాత మురుగుకాలువ విషయమై ఆయనతోనే వివాదం ఏర్పడింది. భీమేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని కోనేరు వద్ద శివలింగానికి సూరిబాబు రోజూ పూజలు చేయడం, దానికి భారీగా భక్తులు రావడం శ్రీనివాస్ గమనించాడు. ఆ శివలింగం లేకుండా చేస్తే అతడు పూజలు చేయలేడని భావించి, మంగళవారం అర్ధరాత్రి సుత్తితో దాన్ని ధ్వంసం చేశాడు. పరిసరాల్లోని 50 సీసీ టీవీ కెమెరాలను పరిశీలించి, అతడే దాడికి పాల్పడినట్లు నిర్ధారించి అరెస్టు చేశారు' అని ఎస్పీ వివరించారు.

భద్రత మరింత పెంచుతున్నాం

భీమేశ్వరాలయానికి భద్రతను మరింత పెంచాలని, ఆలయ ప్రాకారాలు నాలుగు వైపులా 360 డిగ్రీలు తిరిగే శక్తిమంతమైన కెమెరాలు ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్(ఎఫ్ఏసీ).. ఆలయ అధికారులను ఆదేశించారు. ధ్వంసమైన శివలింగాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. సంప్రోక్షణ చేయకుండానే లింగాన్ని పునఃప్రతిష్ఠించారనే ఆరోపణలపై స్పందిస్తూ అర్చకులు, వైదిక వర్గాల సలహా మేరకే చేసినట్లు చెప్పారు.

ఆలయాలపై వైకాపాది విషప్రచారం

దేవాదాయ మంత్రి ఆనం



నెల్లూరు(టౌన్), అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి రోజున రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది భక్తులు ఆలయాలను దర్శించుకుని ప్రశాంత వాతావరణంలో ఉంటే.. ఒక రాజకీయ పార్టీ (వైకాపా) ఆలయాలపై విషం చిమ్మడానికి అత్యంత హేయమైన మార్గాన్ని ఎంచుకుందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసాదాలు కలుషితమయ్యాయని మీడియా, సోషల్ మీడియాల్లో విషప్రచారం చేస్తోందని మండిపడ్డారు. బుధవారం నెల్లూరులో, ఏఎస్‌పేటల్లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'ద్రాక్షారామ భీమేశ్వర ఆలయ ఘటనకు ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవే కారణం. సింహాచలం ఘటనలో ఇద్దరు వ్యక్తులు ప్రసాదాలు కొని, తమతో తెచ్చిన నత్తను దానిలో పెట్టి వీడియోలు చిత్రీకరించి ట్రోల్ చేశారు. నిజంగా పులిహోరలోనే ఉంటే.. నత్త నత్తలాగే ఉంటుందా? దీనిపై గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అక్కయ్యపాలెంలో నివసించే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు సూరిశెట్టి సాయికుమార్, శ్యామల వైకాపా సోషల్ మీడియాకు తప్పుడు వీడియోలు అందించినట్లు తేలింది. వైకాపా నేతలు చిన్న శ్రీను, రాజీవ్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని నడిపిస్తున్నట్లు తేలింది' అని తెలిపారు.

'వీబీ-జీ రామ్ జీ'పై రాష్ట్రవ్యాప్త అవగాహన సదస్సులు

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడి

ఈనాడు, అమరావతి: వీబీ-జీ రామ్ జీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'గ్రామీణ భారతాన్ని మార్చే ఓ గొప్ప సంస్కరణను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం తెచ్చింది. గతంలో ఉన్న వంద రోజుల పనిని.. మోదీ ప్రభుత్వం 125 రోజులకు పెంచింది. దీనివల్ల కూలీల వార్షికాదాయం 25% పెరుగుతుంది. గుంతలు తీసే పనులకే పరిమితం కాకుండా చెరువుల పునరుద్ధరణ, రోడ్లు, గిడ్డంగుల నిర్మాణం లాంటి శాశ్వత ఆస్తుల కల్పనతో గ్రామాల అభివృద్ధికి బలమైన పునాది వేస్తారు. సాగు, కోతల సమయంలో కూలీల కొరత రాకుండా ఏటా 60 రోజుల విరామం ఇచ్చే సౌకర్యాన్ని రాష్ట్రాలకు కల్పించారు. ఈ నిర్ణయంతో రైతులకు, కూలీలకు లాభం. ఏఐ, బయోమెట్రిక్ విధానాలతో అవినీతికి తావులేకుండా వేతనాలు నేరుగా కూలీల ఖాతాల్లోకి జమ అవుతాయి' అని మాధవ్ వెల్లడించారు. రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో 2026 సంవత్సరం కొత్త వెలుగులు నింపాలని మాధవ్ ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

'బ్యాడ్ బాయ్ బిలియనీర్' సిరీస్ విడుదలపై ఆంక్షల ఎత్తివేత

ఈనాడు, హైదరాబాద్: సత్యం కుంభకోణం ఆధారంగా 'బ్యాడ్ బాయ్ బిలియనీర్స్: ఇండియా' డాక్యుమెంటరీ సిరీస్ విడుదలపై ఉన్న ఆంక్షలను సిటీ సివిల్ కోర్టు ఎత్తివేసింది. ఐదేళ్ల సుదీర్ఘ విచారణ తర్వాత ఇంజంక్షన్ పిటిషన్‌ను కొట్టివేస్తూ న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది. 2020లోనే డాక్యుమెంటరీ విడుదలకు సిద్ధమవగా..నిలిపివేయాలంటూ బైర్రాజు రామలింగరాజు సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'ఈ డాక్యుమెంటరీలో అర్ధసత్యాలున్నాయి. కింది కోర్టు రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష విధించగా..దీనిపై ఆయన అప్పీలు దాఖలు చేశారు. ఇది పెండింగ్‌లో ఉండగా ఓ ముగింపునకు వచ్చి డాక్యుమెంటరీ తీసి విడుదల చేయడం సరికాదు. అది పిటిషనర్ హక్కులకు భంగం కలిగిస్తుంది' అని విన్నవించారు. వాదనలు విన్న సివిల్ కోర్టు సిరీస్ ప్రదర్శనను నిలిపివేస్తూ 2020 సెప్టెంబరు 1న ఉత్తర్వులు జారీ చేసింది. నెట్‌ఫ్లిక్స్ తరఫు న్యాయవాది బొమ్మినేని వివేకానంద వాదనలు వినిపిస్తూ.. బహిరంగమైన రికార్డులు, లిఖితపూర్వక డాక్యుమెంట్ల ఆధారంగా డాక్యుమెంటరీ రూపొందిందని, పిటిషనర్ వ్యక్తిగత జీవితంపై ఎలాంటి దృష్టి సారించలేదన్నారు. చారిత్రక మోసాన్ని ప్రజలకు తెలపడమే ఉద్దేశమని స్పష్టం చేశారు. సుదీర్ఘ వాదనల అనంతరం న్యాయస్థానం ఇంజంక్షన్ ఆర్డర్‌ను రద్దు చేయడంతో పాటు, విడుదలను నియంత్రించే హక్కు లేదని స్పష్టం చేస్తూ తీర్పు వెలువరించింది. కేసు తీర్పు ప్రతి వెలువడాల్సి ఉంది.

ఈనాడు బిజినెస్

తాజ్ జీవీకే నుంచి టాటా నిష్క్రమణ

రూ.592 కోట్లకు వాటా విక్రయించిన ఐహెచ్‌సీఎల్



ఈనాడు, హైదరాబాద్: ఆతిథ్య రంగంలో దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న ఒక ప్రతిష్ఠాత్మక భాగస్వామ్యానికి తెరపడింది. టాటా గ్రూపునకు చెందిన ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్‌సీఎల్).. తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఉమ్మడి భాగస్వామ్యం నుంచి పూర్తిగా తప్పుకుంది. తాజ్ జీవీకేలో తనకున్న 25.52% వాటాను ప్రమోటర్ గ్రూపునకు చెందిన షాలినీ భూపాల్‌కు విక్రయించినట్లు ఐహెచ్‌సీఎల్ వెల్లడించింది.

లావాదేవీ ఇలా: 1.60 కోట్ల షేర్లను, ఒక్కోటి రూ.370 చొప్పున, మొత్తం రూ.592 కోట్లకు ఐహెచ్‌సీఎల్ విక్రయించింది. ఫలితంగా తాజ్ జీవీకేలో జీవీకే-భూపాల్ కుటుంబం వాటా 49% నుంచి 74.99 శాతానికి పెరిగి, సంస్థపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు లభించాయి. బోర్డులోని ఐహెచ్‌సీఎల్ నామినేటెడ్ డైరెక్టర్లందరూ తమ పదవులకు రాజీనామా చేశారు. 2011 నాటి షేర్‌హోల్డర్స్, 2007నాటి ట్రేడ్‌మార్క్, లైసెన్స్ ఒప్పందాలూ రద్దయ్యాయి.

సంస్థ పేరు నుంచి 'తాజ్'ను తొలగించే అవకాశం: యాజమాన్య మార్పిడి నేపథ్యంలో సంస్థ తన కార్పొరేట్ పేరు నుంచి తాజ్ అనే పదాన్ని తొలగించి, కొత్త పేరు స్వీకరించే ప్రక్రియను ప్రారంభించింది. గతంలో చేసుకున్న హోటల్ నిర్వహణ ఒప్పందాలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయి. అంటే, ప్రస్తుతానికి తాజ్ కృష్ణ, తాజ్ డెక్కన్ వంటి హోటళ్లు పాత బ్రాండ్ పేర్లతోనే కార్యకలాపాలు సాగిస్తాయి. ఐహెచ్‌సీఎల్ ఇకపై కేవలం నిర్వహణ భాగస్వామిగా మాత్రమే సేవలను అందించనుంది. ఇది టాటా గ్రూపు అనుసరిస్తున్న 'క్యాపిటల్ లైట్' (ఆస్తులపై పెట్టుబడి తగ్గించి, సేవలపై దృష్టి పెట్టడం) వ్యూహంలో భాగమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

● రానున్న కాలంలో బెంగళూరులోని యలహంక వద్ద నిర్మిస్తున్న కొత్త హోటల్‌తో కలిపి తన సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాలని జీవీకే గ్రూపు భావిస్తోంది.

వేతనాల్లో ఓపెన్‌ఏఐ రికార్డు

ఒక టెక్ అంకురం పబ్లిక్ ఇష్యూకు వెళ్లక ముందు, తన ఉద్యోగులకు ఇచ్చిన వేతన ప్యాకేజీల పరంగా చూస్తే, గత రికార్డులను అమెరికా కృత్రిమ మేధ (ఏఐ) సంస్థ ఓపెన్‌ఏఐ బద్దలు కొట్టింది. తన 4000 మందికి పైగా ఉద్యోగులకు సగటున 1.5 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.13.5 కోట్ల) స్టాక్ ఆధారిత వేతనాన్ని ఓపెన్ అందిస్తోంది. ఐపీఓకు వెళ్లడానికి ఏడాది ముందు, అంటే 2003లో గూగుల్ చెల్లించిన స్టాక్ ఆధారిత వేతనంతో పోలిస్తే ఈ మొత్తం ఏడు రెట్లు ఎక్కువ. 18 పెద్ద టెక్ కంపెనీలు, పబ్లిక్ ఇష్యూలకు వెళ్లడానికి ముందు చెల్లించిన ప్యాకేజీలతో పోలిస్తే ఇది ఏకంగా 34 రెట్లు ఎక్కువ అని వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది.

57 నగరాల్లో మారథాన్: కిస్నా

ముంబయి: దేశంలోని 57 నగరాల్లో 'రన్ ఫర్ స్వస్థ్ భారత్' మారథాన్ నిర్వహించినట్లు హరికృష్ణ గ్రూప్ సంస్థ కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జువెలరీ తెలిపింది. ఇంతటి భారీస్థాయిలో మారథాన్ నిర్వహించడం ఇది 10వ సారని వివరించింది. 5 కిలోమీటర్ల మారథాన్‌ను అత్యధిక నగరాల్లో ఒకేసారి నిర్వహించడం ద్వారా, గిన్నీస్ వరల్డ్ రికార్డు కోసం ప్రయత్నించినట్లుగా అధీకృతంగా నమోదైందని కిస్నా వెల్లడించింది. మొత్తం 20,000 మంది ఇందులో పాల్గొన్నారని హరికృష్ణా గ్రూప్ ఎండీ ఘనశ్యామ్ ఢోలాకియా తెలిపారు.

కోడి గుడ్లు

1న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	630
వరంగల్	632
విజయవాడ	660
తూ/ప గోదావరి	620
విశాఖపట్నం	660
చిత్తూరు	703

ద్రవ్యలోటు రూ.9.76 లక్షల కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు రూ.15.69 లక్షల కోట్లు (జీడీపీలో 4.4%)గా ఉంటుందని బడ్జెట్‌లో అంచనా వేయగా, నవంబరు చివరకే అందులో 62.3% విలువకు సమానమైన రూ.9.76 లక్షల కోట్లకు చేరిందని ప్రభుత్వం తెలిపింది. గత సంవత్సరం ఇదే సమయానికి లోటు 52.5 శాతంగా నమోదైంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక ప్రకారం.. నవంబరు వరకు కేంద్ర ప్రభుత్వ ఆదాయం రూ.19.49 లక్షల కోట్లుగా ఉంది.

ప్రీమియర్ ఎనర్జీస్‌కు రూ.2,307 కోట్ల ఆర్డర్లు


ఈనాడు, హైదరాబాద్: పునరుత్పాదక ఇంధన పరికరాలను తయారు చేసే హైదరాబాద్ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్‌కు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో మొత్తం రూ.2,307.30 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయి. సోలార్ సెల్స్, మాడ్యూల్స్ సరఫరాకు సంబంధించి ఈ కొత్త ఆర్డర్లు లభించినట్లు సంస్థ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. ఈ ఆర్డర్లను 2026-27, 2027-28 ఆర్థిక సంవత్సరాల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. 2026 సెప్టెంబరు నాటికి తన సోలార్ సెల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 10.6 గిగావాట్లకు, సోలార్ మాడ్యూల్ సామర్థ్యాన్ని 11.1 గిగావాట్లకు పెంచుకోవాలనేది లక్ష్యమని ప్రీమియర్ ఎనర్జీస్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ చిరంజీవ్ సలూజా తెలిపారు. వేఫర్స్, బ్యాటరీ స్టోరేజ్, సోలార్ ఇన్వర్టర్ల వంటి అనుబంధ విభాగాల్లోకీ కంపెనీ అడుగుపెట్టనున్నట్లు వెల్లడించారు.

పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు మారలేదు

దిల్లీ: చిన్న మొత్తాల పొదుపు పథకాలపై ఇచ్చే వడ్డీ రేట్లను వరుసగా ఏడో త్రైమాసికంలోనూ కేంద్రం మార్చలేదు. గత త్రైమాసికానికి నోటిఫై చేసిన వడ్డీ రేట్లనే 2026 జనవరి 1 - మార్చి 31 వరకు అమలు చేయనున్నారు.

పథకం	వడ్డీ రేటు(%)
సుకన్య సమృద్ధి యోజన	8.2
మూడేళ్ల టర్మ్ డిపాజిట్	7.1
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పీపీఎఫ్)	7.1
కిసాన్ వికాస్ పత్ర	7.5
ఎన్ఎస్‌సీ(నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్)	7.7
నెలవారీ ఆదాయ పథకం	7.4
పోస్టాఫీసు పొదుపు డిపాజిట్ పథకాలు	4

అటెన్షన్ ప్లీజ్..
నేటి నుంచే ఈ మార్పులు



కొత్త ఏడాది ప్రారంభం నుంచే మనల్ని ప్రభావితం చేసే కొన్ని కీలక ఆర్థిక, విధాన పరమైన మార్పులు అమల్లోకి వస్తున్నాయి. బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ లావాదేవీలు, పన్ను చెల్లింపులతో పాటు ఇలా పలు విభాగాల్లో కొత్త నిబంధనలు గురువారమే అమల్లోకి వస్తున్నాయి.

డిజిటల్ లావాదేవీలపై

ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం యూపీఐ లావాదేవీలపై పర్యవేక్షణ పెంచనుంది. దీంతోపాటు వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్ వంటి మెసేజింగ్ యాప్‌ల కోసం సిమ్ వెరిఫికేషన్ నిబంధనలను కఠినతరం చేసింది. మోసపూరిత కార్యకలాపాలకు చెక్ పెట్టడమే దీని లక్ష్యం.

కార్ల ధరలు పెరుగుతున్నాయ్

తయారీ ఖర్చులు పెరగడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణించిన నేపథ్యంలో, కార్ల ధరలను జనవరి 1 నుంచి పెంచుతున్నట్లు పలు కంపెనీలు ప్రకటించాయి. అన్ని మోడళ్ల ధరలను 0.6% వరకు పెంచుతున్నట్లు హ్యుందాయ్ మోటార్ ఇండియా తెలిపింది. రెనో ఇండియా 2%, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ 2%, మెర్సిడెస్ బెంజ్ 2%, నిస్సాన్ 3%, బీఎండబ్ల్యూ 3% వరకు ధరలు పెంచుతున్నట్లు తెలిపాయి. ధరలు పెంచుతామని టాటా మోటార్స్, హోండా, బీవైడీ కూడా ప్రకటించాయి.

ఆదాయపు పన్ను రిటర్నులు..

పన్ను చెల్లింపుదారులకు కొత్త ఐటీఆర్ ఫారాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ ఫారాల్లో బ్యాంకింగ్ లావాదేవీలు, ఖర్చుల వివరాలు ముందుగానే భర్తీ చేసి ఉంటాయి. దీనివల్ల రిటర్నుల దాఖలు మరింత సులభం కానుంది. అయితే సునిశిత పరిశీలనకు దారి తీస్తుంది. కాబట్టి, రిటర్నుల సమర్పణలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలి.


క్రెడిట్ కార్డులు..



ప్రముఖ బ్యాంకులు తమ క్రెడిట్, డెబిట్ కార్డు నిబంధనలను సవరించనున్నాయి. ఎస్‌బీఐ కార్డు జనవరి 10 నుంచి కొత్త డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్‌ను ప్రారంభిస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డెబిట్ కార్డు వినియోగదారుల కోసం ఖర్చుల పరిమితి ఆధారంగా వోచర్ పద్ధతిని ప్రవేశపెడుతోంది. ఐసీఐసీఐ బ్యాంక్ ఆన్‌లైన్ గేమింగ్ లావాదేవీలు, బుక్‌మైషో ద్వారా లభించే రివార్డు పాయింట్ల నిబంధనలను మార్చుతోంది. రవాణా సంబంధిత లావాదేవీలు ఒక పరిమితి దాటితే 1% అదనపు రుసుము వసూలు చేయనుంది.


● 2026లో రానున్న కీలకమైన మార్పు.. దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం 1961 స్థానంలో 'కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025' వచ్చే ఆర్థిక సంవత్సరం అంటే 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. పన్ను చట్టాన్ని మరింత సులభతరం చేయడమే దీని లక్ష్యం.

వీటికీ స్టార్లు ఉండాల్సిందే



జనవరి 1 నుంచి రిఫ్రిజిరేటర్లు, టెలివిజన్లు, ఎల్‌పీజీ గ్యాస్ స్టవ్‌లు, కూలింగ్ టవర్లు, చిల్లర్లకు ఇంధన వినియోగ సామర్థ్యం (ఎనర్జీ ఎఫిషియెన్సీ) స్టార్ లేబుళ్లను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఈ కొత్త నిబంధనలు డీప్ ఫ్రీజర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, గ్రిడ్ కనెక్టెడ్ సోలార్ ఇన్వర్టర్లకూ వర్తిస్తాయి. గతంలో ఈ స్టార్ లేబుల్ ఫ్రాస్ట్-ఫ్రీ రెఫ్రిజిరేటర్లు, డీప్ ఫ్రీజర్లు, కార్నర్ ఏసీ తదితరాలకు ఐచ్ఛికంగా ఉండేది. ఇప్పటికే రూమ్ ఏసీలు, సీలింగ్ ఫ్యాన్లు, ఎలక్ట్రిక్ వాటర్ హీటర్లు, వాషింగ్ మెషీన్ తదితరాలకు స్టార్ లేబుల్ తప్పనిసరి. వీటికి ఇకపైనా ఇది కొనసాగుతుంది. వీటిని మరింత శక్తిమంతంగా మార్చేందుకు ప్రస్తుత నిబంధనలను కొన్నింటిని ప్రభుత్వం మార్చింది.

క్రెడిట్ స్కోరు అప్‌డేట్‌కు ప్రతివారం వివరాలు



సాధారణంగా క్రెడిట్ బ్యూరోలు ప్రతి 15 రోజులకు ఒకసారి రుణగ్రహీతలు, క్రెడిట్‌కార్డుదారుల వివరాలను అప్‌డేట్ చేసేవి. ఇప్పుడు ఈ గడువు వారానికి మారింది. దీనివల్ల రుణ వాయిదా చెల్లించలేకపోతే, మీ క్రెడిట్ స్కోరుపై వెంటనే ప్రభావం పడుతుంది. ఇదే సమయంలో క్రమం తప్పకుండా చెల్లిస్తున్న వారికి, మంచి క్రెడిట్‌స్కోరుతో పాటు తక్కువ వడ్డీకే రుణాలు లభించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు క్రెడిట్‌స్కోర్ ఆధారంగా వడ్డీ రేట్లను సవరించే దిశగా చర్యలు చేపట్టాయి.

ఆధార్ అనుసంధానించని పాన్ చెల్లదు



శాశ్వత ఖాతా సంఖ్య (పాన్), ఆధార్ కార్డును అనుసంధానించడం ఇప్పటికే పూర్తవ్వాల్సి ఉంది. బ్యాంకింగ్, ప్రభుత్వ సేవలను పొందేందుకు ఈ రెండూ అనుసంధానం కావాల్సిందే. ఈ ప్రక్రియ పూర్తి కాకపోతే.. మీ ఆర్థిక ఖాతాలు నిలిపివేయడమే కాకుండా, ప్రభుత్వ పథకాల ప్రయోజనం పొందేందుకూ అవకాశం ఉండదు. ఈ రెండూ అనుసంధానం కాని, పాన్ కార్డులు ఇక నుంచీ చెల్లవు.

ఏసీల ధరలు 10%.. ఫ్రిజ్‌ల ధరలు 5% పెరుగుతాయ్

బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) నూతన ప్రమాణాల ప్రకారం తయారయ్యే ఏసీల ధరలు 10% వరకు, రిఫ్రిజిరేటర్ల ధరలు 5% వరకు జనవరి 1 నుంచి పెరగనున్నాయి. ప్రస్తుతం 5 స్టార్ రేటింగ్ పొందినవి, నూతన ప్రమాణాల ప్రకారం 4 స్టార్‌కు, ఇప్పటివరకు 4 స్టార్‌గా ఉన్నవి 3 స్టార్‌కు, ప్రస్తుతం 3 స్టార్‌గా ఉన్నవి 2స్టార్‌కు పరిమితమవుతాయి.

- ఈనాడు, హైదరాబాద్

వొడాఫోన్ ఐడియాకు భారీ ఊరట

● రూ.87,695 కోట్ల బకాయిలను ఫ్రీజ్ చేసిన కేంద్రం

● చెల్లింపులకు 5 ఏళ్ల మారటోరియం



దిల్లీ: అప్పుల్లో కూరుకుపోయిన టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా (వీఐఎల్)కు కేంద్రప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయ (ఏజీఆర్) బకాయిలను ఫ్రీజ్ చేయడంతో పాటు, చెల్లింపులపై అయిదేళ్ల మారటోరియంకు ఆమోదం తెలిపింది. దీంతో వొడాఫోన్‌ఐడియాకు ఉపశమనం లభించింది. వీఐఎల్ చెల్లించాల్సిన రూ.87,695 కోట్ల బకాయిలను ఫ్రీజ్ చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రిమండలి అనుమతినిచ్చింది. అయిదేళ్ల మారటోరియం కారణంగా 2031-32 నుంచి చెల్లింపులను మొదలుపెట్టి 2040-41కల్లా పూర్తిచేయడానికి ఆ కంపెనీకి వెసులుబాటు కలిగిందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఏజీఆర్ ఆధారంగానే లైసెన్సు ఫీజు, స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీలను టెలికాం కంపెనీలు చెల్లించాల్సి ఉంటుంది.

● పై చెల్లింపులే కాకుండా, 2017-18, 2018-19 సంవత్సరాలకు సంబంధించిన ఏజీఆర్ బకాయిలను సైతం 2025-26 నుంచి 2030-31 వరకు చెల్లించేందుకూ అనుమతి వచ్చినట్లు సమాచారం. ఏటా రూ.120 కోట్లు చొప్పున ఆరేళ్లలో రూ.700-800 కోట్ల వరకు ఈ మొత్తం ఉండొచ్చని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నారు. ఫ్రీజ్ చేసిన మొత్తం విషయంలో టెలికాం విభాగం తిరిగి మదింపు చేపడుతుంది. ఇందుకు డిడక్షన్ వెరిఫికేషన్ గైడ్‌లైన్స్, ఆడిట్ నివేదికలను ఆధారంగా చేసుకుంటుంది.

ఇంకో శుభవార్త: వొడాఫోన్ గ్రూప్ నుంచి వొడాఫోన్ ఐడియాకు రూ.5,836 కోట్లు అందనున్నాయి. ఇరు కంపెనీల మధ్య కుదిరిన లయబులిటీ క్లెయిమ్ ఒప్పందం రీ-సెటిల్‌మెంట్‌లో భాగంగా వచ్చే 12 నెలల్లో రూ.2,307 కోట్లను గ్రూప్ ప్రమోటర్లు విడుదల చేస్తారు. వొడాఫోన్ ఐడియా ప్రయోజనం కోసం తనకున్న 328 కోట్ల షేర్లను గ్రూప్ పక్కనపెట్టనుంది. వీటి విలువ రూ.3,529 కోట్లుగా ఉంది.

60 ఏళ్లలో 40,00,000% పైగా లాభం

● బెర్క్‌షైర్ హాత్‌వే షేర్ల ప్రభంజనం

● 95 ఏళ్ల వయసులో సీఈఓ బాధ్యతలకు వారెన్ బఫెట్ బైబై



వారెన్ బఫెట్.. స్టాక్‌మార్కెట్ ప్రపంచంలో పరిచయం అక్కర్లేని పేరు ఇది. తన కంపెనీ బెర్క్‌షైర్ హాత్‌వే సీఈఓ బాధ్యతల నుంచి ఆయన డిసెంబరు 31న తప్పుకుంటున్నట్లు తెలిపారు. 60 ఏళ్ల అసాధారణ నాయకత్వానికి తెరపడనుంది.

వాటా విలువ ఎంతో తెలుసా?: 95 ఏళ్ల బఫెట్‌కు బెర్క్‌షైర్‌లో ఉన్న వాటా విలువే సుమారు 150 బి. డాలర్లు (రూ.13.5 లక్షల కోట్లు). గత 20 ఏళ్లలో 60 బి. డాలర్ల (సుమారు రూ.5.40 లక్షల కోట్ల)కు పైగా దాతృత్వ కార్యకలాపాలు ఇచ్చినా.. ఈ స్థాయిలో బఫెట్ వాటా విలువ ఉండడం విశేషం.

1962లో తొలి కొనుగోలు..: ఇబ్బందుల్లో ఉన్న టెక్స్‌టైల్ కంపెనీ న్యూ ఇంగ్లండ్‌ను 1962లో కొనుగోలు చేయడం ద్వారా బఫెట్ ప్రస్థానం మొదలైంది. 1965లో పూర్తిగా కంపెనీని తన నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ఆ సమయంలో బఫెట్ ఒక్కో షేరుకు 15-18 డాలర్ల మేర ఖర్చు పెట్టినట్లు వార్షిక నివేదికల ఆధారంగా తెలుస్తోంది. ప్రస్తుతం బెర్క్‌షైర్ క్లాస్ ఏ షేరు విలువ 7,55,400 డాలర్లుగా ఉంది. అంటే 60 ఏళ్లలో ఏకంగా 47,21,150 % ప్రతిఫలం లభించిందన్నమాట.

● అమెరికా ప్రామాణిక సూచీ ఎస్ అండ్ పీ 500 కంటే, బెర్క్‌షైర్ హాత్‌వే షేరు ఎక్కువ లాభాలనే పొందుతూ వచ్చింది. ఆయన పెట్టుబడులు పెట్టిన కంపెనీలు అలాంటివి మరి. తాజా వార్షిక నివేదిక ప్రకారం 1965 నుంచి 2024 మధ్య బెర్క్‌షైర్ షేరు సమ్మిళిత వార్షిక వృద్ధి 19.9 శాతంగా ఉంది. ఎస్ అండ్ పీ 500 ఇదే కాల వృద్ధి 10.4 శాతంతో పోలిస్తే, ఇది దాదాపు రెట్టింపు కావడం గమనార్హం.

● బఫెట్ స్థానంలో కంపెనీ పగ్గాలు చేపట్టనున్న గ్రెగ్ అబెల్‌పైనే అందరి దృష్టి ఉండనుంది.

రూ.14 లక్షల కోట్లు పెరిగిన ఫండ్ పెట్టుబడులు



భారతీయ మ్యూచువల్ ఫండ్ల పరిశ్రమకు 2025 కలిసొచ్చిన ఏడాదిగా మిగిలింది. రిటెయిల్ మదుపరుల భాగస్వామ్యం భారీగా పెరగడం, క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా నిధుల వెల్లువ కొనసాగడంతో, ఈ రంగం సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ఈ ఏడాది నవంబరుకు మ్యూచువల్ ఫండ్ల మొత్తం నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.81 లక్షల కోట్లను తాకింది. 2024 చివరలో రూ.67 లక్షల కోట్లుగా ఉన్న ఏయూఎం ఈ ఏడాదిలో ఏకంగా రూ.14లక్షల కోట్ల (21%) మేర వృద్ధి చెందడం విశేషం. ● భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) గణాంకాల ప్రకారం 2025లో ఫండ్లలోకి రూ.7 లక్షల కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. ఇదే సమయంలో మదుపరుల సంఖ్య 3.36 కోట్లు పెరిగింది. ● సిప్ పెట్టుబడులు మార్కెట్‌కు వెన్నెముకలా నిలుస్తున్నాయి. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో నెలవారీ సిప్ పెట్టుబడులు నిలకడగా రూ.29,000 కోట్లను అధిగమించాయి. ముఖ్యంగా అక్టోబరులో రూ.29,529 కోట్లతో జీవనకాల గరిష్ఠం నమోదయ్యింది.

నిరర్థక ఆస్తులు మరింతగా తగ్గుతాయ్: ఆర్‌బీఐ



ముంబయి: దేశ ఆర్థిక వ్యవస్థ వేగవంత వృద్ధిని నమోదు చేస్తోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. దేశీయంగా బలమైన గిరాకీ పరిస్థితులు, తక్కువ స్థాయిలో ద్రవ్యోల్బణం, బ్యాంకుల బ్యాలెన్స్‌షీట్లు పటిష్ఠంగా ఉండటం ఇందుకు తోడ్పడుతున్నాయని, 'ఆర్థిక స్థిరత్వం'పై విడుదల చేసిన అర్థ సంవత్సర నివేదికలో ఆర్‌బీఐ పేర్కొంది. బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి మున్ముందు మరింత మెరుగవుతుందని వెల్లడించింది. 2025 సెప్టెంబరు చివరికి 46 బ్యాంకుల జీఎన్‌పీఏ నిష్పత్తి దశాబ్దాల కనిష్ఠమైన 2.1 శాతంగా ఉందని, 2027 మార్చికి ఇది 1.9 శాతానికి తగ్గుతుందని పేర్కొంది. సాధారణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఈ అంచనా వేసినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఒకవేళ ఏదేని ప్రతికూల పరిణామాలు చోటుచేసుకుంటే జీఎన్‌పీఏ నిష్పత్తి 3.2-4.2 శాతానికి పెరిగే అవకాశమూ ఉందని తెలిపింది.

మూలధన నిష్పత్తిలోనూ పటిష్ఠంగా..: మూలధన నిల్వల విషయంలో బ్యాంకులు పటిష్ఠంగా ఉన్నాయని ఆర్‌బీఐ తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల కనీస మూలధన నిష్పత్తి 16 శాతంగా, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో 18.1 శాతంగా ఉందని వెల్లడించింది. ఆర్థికవ్యవస్థ పరంగా ఏవైనా ప్రతికూలతలు చోటుచేసుకున్నా, తట్టుకునే స్థాయిలో బ్యాంకులు ఉన్నాయనే విషయాన్ని ఇది తెలియజేస్తోంది. 46 బ్యాంకుల కనీస మూలధన నిష్పత్తి 2025 సెప్టెంబరులో 17.1% కాగా.. 2027 మార్చికి 16.8 శాతానికి తగ్గే అవకాశం ఉందని వివరించింది.

●బ్యాంకుల మొత్తం రుణాల్లో, పెద్ద రుణ గ్రహీతల వాటా 44% వద్ద స్థిరంగా ఉన్నప్పటికీ.. స్థూల నిరర్థక ఆస్తుల్లో వీరి వాటా గత కొన్నేళ్లుగా గణనీయంగా తగ్గి 2025 సెప్టెంబరు నాటికి 33.8 శాతానికి తగ్గినట్లు నివేదిక తెలిపింది. బ్యాంకులకు కీలకమైన నికర వడ్డీ ఆదాయంలో వృద్ధి గణనీయంగా తగ్గి 2025 సెప్టెంబరులో 2.3 శాతంగా నమోదైనట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

దివాలా పరిష్కార ప్రక్రియలో రూ.4 లక్షల కోట్ల వసూలు..

2025 సెప్టెంబరు వరకు దివాలా పరిష్కార ప్రక్రియ కింద, రుణ సంస్థలకు రూ.4 లక్షల కోట్ల బకాయిలు వసూలైనట్లు ఆర్‌బీఐ తెలిపింది. లిక్విడేషన్ విలువలో ఇది సుమారు 170.1% కాగా.. సహేతుక విలువ (ఫెయిర్ వ్యాల్యూ)లో 93.9 శాతమని వెల్లడించింది. కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియకు సంబంధించిన నిబంధనలు 2016 డిసెంబరులో అమల్లోకి వచ్చాయి. అప్పటినుంచి 2025 సెప్టెంబరు 30 వరకు దివాలా పరిష్కార ప్రక్రియ కోసం మొత్తంగా 8,659 దరఖాస్తులకు అనుమతినివ్వగా.. ఇందులో 6,761 కేసులు (78.1%) పూర్తయ్యాయి. ● దివాలా స్మృతి అమల్లోకి వచ్చినప్పటి నుంచి మొత్తంగా 3,865 కార్పొరేట్ రుణ గ్రహీతలు, దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా ఒత్తిడి రుణాల సమస్య నుంచి బయటపడ్డారు. 2025 ఏప్రిల్-సెప్టెంబరులో ఈ సంఖ్య 187గా ఉంది.

ఉక్కు దిగుమతులపై సేఫ్‌గార్డ్ సుంకాల పొడిగింపు



దిల్లీ: కొన్ని ఉక్కు ఉత్పత్తుల దిగుమతులపై సేఫ్‌గార్డ్ సుంకాలను మూడేళ్ల పాటు కొనసాగిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. చైనా వంటి దేశాల నుంచి వచ్చే చౌక దిగుమతుల నుంచి దేశీయ తయారీదార్లను రక్షించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 2025 ఏప్రిల్ 21న మొదటిసారిగా ఉక్కు ఉత్పత్తులపై 200 రోజుల పాటు తాత్కాలికంగా 12% సుంకాన్ని కేంద్రప్రభుత్వం విధించింది. తాజా ఆదేశాలతో ఈ సుంకాలు 2028 ఏప్రిల్ వరకు కొనసాగనున్నాయి. మొదటి ఏడాది (2025 ఏప్రిల్ 21 నుంచి 2026 ఏప్రిల్ 20)లో 12% సేఫ్‌గార్డ్ సుంకాన్ని విధిస్తారు. రెండో ఏడాది (2026 ఏప్రిల్ 21 నుంచి 2027 ఏప్రిల్ 20)లో దాన్ని 11.5 శాతానికి, మూడో ఏడాది (2027 ఏప్రిల్ 21 నుంచి 2028 ఏప్రిల్ 20)లో 11 శాతానికి తగ్గించనున్నారు. ఈ నేపథ్యంలో బీఎస్ఈలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు 4.89%, సెయిల్ 4.18%, జిందాల్ స్టీల్ 2.75%, టాటా స్టీల్ 2.45% లాభపడ్డాయి.

భారీ లాభాలతో వీడ్కోలు

2025లో 10.50% పెరిగిన నిఫ్టీ

సెన్సెక్స్ ▲ 546	నిఫ్టీ ▲ 191
85221	26130

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3598 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.6760 కోట్లు

2025 చివరి ట్రేడింగ్ సెషన్‌ను దేశీయ సూచీలు దాదాపు 1% లాభంతో ముగించాయి. దేశీయ సంస్థాగత మదుపర్ల కొనుగోళ్లు, రిలయన్స్, టాటా స్టీల్, కోటక్ బ్యాంక్ వంటి షేర్లు రాణించడం ఇందుకు కలిసొచ్చింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 13 పైసలు తగ్గి 89.88 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.31% లాభంతో 61.53 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా సూచీలు స్వల్ప నష్టాల్లో ట్రేడయ్యాయి. బీఎస్ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ బుధవారం రూ.3,63,755 మేర పెరిగింది.

ఏడాది మొత్తంమీద

రూ.33.84 లక్షల కోట్ల లాభం

● 2025లో సెన్సెక్స్ 7,081.59 పాయింట్లు (9%), నిఫ్టీ 2,484.8 పాయింట్లు (10.50%) చొప్పున పరుగులు తీశాయి. బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ గత ఏడాది కాలంలో రూ.33.84 లక్షల కోట్లు పెరిగి రూ.475 లక్షల కోట్లు (5.29 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 85.64 నుంచి 4.95% క్షీణించి 89.88కు పడింది.

● సెన్సెక్స్ ఉదయం 118 పాయింట్ల (క్రితం ముగింపు 84,675.08) లాభంతో 84,793.58 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీ, ఇంట్రాడేలో 762.09 పాయింట్లు పెరిగి 85,437.17 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 545.52 పాయింట్ల లాభంతో 85,220.60 వద్ద ముగిసింది. నిఫ్టీ 191 పాయింట్లు రాణించి 26,129.60 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,969- 26,187.95 పాయింట్ల మధ్య కదలాడింది.

● మెరుగైన వేతనాలను కోరుతూ గిగ్ కార్మికులు ఆందోళనలు ప్రారంభించిన నేపథ్యంలో స్విగ్గీ షేరు 2.10% నష్టపోగా, ఎటర్నల్ షేరు 0.34% లాభపడింది.

● సెన్సెక్స్ 30 షేర్లలో 26 మెరిశాయి. టాటా స్టీల్ 2.45%, కోటక్ బ్యాంక్ 2.14%, టైటన్ 1.93%, రిలయన్స్ 1.86%, యాక్సిస్ బ్యాంక్ 1.82%, టీఎంపీవీ 1.66%, ట్రెంట్ 1.63%, పవర్‌గ్రిడ్ 1.63%, బీఈఎల్ 1.56%, ఎన్‌టీపీసీ 1.42%, ఎం అండ్ ఎం 1.26%, హెచ్‌యూఎల్ 1.10% లాభపడ్డాయి. టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ 1.29% వరకు నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. చమురు-గ్యాస్ 2.73%, ఇంధన 2.28%, లోహ 1.51%, మన్నికైన వినిమయ వస్తువులు 1.39%, యుటిలిటీస్ 1.25%, పీఎస్‌యూ బ్యాంక్ 1.22%, యంత్ర పరికరాలు 1.12%, విద్యుత్ 1.12% పెరిగాయి. టెలికాం, ఐటీ, ఫోకస్డ్ ఐటీ తగ్గాయి. బీఎస్ఈలో 2753 షేర్లు లాభపడగా, 1467 స్క్రిప్‌లు నష్టపోయాయి. 161 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

ఐపీఓకు ఓయో మాతృసంస్థ ప్రిజం



ఐపీఓ ద్వారా రూ.6,650 కోట్లు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి, ఆతిథ్య సేవలు అందించే ఓయో మాతృసంస్థ ప్రిజం ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. కాన్ఫిడెన్షియల్ మార్గంలో ఐపీఓకు దరఖాస్తు చేసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రతిపాదిత ఐపీఓ కోసం కంపెనీ విలువను 7-8 బిలియన్ డాలర్లు (రూ.49,000-56,000 కోట్లు)గా లెక్కకట్టే అవకాశం ఉంది.

● ఐపీఓ ద్వారా రూ.4000 కోట్లు సమీకరించేందుకు సెబీ వద్ద బాగ్‌మనే ప్రైమ్ ఆఫీస్ రీట్ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. తాజా ఇష్యూలో భాగంగా రూ.3000 కోట్ల వరకు యూనిట్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో రూ.1000 కోట్ల యూనిట్లను విక్రయించనుంది.

● మ్యూచువల్ ఫండ్స్‌ను ప్రారంభించేందుకు సెబీ నుంచి సూత్రప్రాయ అనుమతి లభించినట్లు అషికా గ్రూప్ ప్రకటించింది.

● ఐపీఓ ద్వారా రూ.250 కోట్లు సమీకరించేందుకు సెబీ వద్ద వి-గార్డ్ గ్రూప్‌నకు చెందిన స్థిరాస్తి సంస్థ వీగాల్యాండ్ డెవలపర్స్ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది.

విద్యుత్ వినియోగదారులకు శుభవార్త

- ప్రజలపై తప్పిన రూ.4,498 కోట్ల ట్రూఅప్ భారం
- ఆ మొత్తాన్ని భరించనున్న ప్రభుత్వం
- ట్రూఅప్ కింద రూ.14,207 కోట్లు వసూలు చేస్తామన్న డిస్కంలు
- రూ.8,274 కోట్ల ప్రతిపాదనలు తిరస్కరించిన ఏపీఈఆర్సీ

ఈనాడు, అమరావతి: నూతన సంవత్సరంలో విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నాలుగో నియంత్రిత వ్యవధి (2019-20 నుంచి 2023-24 మధ్య)లో డిస్కంలకు చెల్లించాల్సిన ట్రూఅప్ ఛార్జీల్ని ప్రజలపై పైసా భారం పడకుండా తానే భరించేందుకు అంగీకరించింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)కి లేఖ రాసింది. దీంతో ప్రజలకు రూ.4,497.89 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారం తప్పింది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో వివిధ పేర్లతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలు వేసింది. ఇప్పటికీ ప్రతి నెలా బిల్లుల్లో కలిపి వినియోగదారులు వాటిని చెల్లించాల్సి వస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలు పెంచబోమని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్లు గగానే రూ.వేల కోట్ల ట్రూఅప్ భారాన్ని ప్రభుత్వం పూర్తిగా భరించింది.

ట్రూఅప్ ప్రతిపాదనలు

- నాలుగో నియంత్రిత వ్యవధిలో ట్రూఅప్ కింద రూ.10,057.82 కోట్లు, క్యారీయింగ్ కాస్ట్ కింద రూ.4,149.70 కోట్లు కలిపి మొత్తం రూ.14,207.52 కోట్ల వసూలుకు అనుమతించాలని డిస్కంలు ఏపీఈఆర్సీకి ప్రతిపాదించాయి.
- గతంలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం సర్దుబాటు చేసిన రూ.1,435.55 కోట్లు పోను ప్రజల నుంచి రూ.12,771.96 కోట్లు వసూలు చేసుకునేందుకు అనుమతించాలని కోరాయి.
- ఈ ప్రతిపాదనలను పరిశీలించిన తర్వాత రూ.3,906.48 కోట్ల మొత్తాన్ని కమిషన్ తిరస్కరించింది. క్యారీయింగ్ కాస్ట్ కింద (వినియోగదారులు బిల్లులు చెల్లించడానికి ఉన్న వ్యవధికి విద్యుత్ కొనుగోలుకు చేసిన ఖర్చుపై వడ్డీ, ఇతర సర్దుబాట్లు) వసూలుకు ప్రతిపాదించిన రూ.4,149.70 కోట్లు, ట్రాన్స్‌మిషన్ ఖర్చు, ఇతర సర్దుబాట్లు రూ.217.89 కోట్లు కలిపి.. మొత్తంగా రూ.8,274.07 కోట్ల వసూలుకు కమిషన్ తిరస్కరించింది.
- డిస్కంలు చేసిన ప్రతిపాదనల్లో.. అనుమతించిన ఖర్చులు పోను రూ.5,933.44 కోట్లు ట్రూఅప్ కింద వసూలు చేసుకునేందుకు కమిషన్ అనుమతించింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం సర్దుబాటు చేసిన రూ.1,435.55 కోట్లు పోను ట్రూఅప్ కింద రూ.4,497.89 కోట్ల వసూలు చేసుకునేందుకు డిస్కంలకు అనుమతిస్తూ కమిషన్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

తెలుగు.. తిరుగులేని భాషగా వెలగాలి

- 3, 4, 5 తేదీల్లో మూడో ప్రపంచ తెలుగు మహాసభలు
- 5న హాజరవుతున్న సీఎం చంద్రబాబు



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న గజల్ శ్రీనివాస్, పీఆర్ రాజు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగునాట.. తిరుగులేని భాషగా తెలుగు వెలగాలని, తెలుగు కవిత్వం, సంస్కృతి, సంప్రదాయాలు దశదిశలా వ్యాపించాలన్న లక్ష్యంతో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో మూడో ప్రపంచ తెలుగు మహాసభలను గుంటూరులో జనవరి 3, 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. గుంటూరు భారతీయ విద్యాభవన్‌లో బుధవారం కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మహాసభల వివరాలు వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలల నుంచి 25 వేల మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. నృత్యరూపకాలు, నాటికల ప్రదర్శనలు కూడా ఉన్నాయన్నారు. తెలుగువారి కీర్తి పెంచిన మహనీయుల పేర్లతో ద్వారాలు, తెలుగు జాతి సాహిత్య, సంస్కృతుల వికాసానికి కృషిచేసిన వారి పేరున పూర్ణకుంభ పురస్కారాలు ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా వందమంది గాయకులతో అన్నమయ్య సహస్ర గళార్చన ఏర్పాటుచేసినట్లు చెప్పారు. పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు పూర్వ సీజేఐ జస్టిస్ ఎన్.వి.రమణ, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, పలు రాష్ట్రాల గవర్నర్లు, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొంటున్నట్లు చెప్పారు. వీరిలో చంద్రబాబు చివరిరోజైన 5న హాజరవుతారు. మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ ప్రత్యేకంగా ప్రసంగ సందేశం ఇవ్వనున్నారని చెప్పారు. ప్రధానవేదికతో పాటు మరో నాలుగు వేదికలపై మూడో ప్రపంచ తెలుగు మహాసభల కళావిందు అందించనున్నట్లు చెప్పారు. భోజన ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో మహాసభల ముఖ్య సమన్వయకర్త పీఆర్ రాజు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

గుంటూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో చివరిరోజైన 5వ తేదీన సీఎం చంద్రబాబు పాల్గొంటున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా బుధవారం పరిశీలించారు. వేదికకు సమీపంలోనే జాతీయ రహదారికి అవతలివైపు హెలిప్యాడ్ ప్రదేశాన్ని తనిఖీచేశారు.

నిషేధితం నుంచి విముక్తి

- అర్హత ఉంటే రకరకాల పత్రాల కోసం వేధించవద్దు
- ఆధారాలు చూసి అధికారులే సుమోటోగా చేయాలి
- 22ఎ జాబితాలోని భూసమస్యలపై రెవెన్యూ కసరత్తు
- సంస్కరణ దిశగా అడుగులు.. త్వరలో మార్గదర్శకాలు

ఈనాడు, అమరావతి: నిషేధిత జాబితాలో చిక్కుకున్న ప్రైవేటు పట్టా భూములకు విముక్తి కలగనుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రైవేటు పట్టా భూములనూ నిషేధిత జాబితాలో చేర్చారు. అందులోంచి తొలగించాలంటే రకరకాల పత్రాలు కావాలంటూ అధికారులు సతాయిస్తున్నారు. ఇకపై ఇలా పదిసార్లు తిప్పడానికి, అర్జీలు తిరస్కరించడానికి వీలుండదు. వైకాపా ప్రభుత్వ హయాంలో రీసర్వే సమయంలో సర్వీసు ఈనాం/ఈనాం భూముల్ని 22ఎ జాబితాలో చేర్చి ఉంటే వాటిని వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ ప్రక్షాళనలో భాగంగా 22ఎ భూముల సమస్య పరిష్కారానికి కసరత్తు మొదలైంది. వీటికి సంబంధించి ప్రభుత్వం త్వరలో మార్గదర్శకాలు విడుదల చేయనుంది.

చిక్కుముడుల్లో లక్షల ఎకరాలు

రెవెన్యూలో రాష్ట్రవ్యాప్తంగా వెంటాడుతున్న సమస్యల్లో 22ఎ ఒకటి. లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చారు. ప్రతి జిల్లాలోనూ 22ఎ బాధితులున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఈ సమస్యపై అర్జీలు వెల్లువెత్తాయి. వాటిలో నేటికీ 95% పైగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో అధికశాతం ప్రకాశం, అన్నమయ్య, తిరుపతి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల్లోనివే.

22ఎ నుంచి తొలగించాలంటే

- మాజీ/ప్రస్తుత సైనికులైతే నిర్దేశించిన పత్రాలు అందిస్తే 22ఎ(1)(ఎ) నుంచి తొలగించాలి.
- రాజకీయ బాధితులైతే సంబంధిత పత్రాలు లేదా కలెక్టరేట్‌లోని ఎసైన్‌మెంట్ మాస్టర్ రిజిస్టర్ పరిశీలించాలి. అక్కడ పేరు ఉంటే 22ఎ(1)(ఎ) నుంచి తొలగించాలి.
- స్వాతంత్ర్య సమరయోధులైతే నిర్దేశిత పత్రాలు లేదా కలెక్టరేట్‌లోని స్వాతంత్ర్య సమరయోధుల మాస్టర్ రిజిస్టర్స్ ఆఫ్ ఎసైన్‌మెంట్ చూడాలి. అక్కడ రికార్డులు ఉంటే వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించాలి.
- 1954 జూన్ 18 కంటే ముందు భూమి కేటాయించినట్లు రుజువులు ఉంటే.. వాటిని కూడా తొలగించాలి.

సైనికులు, రాజకీయ బాధితులు, స్వాతంత్ర్య సమరయోధులైతే

- మాజీ సైనికులు/ప్రస్తుతం పనిచేస్తున్న సైనికులకు కేటాయించిన భూములైతే.. ఎసైన్‌మెంట్ మాస్టర్ రిజిస్టర్లు.
- భూమి కేటాయింపు కోసం జిల్లా సైనిక సంక్షేమ అధికారి చేసిన సిఫారసుల రిజిస్టర్.
- పాత రెవెన్యూ రికార్డులు: 10(1) రిజిస్టర్, అడంగల్స్, ఎస్ఎఫ్ఏ.. తదితరాలు.
- ఎసైన్‌మెంట్ రిజిస్టర్లు, డీఆర్ దస్త్రాలు.
- రికార్డు ఆఫ్ హోల్డింగ్స్ (ఆర్ఓహెచ్).
- రిజిస్ట్రేషన్ పత్రాలు.
- 8ఎ రిజిస్టర్లు (సర్వే, సబ్‌డివిజన్స్ సంబంధించినవి).
- డీకేటీ పట్టాలు.
- వీటిలో ఏదో ఒకటి ఉంటే చాలు.. అనేక పత్రాలు కావాలంటూ ఒత్తిడి చేయకూడదు.

ఈనాం భూములైతే.. సుమోటోగా తొలగించాల్సిందే

- గ్రామ సర్వీస్ ఈనాం భూములే 1.37 లక్షల ఎకరాలు చిక్కుల్లో ఉన్నాయి. వాటికి సంబంధించి పరిష్కార మార్గాల్ని ప్రభుత్వం రూపొందిస్తోంది.
- ఇప్పటికే జారీ చేసిన రైత్వారీ పట్టాలు చెల్లుబాటు అవుతాయి. అన్ని రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారులు, వారి వారసులు/కొనుగోలుదారుల్ని నమోదు చేయాలి. రీసర్వే రికార్డుల్లోనూ పొందుపరచాలి.
- 2013 చట్టం కంటే ముందు రైత్వారీగా మార్చిన పట్టాభూముల్ని 310 జీవో ద్వారా తిరిగి రైత్వారీగా పునరుద్ధరించారు. వాటిని మరోసారి 22ఎ జాబితాలో చేర్చకూడదు.
- రీసర్వే సమయంలో సర్వీసు ఈనాం, ఈనాం భూముల్ని 22ఎ జాబితాలో చేరిస్తే.. అధికారులే స్వచ్ఛందంగా వాటిని తొలగించాలి.
- 2023 జులై 19న జారీ చేసిన 310 జీవోలో నిర్ణయించిన విధంగా నడుచుకోవాల్సిందే.

చుక్కల భూములైనా.. సుమోటోగా చేయాల్సిందే

- ప్రభుత్వ ఉత్తర్వులు లేదా కలెక్టర్ ఆదేశాల ద్వారా చుక్కల భూముల్ని నిషేధిత జాబితా నుంచి తొలగించి ఉంటే అలాంటి వాటిని మళ్లీ 22ఎ జాబితాలో చేర్చకూడదు.
- ప్రభుత్వ/కలెక్టర్ ఉత్తర్వులున్నా వాటిని మళ్లీ 22ఎ జాబితాలో చేరిస్తే.. అధికారులే సుమోటోగా తొలగించాలి.
- గతంలో పరిష్కరించిన భూముల్ని రీసర్వే సమయంలో మళ్లీ చుక్కల, అనాధీన, షరతులు గల పట్టా భూములుగా మార్చి ఉంటే.. గత నిర్ణయాల ఆధారంగా వాటిని యథాతథ స్థితిలోకి తీసుకురావాలి.

ప్రైవేటు పట్టా భూములకూ..

ప్రైవేటు పట్టా భూముల్ని 22ఎ జాబితాలో చేరిస్తే ఎవరూ దరఖాస్తు చేసుకోకున్నా అధికారులే సుమోటోగా వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలి.

సర్వే నంబరు మొత్తాన్ని నిషేధిత జాబితాలో పెట్టేస్తే

ఒక సర్వే నంబర్లో కొంత విస్తీర్ణంలోనే నిషేధిత భూములున్నా.. మొత్తం సర్వే నంబరును జాబితాలో పెట్టేశారు. ఇలాంటి పరిస్థితి వెంటనే సరిదిద్దాలి. అవసరమైన చోట వెంటనే సబ్‌డివిజన్ చేయాలి. నిషేధిత భూమి ఎంత ఉందో ఆ సబ్‌డివిజన్ విస్తీర్ణం వరకే జాబితాలో ఉంచాలి. మొత్తం సర్వే నంబరును పెట్టకూడదు.

జేఈఈ అడ్వాన్స్‌డ్.. ఏపీలో 24 చోట్ల పరీక్షా కేంద్రాలు

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను తెలంగాణలో 13, ఆంధ్రప్రదేశ్‌లో 24 నగరాలు, పట్టణాల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐఐటీ రూర్కీ బుధవారం సమాచార పత్రాన్ని(ఇన్ఫర్మేషన్ బులిటెన్) విడుదల చేసింది. ఐఐటీల్లో బీటెక్ సీట్ల భర్తీకి మే 17వ తేదీన జేఈఈ అడ్వాన్స్‌డ్-2026ను నిర్వహించనున్న విషయం తెలిసిందే. గత ఏడాది దేశవ్యాప్తంగా 725 చోట్ల పరీక్ష నిర్వహించగా ఈసారి ఆ సంఖ్య 717కు తగ్గింది. విద్యార్థులు పరీక్షా కేంద్రాల కోసం మొత్తం 10 నగరాలు/పట్టణాలకు ఆప్షన్ ఇచ్చుకోవాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం దేశవ్యాప్తంగా 23 ఐఐటీల్లో 18,160 బీటెక్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(బీఎస్) సీట్లు అందుబాటులో ఉన్నాయి. వచ్చే విద్యా సంవత్సరం(2026-27)లో మరికొన్ని సీట్లు పెరగొచ్చు.

ఏపీలో పరీక్షా కేంద్రాలు: శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, అమలాపురం, అనంతపురం, భీమవరం, చీరాల, చిత్తూరు, ఏలూరు, గుడ్లవల్లేరు, గూడూరు, కడప, కాకినాడ, కర్నూలు, మార్కాపురం, మైలవరం, నరసరావుపేట, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, సూరంపాలెం, తాడేపల్లిగూడెం, తిరుపతి, విజయవాడ.



నిద్రపోయే ముందు వీటిని చదవండి

✦ అన్నింటికి ప్రతిస్పందన అవసరం లేదు. నిశ్శబ్దం చాలా శక్తిమంతం ✦ మీకు సాధ్యమైనంత వేగంతో ముందుకు సాగండి. తొందరపాటుతో ప్రయోజనం లేదు ✦ విశ్రాంతి తీసుకోవడానికి అనుమతి అవసరం లేదు. పురోగతిలో అదీ ఒక భాగమే ✦ పట్టుబిగించడం ద్వారా కాకుండా స్వేచ్ఛనివ్వడంతో కొన్నింటిని సాధించొచ్చు.

– వివేక్ గుప్తా, ఫిట్‌నెస్ కోచ్

ఉద్యాన, పట్టుశాఖ డైరెక్టరేట్ వడ్డేశ్వరానికి తరలింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఉద్యాన, పట్టుశాఖ డైరెక్టరేట్‌ను గుంటూరు నుంచి మంగళగిరి సమీపంలోని వడ్డేశ్వరానికి తరలించనున్నారు. 17,908 చదరపు అడుగుల భవనానికి అద్దె ఖరారు చేస్తూ వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.



మరింత మెరుగైన పాలన అందిస్తాం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం 2026 కొత్త ఏడాదిలో ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించనుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. "గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం నూతన సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నాం. ఈ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం" అని పేర్కొన్నారు.

సమష్టి కృషితో శాంతి, క్రాంతి పెంచుదాం

- నారా లోకేశ్ పిలుపు
- ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

ఈనాడు, అమరావతి: సమష్టి కృషితో శాంతి, క్రాంతి పెంచేందుకు కొత్త ఏడాదిలో కృషి చేద్దామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. "ఆశయాల సాధనకు ఆత్మవిశ్వాసంతో ప్రయత్నిద్దాం. కలలు సాకారం చేసుకునేందుకు క్రమశిక్షణతో శ్రమిద్దాం. ప్రగతి సంక్షేమాలతో నవ వసంతం ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు పంచాలి" అని లోకేశ్ ఆకాంక్షించారు.

8న మంత్రివర్గ సమావేశం

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో ఈ నెల 8న ఉదయం 10:30 గంటలకు మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలను శాఖల వారీగా రూపొందించి, జనవరి 6న సాయంత్రం నాలుగు గంటల లోపు సాధారణ పరిపాలన శాఖలో అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. ఈ మేరకు ఆయా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులకు ఉత్తర్వులు జారీ చేశారు.

సంక్షేమ హాస్టళ్లలో బాలల మృతి ఆందోళనకరం

- తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు
- వైద్యశిబిరాల ఏర్పాటు, పరిహారం చెల్లింపుపై వివరాలివ్వండి
- వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల వసతిగృహాల్లో ఉంటున్న బాలబాలికలు అనారోగ్య కారణాలతో మృతి చెందడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఇలాంటి విషయాలను తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదని ఘాటుగా వ్యాఖ్యానించింది. 2016 నుంచి నేటి వరకు 45 మరణాలు సంభవించడం ఆందోళనకు గురిచేస్తోందని వ్యాఖ్యానించింది. జ్వరం, కడుపునొప్పి, బ్లడ్ ఇన్‌ఫెక్షన్, కాలేయ సంబంధిత వ్యాధులతో పిల్లలు మృతి చెందారంటే వైద్యం అందించడంలో అధికారులు దారుణంగా విఫలమైనట్లేనని వ్యాఖ్యానించింది. వసతిగృహాల్లో ఉంటున్న బాలబాలికలను సంరక్షించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో బాలబాలికల మరణాలు, అందుకు కారణాలు, మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లింపులో అనుసరిస్తున్న విధానం, ఇప్పటి వరకు ఎందరికి చెల్లించారు తదితర వివరాలతో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. నెలకు ఎన్నిసార్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారో వివరాలతో పాటు హెల్త్ క్యాంపుల ఏర్పాటుకు సంబంధించిన కార్యాచరణను కోర్టు ముందుంచాలని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌ను ఆదేశించింది. విచారణను జనవరి 21కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ ఉత్తర్వులిచ్చింది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల పరిధిలోని వసతిగృహాల్లో బాలబాలికలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని, నిరంతర పర్యవేక్షణ కోసం ఏఎన్ఎం, హెల్త్ వాలంటీర్లను నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఉత్తరాంధ్ర కమిటీ ఆఫ్ గిరిజన సంక్షేమ సంఘం ప్రతినిధి పి.రంజిత్‌కుమార్ హైకోర్టులో పిల్ వేశారు. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం చెల్లించేలా ఆదేశించాలని కోరారు. బుధవారం విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది శ్రీకాంత్ వాదనలు వినిపిస్తూ.. 2016 నుంచి ఇప్పటి వరకు గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో 45 మరణాలు చోటు చేసుకున్నాయన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ 2025లో రెండు మరణాలు సంభవించాయన్నారు. 2016 నుంచి 45 మంది పిల్లలు మృతి చెందినట్లు పిటిషనర్ చెబుతున్నారని.. అందుకు కారణాలేంటో పరిశీలించాల్సి ఉందని చెప్పారు. సమీప గ్రామాల్లోని ఏఎన్ఎంలు 15 రోజులకోసారి హాస్టళ్లకు వెళ్లి విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షిస్తుంటారన్నారు.

పీఎంశ్రీతో ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులు

- సీఎస్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని

ఈనాడు, అమరావతి: పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం సమర్థ అమలుపై రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. దిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో బుధవారం ఆయన 50వ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధాని మాట్లాడుతూ.. 'జాతీయ విద్యా విధానం-2020కి అనుగుణంగా ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం, పాఠశాలల్లో ఆధునిక వసతుల కల్పన లక్ష్యంగా ముందుకు సాగాలి. పీఎంశ్రీ పథకానికి కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం నిధులు సమకూరుస్తాయి. దీని కింద దేశ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి.. వాటిల్లో మెరుగైన విద్య అందించే వాతావరణం, డిజిటల్ విద్య, ఇతర మౌలిక సదుపాయాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించాలి. గ్రీన్‌స్కూల్ అభివృద్ధి, స్మార్ట్ తరగతి గదులు, ఆధునిక సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు తదితర సౌకర్యాల కల్పనతో పాటు క్రీడలు, కళలు, వృత్తి విద్యను మెరుగుపర్చాలి. సౌర వినియోగం, జల సంరక్షణ తదితర పర్యావరణ అనుకూల సదుపాయాలు కల్పించాలి. వీటితో గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు సమాన అవకాశాలు లభిస్తాయి' అని వెల్లడించారు.

రాష్ట్రంలో 935 పాఠశాలల ఎంపిక: సీఎస్

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో పీఎంశ్రీ కింద ఎంపికైన 935 పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ విద్య అందిస్తున్నాం. ఆయా బడులకు పక్కా భవనాలు, విద్యుత్తు సరఫరా, గ్రంథాలయాలు, బాలబాలికలకు వేర్వేరు మరుగుదొడ్ల వసతులు కల్పిస్తున్నాం. పిల్లలకు రక్షిత నీరు, చేతులు కడుక్కునే ఏర్పాట్లు, గుర్తింపు కార్డులు పంపిణీ చేయడంతో పాటు హాజరును ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా పర్యవేక్షిస్తున్నాం' అని వివరించారు. ఈ సమావేశంలో ఎస్పీడీ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పోస్టులకు మరోసారి ఐచ్ఛికాల స్వీకరణ

- వారం రోజులు సమయం ఇచ్చి, వివరాల సేకరణ
- క్రీడా కోటాకు సంబంధించి పెండింగ్‌లో మరో కేసు
- గ్రూప్-1, డిప్యూటీ ఈఓ, ఎఫ్ఆర్ఓ రిజర్వేషన్ల కేసుల పరిష్కారానికి ఏపీపీఎస్సీ చర్యలు



ఈనాడు, అమరావతి: గ్రూప్-2పై దాఖలైన వ్యాజ్యాలను హైకోర్టు కొట్టేయడంతో నియామక ప్రక్రియను ప్రారంభించేందుకు ఏపీపీఎస్సీ చర్యలు చేపట్టింది. మొదట పోస్టుల ప్రాధాన్యాలకు సంబంధించి అభ్యర్థుల నుంచి మరోసారి ఐచ్ఛికాలను స్వీకరించాలని నిర్ణయించింది. బుధవారం నిర్వహించిన కమిషన్ సమావేశంలో వివిధ నోటిఫికేషన్లపై చర్చించారు. గ్రూప్-2లో పోస్టుల ప్రాధాన్యం ఐచ్ఛికాల స్వీకరణకు వారం రోజులు గడువు ఇవ్వాలని, తర్వాత ఎంపిక జాబితాను విడుదల చేయాలని ఏపీపీఎస్సీ నిర్ణయించింది. గ్రూప్-2 పోస్టుల ప్రాధాన్యాలకు ఇప్పటికే అభ్యర్థుల నుంచి మూడుసార్లు ఐచ్ఛికాలు తీసుకున్నారు. కోర్టు కేసులతో నియామక ప్రక్రియ ఆలస్యమైంది. ఈలోపు డీఎస్సీతో పాటు సుమారు 20 వరకు ఉద్యోగ నియామకాల ఫలితాలు వచ్చాయి. గ్రూప్-2 మెరిట్‌లో ఉన్న అభ్యర్థుల్లో కొందరు ఇతర ఉద్యోగాలకు వెళ్లిపోయారు. దీంతో మరోసారి ఐచ్ఛికాలు తీసుకోవాలని ఏపీపీఎస్సీ భావిస్తోంది. 2023 డిసెంబరు 905 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. 2025 ఫిబ్రవరిలో మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. ఫలితాలను ఏప్రిల్‌లో విడుదల చేశారు. 1:2 విధానంలో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేశారు.

పెండింగ్‌లో మరో కేసు

గ్రూప్-2లో క్రీడాకోటాకు రెండు పోస్టులను రిజర్వు చేయాలని గతంలో హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఏ కేడర్‌లో పోస్టులను రిజర్వు చేయాలనేదానిపై స్పష్టత లేదు. ఇది డీఎస్సీ కేసుతో ముడిపడి ఉండడంతో గ్రూప్-2 కేసును ప్రత్యేకంగా చేపట్టాలని హైకోర్టును ఆశ్రయించాలని ఏపీపీఎస్సీ నిర్ణయించింది. ఈ కేసుపై స్పష్టత రావాల్సి ఉంది.

గ్రూప్-1, ఇతర వాటిపైన..

రిజర్వేషన్లకు సంబంధించి గ్రూప్-1, డిప్యూటీ విద్యాధికారులు, అటవీశాఖ రేంజ్ అధికారుల పోస్టులపై హైకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రూప్-2పై హైకోర్టు తీర్పు ఇచ్చినందున ఇదే తరహాలో వీటినీ పరిశీలించాల్సిందిగా హైకోర్టును కోరాలని ఏపీపీఎస్సీ భావిస్తోంది. కోర్టు ఆదేశాలు అనుకూలంగా వస్తే మొదట గ్రూప్-1 నియామకం చేపట్టాలని ఆలోచన చేస్తోంది. గ్రూప్-1లో క్రీడా కోటాలోని రెండు పోస్టులకు 1:2 చొప్పున నలుగుర్ని ఇంటర్వ్యూలకు పిలుస్తారు. గ్రూప్-1 కేసు తేలకపోతే గ్రూప్-2 నియామక ప్రక్రియ పూర్తిచేయాలని ఏపీపీఎస్సీ నిర్ణయించింది.

టౌన్‌ప్లానింగ్‌పై పీటముడి

టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులకు విద్యార్హతలపై అస్పష్టత నెలకొంది. మెరిట్ జాబితాలో 15 మందిని ఎంపిక చేయగా.. వీరిలో మెజారిటీ అభ్యర్థుల విద్యార్హతలు నోటిఫికేషన్ ప్రకారం లేవని ఉన్నత విద్యామండలి తేల్చింది. దీనిపై ఇగ్నో నుంచి స్పష్టత తీసుకోవాలని ఏపీపీఎస్సీ భావిస్తోంది. డిగ్రీ లెక్చరర్ల పోస్టులకు రిజర్వేషన్లు, విద్యార్హతలపై స్పష్టత రావాలి. ఆ తర్వాతే ఈ నియామక ప్రక్రియను చేపట్టనున్నారు.

కాణిపాకం ఆలయానికి ఐఎస్‌వో గుర్తింపు



ఎమ్మెల్యే మురళీమోహన్‌కు ధ్రువపత్రాలు అందిస్తున్న హైమ్ సంస్థ సీఈవో శివయ్య

కాణిపాకం, న్యూస్‌టుడే: భక్తులకు అందిస్తున్న సేవలకు గుర్తుగా చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి ఐఎస్‌వో గుర్తింపు లభించింది. పాలనావ్యవస్థ, క్వాలిటీ, పరిశుభ్రత, ప్రసాదం తయారీ, అన్నదానం, పడితరం గిడ్డంగి నిర్వహణ మొదలైనవి ఐఎస్‌వో ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని హైదరాబాద్‌కు చెందిన హైమ్ సంస్థ నిర్ధారించింది. ఐఎస్‌వో గుర్తింపు ధ్రువపత్రాలను హైమ్ సీఈవో శివయ్య పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఛైర్మన్ ఎం.మణినాయుడు, ఈవో పెంచల కిశోర్‌కు బుధవారం అందజేశారు. ఆలయంలో సేవల నాణ్యతను గుర్తించి ఏపీ, తెలంగాణల్లో మొదటిసారి కాణిపాకం ఆలయానికి క్యూ త్రీస్టార్ రేటింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

'వీబీ జీ రామ్ జీ' రద్దు చేయాలని నిరసనలు

- కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

ఈనాడు, అమరావతి: కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన 'వీబీ జీ రామ్ జీ' చట్టాన్ని రద్దుచేసి.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తిరిగి అమలు చేసేలా కలిసొచ్చే పార్టీలు, ప్రజా, రైతుసంఘాలతో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున నిరసనలు చేపట్టనున్నామని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల తెలిపారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయసాధనకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'వైఎస్సార్ ఒత్తిడితో 2006లో ఉపాధి హామీ పథకానికి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీలోనే శ్రీకారం చుట్టింది. ఉమ్మడి రాష్ట్ర గ్రామీణ ప్రాంత అభివృద్ధికి, జీవనానికి గ్యారంటీ ఇవ్వడానికి, వలసలు నివారించి పేదల కొనుగోలు శక్తి పెంచడానికి ఈ పథకం ఎంతో దోహదం చేసింది. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఈ చట్టాన్ని మార్చి ఉపాధిహామీలో ఊపిరి తీసేసింది. కొత్త చట్టంలో పనులు గ్రామ సభ కాకుండా దిల్లీ సభ నిర్ణయిస్తుందట. ఇదెక్కడి న్యాయం.. ఇదేం చట్టం? 40% నిధులు రాష్ట్రాలు ఇవ్వకపోతే ఉపాధి ఎలా దక్కుతుంది?' అని షర్మిల మండిపడ్డారు.

స్పైస్ బోర్డు సభ్యులుగా ఇద్దరు తెలుగువారు



భగవతి మహేశ్ బల్ద్వా



కొత్తూరి వెంకట సుబ్బారావు

ఈనాడు, దిల్లీ: కేంద్ర వాణిజ్యశాఖ పరిధిలోని స్పైస్ బోర్డు సభ్యులుగా 11 మందిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఇద్దరు తెలుగువారికి చోటు దక్కింది. వారిలో హైదరాబాద్‌కు చెందిన భగవతి మహేశ్ బల్ద్వా, గుంటూరుకు చెందిన కొత్తూరి వెంకటసుబ్బారావు ఉన్నారు. వెంకటసుబ్బారావు భాజపా నాయకులు. గతంలో భాజపా మజ్దూర్ మోర్చా ఏపీ అధ్యక్షుడిగా పనిచేశారు. భగవతి మహేశ్ బల్ద్వా వ్యాపారవేత్త. స్వరాష్ట్రం రాజస్థాన్. 43 ఏళ్లుగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. కార్తికేయ గ్రూప్ సీఎండీగా ఉన్నారు. వీరిద్దరు మూడేళ్లపాటు స్పైస్ బోర్డు సభ్యులుగా కొనసాగుతారు. ఇతర సభ్యులు తమిళనాడు, కర్ణాటక, కేరళ, గుజరాత్, పశ్చిమబెంగాల్‌లకు చెందినవారు. కేరళలోని కొచ్చి ప్రధాన కార్యాలయంగా పనిచేసే బోర్డు... దేశంలో పండే 52 రకాల సుగంధ ద్రవ్యాలకు ప్రపంచవ్యాప్తంగా మార్కెటింగ్‌కి చేయూతనందిస్తుంది. గుంటూరు జిల్లాలో అత్యధికంగా పండే ఎండుమిర్చి ఈ బోర్డు పరిధిలోకే వస్తుంది.

EENADU Vol: 52, Issue: 142 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఇరవై ఆరు.. ఆనందాల సెలయేరు!

నింగి — ఆకాంక్షల పొద్దు.. ఆకాశమే హద్దు..

నీరు — సంకల్ప ధార.. స్వశక్తితో చేర..

నేల — ఓర్పు నేర్పు ఇమిడేలా.. జగమంతా జేజేల"నేల"

గాలి — నైపుణ్యాలే ఊపిరి... ఒడిసి పడితేనే సిరి

అగ్ని — నిత్య కృషితో జ్వలిద్దాం... నిరంతర శ్రమతో ప్రజ్వలిద్దాం

ఉషోదయాన తొలిఅడుగు..
ఉషస్సులకు మేలిమలుపు...

అనురాగ వసంతాన..
అనుబంధ సంతసాన..

మమతల మడిలో..
మాధుర్య జడిలో...

అనుభవాలే వారధియై..
ఆత్మవిశ్వాసమే సారథియై..

పంచభూతాలే స్ఫూర్తిగా..
పరిఢవిల్లే ప్రగతి దీప్తి..

- అమరావతి డెస్క్

2026.. ప్రతీ క్షణం సార్థకం కావాలి.. ప్రతీ లోగిలిలో సకల శుభాలు వెల్లివిరియాలని మనసారా ఆకాంక్షిస్తూ...




అనురాగాలే వెల్లువాయె..
విజయవాడ పాలీక్లినిక్ రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఆనందం వెల్లివిరిసింది. మగువలు, యువత, చిన్నారులు వేడుకగా నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు.

కాలువలకు నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్: బ్యారేజీ నుంచి బుధవారం 5,602 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. తూర్పు ప్రధాన కాలువకు 3,212, పశ్చిమ 2,304, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కులు ఇస్తున్నారు. తూర్పు కాలువ నుంచి రైవస్‌కు 1,902, ఏలూరు 708, కేఈబీ 302, బందరు కాలువకు 300 క్యూసెక్కుల మేర విడుదల చేశారు.

వందే.. నవతరం..!

కాలం.. తనతోపాటే పరిగెత్తేవారికే అవకాశాలిస్తుంది.. మార్పును గుర్తించి.. అందుకు తగ్గట్టుగా తనను తాను మార్చుకోగలగాలి. వర్తమానంలో ఉంటూనే... భవిష్యత్తునూ సరిగ్గా అంచనా వేయగలగాలి. అవకాశాల కోసం ఎదురుచూడడం కాదు.. వాటిని సృష్టించుకోవాలి. అందుకు మేధో మథనం చేయాలి. అలా చేయాలంటే శారీరకంగా.. మానసికంగా దృఢంగా ఉండాలి.. క్రిటికల్ థింకింగ్, డిజిటల్ లిటరసీపై పట్టు సాధించాలి.. సోషల్ మీడియాను ఎదుగుదలకు మెట్టుగానే ఉపయోగించుకోవాలి... కొత్త సంవత్సర వేళ.. జిల్లాలోని ఇంజినీరింగ్ విద్యార్థులు ఏయే అంశాల్లో ఎలా ఉన్నారో 'న్యూస్‌టుడే' బృందం ఓ సర్వే చేసింది. కొంతమంది కాలానికి తగ్గట్టుగా తమను తాము సన్నద్ధం చేసుకుంటుండగా.. మరికొందరు పరిస్థితులను బట్టి పయనించాలన్న ధోరణిలో ఉన్నారన్నది తేటతెల్లమైంది.



కానూరు శ్రీ భవిష్య కళాశాలలో యువతుల కేరింతలు

ప్రశ్న	సమాధానాలు
ఏఐ ఉద్యోగావకాశాలపై ప్రభావం చూపుతుందా	చూపుతుంది : 263, కొత్త అవకాశాలు: 35, అవగాహన లేదు : 2
క్రిటికల్ థింకింగ్, డిజిటల్ లిటరసీపై అవగాహన ఉందా?	ఉంది: 115, లేదు: 45, కొంచెం: 140
భవిష్యత్తులో సొంతంగా వ్యాపారమా లేదా ఉద్యోగమా?	వ్యాపారం... 83, ఉద్యోగం..204, చూద్దాం: 13
సోషల్ మీడియాలో ఎంత సమయం గడుపుతున్నారు?	గంటకు పైగా : 85, 2 గంటలకు పైగా:100, 3గంటలకు పైగా: 115
ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన ఉందా?	లేదు..169, ఉంది..: 131
ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి జీవనాన్ని ఇష్టపడుతున్నారు?	సాఫ్ట్ లివింగ్...119, సవాళ్లను ఎదుర్కోవడం : 181
ఫిట్‌నెస్ కోసం ఏం చేస్తుంటారు?	యోగా..23, జిమ్ ..105, సి.రెండూ..29, ఏమీ లేదు: 143

విజయవాడ, కానూరు, బందరులోని వివిధ కళాశాలల్లో 300 మంది విద్యార్థులతో సర్వే.. -న్యూస్‌టుడే, విజయవాడసిటీ, కానూరు, మచిలీపట్నం రూరల్

ఆవకాయ్ కార్యక్రమానికి ఏర్పాట్లు

భవానీపురం, న్యూస్‌టుడే: ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆవకాయ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కృష్ణానది ఒడ్డున భవానీపురంలోని పున్నమిఘాట్ వేదికగా ఈనెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్నారు. ఆవకాయ్ కార్యక్రమం నిర్వహణ కోసం ఎగ్జిబిషన్ అనుమతులను అధికారులు రద్దు చేశారు. దీంతో ఎగ్జిబిషన్ సామగ్రిని నిర్వాహకులు తరలిస్తున్నారు. ఇప్పటికే నిర్వాహకులు ఘాట్ వద్ద టెంట్లు, వేదికల నిర్మాణానికి సంబంధించి డిజైన్‌లు రూపొందించి మార్కింగ్ చేశారు. ఆ డిజైన్ల ప్రకారం వేదికల నిర్మాణం చేయనున్నారు.

మిన్నంటిన ఈఎస్ఎల్ క్రికెట్ సంరంభం

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) -2025 క్రికెట్ పోటీలు ముగిశాయి. కానూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో బుధవారం సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో జిల్లా స్థాయి ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. సీనియర్స్ విభాగంలో నలంద డిగ్రీ కళాశాల, జూనియర్స్ విభాగంలో ఎన్ఆర్ఐ కళాశాల విజేతలుగా నిలిచాయి. గెలుపొందిన వారికి శాప్ ఎండీ భరణి, కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్(స్పోర్ట్స్)డా. హరికిషోర్, కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ కన్వీనర్ వి.శశికళ, ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అకడమిక్ అడ్వయిజర్ కె.రవీంద్రకుమార్, గోదావరి గ్రామీణ యూనివర్సిటీ విజయవాడ బ్రాంచ్ మేనేజర్ శైలజ, గుంటూరు చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డీన్ డా.పి.బాలమురళి, ఈనాడు విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్.కె.కిషోర్‌కుమార్ బహుమతులు అందించారు. **-న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు**



సీనియర్స్‌లో విజేతగా నిలిచిన నలంద డిగ్రీ కళాశాల జట్టు



జూనియర్స్‌లో విజేత.. ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల క్రీడాకారులు

పంచ లక్ష్యాలు.. ప్రగతి సూత్రాలు

సర్వతోముఖాభివృద్ధికి కృషి: కలెక్టర్



ఈనాడు, అమరావతి

నవ్యాంధ్రలో జిల్లాను అగ్రపథాన నిలపడమే లక్ష్యంగా, సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని **కలెక్టర్ లక్ష్మీశ** హామీ ఇచ్చారు. వ్యవసాయం, విద్య, పర్యాటకం, పరిశ్రమలు, ఉపాధి కల్పన అంశాల్లో లక్ష్యాలు నిర్దేశించుకున్నారు. కొత్త ఏడాదిలో వాటిని సాధించేందుకు పరిశ్రమిస్తానని చెబుతున్నారు.

పర్యాటకానికి ప్రాధాన్యం

భవానీ ద్వీపంలో అమ్యూజ్‌మెంట్ పార్క్, విడిదికి హోటళ్లు నిర్మిస్తాం. కృష్ణా నదిలో బ్యారేజీ నుంచి ఫెర్రీ వరకు కేరళ తరహాలో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తాం. స్థానికంగా పర్యాటకులు నివాసం ఉండేందుకు హోంస్టే పాలసీని పట్టాలెక్కిస్తాం.

విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి..

పదో తరగతికి 100, ప్రైమరీ పాఠశాలల్లో 75, ఇంటర్ విద్యలో 50 రోజుల ప్రణాళికలు సిద్ధం చేసి ఉత్తీర్ణత 90 శాతం మించి వచ్చేలా చేస్తాం. ప్రతి పాఠశాలకు మోటివేటివ్ ఆఫీసర్ పేరుతో జేసీ, ఆర్డీవోలు, ఎంపీడీవో, తహసీల్దార్లు వారంలో వారికి కేటాయించిన పాఠశాలలకు వెళ్లి స్ఫూర్తి కలిగించే విషయాలు బోధిస్తారు.

పారిశ్రామిక వృద్ధికి పెద్దపీట..

జగ్గయ్యపేట, మైలవరం, విజయవాడ మధ్య నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు వచ్చాయి. 2026లో మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లోనూ పారిశ్రామిక పార్కులు తీసుకురావడమే లక్ష్యం. డ్వాక్రా మహిళలు ఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారం చేసేలా రుణాలు, శిక్షణ ఇస్తాం.

సాగు బాగుకు కృషి..

డ్రోన్ టెక్నాలజీకి ప్రాచుర్యం కల్పిస్తున్నాం. ఆంధ్రా ట్యాక్సీ యాప్ ద్వారా డ్రోన్లు బుక్ చేసుకునే అవకాశం కూడా కల్పిస్తాం. ఉపాధి హామీ ద్వారా జీలుగ వంటి 30 రకాల విత్తనాలు రాయితీపై ఇస్తాం. పాడి ప్రోత్సాహానికి నియోజకవర్గానికో పశువుల హాస్టల్ ఏర్పాటు చేస్తాం.

ఉద్యోగ కల్పన దిశగా..

చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు వికాస ద్వారా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నాం. 2025లో 2వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. 2026లో 5వేల మందికి ఉపాధి కల్పించేలా కొత్త కంపెనీలు తీసుకొస్తాం.

ముఖాముఖి

పౌరుల భద్రతకే.. అధిక ప్రాధాన్యం

రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యం: పోలీస్ కమిషనర్



ఈనాడు, అమరావతి

'ఎన్టీఆర్ కమిషనరేట్‌లో అత్యుత్తమ సాంకేతిక విధానాలతో పోలీసింగ్‌లో గణనీయమైన ఫలితాలు సాధించాం. ప్రజలకు మెరుగైన సేవలు అందించాం. 2026లో మరింత మెరుగైన పనితీరుతో ప్రజలకు చేరువకావడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. నేరరహిత జిల్లాగా మార్చేందుకు పలు సాంకేతిక విధానాలు తీసుకొస్తాం. దీని కోసం పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతాం. రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టడం, సైబర్ నేరాల నియంత్రణలో అన్ని వర్గాల వారిని భాగస్వాములను చేస్తాం. ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వీటిని నూతన సంవత్సరంలో మరింత విస్తరిస్తామని' **సీపీ రాజశేఖర్‌బాబు** అన్నారు. కొత్త ఏడాదిలో లక్ష్యాలను వివరించారు.

శిరస్త్రాణం తప్పనిసరి చేస్తాం..

★ 2025లో రోడ్డు ప్రమాదాలను కొంత వరకు తగ్గించాం. కొత్త సంవత్సరంలో గణనీయంగా మార్పు తీసుకొచ్చే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు పెంచుతాం. బైక్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. నగరంలో ఐదు ముఖ్య ప్రాంతాల్లో ఎనలిటిక్ కెమెరాలను ఏర్పాటు చేశాం. ఇవి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిని గుర్తిస్తాయి. వారికి నోటీసులు పంపిస్తాం. పదిసార్లు ఇలా చేస్తాం. తర్వాత చట్ట ప్రకారం చర్యలకు ఉపక్రమిస్తాం.

అస్త్రం యాప్‌తో ముందుకు..

★ ట్రాఫిక్ అవస్థలను తగ్గించేందుకు ప్రజలకు త్వరలో అస్త్రం యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం. ఇందులో లైవ్ ట్రాఫిక్, వివిధ అలెర్ట్‌లు వస్తాయి. మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు పరీక్షిస్తున్నాం. ట్రాఫిక్‌లో చిక్కుకుంటే.. 'వై యామ్ ఐ స్టక్' అన్న ఫీచర్‌ను ఉపయోగించి కారణాలు తెలుసుకోవచ్చు. యాప్‌లో ప్రత్యామ్నాయ మార్గాలు వస్తాయి. ప్రస్తుత ట్రాఫిక్ గురించే కాకుండా.. రాబోయే వారం రోజుల పాటు రద్దీ ఎలా ఉంటుందో అంచనా వేసి సమాచారం ఇస్తుంది.

★ నూతన సంవత్సరంలో 'ఇన్విజిబుల్ పోలీసింగ్.. స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' నినాదంతో ముందుకు సాగుతాం.

నూతన సంవత్సర శుభాకాంక్షలతో జరభద్రం

విజయవాడ నేరవార్తలు: నూతన సంవత్సర శుభాకాంక్షల పేరుతో వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు ఏపీకే ఫైల్ రూపంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు పంపిస్తారనీ... వాటిని క్లిక్ చేయవద్దని సూచించారు. అనుమానాస్పద ఇమేజ్‌లు, సందేశాల పట్ల మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఏమైనా అనుమానాస్పదంగా ఉంటే 1930 లేదా 112 నెంబరు ఫోన్ చేయాలని సీపీ సూచించారు.



రేపటి నుంచే పుస్తక పండగ

విజయవాడ 36వ పుస్తక మహోత్సవం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. స్టాళ్ల ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. వేడుకలకు సంబంధించిన ఫ్లెక్సీలు ఆకట్టుకునే రీతిలో ఏర్పాటు చేశారు. **- ఈనాడు, అమరావతి**

నవ్యనగరిలో ప్రగతి కాంతులు

ఈనాడు - అమరావతి: నవ్యాంధ్ర రాజధాని అమరావతి పనులు ఊపందుకున్నాయి. నూతన సంవత్సరంలో కొన్ని భవనాలు అందుబాటులోకి రానున్నాయి. అఖిల భారత సర్వీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, హైకోర్టు న్యాయమూర్తులకు సంబంధించిన నివాసాల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను కూటమి ప్రభుత్వం తిరిగి పట్టాలెక్కించడంతో రాత్రిపగలు వేలాదిమంది కార్మికులు వాటిల్లో నిమగ్నమయ్యారు. హైకోర్టు, సచివాలయం నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నారు. మరోవైపు కొండవీటి వాగు విస్తరణ సైతం ఊపందుకుంది. ఇప్పటికే చేపట్టినవి 2027నాటికి పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. వివిధ బ్యాంకులకు స్థలాలు కేటాయించడంతో అక్కడ కూడా సందడి మొదలైంది. మౌలిక వసతులపరంగా రహదారుల నిర్మాణం, మురుగుకాలువలు, తాగునీటి సరఫరా, విద్యుత్తు లైన్ల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాజధాని ప్రాంతం మీదుగా వెళ్తున్న 400, 200కేవీ విద్యుత్తు లైన్ల మార్పిడి ఇప్పటికే మొదలైంది. ప్రతీ పనికి నిర్దేశిత కాల పరిమితి విధించారు. సంక్రాంతి తరువాత మరింత వేగంగా జరుగుతాయని పర్యవేక్షిస్తున్న ఇంజినీరు ఒకరు తెలిపారు.

సరికొత్తగా పయనిస్తాం.. సవాళ్లు అధిగమిస్తాం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కొత్త ఆశలు, ఆశయాలతో నూతన సంవత్సరంలోకి అడుగులు వేస్తున్నాం.. సవాళ్లను అధిగమిస్తూ సరికొత్త పయనం చేయబోతున్నాం.. అందరి సహకారంతో 2026లో జిల్లాను అగ్రగామిగా నిలుపుతామని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. నిర్మాణాత్మక సద్విమర్శలకు ఎప్పుడూ ఆహ్వానం ఉంటుందన్నారు. సీఎం చంద్రబాబు దిశానిర్దేశంతో ఆధునిక సాంకేతిక, రియల్ టైమ్ గవర్నెన్స్‌తో అనుసంధానం కానున్నట్టు పేర్కొన్నారు. 2025 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ, 2026 ఏడాదికి ఆహ్వానం పలుకుతూ నగరంలోని గురునానక్‌కాలనీలోని ఒక ఫంక్షన్ హాలులో బుధవారం మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా అన్ని రంగాల్లోనూ 18.5 శాతం వార్షిక వృద్ధి లక్ష్యంగా పటిష్ఠ ప్రణాళికలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. వివిధ శాఖలకు సంబంధించి 315 కీలక ప్రగతి సూచికల్లో (కేపీఐల్లో) 83 స్కోరుతో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లేలా.. ప్రతి సూచికలోనూ ముందంజలో నిలిచేందుకు కృషి చేస్తున్నట్టు వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, పక్కనే డీపీఆర్వో రమణ, డి.ఎల్.పి.ఆర్.ఓ. రవి

నూతన సంవత్సర శుభాకాంక్షలు.. జిల్లా ప్రజలకు కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు అంతా మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు.

అమరావతి ప్రాంతానికి గేట్‌వే..

విజయవాడ ఎన్టీఆర్ జిల్లాకు కేంద్రమే కాదు, రాజధాని అమరావతి ప్రాంతానికి గేట్‌వేగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆ దిశగా మరింత ప్రగతి సాధించేలా కృషి చేస్తున్నామన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో పోల్చితే జిల్లాలో సేవా రంగం అధిక శాతం వాటా (సుమారు 67 శాతం) కలిగి ఉన్నట్టు చెప్పారు. పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు వినూత్న కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇటీవల మొంథా తుపాను తరుణంలో డేటా అనలిటిక్స్ సాయంతో తీసుకున్న చర్యలు మంచి ఫలితాలను ఇచ్చినట్టు పేర్కొన్నారు. పరిపాలనలోనూ రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా బ్యాంకు సహకారంతో, ఐవీఆర్ఎస్ నివేదికల ఆధారంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. మూత్రపిండ బాధిత ప్రాంతం ఎ.కొండూరుకు అదనపు డయాలసిస్ కేంద్రం రావడం ఇందుకు ఉదాహరణ అన్నారు. ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేలా ప్రతి నియోజకవర్గంలో ఎం.ఎస్.ఎం.ఇ. పార్కుల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకుంటూ ముందుకు వెళతామన్నారు. డీపీఆర్వో కె.వి.రమణరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, ఆడియో విజువల్ సూపర్‌వైజర్ వేమూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పాత్రికేయులు కలెక్టర్‌ను సత్కరించగా, నూతన సంవత్సర కేకును కలెక్టర్ కోశారు.

అయోధ్యలో అవధూత దత్త పీఠం

పటమట, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఆనందంగా గడపాలని గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆకాంక్షించారు. బుధవారం పటమటలోని దత్త పీఠంలో నూతన సంవత్సర వేడుకలను, 8 రోజుల భాగవత సప్తాహం కార్యక్రమాన్ని స్వామీజీ సమక్షంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ విజయవాడలో దత్త పీఠం ఏర్పాటు చేసి 45 ఏళ్లు అయ్యిందని, ఏటా నూతన సంవత్సర వేడుకలు ఆశ్రమంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఈ ఏడాది అయోధ్యలో రామోద్యమం సమాప్తి కార్యక్రమం నిర్వహించామని, నూతనంగా అవధూత దత్త పీఠం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగులో భగవద్గీత ప్రవచనం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. దత్త పీఠంలో ఈ నెల 2 నుంచి 8 వరకు సంపూర్ణ శ్రీమద్భాగవతం శ్లోక పఠనం, పారాయణ హోమ, ప్రవచన సప్తాహ మహాయజ్ఞం నిర్వహిస్తున్నామని తెలిపారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు గీతా ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు.



గణపతి సచ్చిదానంద స్వామీజీ సమక్షంలో జ్యోతి వెలిగిస్తున్న జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు

పసి పిల్లల విక్రయం కేసులో రిమాండ్ పొడిగింపు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : పసి పిల్లలను విక్రయిస్తున్న కేసులో నిందితులకు జనవరి 12వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బలగం సరోజిని, కిరణ్‌శర్మ మరో ఇద్దరిని నున్న పోలీసులు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. ఇప్పటికే అరెస్టైన మరో ఆరుగురు నిందితులను భవానీపురం పోలీసులు వర్చువల్ విధానంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం వీరికి రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీస్ కస్టడీకి ఇద్దరు నిందితులు.. కాగా ఈ కేసులో అరెస్టు చేసిన బలగం సరోజని, భారతిలను తమ కస్టడీకి ఇవ్వాలంటూ భవానీపురం పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణ అనంతరం వీరిద్దరిని జనవరి 2 నుంచి 9 వరకు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన నిందితురాలు బలగం సరోజినిపై నున్న, కొత్తపేట పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు.

అంతర్ జిల్లా నేరస్థుడి అరెస్టు

25 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాల స్వాధీనం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: దుర్గగుడి ఘాట్ రోడ్డులో గతేడాది ఏప్రిల్‌లో పార్క్ చేసిన కారు అద్దాలు పగలగొట్టి బంగారు ఆభరణాలు అపహరించిన కేసులో అంతర్ జిల్లాల నేరస్థుడు చింతా గణేష్‌ను అరెస్టు చేసినట్లు ఏడీసీపీ రాజారావు తెలిపారు. అతడి నుంచి రూ.25 లక్షలు విలువ చేసే 180 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వన్ టౌన్ సీసీఎస్ పోలీసుస్టేషను ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏడీసీపీ మాట్లాడారు. దుర్గమ్మ దర్శనానికి హైదరాబాద్ నుంచి ఇంద్రకీలాద్రికి చేరుకున్న కుటుంబం ఏప్రిల్‌లో తమ బంగారు ఆభరణాలను కారులో ఉంచి దర్శనానికి వెళ్లారు. కోనసీమ అంబేడ్కర్ జిల్లా మొగలమూరు గ్రామానికి చెందిన చింత గణేష్ గతంలో 15 ఏళ్ల పాటు ఖతార్‌లో కారు డ్రైవర్‌గా పని చేశాడు. ఉద్యోగం మానేసి ఇక్కడికి వచ్చేశాడు. అనంతరం వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ నేపథ్యంలో విజయవాడకు చేరుకున్నాడు. దుర్గగుడి వచ్చిన కుటుంబం ఆభరణాలు, కొంత నగదు కారులో ఉంచి దర్శనానికి వెళ్లారు. అదే సమయంలో కారు డోరు తెరిచి ఆభరణాలు అపహరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. విచారణలో పలు చోట్ల సీసీ కెమెరాలు పరిశీలించారు. ఈ క్రమంలో బుధవారం తారపేటలో చర్చి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న గణేష్‌ను సీసీఎస్ సీఐ రామ్‌కుమార్, సిబ్బంది అదుపులోకి తీసుకొని విచారించగా అపహరించిన బంగారం వెలుగులోకి వచ్చినట్లు ఏడీసీపీ రాజారావు తెలిపారు. కేసు ఛేధించిన డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ రాజారావు, ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ రామ్‌కుమార్‌లను ఈసందర్భంగా సీపీ రాజశేఖరబాబు అభినందించారు.



నిందితుడిని చూపుతున్న ఏడీసీపీ రాజారావు, ఏసీపీ వెంకటేశ్వర్లు

ఆర్టీసీ బస్సు ఢీకొని కండక్టర్ దుర్మరణం

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఆ కండక్టర్ విధి వక్రీకరించింది. తాను విధులు నిర్వహించిన బస్సే అతని మృతికి కారణమైంది. పోలీసుల వివరాల ప్రకారం... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన వజ్జ అభిలాష్ (40) భద్రాచలం ఆర్టీసీ డిపోలో కండక్టర్. మంగళవారం సాయంత్రం భద్రాచలం - గుంటూరు బస్సుకు డ్రైవర్ తప్పెట ప్రకాశంతో కలిసి డ్యూటీ ఎక్కారు. గుంటూరులో ప్రయాణికులను దింపిన అనంతరం మళ్లీ భద్రాచలం వెళ్లేందుకు గుంటూరులో రాత్రి 10.30 సమయంలో బయలు దేరారు. బస్సు వారధి దాటిన అనంతరం బస్ స్టేషన్ వైపునకు వెళ్లాల్సి ఉండగా.. డ్రైవర్ ఏమరపాటు వల్ల బస్సు పైవంతెన ఎక్కి కొద్ది దూరం ముందుకెళ్లింది. గమనించిన డ్రైవర్ బస్సు ఆపి ముందుకెళ్లిన మార్గంలోనే వెనక్కి రావాలని నిర్ణయించుకున్నారు. కండక్టర్ అభిలాష్ బస్సు వెనుక భాగానికి వెళ్లి డ్రైవర్‌కు సిగ్నల్ ఇవ్వసాగారు. రివర్స్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు బస్సు అతన్ని ఢీకొని తలపైకి ఎక్కింది. ఘటనా స్థలంలోనే మృతి చెందారు. పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

విజయవాడ పశ్చిమ

ప్రతిభ చూపి.. బహుమతులు సాధించి..


విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఇందిరా, రంగమణి

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతబస్తీ కొత్తపేట ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను బుధవారం నిర్వహించారు. పాఠశాల స్థాయిలో వర్తమాన వ్యవహారాలు, జనరల్ నాలెడ్జ్, క్రీడలపై క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. వీటిల్లో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఈ. మహాలక్ష్మి(9వ తరగతి), డి.నిఖిల్ సందీప్ (9వ తరగతి), ఎన్. కౌశిక్ (8వ తరగతి) నిలిచారు. పాఠశాల ఇన్‌ఛార్జి ఎస్.ఇందిర, డీడీకే రంగమణిలు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం.. ✦ సామారంగం చౌకి పాతశివాలయం ప్రాంతంలో రంగుమారిన మంచినీరు సరఫరా అవుతోందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. స్పందించిన మంచినీటి విభాగం అధికారులు ఆ ప్రాంతంలో మంచినీటి పరీక్షలను నిర్వహించారు. **- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

? వాగుసెంటర్ వద్రుపేటలో రోడ్డుపై చెత్త ఉంది. **- రాజు, స్థానికుడు.** ✔ చెత్త తరలిస్తాం. **- నరసింహారావు, స్థానిక శానిటరీ అధికారి. - న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

హిందూ సమ్మేళనానికి ఆహ్వానం

చిట్టినగర్: హిందువులంతా ఐకమత్యంతో మెలగాలనే సంకల్పంతో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి పాలక మండలి సభ్యులు అవ్వారు బుల్లబ్బాయి పేర్కొన్నారు. ఈనెల 4న విజయ డెయిరీ ఫంక్షన్ హాల్లో హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ఇంటింటికి హిందూ బంధువుల మహిళలకు, యువతులకు బొట్టు పెట్టి ఆహ్వానించారు.

ఎల్‌ఓసీ పత్రాల అందజేత


లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న నాయకులు

భవానీపురం: ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు వీలుగా ఎమ్మెల్యే సుజనాచౌదరి సహకారంతో ఇద్దరికి ఎల్‌ఓసీ పత్రాలు మంజూరయ్యాయి. 46వ డివిజన్‌లో నివాసం ఉండే బత్తుల జీవన్ తేజ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడికి రూ.1.20 లక్షలు, పాతబస్తీ 51వ డివిజన్‌కు చెందిన గూడెల తవుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఆమెకు రూ.5 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరయ్యాయి. లబ్ధిదారులకు ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, నాయకులు భవానీపురంలోని కార్యాలయంలో బుధవారం పత్రాలు అందజేశారు. కార్పొరేటర్ రాజేష్, నాయకులు రామారావు, నాగమణి, సుజనామిత్రలు తదితరులు పాల్గొన్నారు.

బాలల కళ.. భళా..

★ పలు అంశాల్లో సత్తా ★ బహుమతులు సాధిస్తూ ముందుకు

చిట్టినగర్, న్యూస్‌టుడే

విద్యతో పాటు ఆసక్తి ఉన్న అంశాల్లో తర్ఫీదు పొందుతున్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ చాటుతూ బహుమతులు సాధిస్తున్నారు. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ప్రాథమిక విద్య నుంచే భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు. ఆ విద్యార్థుల గురించి తెలుసుకుందామా..

పది మందికి నేర్పుతా



మేము గొల్లపాలెం గట్టులో ఉంటాం. అమ్మ జ్యోతిస్వరూప, నాన్న శంకరరావు. గీతాంజలి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాను. 4 ఏళ్లుగా ఆంధ్ర నాట్యంలో శిక్షణ పొందుతున్నాను. నగరంలోని పలు ఆలయాలతో పాటుగా తిరుపతి, సింహాచలం, ద్వారకాతిరుమల, శ్రీశైలం, దుర్గగుడి, ఏలూరు, రాజమహేంద్రవరం, గుంటూరు తదితర ప్రాంతాల్లో ఇప్పటికి 50కి పైగా ప్రదర్శనలు చేశాను. భవిష్యత్తులో తాను నేర్చుకున్న ఆంధ్రనాట్యాన్ని మరికొంత మందికి నేర్పిస్తాను. **- ఆనందవర్షిణి, గొల్లపాలెంగట్టు**

ఇన్‌స్టిట్యూషన్ ఏర్పాటు చేస్తా



నేను అమ్మనాన్నలు నరేష్, లలితతో కలిసి పాల ఫ్యాక్టరీ ప్రాంతంలో ఉంటాను. మాది బైడింగ్ షాపు. రాకేష్ పబ్లిక్ స్కూల్లో 10వ తరగతి చదువుతున్నాను. 5 ఏళ్లుగా కరాటేలో శిక్షణ పొందుతున్నాను. ప్రస్తుతం బ్రౌన్-4 బెల్టు సాధించాను. పోటీల్లో పలు పాల్గొని బహుమతులు సాధించాను. భవిష్యత్తులో మార్షల్ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ స్థాపించి శిక్షణ ఇవ్వాలనేది లక్ష్యం. **- కె.ప్రభుచరణ్, భీమనవారిపేట**

గ్రాండ్ మాస్టర్ లక్ష్యం



మేము వైఎస్ఆర్‌కాలనీలో ఉంటాం. ఆనంద్. నాన్న సురేశ్ మార్బుల్ మేస్త్రి. శ్రీగౌతమ్ పబ్లిక్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్నాను. నాకు చదరంగంపై ఆసక్తితో 3 ఏళ్లుగా శిక్షణ పొందుతున్నాను. జిల్లా స్థాయిలో-14, రాష్ట్ర స్థాయిలో-8 పతకాలు కైవసం చేసుకున్నాను. భవిష్యత్తులో గ్రాండ్ మాస్టర్ జీవిత లక్ష్యం. **- నంబూరి ఆనంద్, వైఎస్ఆర్ కాలనీ**

శ్లోకాలు కంఠస్థం చేస్తూ..



నా పేరు చైత్ర.. అమ్మ నాన్న శ్యామలరావు, కామాక్షి. రాకేష్ పబ్లిక్ స్కూల్లో 3వ తరగతి చదువుతున్నాను. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉపాధ్యాయులు భగవద్గీత పఠనంపై తర్ఫీదు ఇస్తున్నారు. చాలా శ్లోకాలు అవలీలగా చెప్పగలను. ఎక్కడ పోటీలు నిర్వహిస్తే అక్కడికి వెళ్లి బహుమతులు సాధిస్తున్నాను. **- పుట్టి చైత్ర, కేఎల్‌రావునగర్**

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

విజయవాడ నగరపాలక సంస్థ: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రూ.26 వేల చొప్పున వేతనాలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పారిశుద్ధ్య కార్మికులతో వారు కార్నర్ మీటింగ్ నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు రంగనాయకులు మాట్లాడుతూ.. కార్మికులకు నెలవారీ వేతన సొమ్ము సరిపోక అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

పాపారావు సేవలు స్ఫూర్తిదాయకం


పాపారావు దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, పక్కన జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

చిట్టినగర్, న్యూస్‌టుడే: ప్రణాళికబద్ధంగా 35 ఏళ్ల పాటు పౌరసరఫరాల శాఖకు పాపారావు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పాపారావు ఉద్యోగ విరమణ కార్యక్రమం బుధవారం గాంధీనగర్‌లోని ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా తన యంత్రాంగాన్ని ముందుకు నడిపించారన్నారు. అనంతరం పాపారావు దంపతులను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా సత్కరించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీఎం సతీష్, అధికారులు, చౌకధర దుకాణదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు, జిల్లా కార్యదర్శి శివప్రసాద్, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల కృషి ప్రశంసనీయం

విజయవాడ పాతబస్తీ, న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగుల సేవలు ప్రశంసనీయమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎం.సుహాసిని అన్నారు. బుధవారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ కార్యాలయంలో హెచ్‌ఈఓగా విధులు నిర్వహిస్తూ సాధారణ రామాంజనేయులు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎం.సుహాసిని, ఇతర ఉద్యోగులు సన్మానించారు.


రామాంజనేయులు దంపతులను సన్మానిస్తున్న సుహాసిని తదితరులు

పీహెచ్‌సీల ఆకస్మిక తనిఖీ..

విజయవాడ పాతబస్తీ, న్యూస్‌టుడే: సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎం. సుహాసిని హెచ్చరించారు. బుధవారం నగరంలోని కొత్తపేట, క్రీస్తురాజపురం, కండ్రిక ప్రాంతాల్లోని పీహెచ్‌సీలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రిజిస్టర్లను పరిశీలించారు. పలువురు రోగులు, గర్భిణులు, బాలింతలతో ఆమె మాట్లాడారు. వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. చిన్నారులకు వేసే టీకా కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు


దాత తిరుపతి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ


దాత శ్రీనివాసరావు దంపతులకు రసీదు అందజేస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ త్రినాథ్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు దాతలు రూ. 2,00,116 విరాళాన్ని బుధవారం అందజేశారు. విశాఖపట్నం మధురవాడకు చెందిన వంగపండు తిరుపతి రూ. 1,00,116, బెంగళూరుకు చెందిన మద్దూరి శ్రీనివాసరావు రూ.లక్ష వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబాలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి ఆశీర్వచనం చేశారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఆలయ ఇన్‌స్పెక్టర్ త్రినాథ్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

జగన్మాత సేవలో స్వామి వాసుదేవానంద సరస్వతి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను స్వామి వాసుదేవానంద సరస్వతి(ప్రయాగరాజ్) శిష్య బృందంతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు, వేదపండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆశీర్వచన మండపంలో భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులోని ముఖ్యమైన ధర్మకర్తల్లో ఒకరైన స్వామి వాసుదేవానంద సరస్వతి దుర్గమ్మ దర్శనం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.


స్వామి వాసుదేవానంద సరస్వతికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేదపండితులు

కొత్త ఆశలు.. అభివృద్ధి జాడలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరాభివృద్ధిపై కొత్త ఆశలు చిగురించాయి. గడిచిన ఏడాదిగా కొన్ని అభివృద్ధి పనులు చేపట్టగా, కొన్ని చివరి దశకు చేరాయి. మరికొన్ని పట్టాలెక్కుతున్నాయి. పార్లమెంట్, శాసనసభ్యుల సూచనల మేరకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి.

✿ మూడు నియోజకవర్గాల్లో గడిచిన ఏడాదిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రధానంగా రూ.63.15 కోట్లతో రహదార్ల నిర్మాణం చేపట్టారు. అందులో రూ.34.27 కోట్లతో సిమెంట్, రూ.28.88 కోట్లతో తారు రోడ్లు నిర్మించారు. 94.72 కి.మీ. మేర రహదార్లను పునఃనిర్మించారు.

✿ రూ.7.65 కోట్లతో 6.34 కి.మీ. పొడవున కాలుష్య రహిత రహదార్లు అభివృద్ధి చేశారు. 6.26 కి.మీ. మేర గ్రావెల్, రబ్బీష్ రహదార్లను రూ.3.37 కోట్లతో చేపట్టారు. రహదార్లపై గుంతలు పూడ్చేందుకు ఏడాదిలో రూ.3.8 కోట్లతో పనులు పూర్తి చేశారు.


గవర్నర్‌పేట గోపువారి వీధిలో నిర్మిస్తున్న రహదారి

కొండ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి..

✿ పశ్చిమలోని కొండ ప్రాంతాల్లో తాగునీరు, మెట్లు, డ్రెయిన్లు, ర్యాంపులు తదితర పనులకు రూ.13.17 కోట్లు వెచ్చించారు. ఇప్పటికే రూ.5.13 కోట్ల విలువైన పనులు పూర్తి చేశారు. తూర్పు పరిధిలో పనులకు రూ.2.77 కోట్లు కేటాయించి, రూ.69.17 లక్షల వ్యయం గల పనులు పూర్తి చేశారు. రూ.20.8 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయి.

✿ పశ్చిమలో నీటి సరఫరా మెరుగుకు రూ.2.35 కోట్లతో 2.34 కి.మీ. పొడవున పైపులైన్లు నిర్మించారు. 46వ డివిజన్ కొండ ప్రాంతంలో రూ.170 కోట్లతో 455 కిలోలీటర్ల సామర్థ్యం గల రిజర్వాయరు పూర్తి చేశారు.

✿ మధ్యలో రూ.17.3 కోట్లతో పంపింగ్ మెయిన్ పైపులు వేసి, గద్దె వెంకట్రామయ్య నగర్, ఇతర ప్రాంతాల్లో రిజర్వాయర్లు నిర్మించారు.

✿ తూర్పులో రూ.17.8 కోట్లతో పైపులైన్ల పనులు చేపట్టారు. క్రీస్తురాజపురంలో 200 కేఎల్ సామర్థం గల రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేశారు.

✿ అమృత్ పథకం కింద మూడు నియోజకవర్గాల్లో నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు ప్రాథమికంగా ఎంపిక చేసిన 18 డివిజన్లలో రూ.100.7 కోట్లతో నూతన పైపులైన్ల నిర్మాణం, ఇతర పనులు చేపట్టి 70 శాతం పూర్తి చేశారు.

భూములను ఇతర అవసరాలకు వినియోగించొద్దు


వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: అంజుమన్-ఎ-ఇస్లామియా సంస్థకు చెందిన భూములను ఇతర అవసరాలకు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ముస్లిం సంఘాల నాయకులు బుధవారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళగిరి మండలం చిన్న కాకాని గ్రామ పరిధిలోని 71.57 ఎకరాల భూములు 1962 వక్ఫ్ గెజిట్‌లో నోటిఫై అయ్యాయని వారు తెలిపారు. భూములను రక్షించేందుకు వక్ఫ్ బోర్డు తరపున చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం సంఘాల ప్రతినిధులు నాగుల్‌మీరా, అబ్దుల్‌కలాం, నూర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ పెనుగొండగా నామకరణం అభినందనీయం


మాట్లాడుతున్న అరుణ్‌కుమార్, పక్కన ఆర్యవైశ్య సంఘం నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పెనుగొండను వాసవీ పెనుగొండగా నామకరణం చేయడం అభినందనీయమని గొల్లపూడి మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. పాతబస్తీలోని కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఆర్య వైశ్యులకు సముచిత స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. కొణిజేటి రమేష్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు అమరజీవి పొట్టి శ్రీరాములు పోలవరం ప్రాజెక్టుగా నామకరణం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె.ఎల్.వి. సతీష్‌కుమార్, జాలాది వెంకటేశ్వరరావు, నందిపాటి నరసింహారావు, నూకల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కెనాల్ రోడ్డు రివర్ ఫ్రంట్ హోటల్లో అగ్నిప్రమాదం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: రద్దీగా ఉండే కెనాల్ రోడ్డులోని రివర్ ఫ్రంట్ హోటల్లో రెండో అంతస్తులో బుధవారం జరిగిన అగ్నిప్రమాదం స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. విద్యుదాఘాతం కారణంగా అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక అధికారులు భావిస్తున్నారు. మంటలతోపాటు పొగలు వ్యాపించడంతో హోటల్లో బస చేసిన యాత్రికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తం అయిన కొందరు హోటల్ టెర్రస్ పైకి.. మరికొందరు రోడ్డుపైకి చేరుకున్నారు. ఘటన జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బందితోపాటు ట్రాఫిక్ శాంతిభద్రతల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. వన్‌టౌన్ సీఐ గుణరామ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రాణనష్టం కలగలేదని నిర్ధారించారు. హోటల్ గదులకు సరైన వెంటిలేషన్ లేకుండా నిర్మాణం చేయడంపై బస చేసిన యాత్రికులు హోటల్ యాజమాన్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో మంటలను అదుపు చేయడంతో ప్రాణాలతో బయట పడ్డామని వారు వాపోయారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: దుర్గగుడి టోల్‌గేటు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందారు. సుమారు 65 ఏళ్ల వయస్సు ఉండొచ్చని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఆరెంజ్ రంగు చొక్కా, లుంగీ అతడి ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. దుర్గగుడిలో పనిచేసే సెక్యూరిటీ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు చెప్పారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరం


కామకోటినగర్‌లో సొమ్ము అందిస్తున్న దూండీ రాకేష్, కూటమి నాయకులు


భవానీపురంలో నగదు అందజేస్తున్న నెట్టెం రఘురాం, కూటమి నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరమని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండీ రాకేష్ అన్నారు. కామకోటినగర్‌లో కూటమి నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివశర్మ, వెంకన్న, సాంబశివయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భవానీపురం: పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని భవానీపురం, హెచ్‌బీకాలనీ, ప్రియదర్శిని కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం నిర్వహించారు. కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం ప్రియదర్శిని కాలనీలో సచివాలయ సిబ్బందితో కలిసి పింఛనుదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేశారు.

పోలీసుల బందోబస్తు


భవానీపురం ప్రాంతంలో..

భవానీపురం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని భవానీపురం ప్రాంతంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. భవానీపురం స్టేషన్, వన్‌ట్రాఫిక్ పోలీసులు వీధుల్లో స్పెషల్ డ్రైవ్‌లను చేపట్టారు. క్రాంబేరోడ్డు, జాతీయ రహదారి, బైపాస్ రోడ్డు, కనకదుర్గ పైవంతెన తదితర ప్రాంతాల్లో పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా చర్యలు చేపట్టారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు


వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ సురేష్‌బాబు, పక్కన ఎస్సై ఆంజనేయులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం వేడుకలు సందడిలో మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ సురేష్‌బాబు హెచ్చరించారు. చిట్టినగర్ కూడలిలో బుధవారం వాహనచోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనం నడిపే సమయంలో శిరస్త్రాణం ధరించాలని సూచించారు. చిన్నపాటి తప్పిదం వల్ల ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై ఆంజనేయులు, ఏఎస్ఐ భగవాన్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరణ

ఆలిండియా రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం విజయవాడ డివిజనల్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు అంగడి వినోద్, డివిజనల్ అధ్యక్షుడు కె.రమేష్, కార్యదర్శి బి.వి.నాయక్, విద్యుత బ్రాంచి అధ్యక్షుడు కర్రె జాషువా, కార్యదర్శి శేషు తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, రైల్వేస్టేషన్**

ప్రకటన

నా క్లయింటయినట్టి ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ టౌన్, ముత్యాలంపాడు, జి.యస్. రాజు రోడ్డు, డోర్ నెం.21-8-40ను నందు నివాసముంటున్న సామంతపూడి గోవిందరాజు గారి కుమారుడైన సామంతపూడి వెంకట సుబ్బారావు గారి నుండి సంజాయిషీ పొంది యీ ప్రకటన తెలియజేయడమైనది.

ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి నా క్లయింటు యొక్క మాతామహి (అమ్మమ్మ) గారైన చింతపాటి వెంకమ్మ గారు దస్తావేజు నెం. 256/1960గా విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిస్టరు కాబడిన విక్రయ దస్తావేజు ద్వారా పొందియున్నారు. దర్మిలా సదరు చింతపాటి వెంకమ్మ గారు ది.22-04-2010వ తేదీన ఇంటెస్టేటుగా చనిపోయినారు. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని డవలప్‌మెంటుకు ఇచ్చేందుకు చిట్టినగర్లోని బిల్డర్‌తో మాట్లాడే నిమిత్తం, నా క్లయింటు ది.29-12-2025వ తేదీన ఉదయం షుమారు 11.00 గంటల సమయంలో షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి చెందిన పైన తెలిపిన నెం. 256/1960గల ఒరిజినల్ విక్రయ దస్తావేజును తీసుకొని దానిని ఒక కవరులో పెట్టుకొని తన మోటారు సైకిల్ వెనుక తగిలించుకొని తన ఇంటి నుండి చిట్టినగర్ బయలుదేరి వెళ్ళారు. నా క్లయింటు చిట్టినగర్ చేరుకున్న తరువాత సదరు ఒరిజినల్ విక్రయ దస్తావేజు కలిగియున్న కవరు మార్గమధ్యలో ఎక్కడో జారి పడిపోయినదని తెలుసుకున్నారు. వెంటనే నాక్లయింటు మరలా తిరిగి అదే మార్గంలో వెదికి చూడగా పోయిన ఒరిజినల్ విక్రయ దస్తావేజు నా క్లయింటుకు దొరకలేదు.

కావున పైన తెలిపిన నెం. 256/1960రు గల ఒరిజినల్ విక్రయ దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల యీ దిగువ అడ్రస్సుకు స్వయముగా గాని, స్పీడు పోస్టు ద్వారా గాని అందచేయగలరు. అయితే పైన తెలిపిన ఒరిజినల్ విక్రయదస్తావేజు దొరికినవారు దానిని తిరిగి ఇవ్వకుండా దానిని ఉపయోగించి ఏవిధమైన వ్యవహారములు చేసిననూ అవి నా క్లయింటును బైండు చేయజాలవు. అంతేకాక సదరు వ్యక్తులపై నా క్లయింటు తీసుకోబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు పూర్తిగా బాధ్యులు అగుదురని యిందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు ఎన్.టి.ఆర్. జిల్లా, (లోగడ కృష్ణా జిల్లా) విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ విల్లేజి పోర్షన్ చేరిన డిమార్కేషన్ నెం.31/1బి రు దాఖలా య.1-90 సెంట్లు శేరి పుంజ భూమికి **హద్దులు:- తూర్పు:** ఉప్పలపాటి చెంచంరాజు గారి భూమి, **దక్షిణం:** బంజరు భూమి, **పడమర:** హనుమాన్ దాసు గారి భూమి, **ఉత్తరం:** శ్రీ కనకదుర్గ అమ్మవారి భూమి. యీ నాలుగు హద్దుల మధ్య గల య.1-90 సెంట్లు శేరి పుంజ భూమి.

గుడిపాటి కృష్ణ అడ్వకేట్ & నోటరీ
హెచ్.ఐ.జి-479, న్యూ హెచ్.బి.కాలనీ, భవానీపురం,
విజయవాడ - 520 012. సెల్ నెం. 98662 15405

ప్రగతి.. బంగారు లోకం..

● 2026లో పూర్తి చేయాల్సిన పనులు ఎక్కువే
● ఈ ఏడాది ప్రారంభోత్సవాలూ చాలానే....

'2026లోకి వచ్చేశాం.. కళ్లెదుటే సాధించాల్సిన అభివృద్ధి లక్ష్యాలు.. మరికొన్ని ఆరంభోత్సవాలకు సిద్ధం.. ఇంకొన్ని పట్టాలెక్కనున్న ప్రాజెక్టులు.. ఆతిథ్య, వ్యవసాయ రంగంపైనే అధిక ఆదాయం కలిగిన ఉమ్మడి కృష్ణాలో పర్యాటక ప్రాజెక్టులు భారీ పెట్టుబడితో కొలువుదీరనున్నాయి. పారిశ్రామిక ప్రగతికి జవసత్వాలు తేనున్నాయి.' - ఈనాడు, అమరావతి



1 అలసిన మోముకు కృష్ణమ్మ దీవెన..

ఎ.కొండూరు గిరిజన తండాల్లో కిడ్నీ వ్యాధులతో పదేళ్లలో 300 మంది చనిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. సుజల ప్రాజెక్టును ఆరంభించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.50 కోట్లతో కృష్ణా జలాల ప్రాజెక్టు చేపట్టారు. పనులన్నీ పూర్తయి ట్రయల్‌రన్ జరుగుతోంది.

లక్ష్యం: జనవరి నుంచి రోజుకు 30 లక్షల లీటర్లు

2 అమ్మకు ఆత్మీయ తోడు..

విజయవాడ ప్రసూతి ఆసుపత్రిలో రూ.25 కోట్లతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణం పూర్తయి.. తుది దశ పనులు జరుగుతున్నాయి. ఈ బ్లాక్ ఆరంభిస్తే.. గర్భిణులకు అదనపు మంచాలు అందుబాటులోకి వస్తాయి. కొత్త ఏడాదిలో దీనిని ఆరంభించనున్నారు.

లక్ష్యం: కొత్తగా సమకూరే మంచాలు 125

3 మల్లవల్లి.. కొలువుల కల్పవల్లి..

మల్లవల్లి పారిశ్రామికవాడలో 1,400 ఎకరాల్లో 377 పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ప్లాట్లు కేటాయించింది. ఆరు నెలల్లో పనులు పట్టాలెక్కించి, 24 నెలల్లో ఉత్పత్తి ఆరంభించాలనేది లక్ష్యం. కొత్త ఏడాదిలో కనీసం సగమైనా.. ఉత్పత్తి ఆరంభిస్తే.. భారీగా ఉపాధి దరి చేరే వీలుంది. ★ జగ్గయ్యపేట పరిధిలో డిఫెన్స్ క్లస్టర్‌లో భాగంగా పరిశ్రమలు రానున్నాయి. ★ జక్కంపూడిలో ఎకనమిక్ టౌన్‌షిప్‌లో భాగంగా ఎంఎస్ఎంఈల కోసం నిర్మించిన మొదటి టవర్‌నూ ఆరంభించను

లక్ష్యం: 377 పరిశ్రమలు.. వేలాది ఉద్యోగాలు

4 త్వర"బడి"లోనే మేలు..

ఉమ్మడి కృష్ణాలో మూడేళ్ల కిందట 168 పాఠశాలల్లో ఆరంభించిన 1,100 అదనపు తరగతి గదుల నిర్మాణం కొలిక్కి రాలేదు. ఇప్పటికే చాలా వరకు ఆగాయి. సగం పనులు చేపట్టి వదిలేశారు. ఈ ఏడాదైనా వీటిని త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంది.

లక్ష్యం: సమకూరాల్సిన అదనపు తరగతి గదులు 1100

5 ఎన్‌హెచ్‌లో కీలక అడుగులు

✦ పశ్చిమ బైపాస్ ప్యాకేజీ 3 పనులు తుది దశకు చేరుకున్నాయి. నిర్మాణం పూర్తి చేసి వేసవి నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నారు. ✦ విజయవాడ రాకుండా 30 కి.మీ మేర గొల్లపూడి మీదుగా హైదరాబాద్‌కు వెళ్లిపోవచ్చు.

✦ అమరావతి ఓఆర్ఆర్‌కు కృష్ణాలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడం, ఎన్టీఆర్‌లోనూ త్వరలో విడుదల కానుండడంతో భూసేకరణ మొదలుకానుంది. హైదరాబాద్-విజయవాడ, విజయవాడ-మచిలీపట్నం, బందరు పోర్టు అనుసంధాన జాతీయ రహదారుల డీపీఆర్‌లు కొలిక్కి రావడంతో త్వరలో పనులు మొదలుకానున్నాయి.



6 ముంపు వీడాలి.. ముప్పు తప్పాలి

చినుకు పడితే.. విజయవాడలో అనేక ప్రాంతాలు మునుగుతున్నాయి. వాన నీటి కాలువల పనులు.. సగమే చేపట్టి మధ్యలో వదిలేశారు. నిరుడు.. వాటిని పూర్తిచేస్తామని చెప్పినా జరగలేదు. ఈ ఏడాదైనా పూర్తిచేస్తే.. నగరవాసులకు ముంపు గండం తప్పినట్లే. పూర్తయిన కాలువల పొడవు: 252 కిమీ

లక్ష్యం: ఇంకా చేపట్టాల్సిన కాలువలు 191కి.మీ

7 పర్యాటకంతో కొత్త ప్రాజెక్టులు..

పర్యాటక రంగంలో ఆదాయాన్ని పెంచే చర్యలు.. వాటి ఫలాలు ఈ ఏడాది అందనున్నాయి. కృష్ణానదిలోని భవాని ద్వీపంలో రూ.50 కోట్లతో పది ఎకరాల్లో పీపీపీ విధానంలో అమ్యూజ్‌మెంట్ పార్కులు, వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయబోతున్నారు.

లక్ష్యం: రూ.50 కోట్లతో హంగులు

8 అమ్మ సన్నిధికి సొబగులు...

దుర్గగుడికి శాశ్వత అన్నదాన శాల, ప్రసాదాల తయారీ భవనం నిర్మిస్తున్నారు. వీటిని 2026లో పూర్తి చేసి వచ్చే దసరా నాటికి అందుబాటులోకి తేనున్నారు.

లక్ష్యం: రెండు భవనాల నిర్మాణ వ్యయం రూ.52 కోట్లు

9 అన్నదాతలకు అండగా..

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పాసుపుస్తకాల పంపిణీ జనవరి 2 నుంచి మొదలుపెడతారు. అదే రోజు నుంచి 4 విడత రీసర్వే మొదలు పెడుతున్నారు. 61 గ్రామాల్లో 1.84 లక్షల ఎకరాల్లో 93 బృందాలు సర్వే చేయనున్నాయి. వేసవి లోపూ సర్వే పూర్తి చేస్తారు

లక్ష్యం: జనవరి 9 నుంచి పాసుపుస్తకాలు 21,275

10 వినువీధిలో వి "హంగామా"..

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.470 కోట్లతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనం.. 80 శాతం పూర్తయింది. లక్ష్యం చేరుకోని గుత్తేదారును తప్పించి.. మరొకరికి జనవరిలో అవకాశం ఇవ్వనున్నారు. తర్వాత మూడు నెలల్లో తుది దశ పూర్తిచేసి.. ఆరంభించనున్నారు. ★ కొత్త టెర్మినల్ విస్తీర్ణం: 3.5 లక్షల చదరపు అడుగులు ★ ప్రయాణికుల సామర్థ్యం: ఒకేసారి 1200 మంది.



బందరులాకుల వద్ద..



బీసెంట్‌రోడ్డు సమీపంలో..

కొత్త సంవత్సరం.. తీయని స్వాగతం

2026 నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో బుధవారం సాయంత్రం నుంచే నగరంలో సందడి వాతావరణం నెలకొంది. మిఠాయిలు, కేకులు, గ్రీటింగ్ కార్డులు, పూలబొకేలు కొనుగోలు చేసేందుకు జనం ఉత్సాహం చూపించారు. -ఈనాడు, అమరావతి







సాంస్కృతిక వేదిక.. సంతోషాల వేడుక..

విజయవాడలోని పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని జీఈవీ రాధామాధవ్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నూతన సంవత్సర స్వాగత వేడుకలు ఘనంగా జరిగాయి. వేదికపై చిన్నారుల డ్యాన్స్‌లు, పెద్దల క్యాట్‌వాక్‌లు ఆకట్టుకున్నాయి. -ఈనాడు, అమరావతి

సరికొత్త ప్రణాళికతో సిద్ధం

★ దీర్ఘకాల సమస్యలకు శాశ్వత పరిష్కారం

★ 'ఈనాడు' ముఖాముఖిలో నగరపాలిక కమిషనర్ ధ్యానచంద్ర



ఈనాడు, అమరావతి

విజయవాడ వాసులను సుదీర్ఘ కాలంగా వేధిస్తున్న.. కొన్ని ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు కొత్త ఏడాదిలో అన్ని రకాల చర్యలు తీసుకుంటామని.. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్.ఎం. వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో పాటు నగరపాలిక ద్వారా వచ్చే ఆదాయంతో ప్రాధాన్యతా క్రమంలో ఒక్కో సమస్యను పరిష్కరిస్తామన్నారు. గడిచిన ఏడాదిలో అనుకున్న లక్ష్యాలను చాలావరకూ చేరుకున్నామని, అదే స్ఫూర్తితో 2026లో మరికొన్ని లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నట్లు 'ఈనాడు' ముఖాముఖిలో వెల్లడించారు. విశేషాలు ఆయన మాటల్లోనే.

ముంచెత్తే వరదకు అడ్డుకట్ట

విజయవాడలో గతంలో ఆరంభించి సగం చేపట్టిన తర్వాత ఆగిపోయిన.. వర్షపు నీటి కాలువల పనులను.. పూర్తిచేసేందుకు అన్ని ప్రణాళికలూ సిద్ధం చేశాం. ఈ ఏడాది పనులు పూర్తి చేసి నగరానికి ముంపు సమస్య లేకుండా చర్యలు చేపడతాం.

మల్టీలెవెల్ కారు పార్కింగ్..

వాహనాలను రహదారుల పక్కన నిలిపేస్తుండడంతో ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తుతున్నాయి. ఈ ఏడాది మల్టీలెవెల్ కారు పార్కింగ్‌ను కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. తొలిదశలో భాగంగా వన్‌టౌన్, బీసెంట్ రోడ్డులో ఏర్పాటు చేస్తాం.

నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ సహకారం..

నగరపాలక సంస్థకు చెందిన పురాతన వాణిజ్య సముదాయ భవనాలు తొలగించి కొత్తగా కట్టబోతున్నాం. నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ సహకారంతో ప్రణాళికలు చేపడుతున్నాం.

యజమానుల గుర్తింపు..

విజయవాడలోని ప్రైవేటు ఖాళీ స్థలాలను శుభ్రం చేయించేందుకు వాటి యజమానులను గుర్తిస్తున్నాం. ఆర్డీవో, జిల్లా రిజిస్ట్రార్, మున్సిపల్ అధికారులతో ప్రత్యేకంగా కమిటీని వేశాం. కొందరికి నోటీసులు జారీ చేశాం.

రహదారులకు పీపీపీ..

నగరంలోని 19 రహదారులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.
● అమృత్ 2.0 పథకంలో భాగంగా ఆర్ఎల్‌నగర్, ఆటోనగర్‌లో రెండు ఎస్టీపీల పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది పూర్తిచేసి ప్రారంభిస్తాం.
● సర్కిల్ 01, 02, 03లో అమృత్‌లో భాగంగా యూజీడీ, మంచినీటి పైప్‌లైన్ల పనులూ పూర్తి చేస్తాం.

ఇంజినీరింగ్ చదువుతూ.. మత్తుకు బానిసయ్యాడు

ఎండీఎంఏ కేసులో మహేష్‌రెడ్డి అరెస్టు



ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్ చదువుతూ చెడు స్నేహాల కారణంగా దారితప్పాడు. డ్రగ్స్‌కు అలవాటు పడి మత్తుకు బానిసయ్యాడు. అదనపు ఆదాయం కోసం మరొకరి వద్ద ఎండీఎంఏ కొనుగోలు చేసి, దానిని అధిక ధరకు విక్రయించడం ప్రారంభించాడు. చివరకు పోలీసులకు దొరికి కటకటాలపాలయ్యాడు. ఇటీవల మాచవరం స్టేషన్ పరిధిలో నమోదైన ఎండీఎంఏ కేసులో బెంగళూరులో డ్రగ్స్ అందజేసిన మహేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బెంగళూరు వెళ్లిన ప్రత్యేక బృందం.. బుధవారం తెల్లవారుజామున నిందితుడిని అక్కడి హాస్టల్‌లో అదుపులోకి తీసుకుని విజయవాడకు తరలించారు. అక్కడ డ్రగ్స్ సరఫరాదారులతో సంబంధాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. మహేష్‌రెడ్డి (ఏ4) నుంచి 2 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో స్టేషన్ నుంచి పరారైన రాజేష్ ఆచూకీ ఇంకా దొరకలేదు. అతని కోసం గాలిస్తున్నారు. బుధవారం రాత్రి నిందితుడిని న్యాయాధికారి ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

స్నేహితురాలి ద్వారా అలవాటు: రాజమహేంద్రవరం నగరానికి చెందిన రామిరెడ్డి మహేష్‌రెడ్డి.. బెంగళూరులో ఈసీఈ చదువుతున్నాడు. అతడికి అనంతపురానికి చెందిన సహ విద్యార్థిని ద్వారా ఎండీఎంఏ తీసుకోవడం అలవాటైందని తెలిసింది. వీరిద్దరు పేయింగ్ గెస్ట్ హాస్టల్‌లో కలిసే ఉంటున్నట్లు తెలిసింది. బెంగళూరులో విజయవాడకు చెందిన అఖిలేష్ పరిచయమయ్యాడు. డ్రగ్స్ కోసం తరచూ అఖిలేష్, జగదీష్‌కుమార్ బెంగళూరు వెళ్లి. . మహేష్ ద్వారా తీసుకుని విజయవాడ వచ్చేవారు. డ్రగ్స్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసి.. దానిని రెట్టింపు ధరకు మహేష్ అమ్మేవాడు. తద్వారా వచ్చిన డబ్బు జల్సాలకు వినియోగించేవాడు. విద్యార్థినిని కూడా అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

రూ.10వేలకు ఆశపడి ఖాతా వివరాలు ఇచ్చేశాడు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : బ్యాంకు ఖాతా తెరిచి, దాని పూర్తి కిట్‌ను అందిస్తే రూ.10వేలు ఇస్తామనగానే ఆశపడ్డాడు. దానివల్ల కేసుల్లో ఇరుక్కుంటారని తెలియడంతో. . కాపాడమంటూ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళితే.. లబ్బీపేటకు చెందిన ఓ యువకుడు (32) ఒక కార్పొరేట్ డయాగ్నోస్టిక్స్ ల్యాబ్‌లో పని చేసి మానేశాడు. బ్యాంకు ఖాతా తెరిచి దానికి సంబంధించిన కిట్, పూర్తి వివరాలు ఇస్తే రూ.10వేలు ఇస్తారని.. 2024లో పక్కింటిలో ఉండే కృష్ణారెడ్డి అనే వ్యక్తి చెప్పడంతో ఆశ పడ్డాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో దానికి అంగీకరించాడు. కృష్ణారెడ్డితో కలిసి భవానీపురంలోని సిటీ యూనియన్ బ్యాంకుకు వెళ్లి ఆధార్, పాన్ కార్డు నకళ్లు ఇచ్చి కరెంట్ ఎకౌంట్ తెరిచారు. కిట్‌ను కృష్ణారెడ్డికి ఇవ్వగా.. ఆయన రూ.5వేలు, రూ.2వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించారు. తర్వాత ఖాతా గురించి పట్టించుకోలేదు. ఇటీవల బ్యాంకు ఖాతాలు ఎవరికైనా ఇస్తే సైబర్ నేరాల్లో ఇరుక్కుంటారంటూ పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వస్తుండడంతో ఆ యువకుడు భయపడిపోయి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై మంగళవారం రాత్రి ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అపరిచితులకు బ్యాంకు ఖాతాల కిట్లు అందిస్తే.. వారు సైబర్ నేరగాళ్లకు అప్పగించి, నగదు లావాదేవీలకు ఉపయోగించుకుంటారని పోలీసులు తెలిపారు. ఈ ఖాతాలను సైబర్ నేరగాళ్లు ఉపయోగించుకుంటే మొదటి ముద్దాయి ఖాతా యజమానే అవుతారని, కేసులు నమోదు చేస్తారని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అపరిచితులైనా, తెలిసిన వారైనా బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వమని అడిగితే ఇవ్వొద్దని వారు సూచిస్తున్నారు.

పెళ్లైన నెలకే.. అదనపు కట్నం వేధింపులు

అమెరికాలోనూ తప్పని బెదిరింపులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : రూ.లక్షల్లో కట్న కానుకలు ఇచ్చి ఘనంగా పెళ్లి చేసినా.. ఇంకా అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్న భర్త, అతని కుటుంబ సభ్యులపై విజయవాడలోని మహిళా పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ గ్రామీణ మండలం అంబాపురానికి చెందిన ఓ యువతి (28)ని గుంటూరుకు చెందిన ఇజ్జాడ మోహన్‌సాయికి ఇచ్చి 2023, నవంబరు 1న వివాహం చేశారు. ఆ సమయంలో రూ.40 లక్షల నగదు, రూ.25 లక్షల విలువైన బంగారం కట్నంగా ఇచ్చారు. పెళ్లైన 15 రోజులకే భర్త.. కొత్త ఇంటిని కొనుగోలు చేశారు. నెల రోజుల తర్వాత నుంచి భర్త, అత్త కొండమ్మ, మామ లక్ష్మణరావు, ఆడపడుచు పిన్నింటి స్రవంతి, ఆడపడుచు భర్త శ్రీనివాస్‌లు అదనపు కట్నం తీసుకురావాలని వేధించడం ప్రారంభించారు. 2023, డిసెంబరులో భర్తతో కలిసి యువతి అమెరికాకు వెళ్లారు. అక్కడకు వెళ్లినా వేధింపులు ఆగలేదు. అదనపు కట్నం తీసుకురాకపోతే.. పుట్టింటికి వెళ్లిపోవాలన్నారు. ఈ క్రమంలో యువతి గర్భందాల్చింది. స్కానింగ్‌లో ఆడపిల్ల అని తేలడంతో మరింతగా వేధించారు. ఆమె వైఫై కనెక్షన్ కూడా నిలిపివేయడంతో.. భరించలేక అమెరికాలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు హెచ్చరించినా తీరు మార్చుకోలేదు. ఈ క్రమంలో తీవ్రమైన మానసిక ఒత్తిడి కారణంగా.. గర్భంలోనే మృతి చెందిన బిడ్డను ప్రసవించారు. రెండో ప్రెగ్నెన్సీకి కనీసం ఏడాది వ్యవధి ఉండాలని వైద్యులు సూచించారు. అయితే వెంటనే గర్భందాల్చమని భర్త ఒత్తిడి చేస్తుండడంతో ఆమె 2024, నవంబరు 17న భారత్‌కు తిరిగి వచ్చేశారు. అప్పటి నుంచి భార్య గురించి పట్టించుకోకపోవడంతో.. విజయవాడ మహిళా పోలీస్‌స్టేషన్‌లో బుధవారం బాధితురాలు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీ.. విజేతలు నలంద.. ఎన్ఆర్ఐ

ఉత్కంఠగా సాగిన సీనియర్స్ ఫైనల్ మ్యాచ్

బౌలింగ్‌లో నిప్పులు చెరిగిన రామ్‌చరణ్


న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు: కానూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో నిర్వహించిన ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) ముగిసింది. బుధవారం ఉదయం జరిగిన సీనియర్స్ ఫైనల్ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. నలంద డిగ్రీ కళాశాల, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య జరిగిన తుది పోరులో నిర్ణీత ఓవర్లలో ఇరు జట్లు సమానంగా 123 పరుగులు చేశాయి. దాంతో సూపర్ ఓవర్ అనివార్యమైంది. బ్యాటింగ్‌కు దిగిన వీఆర్ సిద్ధార్థ జట్టు ఆరు బంతుల్లో రెండు వికెట్లు కోల్పోయి మూడు పరుగులు చేసింది. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన నలంద జట్టు రెండు బంతుల్లో నాలుగు పరుగులు చేసి ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన నలంద జట్టు 15 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. జె.బన్నీ(53) రాణించగా.. బి.విశాల్ 32 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ ఎం.దినేష్ 18 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన వీఆర్ సిద్ధార్థ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. టి.ఊర్ధేశ్వర 44 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. పి.సత్రూపన్ 23 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ ఎన్.భానుప్రసాద్ 21 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. వీఆర్ సిద్ధార్థ జట్టు ఆరు బంతుల్లో 13 పరుగులు చేస్తే విజయం సాధిస్తుంది. కానీ 12 పరుగులే చేయడంతో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. దాంతో సూపర్ ఓవర్‌కు దారితీసింది. జె.బన్నీ మ్యాచ్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.



లయోలా జూనియర్ కళాశాల బ్యాట్స్‌మెన్ వికెట్ తీసిన ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల బౌలర్ రామ్‌చరణ్

వరుసగా ఐదు బంతులకు ఐదు వికెట్లు తీసి..: జూనియర్స్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల జట్టు 102 పరుగుల తేడాతో ఆంధ్రా లయోలా జూనియర్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన లయోలా జట్టు బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన ఎన్ఆర్ఐ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో అయిదు వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. బి.ఆకాష్ 25, పి.రేనేష్ 25 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ ఎం.దుర్గాప్రసాద్ 31 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన లయోలా జట్టు 4.4 ఓవర్లలో 17 పరుగులకే కుప్పకూలింది. ప్రత్యర్థి బౌలర్ జె.రామ్‌చరణ్(7/2) హ్యాట్రిక్ సాధించాడు. ఒక ఓవర్‌లో ఐదు బంతులకు ఐదు, మరో ఓవర్‌లో రెండు వికెట్లు తీసి బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. జె.రామ్‌చరణ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..



రామ్‌చరణ్



బన్నీ



జూనియర్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన లయోలా జూనియర్ కళాశాల క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న శాప్ ఎండీ భరణి తదితరులు



సీనియర్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

క్రీడా స్ఫూర్తితో గెలుపు ఓటములు స్వీకరించండి



మాట్లాడుతున్న శాప్ ఎండీ భరణి, వేదికపై ఈనాడు విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్.కె.కిషోర్‌కుమార్, కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ (స్పోర్ట్స్) డా.హరికిశోర్, కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్సియల్ స్కూల్ కన్వీనర్ వి.శశికళ, గోదావరి గ్రామీణ యూనివర్సిటీ విజయవాడ బ్రాంచ్ మేనేజర్ శైలజ, ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అకడమిక్ అడ్వయిజర్ కె.రవీంద్రకుమార్, గుంటూరు చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డీన్ పి.బాలమురళి

ముగింపు కార్యక్రమానికి శాప్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఈనాడు' 15 ఏళ్లుగా 'ఈఎస్ఎల్' నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మీడియా సంస్థ నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొని రాణించడం ద్వారా క్రీడాకారులు మరింత వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. క్రమశిక్షణతో పోటీలో పాల్గొనడం ముఖ్యమని, ఓడినా.. గెలిచినా.. క్రీడా స్ఫూర్తితో స్వీకరించాలని సూచించారు. పోటీల సమయంలో బయటకు వచ్చినప్పుడు మంచిని స్వీకరించి, చెడును వదిలేయాలని అన్నారు. కార్యక్రమానికి 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్.కె.కిషోర్‌కుమార్ అధ్యక్షత వహించగా.. జీజీయూ విజయవాడ శాఖ మేనేజర్ శైలజ, చలపతి ఇంజినీరింగ్ కళాశాల డీన్ (రీసెర్చ్) డాక్టర్ పి.బాలమురళి, కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ స్పోర్ట్స్ సంచాలకుడు డాక్టర్ కాకర్ల హరి కిషోర్, ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అకడమిక్ అడ్వైజర్ కె.రవీంద్రకుమార్, కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ కన్వీనర్ వి.శశికళ పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్.కె.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు త్వరలో జరిగే రీజనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించాయని వెల్లడించారు.

కొన్నేళ్లుగా పాన్ ఇండియా మార్కెట్‌పై ఆధిపత్యం ప్రదర్శిస్తూ వచ్చిన తెలుగు సినిమా 2025లో కాస్త తగ్గింది. 2026లో మాత్రం అస్సలు తగ్గేదేలే అనే సంకేతాలిస్తోంది. ఇప్పటికే ఆ మార్కెట్లో విజయ పతాకాన్ని ఎగరేసి.. దేశవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకున్న తారలంతా ఈ ఏడాది ఆసక్తికరమైన సినిమాలతో అలరించేందుకు సన్నద్ధమయ్యారు. సంక్రాంతి నుంచే ఆ జోరు మొదలుకాబోతోంది.

ఈనాడు సినిమా 2026


ప్రభాస్

పాన్ ఇండియా... ఊపిరి పీల్చుకో!

2026లో మళ్లీ మనదేనా హవా?

మార్కెట్‌ని ఊరిస్తున్న అగ్ర తారల చిత్రాలు


అల్లు అర్జున్ | రామ్ చరణ్ | ఎన్టీఆర్ | నాని

2025లో పాన్ ఇండియా మార్కెట్‌పై తెలుగు సినిమాలు ప్రభావం చూపించలేకపోవచ్చు కానీ.. ఇతర దక్షిణాది సినిమాలు మాత్రం ఆ పట్టుని కొనసాగించాయి. కన్నడ నుంచి 'కాంతార: చాప్టర్ 1', మలయాళం నుంచి 'లోక చాప్టర్ 1: చంద్ర', తమిళం నుంచి రజనీకాంత్ 'కూలీ' సినిమాలు భారీస్థాయిలో వసూళ్లు సొంతం చేసుకున్నాయి. కానీ తెలుగు నుంచే సందడి కరువైంది. ఆ మార్కెట్లో పట్టున్న మన హీరోలు ప్రభాస్, అల్లు అర్జున్ నుంచి సినిమాలే రాలేదు. రామ్‌చరణ్, ఎన్టీఆర్ సినిమాలు అంచనాల్ని అందుకోలేకపోయాయి. 'మిరాయ్'తోపాటు ఒకట్రెండు సినిమాలు ప్రారంభ వసూళ్లు సొంతం చేసుకున్నా...బలమైన తెలుగు సినిమాలు లేక ఆ మార్కెట్ కళ తప్పినట్టు కనిపించింది. 2026లో మాత్రం ప్రభాస్ రెండు సినిమాలతో సందడి చేయనున్నారు. అల్లు అర్జున్, రామ్‌చరణ్, ఎన్టీఆర్ సినిమాలూ విడుదల కాబోతున్నాయి. యువ కథానాయకుల జాబితా కూడా పెద్దదే.

రాజాసాబ్‌తో మొదలు...

కొత్త ఏడాదిలో తెలుగు పాన్ ఇండియా సినిమాల జోరు 'ది రాజాసాబ్' నుంచి మొదలు కాబోతోంది. ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన్న చిత్రమిది. రూ.400 కోట్లకు పైగా వ్యయంతో ఈ చిత్రం రూపొందింది. తాత, మనవడి చుట్టూ తిరిగే హారర్ ఫాంటసీ సినిమా ఇది. ప్రభాస్ ఈ ఏడాది 'ది రాజాసాబ్'తోపాటు, హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ' సినిమాతోనూ అలరించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్టులో విడుదల కోసం సిద్ధమవుతోంది. 'పుష్ప' సినిమాలతో దేశం మొత్తాన్ని ఏకం చేసిన అల్లు అర్జున్ హీరోగా అట్లీ తెరకెక్కిస్తోన్న సినిమా 2026లోనే విడుదల కాబోతోంది. గ్లోబల్ స్థాయిలో రూపొందుతున్న చిత్రమిది. రామ్‌చరణ్ కథానాయకుడిగా... బుచ్చిబాబు సానా రూపొందిస్తోన్న 'పెద్ది', నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తోన్న 'ది ప్యారడైజ్' సినిమాలు కూడా గ్లోబల్ మార్కెట్‌ని లక్ష్యంగా చేసుకునే రూపొందుతున్నాయి. ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ఈ ఏడాది విడుదలల్లో మరో ప్రధానమైన ఆకర్షణ.



రష్మిక


సమంత

నాయికలూ సిద్ధం

2025లో అటు హిందీలోనూ... ఇటు దక్షిణాదిలోనూ సత్తా చాటిన రష్మిక ఈ సంవత్సరం నాయికా ప్రధానమైన 'మైసా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా టీజర్ ఇటీవలే విడుదలైంది. రష్మిక నటనలోని యాక్షన్ కోణాన్ని ఆవిష్కరించే చిత్రమిది. నందిని రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న 'మా ఇంటి బంగారం' కూడా కథానాయిక సమంతకు వివిధ భాషల్లో ఉన్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. ఫాంటసీ అంశాలున్న కథ అని సమాచారం. "దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని మెప్పించే కథల్ని చెప్పడంలో దక్షిణాది దర్శకులు రాటుదేలారు. ఇప్పుడు గ్లోబల్ మార్కెట్‌పై కూడా దృష్టిపెట్టారు. 2025లో తెలుగు నుంచి ఎక్కువ సినిమాలు విడుదల కాకపోవడంతోనే పాన్ ఇండియా మార్కెట్‌లో మన ప్రభావం కాస్త తగ్గినట్టు అనిపించిందంతే. 2026లో మన సినిమాల ప్రభావం చాలా గట్టిగా ఉంటుంది. మా నుంచే ఈసారి 'జీ2', 'ది ఇండియా హౌస్' చిత్రాలొస్తున్నాయి. అగ్ర కథానాయకుల పాన్ ఇండియా చిత్రాలు చాలానే సిద్ధమవుతున్నాయి. ఆ ప్రభావం మార్కెట్‌పై ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తోంది" అన్నారు ప్రముఖ నిర్మాత అభిషేక్ అగర్వాల్.

యువ కథానాయకులు కూడా...


విజయ్ దేవరకొండ



నిఖిల్

'కార్తికేయ 2' సినిమాతో దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు చేరువైన నిఖిల్ ఈసారి 'స్వయంభూ', 'ది ఇండియా హౌస్' లాంటి పీరియాడికల్ సినిమాలతో సందడి చేయనున్నారు. 'మేజర్' సినిమాతో పాన్ ఇండియా హీరో అనిపించుకున్న అడివి శేష్ 'డెకాయిట్', 'జీ2' సినిమాలతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఇప్పటికే 'డెకాయిట్' ప్రచార కార్యక్రమాలు మొదలైపోయాయి. సాయిదుర్గా తేజ్ 'సంబరాల ఏటిగట్టు' సినిమా కూడా పాన్ ఇండియా మార్కెట్‌నే లక్ష్యంగా చేసుకుని రూపొందుతోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా... రవికిరణ్ కోలా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రౌడీ జనార్ధన' కూడా పలు భాషల్లో విడుదలవుతోంది. 2026లో విడుదలవుతున్న నాగచైతన్య 'వృషకర్మ', చిరంజీవి 'విశ్వంభర' చిత్రాలు కూడా భారీ హంగులతో రూపొందుతున్నవే.


అడివి శేష్

కుటుంబ విలువల చిత్రం

భారతీయతకు మూలం, బలం కుటుంబ వ్యవస్థే అని చెప్పే కథతోనే 'సఃకుటుంబానాం' తెరకెక్కిందని, ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా అన్నారు ఉదయ్‌శర్మ. ఆయన దర్శకత్వంలో... రామ్‌కిరణ్, మేఘ ఆకాష్ జంటగా నటించిన చిత్రమిది. హెచ్.మహాదేవ గౌడ్ నిర్మించారు. రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం ముఖ్యపాత్రల్ని పోషించారు. ఈ చిత్రం ఈరోజే విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "కుటుంబ విలువల గురించి మరింత అందంగా, అర్థవంతంగా చెప్పే కథ ఇది. ప్రత్యేక ప్రదర్శనకు మంచి స్పందన లభించింద"న్నారు.


రామ్‌కిరణ్

అందుకే సంక్రాంతికి వస్తున్నాం!


మీనాక్షి, నవీన్ పొలిశెట్టి

"సంక్రాంతి సినిమా అంటేనే వినోదం. అందుకే కడుపుబ్బా నవ్వించే మా 'అనగనగా ఒక రాజు' చిత్రాన్ని పండక్కి విడుదల చేస్తున్నాం. దీన్ని కుటుంబ సమేతంగా చూసి ఆనందించాలని కోరుతున్నాం" అన్నారు కథానాయకుడు నవీన్ పొలిశెట్టి. ఆయన.. మీనాక్షి చౌదరి జంటగా నటించిన ఈ చిత్రాన్ని మారి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో 'రాజు గారి పెళ్లి రిసెప్షన్' పేరుతో ఓ వేడుకని నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. "వరుసగా మూడు విజయాల తర్వాత అదే ఉత్సాహంలో అందరి ముందుకు మరో అదిరిపోయే చిత్రం తీసుకొద్దామనుకున్నా. కానీ, ఓ యాక్సిడెంట్ వల్ల కొన్ని నెలలు చిత్రీకరణకు దూరమయ్యా. మానసికంగా, శారీరకంగా కోలుకోవడానికి చాలా టైమ్ పట్టింది. ఆ సమయంలోనే మా బృందంతో కలిసి 'అనగనగా ఒక రాజు' కథ రాసుకున్నా. గత ఫిబ్రవరిలో చిత్రీకరణ ప్రారంభించా. అందరి ప్రేమతో ఆరు నెలల్లోనే సరదాగా షూట్ పూర్తి చేసేశాం. సినిమా చాలా బాగా వచ్చింది. ఇంతటి వినోదాత్మక చిత్రాన్ని పండక్కి విడుదల చేయడమే కరెక్ట్ అనుకున్నాం. ఒకప్పుడు నేను ఏ హీరోల సినిమాలకైతే థియేటర్లకు వెళ్లి సినిమా చూసేవాడినో.. ఇప్పుడు ఆ అభిమాన హీరోల సినిమాలతో పాటు నా చిత్రం విడుదల కానుండటం సంతోషంగా ఉంది. ఈ పండక్కి విడుదలవుతున్న అన్ని చిత్రాలు విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఇన్ని మంచి సినిమాలతో ఈసారి సంక్రాంతి నిజంగానే తెలుగు ప్రేక్షకులకు సినిమా పండగను తీసుకొచ్చింది" అన్నారు. "ఇదొక మంచి కుటుంబ కథా చిత్రం. దీన్ని అందరూ ఆదరించాలని కోరుతున్నా" అంది నటి మీనాక్షి చౌదరి.

ప్రథమార్ధం వినోదాత్మకం.. ద్వితీయార్ధం భావోద్వేగభరితం


దుష్యంత్, ఆషికా రంగనాథ్

'గత వైభవం' చిత్రంతో కొత్త ఏడాదికి తెలుగు ప్రేక్షకుల్ని పలకరించనుంది నటి ఆషికా రంగనాథ్. ఆమె.. దుష్యంత్ జంటగా నటించిన ఈ సినిమాని సునీ తెరకెక్కించారు. ఇది ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ద్వారా నేడు తెలుగులో విడుదలవుతోంది. ఈ నేపథ్యంలోనే బుధవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆషికా రంగనాథ్ మాట్లాడుతూ.. "ఈ చిత్రం ఇప్పటికే కన్నడలో విడుదలై మంచి ఆదరణ దక్కించుకుంది. ఇప్పుడదే నమ్మకంతో తెలుగులో విడుదల చేస్తున్నాం. దీన్ని తెరపై చూస్తున్నప్పుడు ఒరిజినల్ తెలుగు సినిమా చూస్తున్న అనుభూతే కలుగుతుంది. ప్రథమార్ధం వినోదాత్మకంగా.. ద్వితీయార్ధం భావోద్వేగభరితంగా సాగుతుంది'' అంది. ఈ కార్యక్రమంలో బెక్కెం వేణు గోపాల్ పాల్గొన్నారు.

నచ్చకుంటే ఈస్థాయి వసూళ్లు వచ్చేవి కావు!


సిరి, అఖిల్ రాజ్, వంశీ నందిపాటి, దామోదర్ ప్రసాద్, డి.సురేశ్‌బాబు, బన్నీవాస్, అశోక్ కుమార్, శ్రీనివాస్ మన్నె

"చిన్న సినిమా.. పెద్ద సినిమా అనేది ఏం లేదు. కంటెంట్ బాగుందంటే ఏ చిత్రాన్నైనా ఆదరిస్తారు. ప్రస్తుతం ప్రేక్షకులు మంచి కథలు కోరుకుంటున్నారు. వాళ్లు పెట్టే డబ్బులకు, వెచ్చించే సమయానికి తగ్గ కంటెంట్‌ని మనం ఇస్తున్నామా? లేదా? అన్నది దర్శక నిర్మాతలు చూసుకోవాలి'' అన్నారు నిర్మాత డి.సురేశ్‌బాబు. ఆయన బుధవారం హైదరాబాద్‌లో 'ఈషా' చిత్ర సక్సెస్‌మీట్‌లో పాల్గొన్నారు. త్రిగుణ్, అఖిల్ రాజ్, హెబ్బా పటేల్, సిరి హనుమంతు ప్రధాన పాత్రల్లో శ్రీనివాస్ మన్నె తెరకెక్కించిన చిత్రమిది. కేఎల్ దామోదర్ ప్రసాద్ సమర్పణలో పి హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ సినిమా నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వారా ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలోనే బుధవారం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. నిర్మాత డి.సురేశ్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "నిజాయతీగా కష్టపడితే మనం ఎప్పుడూ ఫెయిలవ్వమని 'ఈషా' విజయంతో మరోసారి నిరూపితమైంది'' అన్నారు. ''అన్ని చిత్రాలు అందరికీ కనెక్ట్ అవ్వవు. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చకపోతే ఐదు రోజుల్లో రూ.6కోట్ల గ్రాస్ వచ్చేది కాదు'' అన్నారు నిర్మాత బన్నీవాస్. దర్శకుడు శ్రీనివాస్ మన్నె మాట్లాడుతూ.. "ప్రేక్షకులు ఈ చిత్రాన్ని చూసి బాగుందని చెప్పారు. కానీ, బుక్ మై షోలో చూస్తే ఫుల్ నెగటివిటీ కనిపించింది. ఆ సమయంలో నాకు ఆత్మహత్య చేసుకోవాలనిపించింది. కానీ, ఆఖరికి ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ అయింది'' అన్నారు. ఈ కార్యక్రమంలో దామోదర్ ప్రసాద్, అఖిల్ రాజ్, సిరి, కల్యాణీ మాలిక్, బెక్కం వేణుగోపాల్, యదు వంశీ, రామ్ జగదీశ్, వంశీ నందిపాటి, అశోక్ కుమార్, ఆర్ ఆర్ ధ్రువన్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు కంటే గౌరవం ముఖ్యం


నందు

"విభిన్నమైన స్క్రీన్‌ప్లేతో.. ఒక న్యూ ఏజ్ ఫిల్మ్ మేకింగ్‌తో రూపొందిన చిత్రం 'సైక్ సిద్ధార్థ'. దీని ఎడిటింగ్ కూడా ప్రేక్షకులు ఇప్పటి వరకు చూడని విధంగా ఉంటుంది" అన్నారు శ్రీ నందు. ఇది తను హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మించిన సినిమా. వరుణ్ రెడ్డి తెరకెక్కించారు. యామిని భాస్కర్ కథానాయిక. ఈ సినిమా ఈరోజు థియేటర్లలోకి వస్తోంది. ఈ నేపథ్యంలోనే బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు నందు.

◆ "నా 18ఏళ్ల కెరీర్‌లో చాలా సినిమాలు చేశాను . కానీ 'సైక్ సిద్ధార్థ'ని ఇదే నా అంతిమ లక్ష్యం అన్నట్లుగా దీన్ని పూర్తి చేశా. మమ్మల్ని నమ్మి ఈ చిత్రాన్ని సురేశ్ బాబు తీసుకోవడంతోనే మేము 90శాతం గెలిచేసినట్లుగా అనిపించింది''.

◆ "ఒక అబ్బాయి జీవితంలోకి అమ్మాయి రావడంతో మోసపోతాడు. అదే అబ్బాయి జీవితంలోకి మరో అమ్మాయి రావడంతో బాగుపడతాడు. ఈ చిత్ర కథ చెప్పడానికి ఇంతే సింపుల్ లైన్‌గా ఉంటుంది. కానీ, దీన్ని తెరపై చూపించిన విధానం చాలా కొత్తగా ఉంటుంది. ప్రథమార్ధం ఓ వీడియో గేమ్‌లా చాలా కొత్తగా ఉంటుంది. ద్వితీయార్ధం బలమైన భావోద్వేగాలతో అందరి మనసుల్ని హత్తుకుంటుంది. కచ్చితంగా ఈ సినిమా జెన్‌జీ ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది".

◆ "నాకు డబ్బు కంటే గౌరవం ముఖ్యం. డబ్బు కావాలంటే నేను సినిమాలే చేయాల్సిన అవసరం లేదు. నేను ఇదే పరిశ్రమని నమ్ముకుని 18ఏళ్లుగా ఉన్నా. ఎన్నో చిత్రాలు చేశా. బాగా నటించానని ప్రశంసలొచ్చాయి. అది నాకు చాలా సంతృప్తినిచ్చింది. ఇప్పుడు సోలో హీరోగా కూడా నిలదొక్కుకోగలనని ప్రశంస వస్తే మళ్లీ ఒక కొత్త ఊపిరి అందుతుంది. మరో పదేళ్లు పరిగెత్తడానికి ఉత్సాహం దొరుకుతుంది. ప్రస్తుతం నేను.. వెన్నెల కిశోర్, వైవా హర్ష కలిసి ఓ సినిమా చేస్తున్నాం. అనిల్ రావిపూడి దగ్గర పని చేసిన ప్రవీణ్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు''.

మోడ్రన్ గంగ

'కేజీఎఫ్' విజయాల తర్వాత కథానాయకుడు యశ్ నుంచి రానున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాని గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్నారు. నయనతార ఈ చిత్రంలో గంగ అనే శక్తిమంతమైన పాత్రలో అలరించనుంది. ఈ విషయాన్ని బుధవారం అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర బృందం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసింది. నయన్ అందులో మోడ్రన్ డ్రెస్‌లో గన్ పట్టుకుని స్టైలిష్‌గా నడిచొస్తూ కనిపించింది. ఈ సందర్భంగా దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ మాట్లాడుతూ.. "ప్రేక్షకులు నయన్‌ని ఇప్పటి వరకు చూడనటువంటి విభిన్నమైన పాత్రలో చూడబోతున్నారు. నిజాయతీతో పాటు భావోద్వేగాలు నిండిన లోతైన పాత్రగా ఆమె చేసిన గంగ పాత్ర కనిపిస్తుంది'' అన్నారు. ఇక ఈ సినిమాలో నదియాగా కియారా, ఎలిజబెత్‌గా హ్యూమా ఖురేషీ కనిపించనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ మార్చి 19న థియేటర్లలోకి రానుంది.


నయనతార

అందర్నీ అలరించే 'మ్యాజిక్'


జితేంద్ర, మెహర్ రమేశ్, రాజు సత్యం

జితేంద్ర జోషి హీరోగా రవీంద్ర విజయ కర్మార్కర్ తెరకెక్కించిన మరాఠీ చిత్రం 'మ్యాజిక్'. రాజు సత్యం నిర్మించారు. ఈ సినిమా ఈరోజు విడుదల కానున్న నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. దర్శకుడు మెహర్ రమేశ్, ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ''అందర్నీ అలరించే మంచి కథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు హీరో జితేంద్ర జోషి. ఈ కార్యక్రమంలో నిర్మాత రాజు సత్యం, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధు ప్రేమకథ


శృతి, మహన్, మోహన సిద్ధి

"మంచి ప్రేమకథతో పాటు చక్కటి సందేశం నిండి ఉన్న సినిమా 'సిద్ధు గాడి లవ్‌స్టోరీ'' అన్నారు హీరో మహన్. ఆయన.. శృతి, మోహన సిద్ధి నాయకానాయికలుగా నటించిన ఈ చిత్రాన్ని రమేశ్ సి తెరకెక్కించారు. సావిత్రమ్మ నిర్మించారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. దర్శకుడు వీఎన్ ఆదిత్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

దీక్షతో పనిచేస్తే...


ప్రతాని రామకృష్ణగౌడ్, అక్సఖాన్

ఎన్టీఆర్ అభిమానిగా.. ఆయన సినిమా పేరుని గుర్తు చేస్తూ, తాను సినిమా తీయడం అదృష్టంగా భావిస్తున్నా అన్నారు ప్రతాని రామకృష్ణగౌడ్. ఆయన దర్శకనిర్మాతగా తెరకెక్కిన చిత్రం 'ఆర్కే దీక్ష'. కిరణ్ కథానాయకుడిగా నటించారు. అక్సఖాన్, అలేఖ్యరెడ్డి కథానాయికలు. ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ప్రముఖ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు, నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ "దీక్షతో పని చేస్తే ఏదైనా సాధించగలం అని చెప్పే కథ ఇది. దేశంకోసం ప్రాణాలర్పించిన సైనికుడు మురళీనాయక్‌ని గుర్తు చేసుకుంటూ ఇందులో ఒక పాట ఉంటుంద"న్నారు.

మకరందం
makarandam@eenadu.in
గురువారం జనవరి 1, 2026
ఈనాడు
16
మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512



అలా మొదలైతే.. అంతా ఆనందమే!

కోటి ఆశలు, అనంతకోటి ఊహలు ఊయలలూగుతూ ముందుకొచ్చి వాలుతుంది కొత్త సంవత్సరం. దైవమే తానై... తానే దైవమైన కాలం ఆశలూ, అవకాశాల వరాల మూటను తెచ్చి దోసిట పెడుతుంది. దేన్ని ఎంచుకోవాలి, ఎలా ముందుకు సాగాలన్నదే ప్రతి సంవత్సరం తొలి రోజున ఎదురయ్యే ప్రశ్న. దానికి సమాధానం దొరికిన నాడు పన్నెండు నెలలపాటు సాగే కాలాన్ని జీవన ప్రగతికి పూలబాటలా మార్చుకోవచ్చు. అందుకోసం కొన్ని లక్ష్యాలను ఊతంగా చేసుకోవాలి.

సంవత్సరమంతా సుఖసంతోషాలతో సాగాలంటే.. కొన్ని స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలి. 12 నెలల కాలచక్రానికున్న మొదటి ఆకు కదిలే వేళలోనే వాటిని సంవత్సరాంతం వరకూ కొనసాగేలా ప్రణాళిక రచించుకోవాలి. లక్ష్య నిర్దేశం ఎందుకంటే.. అభ్యున్నతి సాధించేందుకు. జీవనయానం ఆనందదాయకంగా సాగేందుకు. నియమాలు, నిబంధనలు, పద్ధతులు, ప్రణాళికలు లేకుంటే.. అంతా అగమ్యగోచరమై దారీ తెన్నూ తోచక.. అశాంతి, అనిశ్చితి, అభద్రతలకు దారితీస్తుంది. నిద్రపట్టని దుర్భర రాత్రుల చెంతకు చేరుస్తుంది. అసలు నిద్ర ఎవరికి పట్టదంటే- 'నిశ్చిత నిర్ణయాలు తీసుకోనివారికే' అని భారతం తెలియజేస్తుంది.

అవి అశాంతి కలిగిస్తాయి..

సంజయుడు కౌరవుల పక్షాన పాండవుల దగ్గరకు రాయబారిగా వెళ్లాడు. తిరిగొచ్చిన తర్వాత పాండవులకు వారి రాజ్యాన్ని ఇచ్చేయడమే మేలని ధృతరాష్ట్రుడితో అన్నాడు. లేదంటే యుద్ధం తప్పదని, యుద్ధమే సంభవిస్తే నీ కుమారులంతా మరణించాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పాడు. అవే మాటలు విదురుడు కూడా చెప్పినప్పటికీ పుత్రుల పట్ల ఉన్న దురభిమానం వల్ల ధృతరాష్ట్రుడు చెవిన పెట్టలేదు. కానీ, తన కుమారులు యుద్ధంలో మరణిస్తారేమోనన్న భయంతో ఆందోళన చెందాడు. విదురుణ్ణి పిలిపించుకుని తనకు నిద్రపట్టటంలేదు, అందుకు కారణమేమిటో తెలియటంలేదని దిగులుగా చెప్పాడు. ఆ మాటలకు బదులిస్తూ 'ఎలాంటి అనారోగ్యం లేకున్నా నిద్ర పట్టనిది నలుగురికే... 1.బలవంతుడైన శత్రువు తనపై దాడి చేస్తాడేమోనని భయపడే బలహీనుడికి, 2.సంపద కోల్పోయినవానికి, 3.దొంగకు, 4.కామంతో రగిలిపోయేవానికి. కాబట్టి.. మహారాజా! వీటిలో ఏ కారణం వల్ల నీకు నిద్రపట్టడం లేదో ఆలోచించు' అన్నాడు విదురుడు. నూతన సంవత్సర శుభారంభ వేళ విదురుడు చెప్పిన ఆ నాలుగు లక్షణాలను విడిచిపెట్టాలని తీర్మానించుకుంటే.. సంవత్సరమంతా ఆనందదాయకంగా సాగుతుంది. మనమంతా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటూ అజాత శత్రువులుగా, అందరికీ కావలసినవారిగా ఆత్మీయస్పర్శతో మెలిగేందుకు ప్రయత్నించాలి.

విజ్ఞత కరవైనా, దురలవాట్లకు చేరువైనా సంపద కోల్పోయి, అశాంతిపాలవడం తథ్యం. కాబట్టి సదా విచక్షణతో మెలగాలి. దొంగకు నిద్రపట్టదన్నాడు విదురుడు. పరాయి సొత్తు ఆనందాన్ని ఇవ్వకపోగా అవమానాలూ, పరాభవాలూ దరిచేరుస్తుంది. మనది కానిదాన్ని ఆశించకూడదనేది కొత్త సంవత్సర నిర్ణయాల్లో ఒకటవ్వాలి. అసంబద్ధ కామం అశాంతి కలిగిస్తుంది. కాబట్టి వ్యామోహాలూ, ప్రలోభాలను త్యజించాలన్న నిర్ణయాన్ని కొత్త సంవత్సర సూత్రాలలో చేర్చుకోవాలి. అలా చేసినప్పుడు సంవత్సరమంతా యోగదాయకంగా ఉంటుంది.

సద్భావాలు.. సదాచారాలు..

వ్యవసాయో వ్యవస్థానః సంస్థానః స్థానదో ధ్రువః
వరర్ధిః పరమస్పష్టః తుష్టః పుష్టః శుభేక్షణః


విష్ణు సహస్రనామ స్తోత్రంలోని ఈ శ్లోకానికి 'మానవాళి అభ్యున్నతి కోసం కృషి చేసేవాడు, అన్ని వ్యవహారాలనూ చక్కగా నడిపేవాడు, సకల జీవులకూ గమ్యస్థానమైనవాడు, స్థిరమైన స్థానం ఇచ్చేవాడు, ధ్రువమైనవాడు'- అనేది అర్థం. ఆ స్వామి ఆదర్శగుణగణాల వర్ణన ఇది. శ్రీమహావిష్ణువు మనకు ఆదర్శ దైవం, ఆదర్శనాయకుడు. ఆ దైవంలోని సద్గుణాలను అలవరచుకునేందుకు ప్రయత్నించాలి. అన్నిటినీ మించి శ్లోకం చివరన ఉన్న 'శుభేక్షణః' అన్న నామాన్ని అనుసరించాలి. కొత్త సంవత్సరంలో మన లక్ష్యాలన్నిటికీ మణిమకుటంలా నిలుస్తుంది. 'శుభేక్షణ' అంటే శుభకరమైన, నిర్మలమైన దృష్టి ఉన్నవాడని అర్థం. మన అంతరంగం స్వచ్ఛంగా, శాంతంగా ఉండాలి. సద్భావాలు, సదాచారాలను అలవరచుకోవాలి. అలాంటి స్థితి సంవత్సరమంతా ఉండేలా చూసుకుంటూనే ఎవరికి వారు తీర్మానించుకుంటే ఇక లోకమంతా శాంతిమయమే. మనం ఎంత ఉత్తమంగా ఉండాలో, ఉన్నతంగా ఎదగాలో తీర్మానాలు చేసుకున్నాం సరే.. కానీ ఒక శత్రువు నిరంతరం మనల్ని వెన్నంటే ఉంటూ, వెంటాడుతూ ప్రయత్నిస్తుంటుంది. అనుకున్న పనులకు ఆటంకం కలిగిస్తుంటుంది. ఆ శత్రువు మరెవరో కాదు.. సోమరితనం. అది మన చెంతకు చేరకుండా అప్రమత్తంగా ఉండాలి.

'రేపెన్నో అడ్డంకులు ఎదురవుతాయని పని చేపట్టనివారు అధములు. పని మొదలుపెట్టినప్పటికీ ఆటంకాలు ఎదురవగానే వదిలేసేవారు మధ్యములు. అవరోధాలకు వెనకడుగు వేయక.. వాటిని అధిగమించి తుది వరకూ శ్రమించేవారు ఉత్తములు. అది కార్యసాధకుల లక్షణం' అన్నాడు భర్తృహరి. మనం మిగతా ఇద్దరిలా కాక ఉత్తములుగా ఉండేందుకు ప్రయత్నించాలి. మనలో కొందరు మంచి పనులను ఆరంభిస్తారు కానీ.. వాటిని కొనసాగించడంలో విఫలమవుతుంటారు. కొత్త సంవత్సర ప్రారంభ వేళ తీసుకునే నిర్ణయాలకు ఇది వర్తించకూడదు. ఎందుకంటే సంవత్సరం మారుతున్నప్పుడల్లా ఒక అడుగు ముందుకే పడాలి. అలా పడకపోతే అభివృద్ధి ఆగిపోతుంది. కాబట్టి చక్కటి తీర్మానాలు చేసుకుందాం. వాటిని ఆచరిద్దాం. అప్పుడే లక్ష్యం చేరువవుతుంది. విజయం చేజిక్కుతుంది.

– ప్రొఫెసర్ యల్లాప్రగడ మల్లికార్జున రావు, గుంటూరు

అప్పుడే అల్లాహ్ క్షమ

ఇస్లాం సందేశం



మనుషులు సహజసిద్ధంగానే కాస్తంత చపలచిత్తులుగా, తప్పులు చేసే స్వభావాన్ని కలిగి ఉంటారు. మరోవైపు ఏది మంచి, ఏది చెడు అని గుర్తించగలిగే విచక్షణ కూడా ఉంటుంది. దైవాజ్ఞలను ధిక్కరించే పనులను పాపాలుగా ఇస్లాం ధర్మం పరిగణిస్తుంది. వీటిని పెద్దవి (కబైర్), చిన్నవి (సయ్యిత్)గా వర్గీకరించారు. ప్రధానంగా తీవ్రమైన ఏడు పాపాల గురించి తెలుసుకుని, వాటికి ఎల్లప్పుడూ దూరంగా ఉండాలి. తీవ్రమైన పాపాల్లో మొదటిది బహుదేవతారాధన (షిర్క్). అల్లాహ్ ఒక్కడే ఆరాధ్యనీయుడు అనేది ఇస్లాం మౌలిక సూత్రం. అల్లాహ్‌కు ఇతర భాగస్వాములను జత చేయటం ఘోరమైన పాపంగా పరిగణిస్తారు. ఇలాంటి విశ్వాసరాహిత్య స్థితిలో మరణించిన వారికి తదనంతరం కూడా క్షమాపణ ఉండదు. రెండోది మంత్ర విద్యలను అభ్యసించటం లేదా నమ్మడం. మూడోది హత్య.. అన్యాయంగా ఒకరి ప్రాణాలు తీయటం. నాలుగోది వడ్డీని తీసుకోవటం లేదా చెల్లించటం. అయిదోది అనాథల ఆస్తిని లేదా సంపదను దుర్బుద్ధితో సొంతం చేసుకోవటం. ఆరోది శత్రువుతో పోరాడాల్సిన సమయంలో యుద్ధభూమిని వదిలి పారిపోవటం. ఏడోది స్త్రీలపై అపవాదులు వేయటం.. అమాయకులు, పవిత్రులపై వ్యభిచార నింద మోపటం.

తీవ్రమైన పాపాలకు దూరంగా ఉండటమే కాదు.. మరికొన్ని నిషేధాలు కూడా ఉన్నాయన్నది ప్రతి ముస్లిం తప్పనిసరిగా తెలుసుకోవాలి. అవి ఏమిటంటే.. తల్లిదండ్రులను అగౌరవపరచకూడదు. వ్యభిచారం చేయకూడదు. అనైతిక సంబంధాలు పెట్టుకోకూడదు. చౌర్యానికి పాల్పడరాదు. అబద్ధపు సాక్ష్యాలు చెప్పకూడదు. మద్యపానానికి, జూదానికి దూరంగా ఉండాలి. వెన్నుపోటుకు పాల్పడకూడదు. ఇతరుల గురించి వారి పరోక్షంలో చెడుగా మాట్లాడకూడదు. గర్వం, అహంకారం ప్రదర్శించకూడదు. ఆత్మహత్యకు పాల్పడకూడదు. లంచం ఇవ్వకూడదు, తీసుకోకూడదు. వాగ్దానాలను ఉల్లంఘించటం, నమ్మక ద్రోహం తగవు. ఇలాంటి పాపాలకు కఠిన శిక్షలు లేకపోయినా.. ఇవి ఆధ్యాత్మికంగా, సామాజికంగా హాని కలిగిస్తాయి. ఒక చెడు కార్యం వెనుక ఉన్న ఉద్దేశం పాప తీవ్రతను నిర్ణయించటంలో కీలకంగా మారుతుంది. తెలిసో తెలియకో చేసిన పాపాలకు హృదయపూర్వక పశ్చాత్తాపం (తౌబా)తో అపార కృపాశీలుడైన అల్లాహ్ క్షమాపణ పొందే అవకాశం ఉంటుంది. మొదట తప్పు చేయటం ఆపాలి. అది పునరావృతం కాకూడదని దృఢ సంకల్పం చేసుకోవాలి. దాని వల్ల జరిగిన హానిని సరిదిద్దాలి. వీలైతే పరిహారం చేసుకోవాలి. ఇది దైవానికీ, విశ్వాసికీ మధ్య ఒప్పందం లాంటిది. పశ్చాత్తాపం మాటల్లో కాదు.. చేతల్లో కనిపించాలి. అలాంటి వారి పాపాల క్షమాపణకు అల్లాహ్ చేసిన వాగ్దానం అమలవుతుంది. దివ్య ఖురాన్ తొమ్మిదో అధ్యాయంలోని సూరా అత్ తౌబా పశ్చాత్తాపం, దానికి దారి తీసే పరిస్థితులను వివరిస్తుంది. చెడు దారిని వదిలి, అల్లాహ్ చూపిన సన్మార్గం వైపు మరలటం ఆధ్యాత్మిక శుద్ధికి దోహదం చేస్తుంది.

ఏ మాసంలోనైనా పౌర్ణమి తిథి విశేషమైన రోజే. అయితే పుష్య పూర్ణిమ మరింత విశిష్టమైనదిగా పండితులు చెబుతారు. ఈ రోజున శివకేశవులను, సూర్యచంద్రులను పూజిస్తారు. ఉదయానే నదీ స్నానం చేయడం శుభప్రదంగా భావిస్తారు. విష్ణుమూర్తికి నెయ్యితో దీపం వెలిగించి విష్ణుసహస్ర నామావళి జపిస్తారు. సూర్యభగవానుడికి ఎర్రటి పూలను సమర్పించి ఆదిత్యహృదయం పఠిస్తారు. ఈ రోజు చేసే పూజలు, దానధర్మాలకు విశేషమైన ఫలితం దక్కుతుంది. ఇంట్లో శాంతి వెల్లివిరుస్తుంది. సిరిసంపదలు చేకూరుతాయి. దైవానుగ్రహం కలుగుతుంది. సుఖ సంతోషాలు వర్ధిల్లుతాయి. ఆహారం, ధనం, వస్త్రాలు దానం చేయడం శ్రేయస్కరం. శివకేశవులను, సూర్యచంద్రులను ప్రార్థించడం వల్ల సంపూర్ణ ఫలం లభిస్తుంది, ధనప్రాప్తి కలుగుతుంది అన్నది శాస్త్రవచనం.

శివకేశవులను పూజించాలి!


శైవక్షేత్రమైన కోటప్పకొండలో త్రికోటేశ్వరుడు కొలువై ఉన్నాడు. ఆ స్వామిని దక్షిణామూర్తిగా ఆరాధిస్తారు. పుష్య పౌర్ణమి రోజున స్వామికి ఘనంగా మహాభిషేకం నిర్వహించనున్నారు. పాలు, తేనె వంటి అనేక రకాల ద్రవ్యాలతో అభిషేకం చేస్తారు. జ్ఞాన లింగాన్ని పరమాద్భుతమైనదిగా చెబుతారు. చిన్నారులకు ఇక్కడ అక్షరాభ్యాసం చేయించడాన్ని అదృష్టంగా భావిస్తారు. మహర్షులు ఇక్కడ తపస్సు చేసి, దక్షిణామూర్తి నుంచి జ్ఞాన భిక్షను అందుకున్నారని పురాణాలు పేర్కొన్నాయి. స్వామిని ఆశ్రయించి, తమ జీవితాలను చరితార్థం చేసుకున్న యోగసాధకులు ఎందరో ఉన్నారు. అలాంటి మహాక్షేత్రం కోటప్పకొండ. ఈ కొండపైన గానీ ఇక్కడి పరిసరాల్లో గానీ ఒక్క కాకి కూడా కనిపించదు. పౌరాణిక కథను అనుసరించి.. ఇక్కడ కొండ కింద ఉన్న గ్రామంలో ఒక భక్తురాలు నిత్యం నైవేద్యం తయారుచేసి, కొండపైకి నడుచుకుంటూ వెళ్లి త్రికోటేశ్వరస్వామికి సమర్పించేది. కొంతకాలానికి ఆమె వృద్ధురాలయ్యింది. ఒకరోజు ఎప్పటిలాగానే నైవేద్యాన్ని వస్త్రంలో మూటకట్టి తలపై పెట్టుకొని కొండ ఎక్కుతోంది. అంతలో కాకుల గుంపు ఆ మూటను తన్నుకుపోయింది. అప్పుడా వృద్ధురాలు శివయ్యకు నైవేద్యం పెట్టలేకపోయినందుకు బాధపడుతూ స్పృహ కోల్పోయింది. కానీ తననెవరో తట్టి లేపుతున్నట్లు అనిపించి కళ్లు తెరిచింది. ఎదురుగా ఉన్న కోయదొర 'అమ్మా! నీ దుఃఖానికి కారణమైన కాకులు కొండపైకి ప్రవేశించకుండా నిషేధం విధిస్తున్నాను' అని ఆమె తలపై చెయ్యి ఉంచి ఆశీర్వదించాడు. వృద్ధురాలిలో నీరసం మటుమాయమై శక్తి ప్రవేశించింది. కోయదొర 'అమ్మా! ఇక మీదట నువ్వు కష్టపడి కొండెక్కి ప్రసాదం తీసుకురానవసరం లేదు. ఆ స్వామే నీ ఇంటికి వస్తాడు' అంటూ కోయదొర రూపంలో ఉన్న పరమేశ్వరుడు తన అసలు రూపాన్ని దర్శింపచేశాడు. అనంతరం అంతర్ధానమయ్యాడు. నేటికీ ఆ కొండపై కానీ చుట్టూ పరిసరాల్లో కానీ కాకులు కనిపించవు.



పుష్యపూర్ణిమ రోజున తులసి మొక్క దగ్గర నెయ్యి దీపం వెలిగించి.. పండ్లు, తీపి పదార్థాలు సమర్పిస్తే ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయని, రావి చెట్టు కింద దీపం పెడితే త్రిమూర్తుల అనుగ్రహం లభిస్తుంది, పితృదేవతలు సంతోషంగా ఉంటారని చెబుతారు. ఇంటి ప్రధాన ద్వారం వద్ద నెయ్యి దీపం వెలిగిస్తే.. ప్రతికూలత పోయి, సానుకూల పరిస్థితులు నెలకొంటాయని, ఆగిపోయిన పనులు కూడా త్వరితగతిన పూర్తవుతాయని విశ్వసిస్తారు.

– నూతి శివానందం

HAPPY New Year



జనవరి 1 కుటుంబ దినోత్సవం

కొంచెం ప్రేమ.. కొంచెం సహనం

అయం నిజః పరోవేతి
గణనా లఘుచేతసామ్
ఉదారచరితానాం తు
వసుధైవ కుటుంబకమ్

'వీళ్లు నావాళ్లు, వాళ్లు పరాయివాళ్లు- అనుకుంటారు అల్పులు. కానీ విశాల హృదయులు ప్రపంచమంతా ఒకే కుటుంబంగా భావిస్తారు' అనేది ఈ శ్లోకార్థం. అనంతమైన కాలచక్రంలో మానవ సంబంధాలకు అత్యున్నతమైన పునాదిరాయి కుటుంబం. 'గ్లోబల్ ఫ్యామిలీ డే' అనేది 'వసుధైక కుటుంబం' అనే సనాతన ఆదర్శానికి సజీవ ప్రతిరూపం. మన పురాణేతిహాసాలు కుటుంబ వ్యవస్థను ఒక పవిత్ర యజ్ఞంలా భావించాయి. కైలాసంలో శివపార్వతుల కుటుంబాన్ని గమనిస్తే, అక్కడ పరస్పర విరుద్ధమైన స్వభావాలు కలిగిన వాహనాలు ఉన్నప్పటికీ, నిరంతర ప్రేమ అనే సూత్రం అందరినీ ఒక్కటిగా ఉంచుతుంది. పాము, నెమలి, ఎలుక, సింహం వంటి విరుద్ధ శక్తులు సైతం పగను మరిచి ఒకేచోట ఉండటం వైవిధ్యంలో ఏకత్వానికి పరమార్థం.

నిజమైన ఆస్తి

రామాయణం పితృవాక్య పరిపాలన, సోదర వాత్సల్యం ద్వారా ఆదర్శవంతమైన గృహస్థాశ్రమాన్ని పరిచయం చేసింది. తండ్రి గౌరవం కోసం శ్రీరాముడు అడవులకు వెళ్లడం, భరతుడు రాజ్య భోగాలను తృణీకరించడం కుటుంబం కోసం చేసే త్యాగానికి నిదర్శనాలు. ఆధ్యాత్మిక కోణంలో- ఈ జగత్తు అంతా ఒకే పరమాత్మ చైతన్యం నుంచి ఉద్భవించిన విస్తరణ. శరీరాలు వేరైనా, మనందరిలో ప్రవహించే ప్రాణశక్తి ఒక్కటే అన్న సత్యం తెలిసినప్పుడు, పొరుగువాని కష్టం మన కష్టంగా మారుతుంది. ఆధునిక కాలంలో యాంత్రిక జీవనశైలి వల్ల మనుషుల మధ్య ఆత్మీయతలు కరవవుతున్నాయి. భౌతిక సంపదల కన్నా ప్రేమానుబంధాలే నిజమైన ఆస్తి అని గుర్తించాలి. ప్రతి ఇల్లు ఒక సంస్కార కేంద్రంగా మారినప్పుడే లోక కల్యాణం సాధ్యమవుతుంది.

వ్యక్తి నుంచి జగత్తు వరకు..

తల్లిదండ్రుల సేవ, పెద్దల పట్ల గౌరవం, తోటి జీవుల పట్ల కరుణ కలిగి ఉండటమే నిజమైన ఆధ్యాత్మిక ప్రగతి. భాగవతంలో పాండవులు కృష్ణ పరమాత్మను మార్గదర్శిగా ఎంచుకోవడం కుటుంబాన్ని నడిపించేవారొకరు ఉండాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తుంది. ఈ విశ్వమంతా ఒకటే కుటుంబమని, ప్రతి మానవుడిలోనూ ఆ దైవమే ఉన్నాడని భావించిన రోజున స్వార్థం నశించి శాంతి వర్ధిల్లుతుంది. 'సర్వేజనాః సుఖినోభవంతు' అన్నారు మహర్షులు. ఆ మాట మన హృదయంలో ప్రతిధ్వనించాలి. మన మూలాలను గౌరవిస్తూ, బాధ్యతాయుతమైన సభ్యులుగా మెలుగుతూ ఈ ప్రపంచాన్ని ఒక ప్రేమమయ కుటుంబంగా తీర్చిదిద్దడమే మనం చేసుకోవలసిన గొప్ప సంకల్పం. విడిపోవడం ప్రకృతి కావచ్చు, కానీ కలిసి ఉండటం గొప్ప సంస్కృతి. ఆ సంస్కృతిని కాపాడుకుంటూ, భావితరాలకు ప్రేమపూర్వకమైన సమాజాన్ని అందించేందుకు ప్రయత్నించాలి. వ్యక్తి నుంచి కుటుంబం, సమాజం నుంచి జగత్తు వరకు మన ప్రేమ పరిధిని విస్తరించుకోవాలి. మనం పంచే ప్రేమ, చూపే సహనం ఈ భూమిని స్వర్గధామంగా మారుస్తాయి. ప్రతి ఇంటా ప్రేమ జ్యోతి వెలిగి, ఆ వెలుగు విశ్వమంతా ప్రసరిస్తుంది. ప్రకృతిలోని చెట్టును, పుట్టను, పశుపక్ష్యాదులను మన పరివారంగా భావించే ఉన్నత స్థితిని చేరుకుందాం. అనంత కోటి జీవరాశులకు నిలయమైన ఈ భూగోళంపై మనం నిర్మించుకోవలసిన అత్యున్నత కట్టడం ప్రేమతో కూడిన కుటుంబం.



కాలం మారుతున్నా, నాగరికతలు మారుతున్నా, మానవ హృదయానికి కావలసిన ఊరట ఆత్మీయ అనుబంధాల ద్వారానే లభిస్తుంది. ఒక చిన్న దీపం చీకటిని చీల్చినట్లు, కుటుంబంలోని సామరస్యం అలజడులను, అశాంతిని తొలగిస్తుంది. ప్రకృతిని తల్లిగా, తోటివారిని సోదర సమానులుగా భావించే ఉన్నత సంస్కారాన్ని మనం పుణికిపుచ్చుకోవాలి. ఈ ప్రపంచాన్ని ద్వేష రహితంగా, ప్రేమమయంగా మార్చుకోవాలని సంకల్పించుకోవాలి. మన మాటలో మాధుర్యం, చేయూతలో కరుణ, మనసులో నిస్వార్థం ఉన్నప్పుడు ఈ జగత్తు ఒక నందనవనమవుతుంది. తరతరాలుగా మనకు అందిన ఈ ఆధ్యాత్మిక వారసత్వాన్ని గుండెల్లో భద్రపరుచుకుందాం. భావితరాలకు భౌతిక సంపదలను మించి అంతులేని అనురాగాన్ని తరగని ఆస్తిగా అందిద్దాం. మన సాంప్రదాయం నేర్పిన ఈ విలువలను ఆచరణలో పెట్టినప్పుడే మనిషికి, మనీషికి మధ్య ఉన్న దూరం తగ్గుతుంది. వ్యక్తి నుంచి విశ్వం వరకూ సాగే ఈ ప్రేమయాత్రలో ప్రతి ఒక్కరం భాగస్వాములమే.

– డా. చిట్యాల రవీందర్

నటరాజస్వామికి ఆరుద్రోత్సవం!

ప్రతి సంవత్సరం ధనుస్సురాశిలోకి రవి సంక్రమణం జరిగిన తర్వాత వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున ఆరుద్రోత్సవం నిర్వహిస్తారు. శివుని నాట్యరూపమైన నటరాజ స్వామికి అంకితం చేసిన ఈ పండుగను ఎంతో వైభవంగా చేసుకుంటారు. ఇది సృష్టి, స్థితి, లయల రహస్యాన్ని తెలియజేస్తుంది. ఆరుద్ర నక్షత్రం పరమశివుడి జన్మనక్షత్రంగా, ఆ స్వామికి అత్యంత ప్రీతికరమైనదిగా పురాణాలు పేర్కొన్నాయి.

నటరాజ తాండవం- సృష్టి, స్థితి, లయలకు ప్రతీక. ఆ స్వామి తన కాలి కింద అజ్ఞానాన్ని తొక్కిపెట్టి, భక్తులకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడన్నది ఆర్యోక్తి. ఇతర నక్షత్రాల కంటే ఎర్రగా, ప్రకాశవంతంగా ఉండే ఆరుద్ర నక్షత్రాన్ని శివుడి ఆగ్రహానికి (రుద్ర రూపం), సృష్టిలోని అనంత శక్తికి చిహ్నంగా భావిస్తారు. మనలోని అజ్ఞానాన్ని పోగొట్టుకుని, పరమాత్మ ఆనంద రూపాన్ని దర్శించుకోవడానికి ఆరుద్రోత్సవం ఒక ఆధ్యాత్మిక మార్గం. ఈ పుణ్య దినాన పరమశివుని పూజిస్తే సకల దోషాలూ తొలగి సర్వశుభాలు కలుగుతాయని చెబుతారు. అందువల్ల సూర్యోదయానికి ముందే స్నానాది కార్యక్రమాలు ముగించి దీపం వెలిగించాలి. శివాలయానికి వెళ్లి స్వామిని దర్శించుకోవాలి. 'శివాష్టకం', 'లింగాష్టకం' పఠించాలి. 'నమః శివాయ' అనే పంచాక్షరీ మంత్రాన్ని జపించడం శ్రేష్ఠం. అన్నదానం వంటి ధార్మిక కార్యక్రమాలు చేపట్టాలి. పౌరాణిక కథను అనుసరించి.. పరమశివుడి ఆనంద తాండవాన్ని చూడాలని పతంజలి మహర్షి, వ్యాఘ్రపాదుడు తదితరులు ఘోర తపస్సు చేశారు. వారి భక్తికి మెచ్చిన శివుడు ఆనంద తాండవం చేశాడు. ఆ అద్భుత దృశ్యాన్ని స్మరిస్తూ ఏటా ఆరుద్రోత్సవం నిర్వహిస్తారు. తమిళనాడులోని చిదంబరం నటరాజ ఆలయంలో ఆరుద్రోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ రోజున పరమేశ్వరుడికి ఆరుద్ర కదంబం, తిరువాదిరై కళి అనే ప్రత్యేక ప్రసాదాలను నివేదిస్తారు. దీని వెనుక ఒక కథ ప్రాచుర్యంలో ఉంది. తమిళనాడులోని చిదంబరం దగ్గర్లో సెంథనార్ అనే శివభక్తుడు కట్టెలు కొట్టి జీవించేవాడు. అతడు నిత్యం ఒక నిరుపేదకు ఆహారం అందించాకే తాను తినేవాడు. ఒకరోజు కుంభవృష్టి వల్ల కట్టెలు అమ్ముడవక సంపాదించలేకపోయాడు. నియమం ప్రకారం నిరుపేదకు భోజనం పెట్టలేని స్థితిలో.. బియ్యప్పిండిలో బెల్లం, కొబ్బరి జోడించి తీపి పదార్థం చేశాడు. ఇంతలో శివుడు సాధురూపంలో వచ్చి ఆకలిగా ఉందన్నాడు. సాధువుకు పెట్టేందుకు తన దగ్గర సరైన ఆహారం లేదని బాధపడగా.. ఉన్నదే పెట్టమన్నాడు శివుడు. అతడు సంకోచిస్తూనే తాను చేసిన పదార్థం సమర్పిస్తే స్వామి ఇష్టంగా తిన్నాడు. మరునాడు ఆలయంలో ఈ పదార్థం కనిపించగా పూజారులు ఆశ్చర్యపోయారు. అలాంటి నైవేద్యం తామెన్నడూ నివేదించలేదు. ఈ అపచారం ఎవరు చేశారోనని ఆందోళనచెంది.. రాజుకు ఫిర్యాదు చేశారు. ఆ రాజు ఎంతటి భక్తుడంటే.. తాను పూజించే సమయంలో శివుడు నడుస్తున్నట్టు పాద ధ్వని వినేవాడు. కానీ ఆ రోజు ఆ ధ్వనులు వినిపించకపోవడాన దిగులుచెందాడు. ఆ రాత్రి శివయ్య కలలో కనిపించి 'నీ పూజ సమయంలో నేను సెంథనార్ నైవేద్యం తినడానికి వెళ్లాను' అని చెప్పాడు. తర్వాత నటరాజ స్వామి ఉత్సవ ఊరేగింపు సందర్భంగా రాజు స్వయంగా రథాన్ని లాగడం ఆనవాయితీ. కానీ ఆ రోజు రాజు ఎంత ప్రయత్నించినా రథం కదల్లేదు. అందరూ ఖిన్నులై ఉండగా 'సెంథన్ ఒక గీతం ఆలపించు' అనటం వినిపించింది. అందరూ ఆశ్చర్యపోయారు. ఈ మాటలు సెంథనార్ కూడా విన్నప్పటికీ నిరక్షరాస్యుడైన తనను కాదులెమ్మనుకున్నాడు. కానీ పాడమని మరోసారి వినిపించటంతో అతడు భయపడుతూనే నటరాజస్వామిని స్తుతించాడు. ఆ పాటలే తమిళంలో పల్లండు స్తుతిగీతాలుగా ప్రసిద్ధి చెందాయి. అప్పటి నుంచి అతడు నివేదించిన పదార్థాన్నే కళి పేరుతో స్వామికి నైవేద్యంగా సమర్పించడం ఆచారంగా మారింది.



– మావూరు విజయలక్ష్మి

ఆకలి తీర్చే శాకంబరీదేవి



పుడమిని సస్యశ్యామలం చేయమని, తమకు శ్రేయస్సు చేకూర్చమని శాకంబరీదేవిని ప్రార్థిస్తారు. పుష్య పూర్ణిమ రోజున శాకంబరీవ్రతం ఆచరిస్తారు. పురాణ కథనాన్ని అనుసరించి.. ఒకసారి వర్షాలు కురవక తీవ్ర కరవు ఏర్పడింది. అప్పుడు శాకంబరీ దేవిని ప్రార్థించారు. ఆ తల్లి దీవెనతో నదులు ప్రవహించాయి. భూమి తిరిగి పచ్చదనంతో కళకళలాడింది. పూలూ, ధాన్యం, కూరగాయలు, పండ్లతో నేలతల్లి అలరారింది. జీవుల ఆకలి తీరింది. అప్పటి నుంచి ఈ వ్రతాచరణ ఆనవాయితీ అయ్యింది.

పుష్య పూర్ణిమ నాడు.. సూర్యోదయం కంటే ముందే స్నానం చేసి పూజామందిరాన్ని శుభ్రం చేస్తారు. శాకంబరీదేవి విగ్రహం లేదా చిత్రపటాన్ని పూలతో అలంకరిస్తారు. పండ్లను, కూరగాయలను సమర్పించి పూజిస్తారు. ఈరోజు 'ఓం శాకంబరీ దేవ్యై నమః' అనే మంత్రాన్ని 108 సార్లు జపించడం వల్ల విశేష ఫలితాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. శాకంబరీ వ్రతం చేయడం వల్ల ఇంట్లో సానుకూల శక్తి ప్రవహిస్తుంది. ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి. వ్యాపారంలో విజయాలు కలుగుతాయి. చిక్కు సమస్యలు తీరి శాంతి, సౌఖ్యం లభిస్తాయి. ఆత్మ విశ్వాసం, మానసిక స్థైర్యం పెరుగుతాయి. భయాలు తొలగుతాయి. సర్వదా విజయం లభిస్తుంది. కుటుంబ శ్రేయస్సు చేకూరుతుంది. ఈ రోజున ఉపవాసం ఉండటం వల్ల అనారోగ్యాల నుంచి ఉపశమనం లభిస్తుంది. ప్రశాంతత, ఆనందం వెల్లివిరుస్తాయి.

ప్రాక్టీస్ బిట్స్ — ఇండియన్ ఎకానమీ

1. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ)-ప్రకారం 2024లో అత్యధిక నిరుద్యోగిత రేటు ఉన్న రాష్ట్రం?
1) ఉత్తరాఖండ్ 2) కేరళ 3) ఆంధ్రప్రదేశ్ 4) హరియాణా

2. ఇటీవల ఏ రాష్ట్రం నిరుద్యోగులకు నెలకు రూ.3,000 భృతి ఇవ్వనున్నట్లు ప్రకటించింది?
1) ఆంధ్రప్రదేశ్ 2) కర్ణాటక 3) కేరళ 4) మధ్యప్రదేశ్

3. పీఎం గతిశక్తి మల్టీ-మోడల్ కనెక్టివిటీ కోసం జాతీయ మాస్టర్ ప్లాన్-ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఏ సంవత్సరంలో ఏర్పాటైంది?
1) 2020 2) 2021 3) 2024 4) 2025

4. 120 రోజులు వేతన ఉపాధిని అందించేలా 'ముఖ్యమంత్రి శ్రామిక్ యోజన' పథకాన్ని అమలు చేసిన రాష్ట్రం?
1) కేరళ 2) హిమాచల్‌ప్రదేశ్ 3) ఝార్ఖండ్ 4) రాజస్థాన్

5. 2018లో ప్రారంభించిన 'ఆపరేషన్ గ్రీన్' (టమాటా, ఉల్లి, బంగాళదుంప) పథకానికి ఎవరు నిధులను సమకూరుస్తారు?
1) నాఫెడ్ 2) నాబార్డు 3) వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ 4) ఎవరూకాదు

సమాధానాలు 1-4, 2-1, 3-2, 4-3, 5-1.

జనం మెచ్చని పాలకులు!

జనరల్ స్టడీస్ — భారతదేశ చరిత్ర


మధ్యయుగంలో భారతదేశ స్థితిగతులను ఢిల్లీ సుల్తానుల పాలన పూర్తిగా మార్చేసింది. ఉపఖండంలో ముఖ్యంగా ఉత్తరాదిన రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలపై తీవ్రమైన ప్రభావం చూపింది. ఐదు వంశాలుగా పాలించిన సుల్తానులు కేంద్రీకృత పరిపాలనా వ్యవస్థతో విశాల భూభాగాలపై నియంత్రణ సాధించినప్పటికీ జనరంజక పాలనను అందించలేకపోయారు. ఖలీఫాల మెప్పు పొందడానికి ఆరాటపడుతూ, ఇస్లాం మత శాసనాలను పాటిస్తూ హిందువులను వేధించారు. మత సామరస్యాన్ని పాటించకుండా హిందువులు, ముస్లింల మధ్య సాంఘిక సంఘర్షణకు బీజం వేశారు. వ్యవసాయ, వాణిజ్యాభివృద్ధికి నిర్దిష్ట చర్యలు చేపట్టలేదు. సైనికులను ఉన్నతంగా, సామాన్యులను దీనులుగా చేసిన వీరి పాలనా విధానాలు, ప్రభుత్వ విభాగాలు, విధించిన పన్నుల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. సుల్తానుల పాలనలో రాజ్యంలో నెలకొన్న సాంఘిక, ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవాలి.

సుల్తానుల యుగ సమీక్ష

మహమ్మద్ ఘోరీ మరణానంతరం క్రీ.శ.1206లో కుతుబుద్దీన్ ఐబక్ భారతదేశంలో ముస్లింల పాలనకు నాంది పలికాడు. అప్పటి నుంచి 1526 వరకు అప్రతిహతంగా బానిస, ఖిల్జీ, తుగ్లక్, సయ్యద్, లోడీ వంశాలు దిల్లీ కేంద్రంగా పాలించడంతో ఆ కాలం చరిత్రలో సుల్తానులయుగంగా ప్రసిద్ధికెక్కింది. వీరిలో లోడీలు తప్ప మిగతా వంశీయులు తురుష్కులు. భారతదేశంలోని తురుష్క సుల్తానులు స్వతంత్ర పాలకులైనప్పటికీ తాము ఖలీఫా ముస్లిం సామ్రాజ్యంలో భాగమనే భావించేవారు. రోజువారీ ప్రార్థన 'ఖుత్బా'లోనూ, వారు ముద్రించిన నాణేలు 'సిక్కా'లోనూ ఖలీఫా పేరు ప్రస్తావించేవారు. ఖలీఫాను ప్రసన్నం చేసుకోవడానికి, ముస్లిం ప్రపంచాన్ని సంతృప్తి పరచడానికి ప్రయత్నించేవారు. దిల్లీ సుల్తానుల్లో అల్లావుద్దీన్ ఖిల్జీ, కుతుబుద్దీన్ ముబారక్.. ఖలీఫా ఆధిక్యతను తోసిపుచ్చి స్వతంత్ర పాలన సాగించారు.

కేంద్ర ప్రభుత్వం: సుల్తానత్ సామ్రాజ్యానికి సుల్తాన్ సర్వాధిపతి. పాలనా విభాగంలో అన్ని విభాగాలకు అతడే సర్వాధికారి. సర్వోన్నత న్యాయమూర్తి, సర్వసైన్యాధ్యక్షుడు. సుల్తాన్ రాజ్యంలో ఇస్లాం మతానికి అధిపతి. సుల్తానులు ఇస్లాం శాసనాలను శిరసావహించారు. సుల్తాన్ సర్వాధికారి అయినప్పటికీ అతడి అధికారాలపై ఉలేమాల(ఇస్లాం మతాధికారులు) ప్రభావం ఉండేది. ప్రజా వర్గీయుల ముస్లిం శాసనాలు తదితర అంశాలు ఉండేవి. ఉలేమాల ప్రభావం రాజ్యపాలనలో అధికంగా ఉండేది. కానీ అల్లావుద్దీన్ ఖిల్జీ, మహమ్మద్ బిన్ తుగ్లక్‌లు ఉలేమాల ఆధిపత్యాన్ని తిరస్కరించి పాలన సాగించారు. సుల్తానుల కొలువులో సర్దారుల కుట్రలు, సుల్తానులను తమ గుప్పిట్లో ఉంచుకోడానికి ప్రయత్నించడం సర్వసాధారణ పరిణామాలు.

సుల్తాను మంత్రిమండలి: సుల్తానులకు పరిపాలనలో సహాయపడటానికి మంత్రిమండలి (మజ్లిస్-ఇ-ఖాస్), ఇతర ఉద్యోగ బృందం ఉండేవి. సుల్తానేట్ ప్రభుత్వంలో నాలుగు ప్రధాన విభాగాలు ఉండేవి. వాటిని నలుగురు ప్రధానమైన మంత్రులు చూసుకునేవారు. వారు దివాన్-ఇ-వజీరత్ (ప్రధాని), దివాన్-ఇ-రిసాలత్, దివాన్-ఇ-అర్జ్ (సైనిక మంత్రి), దివాన్-ఇ-ఇన్షా (ఉత్తర ప్రత్యుత్తరాల మంత్రి). సుల్తానుకు మంత్రిమండలి ఉన్నప్పటికీ వారి సలహాలకు సుల్తాను బద్ధుడు కాదు. 'నాయబ్ ఉల్ ముల్క్' సుల్తానుకు డిప్యూటీగా వ్యవహరించేవాడు. నసీరుద్దీన్ మహమ్మద్‌కు ఘియాస్ ఉద్దీన్ బాల్బన్ నాయబ్‌గా వ్యవహరించి రాజ్య వ్యవహారాలు నడిపించేవాడు. బరీద్-మమాలిక్ (గూఢచారి శాఖాధిపతి) ముఖ్య ఖాజీ, న్యాయ శాఖాధ్యక్షుడు, వీరి కింద గుమాస్తాలు మొదలైన ఉద్యోగులు ఉండేవారు. దిల్లీ సుల్తానుల రాజ్యం సైనిక బలంపై ఆధారపడింది. వీరిది సైనిక రాజ్యమని చెప్పవచ్చు. స్థిర సైన్యంలో కాల్బలం, అశ్వ, గజ బలగాలు ఉండేవి. సుల్తానులందరిలో ఎక్కువ శాశ్వత సైన్యాన్ని అల్లావుద్దీన్ ఖిల్జీ పోషించాడు. సైనికులకు జీతాలు నగదు రూపంలో చెల్లించే విధానం ప్రారంభించాడు. తురుష్కులు, అరబ్బులు, అబిసీనియన్లు, భారతీయ ముస్లింలు అనేకమంది సైన్యంలో ఉండేవారు. అందుకే సైనికుల్లో ఏకత్వ భావన లేదు.





ప్రాంతీయ పాలన: సుల్తానుల పాలనా తొలి దశలో ఇల్ టుట్ మిష్ రాజ్యాన్ని 'ఇక్తా'లుగా విభజించాడు. అల్లావుద్దీన్ ఖిల్జీ కాలం నుంచి ప్రాంతీయ పాలనపై స్పష్టమైన విధానం కనిపిస్తుంది. అల్లాఉద్దీన్ ఇక్తాలను రద్దు చేశాడు. సుల్తాన్‌లు సామ్రాజ్యాన్ని ప్రాంతాలుగా, సామంత రాజ్యాలుగా విభజించారు. ప్రాంతాలను షిక్‌లుగా, షిక్‌లను పరగణాలుగా విభజించేవారు. పరగణాల్లో అనేక గ్రామాలు ఉండేవి. గ్రామాల్లో స్వయంప్రతిపత్తి ఉండేది.

సాంఘిక పరిస్థితులు: భారతదేశంపై దండెత్తి పాలకులుగా అవతరించిన ముస్లిం పాలకులు ఇక్కడి ప్రజలతో, వారి సాంఘిక మతాచారాలతో సమ్మిళితం కాలేదు. ఇస్లాం మత విస్తరణకు ప్రయత్నిస్తూ హిందువులను కాఫిర్లు (ఇస్లాం మతానికి భిన్నమైన మతాన్ని అనుసరించేవారు) అని చిన్నచూపు చూసేవారు. హిందువులు స్వమత రక్షణా సక్తులుగా మారి ముస్లింలను మ్లేచ్ఛులుగా పరిగణించారు. దీంతో రెండు సాంఘిక శక్తుల మధ్య సంఘర్షణ ప్రారంభమై శాశ్వతంగా భిన్న వర్గాలుగా మారిపోయారు. హిందువులపై పన్నుల భారం, కఠిన నిబంధనలు ఉండేవి. విదేశీ జాతులతోపాటు దేశీయ ముస్లింల సంఖ్య పెరిగిపోయింది.

ఆర్థిక పరిస్థితులు: జనాభాలో అధిక సంఖ్యాకులు గ్రామాల్లో జీవించేవారు. వరి, గోధుమ, జొన్న, చెరకు, పత్తి పండించేవారు. ఈ యుగంలో పండ్ల తోటలు సాగు ఎక్కువైంది. ప్రధాన ఆహారధాన్యం జొన్న. ధనికులకు మాత్రమే వరి ధాన్యం ఉండేది. తరచూ ఏదోక ప్రాంతంలో కరవులు సంభవిస్తూ ఉండేవి. తుగ్లక్ వంశ పాలనలో వ్యవసాయాభివృద్ధిపై కొద్దిగా దృష్టి పెట్టారు. మహమ్మద్ బిన్ తుగ్లక్ 'దివాన్-ఇ-కోహి' వ్యవసాయ మంత్రిత్వ శాఖ స్థాపించి రైతులకు రుణాలిచ్చాడు. ఫిరోజ్ షా తుగ్లక్ కాలువలు తవ్వించాడు. ప్రభుత్వానికి ముఖ్య ఆదాయం భూమిశిస్తు. ఇస్లాం సంప్రదాయాలు అంగీకరించిన అయిదు రకాల పన్నులు విధించారు. అవి 1) జకాత్ 2) జిజియా 3) ఉషర్ 4) ఖరాజ్ 5) ఖామ్స్. ఇవేకాకుండా అనేక రకాల పన్నులతో భారం పెంచారు. లోహ, వస్త్ర, పరిమళద్రవ్యాల పరిశ్రమలు విస్తరించాయి.

◆ ఇల్ టుట్ మిష్ దిల్లీ నుంచి ముల్తాన్, దిల్లీ నుంచి అవధ్, దిల్లీ నుంచి ఉజ్జయిని వరకు మూడు ప్రధాన వాణిజ్య మార్గాలను నిర్మించినట్లు చెప్పినప్పటికీ, విశాలమైన సుల్తాను రాజ్యంలో రహదారి సౌకర్యాలు సరిగా లేక దేశీయ వాణిజ్యం స్థానికంగానే జరిగేది. సామాన్యులకు నిత్యావసరాలు కూడా లభ్యం కావడం కష్టంగా ఉండేది. విదేశీ వాణిజ్యం అంతా తురుష్కులు, అరబ్బుల చేతుల్లో ఉండేది.



రచయిత: వి.వి.ఎస్. రామావతారం

TENTH Physical Science — Acids, Bases and Salts

Final Exams-2026 IMPORTANT Q & A — **1 Mark**

1. **Give an example of a base.**
A: Sodium hydroxide (NaOH).
2. **Why does an aqueous solution of an acid conduct electricity?**
A: Due to the availability of ions, it conducts electricity.
3. **Compare a real-life situation where pH plays a vital role.**
A: Tooth decay starts when the pH of the mouth is lower than 5.5.
4. **What might happen if the human stomach secreted a base instead of an acid? Predict your reasoning.**
A: It would affect digestion, nutrient absorption, and disturb the pH balance of the body.
5. **Which gas is released in the reaction of Zinc granules with dilute acid?**
A: Hydrogen
6. **Complete the following equation:Acid + Base → Salt + ...**
A: Water
7. **Name the Sodium compound used to remove permanent hardness of water.**
A: Sodium carbonate (Washing soda) Na_2CO_3
8. **Which gas evolves when metal carbonate or metal hydrogen carbonate reacts with acids?**
A: Carbon dioxide or CO_2
9. **Give any one example of a neutralisation reaction.**
A: $NaOH + HCl \longrightarrow NaCl + H_2O$
10. **The pH value of a solution is 10. What is its colour in the presence of methylene blue indicator?**
A: Yellow
11. **Why are toothpastes generally basic?**
A: Toothpaste neutralises excess acid and prevents tooth decay.
12. **What happens to the pink colour of phenolphthalein in a basic solution?**
A: It remains pink in a basic solution.
13. **What happens when plaster of Paris is mixed with water?**
A: It changes into a hard mass of Gypsum.

For more IMP Q & A



Writer: D.V.Subba Naidu

జీఎస్టీ సరళం.. యూఎస్ వీసా భారం!

కరెంట్ అఫైర్స్ — రౌండప్ - 2025 — సెప్టెంబరు

భారత నూతన ఉపరాష్ట్రపతిగా సి.పి.రాధాకృష్ణన్ గత సెప్టెంబరులో ఎన్నికయ్యారు. ఆరు దశాబ్దాలుగా అండగా నిలిచిన మిగ్-21 యుద్ధ విమానాలను వాయుసేన నుంచి ఉపసంహరించారు. జీఎస్టీని సరళీకరిస్తూ రెండు శ్లాబులకే పరిమితం చేశారు. హెచ్-1బీ వీసాల వార్షిక దరఖాస్తు రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు ట్రంప్ ప్రభుత్వం పెంచేసింది. థాయ్‌లాండ్, ఫ్రాన్స్, నేపాల్‌లకు నూతన ప్రధానులు వచ్చారు. ఆసియా కప్ హాకీ టోర్నీతో పాటు, ఆసియా కప్ టీ-20 క్రికెట్ టోర్నీని భారత జట్లు గెలుచుకున్నాయి. మాతృ మరణాల రేటును తగ్గించడంలో ఆంధ్రప్రదేశ్, ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ఆదర్శంగా నిలిచాయి. ఈ విధమైన ముఖ్యమైన వర్తమాన వ్యవహారాలు, కీలక పరిణామాలు, సర్వేలు, నివేదికలు, వార్తల్లో నిలిచిన సంఘటనలు, వ్యక్తులు, విజయాలను పరీక్షార్థులు పునశ్చరణ చేసుకోవాలి.

ముఖ్యాంశాలు

◆ సెప్టెంబరు 1 నుంచి దేశంలో 'వలసలు, విదేశీయుల చట్టం - 2025' అమల్లోకి వచ్చింది. ఫోర్జరీ పత్రాలతో దేశంలో అక్రమంగా ఉంటున్న విదేశీయులకు కఠిన శిక్షలు విధించేందుకు ఈ చట్టాన్ని తీసుకొచ్చారు.

◆ సెప్టెంబరు 1 నుంచి 7 వరకు జాతీయ పోషకాహార వారాన్ని 'ఈట్ రైట్ ఫర్ ఎ బెటర్ లైఫ్' అనే థీమ్‌తో నిర్వహించారు.

◆ సెప్టెంబరు 2న ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీలోని యశోభూమిలో 'సెమికాన్ ఇండియా 2025' సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సులో మోదీకి భారత తొలి స్వదేశీ 32 - బిట్ చిప్ అయిన 'విక్రమ్ 3201'ను కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అందించారు. ఈ చిప్‌ను చండీగఢ్‌లోని ఇస్రోకు చెందిన సెమీ కండక్టర్ ల్యాబొరేటరీ రూపొందించింది.



కేంద్ర జనగణన విభాగం శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టం (ఎస్ఆర్ఎస్) 2021-23కు సంబంధించి విడుదల చేసిన ప్రసూతి మరణాల ప్రత్యేక బులిటెన్ గణాంకాల ప్రకారం దేశంలోనే మాతృ మరణాలు తక్కువగా ఉన్న రాష్ట్రాలుగా కేరళ, ఆంధ్రప్రదేశ్ నిలిచాయి. ఐరాస లక్ష్యాలకు అనుగుణంగా మాతృ మరణాల రేటు (ఎంఎంఆర్) 70 కంటే తక్కువ ఉండాలి. దేశవ్యాప్తంగా ఎంఎంఆర్ నిష్పత్తి (ప్రతి లక్ష జననాలకు మాతృమరణాలు) సగటున 88గా నమోదైంది. ఎంఎంఆర్ రేటు అత్యధికంగా ఒడిశాలో 153 ఉండగా, అత్యల్పంగా ఆంధ్రప్రదేశ్, కేరళలో 30 చొప్పున నమోదైంది.

◆ యూఏఈలో తదుపరి భారత రాయబారిగా డాక్టర్ దీపక్ మిత్తల్ నియమితులయ్యారు.

◆ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన సెప్టెంబరు 3న జరిగిన జీఎస్టీ పాలక మండలి 56వ సమావేశంలో జీఎస్టీలో ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబులను రెండింటికి కుదించారు. 5%, 18% కొనసాగించి, 12%, 28% రద్దు చేయాలని నిర్ణయించారు.

◆ ప్రఖ్యాత ఫ్యాషన్ రంగ నిపుణుడు, బిలియన్ డాలర్ల ఫ్యాషన్ ప్రపంచాన్ని సృష్టించిన జార్జియో అర్మానీ (91) సెప్టెంబరు 4న ఇటలీలోని మిలాన్‌లో మరణించారు.

◆ సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ సెప్టెంబరు 4న న్యూదిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, ఇతర డిజిటల్ సాంకేతిక రంగాల్లో పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకున్నారు.

◆ నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్-2025లో ఐఐటీ మద్రాసు అగ్రస్థానంలో నిలిచింది. ఇది అగ్రస్థానంలో నిలవడం వరుసగా ఏడోసారి.

◆ అనుతిన్ చర్న్‌విరకుల్ (58)ను దేశ నూతన ప్రధానిగా థాయ్‌లాండ్ పార్లమెంటు ఎన్నుకుంది. షినవత్రాను రాజ్యాంగ న్యాయస్థానం పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో నూతన ప్రధానిని ఎన్నుకున్నారు. గత రెండేళ్లలో థాయ్ ప్రధానిగా ఎన్నికైన మూడో వ్యక్తి అనుతిన్.

◆ 2030 నాటికి దేశం పప్పుధాన్యాల్లో స్వయంసమృద్ధి సాధించడానికి, సాంకేతికత, సంస్కరణల ద్వారా 2047 నాటికి ఉత్పత్తిని రెట్టింపు చేసి 51.57 మెట్రిక్ టన్నులకు చేరుకోవడానికి నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ విడుదల చేసింది.

◆ ప్రముఖ కవయిత్రి, కాలమిస్ట్ నెల్లుట్ల రమాదేవికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కాళోజీ సాహితీ పురస్కారాన్ని ప్రకటించింది.

◆ పార్టీలో అంతర్గత విభేదాలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో తన ప్రధాని పదవికి రాజీనామా చేస్తున్నట్లు జపాన్ ప్రధాని షిగేరు ఇషిబా సెప్టెంబరు 7న ప్రకటించారు.



భారత 15వ ఉపరాష్ట్రపతిగా చంద్రాపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ సెప్టెంబరు 12న బాధ్యతలు చేపట్టారు. 2030, సెప్టెంబరు 11 వరకూ ఈయన పదవీకాలం ఉంటుంది. తమిళనాడు నుంచి ఈ పదవి చేపట్టిన మూడో వ్యక్తిగా గుర్తింపు పొందారు.

◆ ఫ్రాన్స్ ప్రధాని ఫ్రాన్సువా బేరూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సెప్టెంబరు 8న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై పార్లమెంటులో జరిగిన ఓటింగ్‌లో ప్రభుత్వానికి అనుకూలంగా 194 మంది, వ్యతిరేకంగా 364 మంది ఓటేశారు. దీంతో బేరూ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌కు రాజీనామా సమర్పించారు.

◆ ఫ్రాన్స్ నూతన ప్రధానిగా ఆ దేశ రక్షణమంత్రి సెబాస్టియన్ లోకోర్ను నియమితులయ్యారు. 39 ఏళ్ల లోకోర్ను ఫ్రాన్స్ చరిత్రలో అతిచిన్న వయసున్న రక్షణమంత్రిగా గుర్తింపు పొందారు.



భారత చెస్ క్రీడాకారిణి వైశాలి.. ఫిడే మహిళల గ్రాండ్ స్విస్ చెస్ టైటిల్‌ను గెలుచుకుంది. ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండ్‌లో జరిగిన టోర్నీలో విజేతగా నిలిచిన వైశాలి వరుసగా రెండో ఏడాది ఈ టైటిల్‌ను గెలుచుకుంది.

◆ జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం-శ్రీ) పథకాన్ని వినియోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో నిలిచింది. దక్షిణాదిలో అగ్రస్థానంలో, మొత్తంమీద ఉత్తర్‌ప్రదేశ్ తర్వాత రెండో స్థానంలో నిలిచింది.

◆ భారత పర్యటనలో భాగంగా మారిషస్ ప్రధాని నవీన్ చంద్ర రాంగులాం సెప్టెంబరు 11న వారణాసిలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారతీయులు అధికంగా ఉండే మారిషస్‌కు భారత్ రూ.5,984 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించింది.

◆ ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఏడీఆర్) సహవ్యవస్థాపకుడు, దేశంలో అవినీతిరహిత ఎన్నికల కోసం చిరకాలంగా పోరాడుతున్న జగదీప్ ఎస్ చోఖడ్ (80) సెప్టెంబరు 12న దిల్లీలో మరణించారు.

◆ పాలస్తీనాకు సంపూర్ణ దేశ ప్రతిపత్తి కల్పించాలంటూ ఐరాస సర్వప్రతినిధి సభ చేసిన తీర్మానానికి భారత్ సెప్టెంబరు 12న మద్దతు తెలిపింది. 193 సభ్యులున్న సర్వప్రతినిధి సభలో భారత్ సహా 142 దేశాలు ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటేశాయి.

◆ నేపాల్ తాత్కాలిక ప్రధానిగా విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా కార్కీ (73) నియమితులయ్యారు. ఈ పదవి చేపట్టిన తొలి మహిళగా ఈమె ఘనత సాధించారు. ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన తొలి, ఏకైక మహిళగానూ సుశీల నిలిచారు.

◆ భారతీయ అమెరికన్ అమిత్ క్షత్రియను తమ దేశ అంతరిక్ష అన్వేషణకు అసోసియేట్ నిర్వహణాధికారిగా నియమిస్తున్నట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ప్రకటించింది.

◆ సెప్టెంబరు 13న ప్రధాని నరేంద్ర మోదీ మిజోరంలో పర్యటించారు. రూ. 8,070 కోట్లతో నిర్మించిన బైరాబి - సైరాంగ్ రైల్వేలైన్‌ను ప్రారంభించారు. 51 కి.మీ. పొడవైన ఈ కారిడార్ మిజోరంను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తుంది. 153 వంతెనలు, 45 సొరంగాలు ఈ కారిడార్‌లో ఉన్నాయి.



సెప్టెంబరు 28న దుబాయ్‌లో జరిగిన ఆసియా కప్ టీ 20 టోర్నీ ఫైనల్‌లో టీం ఇండియా అయిదు వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై నెగ్గి మొత్తంమీద తొమ్మిదో సారి ఆసియా కప్ విజేతగా నిలిచింది. అభిషేక్ శర్మ ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు.

◆ తీర ప్రాంతానికి చేరువలోని సాగర జలాల్లో శత్రు జలాంతర్గాముల ఉనికిని పసిగట్టే యుద్ధ నౌక ఐఎన్ఎస్ ఆండ్రోత్‌ను కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ నౌకాదళానికి అందించింది.

◆ మేఘాలయ మాజీ ముఖ్యమంత్రి డి.డి.లాపాంగ్ (93) సెప్టెంబరు 12న మరణించారు. 1992-2010 మధ్య నాలుగు సార్లు సీఎంగా పనిచేశారు.

◆ దేశంలోనే తొలిసారిగా చట్టసభల మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సును సెప్టెంబరు 14 నుంచి 15 వరకు తిరుపతిలో నిర్వహించారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఈ సదస్సును ప్రారంభించారు.

◆ సెప్టెంబరు 15 నుంచి 19 వరకు న్యూదిల్లీలోని భారత్ మండపంలో అంతర్జాతీయ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ) 89వ జనరల్ మీటింగ్ నిర్వహించారు.




దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. 2023 సంవత్సరానికి ఆయనకు ఈ పురస్కారం ప్రకటించారు.


◆ చదరంగంలో క్లిష్టమైన 175 పజిల్స్‌ను వేగంగా పరిష్కరించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ తనయుడు దేవాంశ్ 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్ 175 పజిల్స్'గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు పొందాడు.

◆ దేశంలోని మహిళలందరికీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఉద్దేశించిన స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకాన్ని ప్రధాని మోదీ సెప్టెంబరు 17న మధ్యప్రదేశ్‌లో ప్రారంభించారు.

◆ రూ.825 కోట్ల వ్యయంతో అహ్మదాబాద్‌లోని నరన్‌పురాలో నిర్మించిన దేశంలోని అతిపెద్ద, అత్యంత సాంకేతికంగా అభివృద్ధి చేసిన క్రీడా సముదాయాన్ని కేంద్ర మంత్రి అమిత్ షా ప్రారంభించారు.

◆ ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (డబ్ల్యూఐపీఓ) ప్రచురించిన గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ (జీఐఐ) 2025లో భారత్ 38వ స్థానంలో నిలిచింది. స్విట్జర్లాండ్, స్వీడన్, అమెరికా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.





యూఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ-2025 మహిళల సింగిల్స్ టైటిల్ విజేతగా సబలెంకా (బెలారస్), రన్నరప్‌గా అసినిమోవా (అమెరికా) నిలిచారు. పురుషుల సింగిల్స్ విన్నర్‌గా కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్), రన్నరప్‌గా జానిక్ సినర్ (ఇటలీ) నిలిచారు.

సబలెంకా

ఆసియా కప్ హాకీ టోర్నీ - 2025 విజేతగా భారత జట్టు నిలిచింది. బిహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన ఫైనల్లో 4-1తో దక్షిణ కొరియాపై విజయం సాధించింది. దీంతో హర్మన్ ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత హాకీ జట్టు 2026 ప్రపంచకప్‌నకు నేరుగా అర్హత సాధించింది.

◆ నీరజ్ ఘయ్వాన్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం హోమ్‌బౌండ్.. 2026 ఆస్కార్ అవార్డులకు ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో భారత్ తరపున అధికారిక ఎంట్రీగా ఎంపికైంది. న్యూయార్క్ టైమ్స్ జర్నలిస్ట్ బషరత్ పీర్ రాసిన 'టేకింగ్ అమ్మత్ హోమ్' ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. గ్రామీణ భారతదేశ నేపథ్యంలో కొవిడ్-19 మహమ్మారి సమయంలో స్నేహం, కులం, మరణాల ఇతివృత్తాలతో ఈ చిత్రాన్ని రూపొందించారు.

◆ హెచ్ 1బీ వీసాల వార్షిక దరఖాస్తు రుసుమును లక్ష డాలర్ల (సుమారు రూ.88 లక్షలు)కు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబరు 21 నుంచి ఏడాది పాటు ఇది అమల్లో ఉంటుంది.

◆ దేశవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఎన్ఎంఈఓ) పథకం అమలులో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది.

◆ దిల్లీ జట్టు మాజీ కెప్టెన్ మిథున్ మన్హాస్ బీసీసీఐ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన బీసీసీఐ 37వ అధ్యక్షుడు.


◆ టోక్యోలో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో అమెరికా 16 స్వర్ణాలు, 5 రజతాలు, 5 కాంస్యాలతో (మొత్తం 26) అగ్రస్థానంలో నిలిచింది. కెన్యా, కెనడాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

◆ ఆరు దశాబ్దాలకు పైగా భారత గగనతలాన్ని శాసించిన యుద్ధవిమానం మిగ్-21కు సెప్టెంబరు 26న వైమానిక దళం నుంచి వీడ్కోలు పలికారు. చండీగఢ్‌లో జరిగిన వేడుకలో ఈ ఫైటర్ జెట్‌లను వాయుసేన నుంచి ఉపసంహరించారు. వాటి స్థానాన్ని దేశీయ తేజస్ యుద్ధవిమానాలతో భర్తీ చేస్తారు.

◆ తెలంగాణ డీజీపీగా బత్తుల శివధర్ రెడ్డి, హైదరాబాద్ కొత్వాల్‌గా వి.సి.సజ్జనార్ నియమితులయ్యారు.



రైలు ఆధారిత మొబైల్ లాంచర్ ద్వారా 'అగ్ని ప్రైమ్' క్షిపణిని డీఆర్‌డీఓ సెప్టెంబరు 25న విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణి 2000 కి.మీ. పరిధిలోని లక్ష్యాలను ధ్వంసం చేస్తుంది. రైలుపై ఈ తరహాలో క్షిపణి పరీక్ష చేయడం ఇదే తొలిసారి.



రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ ఎకానమీ

దేశ ప్రగతికి.. పతనానికి జనాభాయే మూలం!

ఒక ప్రదేశంలో నివసించే జన సంఖ్యను జనాభాగా పేర్కొంటారు. మానవ వనరుల్లో ఇది ఎంతో ప్రధానమైంది. దేశ ప్రగతికి, పతనానికి ఇది ముఖ్య కారణంగా ఉంటుంది. అవసరమైన స్థాయిలో పెరిగే జనం అభివృద్ధికి తోడ్పడితే, అడ్డుఅదుపు లేకుండా వృద్ధి చెందే జనాభా అధోగతికి దారితీస్తుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను సృష్టిస్తుంది. మౌలిక వసతులు, నిరుద్యోగం, వనరుల వినియోగం, పట్టణీకరణ మొదలైన అనేక అంశాలపై జనాభా వృద్ధి ప్రభావాన్ని చూపుతుంది. అందుకే ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు నియంత్రణ చర్యలు చేపడతాయి. జనాభా ఆవశ్యకత, అధిక జనాభా కారణంగా తలెత్తే సమస్యలు మొదలైనవాటిపై పరీక్షార్థికి అవగాహన అవసరం.

జనాభా ఆవశ్యకత

ఏ దేశానికైనా నిజమైన సంపద ఆ దేశ ప్రజలే. వారు దీర్ఘకాలం పాటు ఆరోగ్యవంతంగా, సృజనాత్మకమైన జీవితాన్ని గడిపే వాతావరణాన్ని అందించడమే అభివృద్ధి లక్ష్యం.

- ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి మానవ వనరులు ఎంతో కీలకం. ఆర్థికాభివృద్ధితో పాటు ఇవి ద్విముఖ సంబంధాన్ని కలిగి ఉంటాయి. ప్రజలు ఉత్పత్తిదారులు, వినియోగదారులుగా రెండు రకాలుగా ఉపయోగపడతారు.
- అయితే జనాభా పెరుగుదల ఎంతవరకు ఉత్పత్తిని పెంచుతుందనేది మానవుల పెరుగుదలపైనే ఆధారపడి ఉండదు. జనాభా పెరుగుతున్న తీరు-తెన్నులు అభివృద్ధికి అవసరమైన ఇతర పూరక వనరులు, ఉత్పత్తి పద్ధతులు మొదలైన అంశాలు ఇందులో భాగంగా ఉంటాయి.
- అధిక జనాభాకు సంబంధించిన ప్రమాదాన్ని తొలిసారిగా ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత థామస్ రాబర్ట్ మాల్థస్‌కు దక్కుతుంది. 1798 లో ఈయన రాసిన 'An Essay on the Principle of Population' గ్రంథంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.
- ఇందులోనే ఆయన మొదటిసారి శాస్త్రీయ జనాభా సిద్ధాంతాన్ని వివరించారు. ఆహార పదార్థాల సప్లయ్ వృద్ధికి, జనాభా వృద్ధికి మధ్య ఉన్న సంబంధాన్ని ఇందులో పేర్కొన్నారు. దీంతో అప్పటి వరకు అధిక జనాభా గురించి ఆలోచించినవారు.. అల్ప జనాభా, జనాభా తగ్గుదల గురించి విశ్లేషించడం మొదలుపెట్టారు.

భారత ఆర్థిక సమస్యలు - జనాభా పెరుగుదల సమస్యలు

ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించింది. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం, ప్రస్తుతం మన దేశ జనాభా 146.39 కోట్లుగా ఉంది. 1901లో దేశంలో మొత్తం జనాభా 23.6 కోట్లు. ఇది 1911లో 25.2 కోట్లు, 1921లో 25.1 కోట్లు, 1951లో 36.1 కోట్లు, 2001లో 102.8 కోట్లు, 2011లో 121 కోట్లుగా ఉంది.

- అధిక జనాభా కారణంగా దేశంలో అవకాశాలతో పాటు సవాళ్లు ఎదురవుతున్నాయి. ఉదాహరణకు ఎక్కువ జనాభాకు తగ్గట్లు భూభాగం పెరగదు. వనరులు పరిమితమే. ఇది రానున్న కాలంలో భారత్‌కు ప్రతికూలంగా మారుతుందనేది నిపుణుల అంచనా.
- ప్రస్తుతం భారత్‌లో యువకుల సంఖ్య అధికంగా ఉంది. 2050 తర్వాత వారంతా వృద్ధాప్యంలోకి వస్తారు. అప్పుడు ఎక్కువగా సమస్యలు ఎదురవుతాయి.
- అయితే జనాభా పెరగడం వల్ల ఆర్థికంగా ఎదగడానికి అపారమైన అవకాశాలు ఉంటాయి. చైనా, జపాన్ లాంటి దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరగడంతో అక్కడి కంపెనీలు భారత్ వైపు దృష్టి సారించే అవకాశం ఉంది.
- 1830లో మొత్తం ప్రపంచ జనాభా 100 కోట్లు. 1987 జులై 11 నాటికి 500 కోట్లు, 2011 నాటికి 700 కోట్లకు చేరింది. ఐక్యరాజ్య సమితి ప్రకారం, ప్రస్తుతం మొత్తం ప్రపంచ జనాభా 823.2 కోట్లు. జనాభా పరంగా అతిపెద్ద దేశాలను పరిశీలిస్తే.. ఇండియా (146.39 కోట్లు), చైనా (141.61 కోట్లు), అమెరికా (34.73 కోట్లు), ఇండోనేసియా (28.57 కోట్లు), పాకిస్థాన్ (25.52 కోట్లు).

అధిక జనాభా వల్ల ఏర్పడే వివిధ రకాల సమస్యలు

అధిక జనాభా ఆర్థిక వ్యవహారాల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయాన్ని కింది అంశాల ద్వారా తెలుసుకోవచ్చు. అవి:

జనాభా – స్థూల జాతీయాదాయం – తలసరి ఆదాయం: ఒక దేశ ఆర్థికాభివృద్ధి ఆ దేశ తలసరి ఆదాయ స్థాయిపై ఆధారపడి ఉంటుంది. మన దేశంలో జాతీయాదాయం పెరుగుతున్నప్పటికీ అధిక జనాభా వల్ల తలసరి ఆదాయ స్థాయి తగ్గుతుంది.

- అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నివేదిక-2025 ప్రకారం ప్రపంచంలో 190 దేశాల పరంగా స్థూలదేశీయోత్పత్తి తలసరి ఆదాయంలో (GDP per capita - ప్రస్తుతం అంతర్జాతీయ డాలర్లలో) మొదటి స్థానంలో Liechtenstein (2,01,110 డాలర్లు) ఉండగా తర్వాతి స్థానాల్లో సింగపూర్ (1,56,970 డాలర్లు), లక్సెంబర్గ్ (1,52,395 డాలర్లు) ఉన్నాయి. ఈ జాబితాలో భారత్ 123వ ర్యాంక్‌లో (12,101 డాలర్లు) ఉంది.
- దక్షిణ సూడాన్ 190వ స్థానం (954 డాలర్లు), బురుండి 189వ ర్యాంక్ (989 డాలర్లు) పొందాయి.
- భారత్ సరిహద్దు దేశాలైన.. చైనా (29,191 డాలర్లు) 74వ స్థానంలో, శ్రీలంక (15,632 డాలర్లు) 108, బంగ్లాదేశ్ (10,258 డాలర్లు) 127, పాకిస్థాన్ (6950 డాలర్లు) 144, నేపాల్ (6,140 డాలర్లు) 148, ఆఫ్ఘనిస్థాన్ (2,201 డాలర్లు) 179 ర్యాంకుల్లో ఉన్నాయి.
- యూఎన్‌డీపీ - మానవాభివృద్ధి సూచిక 2025 ప్రకారం, మానవ అభివృద్ధిలో మొదటి స్థానంలో ఐస్‌లాండ్ ఉండగా తర్వాత వరుసగా నార్వే, స్విట్జర్లాండ్ ఉన్నాయి. జాబితాలో మొత్తం 193 దేశాలు ఉన్నాయి. భారత్ 130వ స్థానంలో నిలిచింది. దక్షిణ సూడాన్ చివరి (193) ర్యాంక్ పొందింది.

పేదరిక సమస్య: ఏ దేశంలో అయితే అధిక శాతం ప్రజలకు కనీస అవసరాలైన తిండి, నివాసం, దుస్తులు, ఆరోగ్యం/ వైద్యం, విద్య, తాగునీరు, పారిశుద్ధ్యం లాంటివి దక్కవో వారిని పేదలుగా సూచిస్తారు.

- పేదరికం అనేది ఒక సాంఘిక ఆర్థిక సమస్య. అంటే ఇది వ్యక్తి లేదా కుటుంబ ఆదాయానికి సంబంధించింది.
- జనాభా పెరుగుదల అభిలషణీయ స్థాయి వరకు ఆ దేశ పురోగతికి తోడ్పడుతుంది. ఆ స్థాయి దాటితే వనరుల కొరత కారణంగా ప్రజల కనీస అవసరాలను తీర్చడం కష్టమవుతుంది. దీంతో వారు పేదరికంలోకి వెళ్తారు.
- ప్రపంచ బ్యాంక్ 2025, ఏప్రిల్‌లో భారతదేశంలోని పేదరిక గణాంకాలను ప్రకటించింది. పదేళ్లలో (2011-12 నుంచి 2022-23) 17.1 కోట్ల మంది ప్రజలు తీవ్ర పేదరికం నుంచి బయటపడినట్లు ఇది వెల్లడించింది. రోజుకి 2.15 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవించే ప్రజల శాతం 2011-12లో 16.2% ఉండగా 2022-23లో 2.3శాతానికి తగ్గినట్లు తెలిపింది.
- గ్రామీణ ప్రాంతాల్లో 2011-12లో 18.4శాతంగా ఉన్న తీవ్ర పేదరికం 2022-23 నాటికి 2.8శాతానికి తగ్గింది. అదే కాలంలో పట్టణాల్లో తీవ్ర పేదరికం 10.7% నుంచి 1.1%కి తగ్గింది.
- 2011-12లో దేశంలో అత్యంత పేదరికంలోని 65% మంది అయిదు అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలైన ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ్ బెంగాల్, మధ్యప్రదేశ్‌లో ఉన్నారు. 2022-23 నాటికి ఈ రాష్ట్రాల్లో తీవ్ర పేదరికం మూడింట రెండోవంతునకు తగ్గింది.

నిరుద్యోగ సమస్య: అధిక జనాభా నిరుద్యోగ సమస్యకు కారణమవుతుంది. ఆరో పంచవర్ష ప్రణాళిక (1980-85)లో పేర్కొన్న అంచనాల ప్రకారం భారత్‌లో 20.7 మిలియన్ల నిరుద్యోగులు ఉన్నారు.

- భారత్‌లో వేగవంతమైన జనాభా పెరుగుదల నిరుద్యోగ సమస్యలు సృష్టిస్తుంది. అందుబాటులో ఉన్న ఉద్యోగాల కంటే ఏటా ఎక్కువ సంఖ్యలో శ్రామిక శక్తిలోకి ప్రవేశిస్తున్నారు. దీంతో పరిమిత అవకాశాల కోసం పోటీ పడేవారి సంఖ్య ఎక్కువవుతోంది.
- 2025, డిసెంబరు 15న భారత ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ఆధారంగా.. 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వ్యక్తుల నిరుద్యోగిత రేటు 2025 నవంబరులో 4.7% తగ్గింది.
- 2025 నవంబరులో 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసున్న వ్యక్తులు మొత్తం శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు (LFPR) ఏడు నెలల గరిష్ఠ స్థాయికి 55.8% పెరిగింది.
- 15 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయసున్న వ్యక్తుల మొత్తం వర్కర్ పాపులేషన్ రేషియో (డబ్ల్యూపీఆర్) 2025 అక్టోబరులో 52.5% నుంచి నవంబరు నాటికి 53.2శాతానికి మెరుగుపడింది.



రచయిత

బండారి ధనుంజయ

విషయ నిపుణులు

878 Word of the Day

Unseemly

Telugu meaning: అనుచితమైన, అసమంజసమైన

English meaning: The word unseemly (అన్‌సీమ్లీ) is an adjective that describes behaviour that is improper, indecent, or socially unacceptable.

Synonyms: Inappropriate, Indecent; ***Antonyms:*** Proper, Appropriate

Uage: 1. The unseemly argument between officials during the meeting embarrassed the entire organisation.

2. His unseemly laughter at a serious moment revealed a lack of sensitivity and maturity.

Current Affairs



Union Civil Aviation Minister Ram Mohan Naidu inaugurated DHRUV-NG, the next-generation civil helicopter, at Hindustan Aeronautics Limited (HAL) in Bengaluru on 30 December 2025. The helicopter received civil certification from Directorate General of Civil Aviation (DGCA) for its indigenous Shakti engine.

- The DHRUV-NG is a 5.5-tonne light twin-engine, multi-role helicopter designed to meet the diverse and demanding operational requirements of Indian terrain. It has been significantly upgraded to cater to the stringent needs of the global civil aviation market.



Bangladesh's former Prime Minister Begum Khaleda Zia has died in Dhaka on 30 December 2025. She was 80. Zia is the chairperson of the Bangladesh Nationalist Party (BNP). She was born on August 15, 1946, in Dinajpur, then part of India's East Bengal, now Northern Bangladesh.

- In 1991, becoming the first woman to serve as Bangladesh prime minister. She held the office from 1991 to 1996, and again from 2001 to 2006.



Israeli Prime Minister Benjamin Netanyahu announced the country's highest civilian honour, the Israel Prize for Peace', to U.S. President Donald Trump, following high-level bilateral talks in Florida. In the 80-year history of the prize, it has never before been awarded to a non-Israeli citizen, nor has the Peace category ever been formally conferred. The decision follows a rule amendment approved in July 2025, enabling foreign nationals to receive the honour under exceptional circumstances.

For more Current Affairs: Scan QR code

ప్రపంచ కుటుంబ దినోత్సవం

జనవరి 1

చరిత్రలో ఈనాడు

ఒక ఇంట్లో నివసించే కొందరు వ్యక్తుల సమూహాన్నే కుటుంబంగా పేర్కొంటారు. వీరి మధ్య వైవాహిక, రక్తసంబంధాలు ఉంటాయి. ప్రపంచంలోని అన్ని సమాజాల్లోనూ కుటుంబ వ్యవస్థ కనిపిస్తుంది. మనిషి సామాజిక జీవనానికి ఇదే మూలం. వ్యక్తికి సమాజంలో తొలి గుర్తింపు కుటుంబం ద్వారానే లభిస్తుంది. అంతేకాక బాధ్యత ఉన్న వ్యక్తిగా మెలగడానికి అవసరమైన శిక్షణ ఇదే అందిస్తుంది. కుటుంబ వ్యవస్థ గొప్పతనం, ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా జనవరి 1న 'ప్రపంచ కుటుంబ దినోత్సవం'గా (Global Family Day) నిర్వహిస్తారు. ప్రజల మధ్య ఐక్యత, శాంతిని పెంపొందించడంతోపాటు మనమంతా ప్రపంచ కుటుంబంలో భాగం అనే భావనను విస్తృతం చేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

కుటుంబం అంటే?

సాధారణంగా దంపతులు, వారి పిల్లలు కలిసి జీవించడాన్ని కుటుంబంగా పేర్కొంటారు. దీన్ని ఆంగ్లంలో 'ఫ్యామిలీ' అని పిలుస్తారు. ఇది 'Famulus' అనే రోమన్ పదం నుంచి ఏర్పడింది. దీని అర్థం 'సేవకుడు'.

చారిత్రక నేపథ్యం

ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1998, నవంబరులో 21వ శతాబ్దపు మొదటి దశాబ్దాన్ని ప్రపంచవ్యాప్తంగా పిల్లల్లో శాంతి, అహింసను ప్రోత్సహించాలని భావించింది. దీనికి అనుగుణంగా 2001-10 కాలాన్ని The International Decade for a Culture of Peace and Non-Violence for the Children of the World గా ప్రకటించింది.

- కుటుంబ వ్యవస్థ ద్వారానే దీన్ని సాధించడం కుదురుతుందని యూఎన్ఓ భావించింది.




2000, జనవరి 1న ఐక్యరాజ్య సమితి 'వన్ డే ఇన్ పీస్' అనే పుస్తకాన్ని విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా శాంతియుత వాతావరణం ఉండాలంటే ప్రజలంతా ఒకే కుటుంబం అనే భావనతో మెలగాలని అందులో సూచించారు. దీనికి మరింత ప్రాచుర్యం కల్పించే ఉద్దేశంతో యూఎన్ఓ ఏటా జనవరి 1న 'ప్రపంచ కుటుంబ దినోత్సవం'గా జరపాలని తీర్మానించింది.

కుటుంబం - రకాలు, గతంలో అడిగిన ప్రశ్నలు - వాటి జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

జీర్ణవ్యవస్థ



జీవుల మనుగడకు అవసరమైన వ్యవస్థల్లో జీర్ణవ్యవస్థ ముఖ్యమైంది. ఇది జంతు శరీరధర్మశాస్త్రంలో ప్రాథమిక భాగం. ఈ వ్యవస్థ నోటితో ఆహారం తీసుకోవడంతో ప్రారంభమై, పెద్దపేగులో నిల్వ అయిన వ్యర్థాలను శరీరం నుంచి బయటికి పంపడంతో ముగుస్తుంది. దీని మధ్యలో అనేక అవయవాలు తమ విధులను నిర్వర్తిస్తాయి. దీనికోసం నోరు, అన్నవాహిక, చిన్నపేగు, పెద్దపేగు, కాలేయం, క్లోమంతో సహా జీర్ణవ్యవస్థను ఏర్పర్చే ప్రధాన అవయవాల పనితీరును అర్థం చేసుకోవాలి.

జీర్ణవ్యవస్థ – ప్రధాన భాగాలు

- నోరు
- అన్నవాహిక
- జీర్ణాశయం
- చిన్నపేగు
- పెద్దపేగు
- పురీష నాళం
- పాయువు

జీర్ణక్రియ – వివిధ ప్రక్రియలు

- ఆహారాన్ని తీసుకోవడం
- యాంత్రిక జీర్ణక్రియ
- రసాయన జీర్ణక్రియ
- శోషణ
- విసర్జన

ప్రధాన జీర్ణ ఎంజైమ్‌లు

- అమైలేస్
- ప్రోటియేజ్
- లైపేస్
- న్యూక్లియేస్

మానవుల్లో జీర్ణ సంబంధ ఆరోగ్య రుగ్మతలు

- గ్యాస్ట్రో ఈసోఫాగియల్ రిఫ్లక్స్ వ్యాధి (GERD)
- అల్సర్
- ప్రకోప పేగు వ్యాధి (IBS)
- ఉదర కుహర వ్యాధి

ప్రధాన జీర్ణ ఎంజైమ్‌లు - వాటి విధులు, జీర్ణక్రియ - ఎంజైమ్ ప్రమేయం ఉన్న దశలు, ఎంజైమ్ కార్యాచరణను ప్రభావితం చేసే కారకాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Apprentice Posts

The Indian Space Research Organisation (ISRO), through its ISRO Propulsion Complex (IPRC) located at Mahendragiri, Tamil Nadu, has released a notification to recruit Graduate and Technician Apprentices. The total no. of posts is 100. The interview dates are 10 January 2026 for Graduate Engineering, Technician Apprentice; 11 January 2026 for Graduate Non-Engineering.

Non-Teaching Posts

Indian Institute of Technology Bhubaneswar (IIT Bhubaneswar) is inviting applications through direct recruitment for the filling of Non-Teaching posts in various departments. The total no. of posts is 101. Eligible candidates can apply online before 8th January 2026.

Trade, Technician, and Graduate Apprentice Posts

Garden Reach Shipbuilders & Engineers Limited (GRSE), Kolkata, is inviting applications from eligible candidates for Trade, Technician, and Graduate Apprentice posts. The total number of posts is 220. The last date for online applications is 10 January 2026.

Did You Apply..?


Today (January 1) is the last date for the following jobs.

- 764 Senior Technical Assistant Posts in DRDO CEPTAM. ***Qualification:*** B.Sc. or Diploma.
- 77 Faculty Jobs at AIIMS Bhopal. ***Eligibility:*** MD/MS/DM/MCh.
- UPSC - 202 posts. ***Eligibility:*** Diploma/Degree/PG/PhD.


For more information and other notifications - scan QR code

Venn Diagrams


1. Which of the following diagrams correctly represents elephants, wolves, animals?




2. Which of the following venn diagram correctly illustrates the relationship among the classes: carrot, food, vegetables?



Directions (Qs. 3 - 7): *In the following questions, three classes are given out of the four figures that follow, you are to indicate which figure will best represent the relationship amongst the three classes.*




3. women mothers, widows
4. authors, teachers, men.
5. sparrow, birds, mice
6. tea, coffee, beverages
7. boys, students, athletes
8. Select from the given diagrams, the one that illustrate the relationship among the given three classes - judge, thief, criminals



Bank Exams

Reasoning


9. Choose from the five diagrams given below, the one that illustrates the relationship among languages, French, German



10. Which one of the following diagrams correctly represent among the classes: tennis fans, cricket players, students.



11. Which are of the following venn diagram best illustrates the three classes - rhombus, quadrilateral, polygons?



Scan the QR code for Key

These model questions were prepared by

Rajesh Madhu

Asst. Prof. of Mathematics.

భగ్గుమంటున్న ఇరాన్

- పెరిగిన ధరలు, పడిపోయిన రియాల్‌తో ప్రజల్లో ఆగ్రహావేశాలు
- దేశమంతటా విస్తరించిన నిరసనలు



మూతపడిన గ్రాండ్ బజార్

టెహ్రాన్: పెరిగిన ధరలు, పడిపోయిన కరెన్సీ విలువతో ఇరాన్ భగ్గుమంటోంది. తొలుత టెహ్రాన్‌లో ప్రారంభమైన నిరసనలు దేశమంతటా విస్తరించాయి. ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో సెంట్రల్ బ్యాంకు గవర్నర్ రాజీనామా చేసినా ప్రజలు శాంతించలేదు. కరెన్సీ రియాల్ విలువ పడిపోవడం, దారుణ పరిస్థితులను నిరసిస్తూ టెహ్రాన్‌లో వ్యాపారులు వీధుల్లోకి వచ్చి ఆందోళనల్లో పాల్గొంటున్నారు. దేశంలోని పలు నగరాలు, పట్టణాల్లో 3 రోజులుగా నిరసనలు కొనసాగుతున్నాయి.

అమెరికా డాలరుతో పోలిస్తే రియాల్ విలువ దారుణంగా పడిపోవడంతో ఆదివారం టెహ్రాన్‌లోని గ్రాండ్ బజార్‌లో ఉన్న వ్యాపారులు నిరసనకు దిగారు. అప్పటి నుంచి ఆందోళనలు కొనసాగుతున్నాయి. అవి కరాజ్, హమేదాన్, కెష్మ్, మలార్డ్, ఇస్ఫహాన్, కెర్మాన్‌షా, షిరాజ్, యాజ్డ్‌లకు విస్తరించాయి. పలుచోట్ల ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారమయ్యాయి. ప్రభుత్వం ఆందోళనకారులను చర్చలకు పిలిచినా పెద్దగా ప్రయోజనం లేకపోయింది. 10 విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఆందోళనల్లో పాల్గొంటున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. నియంతలకు మరణ శిక్ష విధించాలని డిమాండు చేస్తున్నారు.



గ్రాండ్ బజార్ వ్యాపారుల ఆందోళన

సెంట్రల్ బ్యాంకుకు కొత్త గవర్నర్

దేశంలో ఆందోళనల నేపథ్యంలో రాజీనామా చేసిన సెంట్రల్ బ్యాంకు గవర్నర్ మహమ్మద్ రెజా ఫర్జిన్ స్థానంలో ఆర్థిక శాఖ మాజీ మంత్రి అబ్దుల్ నాజర్ హెమ్మతిని ప్రభుత్వం నియమించింది. అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నేతృత్వంలోని క్యాబినెట్ ఆయన నియామకానికి ఆమోద ముద్ర వేసింది.

✦ వాస్తవానికి ఆర్థిక మంత్రిగా ఉన్న 68ఏళ్ల హెమ్మతిని 2024 మార్చిలో పార్లమెంటు తొలగించింది. పాలనా వైఫల్యంతోపాటు ఆయన అమలు చేసిన విధానాలు రియాల్‌కు వ్యతిరేకంగా ఉన్నాయని అప్పట్లో తీవ్ర విమర్శలొచ్చాయి.

40 శాతానికి ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణం 40శాతానికి చేరడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందని నిపుణులు చెబుతున్నారు. బుధవారం ఒక అమెరికా డాలరు విలువ 1.38 మిలియన్ రియాల్స్‌గా ఉంది. 2022లో ఫర్జిన్ బాధ్యతలు చేపట్టిన సమయానికి అది 4,30,000 వద్ద ఉండేది. ఈ మూడేళ్లలో రియాల్ విలువ భారీగా పడిపోయింది.

✦ కరెన్సీ రియాల్ విలువ పడిపోవడం, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరగడంతో ఆహారం, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇప్పటికే పాశ్చాత్య దేశాల ఆంక్షల కారణంగా ఇరాన్ బడ్జెట్ భారంగా ఉంది. దీనికితోడు పెట్రో ధరలను పెంచడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

✦ 2015లో ఒక డాలరు విలువ 32,000 రియాల్స్‌గా ఉండేది. 10 ఏళ్లలో అది ఊహించనంతగా దిగజారింది.

✦ ఇరాన్‌లో ఒక సగటు ఉద్యోగి నెలకు 100 డాలర్లు సంపాదిస్తారు. ఈ సొమ్ము కేవలం అతి సాధారణ ఆహారం కొనుగోలుకే సరిపోతోంది. ఇరాన్ ఎక్కువగా దిగుమతులపై ఆధారపడటం, ఆర్థిక ఆంక్షల కారణంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. ఇది సమాజంలో అశాంతికి కారణమవుతోంది.

✦ 2026 బడ్జెట్‌లో పన్నును ప్రభుత్వం 62శాతానికి పెంచింది. దీంతోపాటు ద్రవ్యోల్బణం అంచనాను 50శాతంగా పేర్కొంది. ఇది వీధుల్లో నిట్టనిలువునా దోచుకోవడమేనని విమర్శలొస్తున్నాయి.

సమాజంలో అశాంతి

దేశంలో ఆర్థిక సంక్షోభం ప్రజల్లో అశాంతికి కారణమవుతోంది. ప్రజలు ఇప్పటిదాకా దాచుకున్న డబ్బులు ఖర్చయిపోతున్నాయి. ఆహారం, ఔషధాలు కొనలేని స్థాయికి చేరుకున్నాయి.

✦ తాగునీరు, విద్యుత్తు సరఫరాల్లో తరచూ అంతరాయాలు చోటుచేసుకుంటున్నాయి. [illegible] పట్టణాల్లోని మధ్య తరగతికి కష్టాలు తప్పడం లేదు.

కఠిన చర్యలకు సిద్ధం!

ప్రభుత్వం ఒకవైపు ఆందోళనకారులతో చర్చలు జరుపుతానని మరోవైపు కఠినంగా అణిచివేసేందుకు సిద్ధమవుతోంది. నిరసనకారులు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే తగిన విధంగా స్పందిస్తామని ఇరాన్ ప్రాసిక్యూటర్ జనరల్ మహమ్మద్ మోవహెది-ఆజాద్ హెచ్చరించారు. చట్టబద్ధంగా ఆందోళనలతో ఇబ్బంది లేదని ఆయన స్పష్టం చేశారు.

విదేశీ సంస్థల పాత్ర ఉందంటున్న ప్రభుత్వం

దేశంలో జరుగుతున్న ఆందోళనల వెనుక విదేశీ నిఘా సంస్థల పాత్ర ఉందని ప్రభుత్వ వర్గాలు, స్థానిక మీడియా ఆరోపిస్తున్నాయి.

గ్రాండ్ బజార్ జీవనాడి

టెహ్రాన్‌లోని గ్రాండ్ బజార్‌కు చారిత్రక నేపథ్యముంది. దశాబ్దాలుగా అది ఇరాన్ ఆర్థిక జీవనాడిగా ఉంది. దేశంలో రాజకీయ స్థిరత్వానికి చుక్కానిలా నిలుస్తోంది. దేశంలో తిరుగుబాటుకు బజార్‌లో మొదలైన ఆందోళనలు సూచికగా నిలుస్తాయని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. 1979లో ఈ గ్రాండ్ బజార్‌లో మొదలైన సమ్మె దేశంలో ఇస్లామిక్ విప్లవానికి దారి తీసింది. రాజరికాన్ని పెకిలించి వేసింది.

✦ గ్రాండ్ బజార్ సమ్మెతో ఆహారానికి ఇబ్బంది కాకుండా ఇస్లామిక్ రిపబ్లిక్ [illegible] చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది ఇరాన్‌లోని మార్కెట్లకు ప్రాణాలను కాపాడే రక్తనాళంలా ఉంటుందని చెబుతున్నారు.

పాక్‌తో కాల్పుల విరమణలో ఎవరి జోక్యమూ లేదు

- భారత్ స్పష్టీకరణ
- చైనా మధ్యవర్తిత్వం వ్యాఖ్యల నేపథ్యంలో స్పందన

దిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య 2025 మే నెలలో తలెత్తిన సైనిక ఉద్రిక్తతలను సమర్థ మధ్యవర్తిత్వం ద్వారా తామే తగ్గించామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మంగళవారం చేసిన ప్రకటనను మన దేశం ఖండించింది. పాక్‌తో కాల్పుల విరమణ విషయంలో ఎవరి జోక్యమూ లేదని స్పష్టం చేసింది. కాల్పులు ఆపాలన్నది ఇరు దేశాల సైనిక డీజీఎంవోలు చర్చలు జరిపి తీసుకున్న నిర్ణయమని, ఇందులో మూడో పక్షం పాత్ర లేదని విదేశీ వ్యవహారాల శాఖ బుధవారం పునరుద్ఘాటించింది.

ప్రధాని స్పందించాలి: కాంగ్రెస్

మధ్యవర్తిత్వం గురించి చైనా చేసిన ప్రకటనపై కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో ప్రధాని మోదీ స్పందించాలని, దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. "భారత్-పాక్ ఘర్షణను ఆపింది తానేనని ట్రంప్ ఇప్పటికి 65 సార్లు చెప్పుకొన్నారు. దానిపై మోదీ నోరు మెదపలేదు. ఇప్పుడు చైనా విదేశాంగ మంత్రి కూడా.. తాము మధ్యవర్తిత్వం జరిపామంటున్నారు. ఈ వ్యవహారంలో ప్రధాని స్పందించాలి. లేకపోతే జాతీయ భద్రత అంశం ఒక జోక్‌గా మారుతుంది" అని జైరాం రమేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

2026లోనైనా మంచి పాలన అందించండి: ఖర్గే



దిల్లీ: భాజపా పాలనలో 2025లో దేశం అనేక సమస్యలను ఎదుర్కొందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. నూతన సంవత్సరంలోనైనా ప్రజలకు మంచి పాలన అందించాలని కేంద్రానికి సూచించారు. బెంగళూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మరోవైపు- 2025కు సంబంధించి కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను గుర్తుచేస్తూ కమలదళంపై 'ఎక్స్'లో ఖర్గే విమర్శలతో విరుచుకుపడ్డారు. ఉపాధి హామీ, ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం, ఎన్నికల ప్రక్రియ, అంతర్జాతీయ వ్యవహారాలు సహా మొత్తం 14 అంశాలను తన సుదీర్ఘ పోస్టులో ప్రస్తావించారు. ఎంజీనరేగాను రద్దు చేయడం ద్వారా కోట్ల మంది పేదల జీవనాధారాన్ని ప్రభుత్వం దెబ్బతీసిందన్నారు. సరైన సన్నాహాలు లేకుండా, బూత్ స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వకుండా చేపట్టిన ఎన్నికల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియతో కోట్ల మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం తలెత్తిందని విమర్శించారు.

స్పష్టమైన సంస్కరణల ఫలితం: భాజపా

ఖర్గే విమర్శలపై భాజపా దీటుగా స్పందించింది. మోదీ సర్కారు చేపట్టిన స్పష్టమైన సంస్కరణల ఫలితంగానే భారత్ ప్రపంచంలోకెల్లా నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి పేర్కొన్నారు.

సంస్కరణ.. ఆచరణ.. రూపాంతరీకరణ

- 'ప్రగతి' మంత్రం ప్రబోధించిన మోదీ



దిల్లీ: సంస్కరణ, ఆచరణ, రూపాంతరీకరణలే ప్రగతి మంత్రాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నొక్కి చెప్పారు. ప్రధానమైన ప్రభుత్వ ప్రాజెక్టుల అమలును సమీక్షించేందుకు ఏర్పాటైన డిజిటల్ పరిపాలక వేదిక- "ప్రొయాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్‌లీ ఇంప్లిమెంటేషన్" (ప్రగతి) 50వ సమావేశానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బుధవారం అధ్యక్షత వహించి ప్రసంగించారు. దశాబ్ద కాలంలో దాదాపు 85 లక్షల కోట్ల విలువచేసే ప్రాజెక్టులను సమీక్షించిన ఈ వేదిక 50 సార్లు సమావేశం కావడం అపూర్వమని, సంస్కరణ గతిని కొనసాగించడంలో ఇదెంతో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. పెండింగు ప్రాజెక్టులను దీని కారణంగానే పూర్తి చేయగలిగామని తెలిపారు. సహకారాత్మక సమాఖ్య స్ఫూర్తికిది ప్రతీక అన్నారు. రహదారులు, రైల్వే, విద్యుత్తు, జల వనరులు, బొగ్గు రంగాలకు సంబంధించిన మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులను మోదీ సమీక్షించారు. పీఎంశ్రీ పథకం అమలును జాగ్రత్తగా పర్యవేక్షించాలని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు. రెండో దశ సంస్కరణలు ఎలా ఉండాలో తెలియజేశారు. సరళీకరణ కోసం సంస్కరణ, ఫలితాలు సాధించడానికి కార్యకుశలత, ప్రభావం చూపేలా పరిణామం అన్నవి మూల సూత్రాలన్నారు. సమయం, వ్యయం, నాణ్యతలు ప్రాజెక్టుల అమలు పనితీరులో అంతర్భాగం కావాలన్నారు. అనేక ప్రాజెక్టులు దశాబ్దాల పాటు పెండింగులో ఉన్నాయని, 'ప్రగతి' వేదిక కారణంగా అవి పురోగతి సాధించగలిగాయని మోదీ తెలిపారు.

ఈ దేశం అందరిదీ

- ఆరెస్సెస్ చీఫ్ భాగవత్ స్పష్టీకరణ

రాయ్‌పుర్: ఈ దేశం అందరిదని ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. కులం, ఐశ్వర్యం, భాష వంటి విభజనలను పక్కనపెట్టి సామాజిక సామరస్యం సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి మనిషినీ మన సొంత మనిషిలా పరిగణించాలని సూచించారు. ప్రతి కుటుంబం వారంలో ఒక రోజు కలసి భోజనం చేయడం, సమష్టి ప్రార్థనలు, అర్థవంతమైన చర్చల వంటి సామూహిక కార్యకలాపాలు చేపట్టాలని పేర్కొన్నారు. తద్వారా ఏకాంతాన్ని పారదోలాలని సూచించారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్ జిల్లా సోనాపైరి గ్రామంలో నిర్వహించిన 'హిందూ సమ్మేళనం'లో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేవాలయాలు, తాగునీటి సదుపాయాలు, శ్మశాన వాటికలు వంటివి వివక్షకు తావులేకుండా హిందువులందరికీ చెందాలని అభిప్రాయపడ్డారు. కులం, ధనం, భాష, ప్రాంతం ఆధారంగా ఎవరినీ అంచనా వేయకూడదని పేర్కొన్నారు. 'యావత్ భారతదేశం నాదే' అని పేర్కొంటూ సామాజిక సామరస్యం ఎంతో ముఖ్యమని తెలిపారు.

దిల్లీలో రూ.10 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

- ఇద్దరి అరెస్టు

దిల్లీ: దేశ రాజధానిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు చేపట్టిన ఆపరేషన్లలో భాగంగా రూ.10 కోట్లకు పైగా విలువైన సుమారు రెండు కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. దిల్లీలోని ద్వారకలో డ్రగ్స్ సరఫరా చేస్తున్నారన్న నిఘా సమాచారం ఆధారంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలీ నుంచి పర్షాద్ అనే వ్యక్తి డ్రగ్స్‌ను అక్రమ రవాణా చేసి దానిని దిల్లీలో రాణా అనే వ్యక్తికి విక్రయించినట్లు తేలింది. దీంతో లక్ష్మీనగర్ ప్రాంతంలో దాడులు నిర్వహించి పర్షాద్‌ను అరెస్టు చేశారు. ఈ సిండికేట్ ముఠా దిల్లీ-ఎన్సీఆర్‌లో మాదకద్రవ్యాలను సరఫరా చేస్తోందని పోలీసులు తెలిపారు.

సొరంగంలో రెండు లోకో రైళ్ల ఢీ

- 88 మంది కార్మికులకు గాయాలు
- ఉత్తరాఖండ్‌లో ఘటన

గోపేశ్వర్: ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో ప్రమాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న విష్ణుగఢ్- పిపాల్‌కోటి జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో రెండు లోకో రైళ్లు ఢీకొన్నాయి. మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో 88 మంది కార్మికులు గాయపడ్డారు. రాత్రి షిఫ్ట్‌లో సొరంగం తవ్వకం పనుల కోసం కార్మికులను తీసుకువెళుతున్న లోకో రైలు అదే సమయంలో ఎదురుగా సామగ్రితో వస్తున్న మరో లోకో రైలును ఢీకొట్టింది. సహాయక బృందాలు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించాయి. సొరంగంలో నిర్మాణ పనుల కోసం కార్మికులకు, సామగ్రిని తరలించడానికి రైళ్లను పోలిన వాహనాలను(లోకో రైళ్లు) వినియోగిస్తుంటారు. ఇవి తమ పరిధిలోనివి కాదని భారతీయ రైల్వే ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.

కదులుతున్న కారులో వివాహితపై అత్యాచారం

- ఆ తర్వాత బయటకు తోసివేత

ఫరీదాబాద్: జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్)లో ఒక వివాహిత (25)కు లిఫ్ట్ ఇస్తామని నమ్మబలికిన ఆగంతకులు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత.. వేగంగా వెళ్తున్న వాహనం నుంచి బయటకు తోసివేశారు. తీవ్రంగా గాయపడిన బాధితురాలి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. మంగళవారం జరిగిన ఈ దారుణం గురించి పోలీసులు బుధవారం వెల్లడించారు. 13 ఏళ్ల క్రితం డిసెంబరులో దిల్లీలో ఇలాంటి పరిస్థితుల్లోనే దారుణ అత్యాచారానికి గురై, ప్రాణాలు కోల్పోయిన నిర్భయ ఉదంతాన్ని ఇది గుర్తుచేసింది. మంగళవారం సాయంత్రం స్నేహితురాలిని కలిసేందుకు వెళ్లి తన ఇంటికి తిరిగి చేరేందుకు వాహనం కోసం గృహిణి నిరీక్షిస్తోంది. తమ కారులో తీసుకువెళ్తామని చెప్పిన నిందితులు ఆమె వెళ్లాల్సిన వైపునకు కాకుండా గురుగ్రామ్ దిశగా వాహనాన్ని మళ్లించారు. ఒకరితర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడి రాత్రంతా కారులో తిప్పారు. తెల్లవారుజామున మూడింటికి.. గంటకు 90 కి.మీ. వేగంతో వెళ్తున్న కారు నుంచి బయటకు నెట్టేశారు. ఆమె తలకు, ముఖానికి తీవ్ర గాయాలు కావడంతో 12 కుట్లు పడ్డాయి. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి జ్యుడీషియల్ కస్టడీ విధించారు. భర్తతో తగాదా కారణంగా బాధితురాలు ముగ్గురు పిల్లలతో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది.

కొత్త ఏడాదికి స్వాగతం పలికిన ప్రపంచం



ఆస్ట్రేలియాలోని సిడ్నీ హార్బర్‌లో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బాణసంచా వెలుగులు

మెల్‌బోర్న్: నూతన సంవత్సరానికి ప్రపంచం స్వాగతం పలికింది. ఆనందోత్సాహాల మధ్య వివిధ దేశాలు ఈ వేడుకలను ఘనంగా జరుపుకున్నాయి. తొలుత పసిఫిక్ మహాసముద్రంలోని కిరిబాటి ద్వీప దేశాన్ని న్యూ ఇయర్ పలకరించింది. తర్వాత న్యూజిలాండ్‌లో సంబరాలు ప్రారంభమయ్యాయి. ఆ దేశంలోని ప్రధాన నగరమైన ఆక్లాండ్‌లోని 'స్కై టవర్' వేదికగా బాణసంచా ప్రదర్శన ఆకట్టుకుంది. కొత్త సంవత్సరం ఆస్ట్రేలియాలోకి ప్రవేశించింది. ఇటీవల సిడ్నీలోని బోండీ బీచ్‌లో జరిగిన కాల్పుల్లో 14 మంది మృతి చెందడంతో ఈసారి సంబరాలపై నీలినీడలు కమ్ముకొన్నాయి. సిడ్నీ హార్బర్ బ్రిడ్జి దగ్గర భారీ సంఖ్యలో భద్రతా సిబ్బంది కనిపించారు. కొత్త సంవత్సరానికి ఓ గంట ముందు బోండీ బీచ్ బాధితులకు అక్కడి ప్రజలు నివాళులర్పించారు. ఆస్ట్రేలియా తర్వాత ఇండోనేసియా, హాంకాంగ్‌లనూ భారీయెత్తున కొత్త సంవత్సర వేడుకలు జరిగాయి.

ఓటరు తుది జాబితాలో తేడాలుంటే న్యాయపోరాటం చేస్తాం

- ఈసీకి తృణమూల్ హెచ్చరిక

దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియకు సంబంధించి తాము లేవనెత్తిన ఆందోళనలను పరిష్కరించడంలో ఎన్నికల సంఘం (ఈసీ) విఫలమైందని తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ బుధవారం ఆరోపించారు. వ్యత్యాసాలేవైనా ఉంటే.. ఓటరు తుది జాబితాను తాము ఆమోదించబోమని స్పష్టం చేశారు. 10 మంది సభ్యుల టీఎంసీ ప్రతినిధి బృందం ఈసీతో సమావేశమైన అనంతరం అభిషేక్ విలేకరులతో మాట్లాడారు. 'తేడాలుంటే న్యాయపోరాటం చేస్తాం' అని హెచ్చరించారు. ఓటు చౌర్యం ఓటరు జాబితా సాయంతో సాగుతోందే తప్ప ఈవీఎంల ద్వారా కాదని అన్నారు. ఈ వాదనను గట్టిగా వినిపించి ఉంటే మహారాష్ట్ర, బిహార్ వంటి రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు విజయం సాధించి ఉండేవని అభిప్రాయపడ్డారు. ముసాయిదా ఓటరు జాబితాపై తమ అభ్యంతరాలను ఈసీకి తెలియజేశామని చెప్పారు. 1.36 కోట్ల మంది ఓటర్లకు సమన్లు జారీ చేయడాన్ని ప్రశ్నించామన్నారు. తమతో సమావేశంలో ఎన్నికల సంఘం దూకుడుగా వ్యవహరించిందని అభిషేక్ పేర్కొన్నారు. "సమావేశంలో మేం మాట్లాడటం ప్రారంభించేసరికి ప్రధాన ఎన్నికల అధికారి (సీఈసీ) అసహనం వ్యక్తం చేయడం ఆరంభించారు. 'మీరు నియమితులైన అధికారి.. నేను ఎన్నికైన ప్రజా ప్రతినిధిని' అని నేను అన్నాను. దమ్ముంటే ఓటింగుకు సంబంధించిన వీడియో ఫుటేజీ బహిర్గతం చేయండని అడిగాను. మా అనుమానాలను ఎన్నికల సంఘం నివృత్తి చేయలేదు" అని పేర్కొన్నారు.

రుతుక్రమ సంరక్షణలో మునగ భేష్

- నిపుణుల వెల్లడి

దిల్లీ: మహిళలు రుతుక్రమం సమయంలో ఉపయోగించే శానిటరీ ప్యాడ్లలో మునగను సహజ పదార్థంగా వాడాలని నిపుణులు సూచిస్తున్నారు. మహిళలకు రుతుక్రమ సమయంలో మునగ ఉపశమనాన్ని కలిగించడంతోపాటు ఇన్‌ఫెక్షన్ల ముప్పును గణనీయంగా తగ్గించగలదని శాస్త్రీయ ఆధారాలు రుజువు చేస్తున్నట్లు వారు వెల్లడించారు. మునగలోని ఖనిజాలు, అమైనో ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు సహా 90 రకాల బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉన్నట్లు పరిశోధనల్లో వెల్లడైంది. ఇవన్నీ పీహెచ్ సమతౌల్యాన్ని పెంపొందిస్తాయి. ఈ చెట్టులోని యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ (వాపు తగ్గించే) లక్షణాలు.. శానిటరీ ప్యాడ్ల పైపొరగా ఉపయోగించడానికి సరిపోతాయని తెలిపారు. సల్ఫేట్ వంటి కఠిన రసాయనాలు దీంట్లో ఉండవని, సున్నితమైన చర్మం సహా అన్నిరకాల చర్మాలకు సరిపోతుందని కొందరు నిపుణులు చెబుతున్నారు. కొన్ని రకాల కృత్రిమ సమ్మేళన పదార్థాల మాదిరిగా మునగ- స్త్రీల అంతర్గత భాగాలకు హాని కలిగించదని చెప్పారు. శానిటరీ ప్యాడ్లను చర్మానికి అనుకూలంగా ఉండేవిగా మార్చాల్సిన అవసరం ఉందని దిల్లీలోని మ్యాక్స్ ఆసుపత్రి గైనకాలజీ విభాగ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రిచా సింఘాల్ తెలిపారు. రుతుక్రమ సమయంలో ఇన్ఫెక్షన్ల ముప్పును తగ్గించడం ద్వారా ఆ సమయాన్ని సౌకర్యవంతంగా మార్చే సామర్థ్యం మునగకు ఉన్నట్లు పరిశోధనల్లో వెల్లడైందని ఆమె వివరించారు.

ఆ పనుల వల్ల వెన్నునొప్పి తాత్కాలికమే

దిల్లీ: వంగి పనిచేయడం, తోయడం వంటి కార్యకలాపాలు స్వల్పకాలికంగా వెన్ను దిగువ భాగంలో నొప్పి కలిగించినా దీర్ఘకాలిక నష్టాన్ని కలిగించబోవని ఒక కొత్త అధ్యయనం వెల్లడించింది. 'జర్నల్ ఆఫ్ ద అమెరికన్ మెడికల్ అసోసియేషన్' ఈ అధ్యయన సారాంశాన్ని ప్రచురించింది. వెన్ను దిగువ భాగంలో నొప్పితో బాధపడుతున్నవారు దేన్నైనా తోయడం, లాగడం, వంగి పనిచేయడం, మెలి తిరగడం వంటివి చేస్తే వారి సమస్య విషమించదని గుర్తించాలని అధ్యయన నివేదిక తెలిపింది. పుగెట్ సౌండ్ హెల్త్‌కేర్ సిస్టం, యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్, ఆస్ట్రేలియాకు చెందిన కొన్ని సంస్థల బృందం ఈ అధ్యయనంలో పాల్గొంది. 4.5 కిలోగ్రాముల బరువు ఎత్తడం, కూర్చోవడం, నిలబడటం, నడక, కాళ్లు ముడుచుకు కూర్చోవడం వంటి కార్యకలాపాల ప్రభావం ఎలా ఉంటుందని ఈ బృందం పరిశోధించింది. దాదాపు 400 మందిపై ఏడాదిపాటు అధ్యయనం జరిపారు. బరువు ఎత్తడం, తోయడం లేదా లాగడం వంటి పనులపై ఎక్కువ సమయం గడిపిన ప్రతిసారీ తాత్కాలికంగా వెన్ను దిగువభాగంలో నొప్పి వచ్చే అవకాశం ఉందని అధ్యయనకర్తలు గుర్తించారు. కూర్చోవడం కారణంగా ఈ నొప్పి పెరిగే అవకాశాలు తక్కువని పేర్కొన్నారు. కొన్ని శారీరక కార్యకలాపాలు తాత్కాలికంగా వెన్నునొప్పికి దారితీసినా దీర్ఘకాల సమస్యలకు అవి కారణం కాదని తేల్చారు.

ట్రక్ డ్రైవర్ల లైసెన్స్‌పై వెనక్కి తగ్గిన కాలిఫోర్నియా

ఇంటర్నెట్‌డెస్క్: వేల సంఖ్యలో ప్రవాస డ్రైవర్ల కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్‌ల రద్దు నిర్ణయంపై అమెరికాలోని కాలిఫోర్నియా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ వ్యవహారంలో వలసదారుల సంఘాలు కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. మార్చి వరకు వాటి రద్దును నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. చట్టబద్ధంగా ఇప్పటికే లైసెన్స్‌లు పొందినవారు అప్పటివరకు వాటిని కొనసాగించొచ్చని వెల్లడించింది. లైసెన్స్ గడువు తేదీల్లో సమస్యలున్నట్లు గుర్తించిన కాలిఫోర్నియా రవాణా ఏజెన్సీ.. ప్రవాస డ్రైవర్లకు జారీ చేసిన లైసెన్స్‌లను రద్దు చేయాలని ఇటీవల నిర్ణయించింది. 17,000 మంది డ్రైవర్లకు వాటిని రద్దు చేస్తూ నోటీసులు జారీ చేసింది. తర్వాత సమీక్షలో ఆ సంఖ్య మరింత పెరిగింది. రవాణా ఏజెన్సీ తప్పులే లైసెన్సుల రద్దుకు కారణమని పౌర హక్కుల సంఘాలు ఆరోపించాయి. వీటిని సరిదిద్ది, లైసెన్స్‌లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో లైసెన్సుల రద్దు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ట్రక్కు డ్రైవర్లు కోర్టును ఆశ్రయించగా.. తాజాగా స్వల్ప ఊరట లభించింది.

వరుసగా 8 ఏళ్లు 'స్వచ్ఛనగరం'.. కలుషిత నీటితో ఏడుగురి మృతి



ఇందౌర్‌లో పైపులైన్లు పరిశీలిస్తున్న కార్మికులు

ఇందౌర్: దేశంలో అత్యంత స్వచ్ఛమైన నగరంగా 2025తోపాటు వరుసగా ఎనిమిదేళ్లు 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులు పొందిన మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో కలుషిత జలాలు ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారాయి. మురుగు కలిసిన నీళ్లు తాగడంతో డయేరియా, వాంతుల బారినపడి నగరంలో ఇప్పటివరకు ఏడుగురు మృతిచెందారు. "ముగ్గురు చనిపోయినట్లు అధికారులు చెబుతున్నా, మరో నాలుగు మరణాల గురించి మాకు సమాచారం ఉంది" అని నగర మేయర్ పుష్యమిత్ర భార్గవ ధ్రువీకరించారు. 149 మంది బాధితులు నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. భగీరథ్‌పుర ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్డి వద్ద లీకేజీ కారణంగా తాగునీటి ప్రధాన పైప్‌లైనులోకి మురుగు చేరినట్లు ప్రాథమికంగా తేలిందని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ యాదవ్ వెల్లడించారు. కలుషిత జలాలతో గత వారం రోజుల్లో 1,100 మందికిపైగా ఇందౌర్ వాసులు అస్వస్థతకు గురైనట్టు అంచనా. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. చికిత్స పొందుతున్న వారి ఆస్పత్రి ఖర్చులు భరిస్తామన్నారు. సీఎం ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషనుకు చెందిన ఓ జోనల్ అధికారి, మరో సహాయ ఇంజినీరుపై సస్పెన్షన్ వేటు వేసి, ఇన్‌ఛార్జి సబ్ ఇంజినీరును విధుల నుంచి తొలగించారు. సమగ్ర విచారణకు ఐఏఎస్ అధికారి నేతృత్వంలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు.

ప్లాస్టిక్ పైపొర మీది వైరస్‌లతో మహా చేటు

దిల్లీ: ప్లాస్టిక్ వస్తువుల మీద ఒక పొరలా పరుచుకుని ఉండే వైరస్‌లు యాంటీబయాటిక్స్ నిరోధకతను వ్యాపింపజేస్తూ ఉండవచ్చని చైనా అకాడెమీ ఆఫ్ సైన్సెస్ పరిశోధకులు కనుగొన్నారు. ప్రజల చేతుల్లోకి వచ్చిన వెంటనే ప్లాస్టిక్కుపై వేగంగా సూక్ష్మజీవులు పరచుకుంటాయి. ఆ పొరను ప్లాస్టిస్ఫియర్ అంటారు. దానిలోని సూక్ష్మజీవులకు యాంటీబయాటిక్స్‌ను పనిచేయకుండా నిరోధించే జన్యువులు ఉంటాయి. ఈ జన్యువులను ఒక సూక్ష్మజీవి నుంచి మరో సూక్ష్మజీవికి వ్యాపింపజేసే పనిని వైరస్‌లు చేపడతాయి. ప్లాస్టిస్ఫియర్ మీద దట్టంగా పరచుకునే సూక్ష్మజీవుల మధ్య యాంటీబయాటిక్స్ నిరోధకతను బదిలీచేయడం వైరస్‌లకు ఎంతో సులువు. నీటిలోని ప్లాస్టిక్‌లపై ఏర్పడిన ప్లాస్టిస్ఫియర్‌లోని వైరస్‌లు జన్యు బదిలీ ప్రక్రియను వేగంగా నిర్వహిస్తాయి. నేలలోని వైరస్‌లు బ్యాక్టీరియాను హతమార్చడం వల్ల యాంటీబయాటిక్ నిరోధకత తగ్గుస్థాయిలో జరుగుతుందని పరిశోధకులు చెప్పారు.

చైనాతో తైవాన్ పునరేకీకరణ.. ఆగేది కాదు

- జిన్‌పింగ్ ఉద్ఘాటన

బీజింగ్: తమ దేశంతో తైవాన్ పునరేకీకరణ.. ఆగేది కాదని చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ ఉద్ఘాటించారు. తైవాన్ జలసంధికి ఇరువైపులా ఉన్న ప్రజలు సంబంధ బాంధవ్యాలను పంచుకుంటున్న సంగతిని గుర్తుచేశారు. నూతన ఏడాది ఆరంభాన్ని పురస్కరించుకొని బుధవారం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆయన ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక, రక్షణ, సాంకేతిక రంగాల్లో బీజింగ్ పురోగతినీ తన ప్రసంగంలో వివరించారు. యర్లుంగ్ జంగ్బో (బ్రహ్మపుత్ర నది)పై ప్రపంచంలోకెల్లా అతిపెద్ద డ్యాం నిర్మాణం ప్రారంభమైన సంగతిని ప్రస్తావించారు. అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుకు సమీపాన టిబెట్‌లో 170 బిలియన్ డాలర్ల వ్యయంతో చైనా దాన్ని నిర్మిస్తోంది. ఆ ప్రాజెక్టు భారత్, బంగ్లాదేశ్‌ల్లోని పలు రాష్ట్రాలకు వరద ముప్పును పెంచుతుందని ఆందోళనలు వ్యక్తమవుతున్న సంగతి గమనార్హం. చైనా జీడీపీ 2026లో 20 ట్రిలియన్ డాలర్లను మించుతుందని జిన్‌పింగ్ విశ్వాసం వ్యక్తం చేశారు.


డ్రాగన్ గడ్డపైనే క్వాడ్ సమావేశం

- బీజింగ్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో నాలుగు దేశాల దౌత్యాధికారుల భేటీ

బీజింగ్: అమెరికా, భారత్, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కూడిన క్వాడ్ దేశాల కూటమిపై చైనా మొదటి నుంచీ గుర్రుగా ఉంది. ఆ కూటమి దేశాలు తన ప్రాబల్యాన్ని అడ్డుకునే యత్నాలు చేస్తున్నాయంటూ పలు సందర్భాల్లో విమర్శలూ సంధించింది. అయినప్పటికీ క్వాడ్ కూటమి దేశాలు ఏకంగా చైనా రాజధాని బీజింగ్‌లోనే మంగళవారం బాహాటంగా సమావేశమయ్యాయి. బీజింగ్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో ఈ భేటీ జరగడం డ్రాగన్‌ను సవాలు చేసినట్లయింది. ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని స్వేచ్ఛాయుత మండలంగా కొనసాగించడానికి క్వాడ్ ప్రయత్నిస్తుంటుందని అమెరికా రాయబారి డేవిడ్ పెర్డ్యూ ఉద్ఘాటించారు. క్వాడ్ దేశాల రాయబారులతో తన కార్యాలయంలో భేటీ కావడం సంతోషం కలిగిస్తోందంటూ సమావేశం ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారత రాయబారి ప్రదీప్ కుమార్ కూడా వారిలో ఉన్నారు. అయితే, ఈ క్వాడ్ సమావేశంపై బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం ఎటువంటి ప్రకటనా విడుదల చేయలేదు. క్వాడ్‌పై చిర్రుబుర్రులాడే చైనా కూడా ఎటువంటి వ్యాఖ్యా చేయకపోవడం గమనార్హం.

అవినీతి, చొరబాట్లే భాజపా ఆయుధాలు

- పశ్చిమ బెంగాల్ ఎన్నికలపై అమిత్ షా ప్రణాళిక



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్ర భాజపా ఎన్నికల సన్నద్ధతను బుధవారం సమీక్షించారు. పార్టీ విజయానికి కార్యాచరణ ప్రణాళికను నిర్దేశించారు. తృణమూల్ కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడేందుకు చొరబాట్లు, అవినీతి ప్రధాన ఆయుధాలుగా కాగలవని గుర్తించినట్టు ఆయన పేర్కొన్నారు. తూర్పు కోల్‌కతాలోని సైన్స్ సిటీ ఆడిటోరియంలో జరిగిన పార్టీ కార్యకర్తలు, నాయకుల అంతర్గత సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారని తెలిసింది. తృణమూల్ పాలనలో అవినీతి, చొరబాట్లు వ్యవస్థీకృతమైనట్లు ఆయన పేర్కొన్నారని సమాచారం. 'మీ మనసులపై రాసుకోండి. ఈసారి మన ప్రభుత్వం రాబోతోంది' అని అమిత్ షా అన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. 294 మంది సభ్యులు కలిగిన శాసనసభలో తమ పార్టీ మూడింట రెండొంతుల మెజారిటీ సాధిస్తుందని అమిత్‌షా మంగళవారం ప్రకటించిన విషయం తెలిసిందే.

ఐక్యంగా ఉండండి..

పార్టీకి చెందిన తాజా, మాజీ ప్రజాప్రతినిధులను ఉద్దేశించి షా ప్రసంగిస్తూ.. పార్టీ సమైక్యంగా ఉందన్న భావన ప్రజలకు కలిగేలా పనిచేయాలని అన్నారు. ఎన్నికల్లో పార్టీ రాష్ట్ర విభాగం మాజీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ ప్రముఖ స్థానం ఆక్రమిస్తారని స్పష్టం చేశారు. కొన్ని నెలలుగా భాజపా కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న దిలీప్ ఘోష్ తాజాగా పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, సంస్థాగత బాధ్యుల సమావేశానికి హాజరయ్యారు.

శ్రీరాముని ఆదర్శాలే ఆపరేషన్ సిందూర్‌కు స్ఫూర్తి

- దుష్టులకు గుణపాఠం చెప్పడమే భారత్ లక్ష్యం
- అయోధ్య రామాలయ ద్వితీయ వార్షికోత్సవంలో రాజ్‌నాథ్ సింగ్
- దేశ ప్రజలకు ప్రధాని మోదీ, అమిత్ షా అభినందనలు



బాలరాముడి సేవలో రాజ్‌నాథ్‌సింగ్, యోగి ఆదిత్యనాథ్

అయోధ్య: భౌగోళికంగానూ, అది కనిపించని సుదీర్ఘ కాలం ప్రకారం చూసినా అయోధ్య రామ జన్మభూమి ఉద్యమం ప్రపంచంలోనే అత్యంత భారీ ఉద్యమమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ ఉద్యమం గొప్ప ఐకమత్యంతో ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసిందని తెలిపారు. శ్రీరాముని ఆదర్శాలను అనుసరించే ఆపరేషన్ సిందూర్‌ను భారత్ చేపట్టిందని వివరించారు. అయోధ్య ఆలయంలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ బుధవారం ప్రసంగించారు. అంతకు ముందు ఆయన అక్కడి ప్రాంగణంలోని అన్నపూర్ణ ఆలయం వద్ద పతాకాన్ని ఎగురవేశారు. వివిధ పూజా క్రతువుల్లో పాల్గొన్నారు. విదేశీ దండయాత్రలు ఎన్ని జరిగినా సనాతన సంప్రదాయాలను సంరక్షించుకుంటూ వచ్చామని తెలిపారు. ఈ దేశ నాగరికత చెక్కుచెదర నిరంతరంగా కొనసాగుతుందన్న సందేశాన్ని రామాలయంపై ఎగురుతున్న కాషాయ పతాకం ఇస్తోందన్నారు. సకల గుణాల శ్రీరాముడు అవసరమైనప్పుడు దుష్ట సంహారానికి వెనుకాడలేదని వివరించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ భారత సైన్యం అదే స్ఫూర్తితో వ్యవహరించిందని రక్షణ మంత్రి వెల్లడించారు. ఉగ్రవాదులకు, వారి మద్దతుదారులకు గుణపాఠం నేర్పిందేకే సైన్యం అత్యంత నియంత్రణతో, కచ్చితత్వంతో ఆయుధాలను ప్రయోగించిందని తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా కార్యక్రమంలో ప్రసంగించారు. బాలరాముడి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం దేశ ప్రజలకు అభినందనలు తెలిపారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం ఐదు శతాబ్దాల స్వప్నమని, రెండేళ్ల క్రితం ఆ కల సాకారమైందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసిన సందేశాల్లో పేర్కొన్నారు. దేశప్రజలందరికీ శ్రీరాముని ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు.

● అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన 2024 జనవరి 22న (పుష్య మాసం శుక్లపక్ష ద్వాదశి నాడు) జరిగింది. 2025లో అదే తిథి డిసెంబరు 31న రావడంతో ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలను బుధవారం ప్రారంభించారు. ఫిబ్రవరి వరకు ఇవి కొనసాగుతాయి.

ఈడీ దాడిలో భారీగా నగదు, ఆభరణాల స్వాధీనం



ఈడీ స్వాధీనం చేసుకున్న నగదు

దిల్లీ: నగదు అక్రమ చలామణి కేసు విచారణలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం దేశ రాజధానిలో భారీగా నగదు, బంగారం, వజ్రాల ఆభరణాలు, రూ.కోట్ల విలువ వచ్చే ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకుంది. హరియాణాకు చెందిన నేరగాడు ఇందర్‌జిత్ సింగ్ యాదవ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా దక్షిణ దిల్లీలోని సర్వప్రియ విహార్‌లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. రూ.5.12 కోట్ల నగదు, రూ.8.8 కోట్ల విలువైన ఆభరణాలున్న సూట్‌కేసు, రూ.35 కోట్ల ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ తెలిపింది. నిందితుడైన ఇందర్‌జిత్ సింగ్ యాదవ్ యూఏఈ కేంద్రంగా అనేక అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని పేర్కొంది.

హాదీ హత్య కేసు నిందితుడు దుబాయ్‌లో



ఫైజల్ కరీం

ఇంటర్నెట్ డెస్క్: బంగ్లాదేశ్‌లో విద్యార్థి నేత హాదీ హత్య కేసులో నిందితుడైన ఫైజల్ కరీం మసూద్ దుబాయ్‌లో ఉన్నట్టు వెల్లడైంది. ఈ హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ అక్కడి నుంచి అతడు ఓ వీడియోను విడుదల చేశాడు. తనను కావాలనే ఈ కేసులో ఇరికించారని ఆరోపించారు. దీని నుంచి తనను తాను రక్షించుకునేందుకు దుబాయ్‌కు వెళ్లిపోయినట్లు తెలిపాడు. జమాతే ఇస్లామీ పార్టీ విద్యార్థి విభాగానికి చెందిన వ్యక్తులు ఇందులో ప్రమేయం ఉందని ఆరోపించాడు. ఈ సందర్భంగా హాదీతో తనకు వ్యాపార సంబంధాలు మాత్రమే ఉన్నాయని తెలిపాడు. ప్రభుత్వ కాంట్రాక్టులు దక్కించుకోవడం కోసం హాదీ రాజకీయ కార్యకలాపాలకు తాను విరాళాలు ఇచ్చినట్టు పేర్కొన్నాడు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండించిన బ్రిటన్



కీర్ స్టార్మర్

బంగ్లాదేశ్‌లో హిందువులపై కొనసాగుతున్న దాడులపట్ల బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఆందోళన వ్యక్తం చేశారు. మైనారిటీలైన దీపూ చంద్రదాస్, బజేంద్ర బిశ్వాస్‌ల హత్యలను ఖండించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. దీపూ హత్య కేసులో బంగ్లాదేశ్ పోలీసులు ఇప్పటికే 12 మందిని అరెస్టు చేయడాన్ని.. ఆ దేశంలో అన్ని వర్గాల భద్రతకు ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల మత స్వేచ్ఛ, విశ్వాసాలను కాపాడటానికి బ్రిటన్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్టార్మర్ స్పష్టం చేశారు. నవంబరులో తమ మంత్రి జెన్నీ చాప్‌మన్.. యూనస్‌ను కలిసిన సమయంలోనూ బంగ్లాలో మైనారిటీల రక్షణ అంశాన్ని లేవనెత్తినట్లు తెలిపారు. పౌర, మానవ హక్కులను రక్షించడంలో, అవినీతిని ఎదుర్కోవడంలో బంగ్లాదేశ్‌కు బ్రిటన్ మద్దతు కొనసాగిస్తుందని హామీ ఇచ్చారు.

చేతబడి అనుమానంతో దంపతుల సజీవదహనం

దీఫూ: అస్సాంలోని కార్బీ ఆంగ్లాంగ్ జిల్లా హోవ్‌రాఘాట్ సమీప గ్రామంలో మంగళవారం రాత్రి దారుణం జరిగింది. చేతబడి చేశారన్న అనుమానంతో కొందరు స్థానికులు ఓ జంటను సజీవ దహనం చేసినట్లు పోలీసులు బుధవారం వెల్లడించారు. "ఇంట్లో ఉన్న గార్డీ బిరోవా (43), మీరా బిరోవా (33) దంపతులపై దుండగులు మొదట పదునైన ఆయుధాలతో దాడి చేశారు. ఈ జంట చేస్తున్న చేతబడి కారణంగా ఆ ప్రాంతానికి కీడు జరుగుతున్నట్టు భావిస్తున్న నిందితులు దాడి తర్వాత వారున్న ఇంటిని తగలబెట్టారు" అని పోలీసు అధికారి పేర్కొన్నారు. నిందితుల గుర్తింపునకు విచారణ ప్రారంభించామన్నారు. భారత న్యాయసంహిత (బీఎన్ఎస్)లోని వివిధ సెక్షన్లతో పాటు అస్సాంలో అమలులో ఉన్న చట్టం ప్రకారం చేతబడిని నేరంగా పరిగణిస్తారు.

శీతాకాల సెలవుల్లోనూ పనిచేసిన సుప్రీంకోర్టు



దిల్లీ: సుప్రీం కోర్టు ఈసారి శీతాకాల సెలవుల్లోనూ దర్మాసనాలు ఏర్పాటు చేసి అత్యవసర అంశాలపై విచారణ నిర్వహించింది. జీవనభృతి సమస్యలు, స్వేచ్ఛా స్వాతంత్య్రాలకు సంబంధించిన అత్యవసర వ్యాజ్యాల పరిష్కార నిమిత్తం అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్వయంగా రెండుసార్లు విచారణ చేపట్టారు. సాధారణంగా వేసవి సెలవుల్లో కోర్టు ఇలాంటి ప్రత్యేక ధర్మాసనాలు నిర్వహించడం పరిపాటి. ఈసారి శీతాకాలంలోనూ ఇలాంటివి చేపట్టడం విశేషం. క్రిస్మస్, ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా డిసెంబరు 22 నుంచి జనవరి 2 వరకూ సుప్రీంకోర్టుకు శీతాకాల సెలవులు ప్రకటించారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీల ధర్మాసనం తొలిరోజే 17 అత్యవసర కేసులను విచారించింది. ఆరావళి పర్వతశ్రేణులు, ఉన్నావ్ అత్యాచార నిందితుడి శిక్ష వంటి కేసులను విచారించి కీలక తీర్పులు వెలువరించింది. సంవత్సరపు చివరి రోజు కూడా జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రల ధర్మాసనం రెండు అత్యవసర కేసులపై ఆన్‌లైన్ విచారణ నిర్వహించింది.

కారులో 150 కిలోల పేలుడు పదార్థాల స్వాధీనం

- కొత్త ఏడాది వేళ కలకలం..



ఇంటర్నెట్ డెస్క్: నూతన సంవత్సర వేళ రాజస్థాన్‌లో పెద్దఎత్తున పేలుడు పదార్థాలు లభ్యం కావడం కలకలం రేపింది. ఓ కారులో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్, ఇతర పేలుడు పదార్థాలను తరలిస్తుండగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఓ కారులో నిందితులు పేలుడు పదార్థాలు తరలిస్తున్నట్లు టోంక్ జిల్లా పోలీసులకు నిఘావర్గాల నుంచి సమాచారం అందింది. ఈ క్రమంలోనే బరోని పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ అనుమానాస్పద కారులో తనిఖీలు నిర్వహించారు. వాహనంలో యూరియా సంచుల్లో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్ నింపి ఉంచినట్లు గుర్తించారు. అదేవిధంగా 200 కార్ట్రిడ్జ్‌లు, ఆరు కట్టల (1,100 మీటర్లు) సేఫ్టీ ఫ్యూజ్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారిని బూందీ జిల్లాకు చెందిన సురేంద్ర పట్వా, సురేంద్ర మోచీలుగా గుర్తించారు. ఈ పేలుడు పదార్థాలను బూందీ నుంచి టోంక్‌కు తరలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఆ పేలుడు పదార్థాలను ఎక్కడినుంచి సేకరించారు? వాటిని దేని కోసం వినియోగించాలనుకున్నారు? తదితర వివరాలను రాబట్టే దిశగా దర్యాప్తు చేపట్టినట్టు వెల్లడించారు.

తల్లికి అంత్యక్రియలు చేస్తుండగా పార్టీ టికెట్

- శ్మశానవాటికలోనే నామినేషన్ పత్రాల అందజేత



ముంబయి: తన తల్లికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న శివసేన నాయకుడు యోగేశ్ గొన్నాడేకి శ్మశాన వాటికలోనే ఎన్నికల టికెట్ లభించింది. తల్లి మరణంతో.. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ప్రయత్నాన్ని ఆయన వదులుకున్నారు. పార్టీ మాత్రం ఆయన అభ్యర్థిత్వానికి ఖరారు చేసింది. నామినేషన్‌కు చివరిరోజు కావడంతో.. పార్టీ నేతలు నామినేషన్ పత్రాలతో శ్మశానవాటికకు చేరుకున్నారు. తల్లి అంత్యక్రియలు జరుగుతుండగానే వారు ఆయనకు వాటిని అందజేశారు. ఆ పరిస్థితిపై ఆయన ఉద్వేగానికి గురయ్యారు. అంత్యక్రియలు ముగిసిన అనంతరం.. చివరి నిమిషంలో నామినేషన్ దాఖలు చేశారు. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే పార్టీకి చెందిన గొన్నాడే 5వ వార్డు నుంచి, ఆయన కుమార్తె కృతిక 8వ వార్డు నుంచి నాగ్‌పుర్ నగర పాలక సంస్థ బరిలోకి దిగారు.

ఉక్రెయిన్‌పై కొనసాగుతున్న రష్యా దాడులు

కీవ్: యుద్ధం ముగింపునకు ప్రయత్నాలు జోరుగా సాగుతున్నప్పటికీ.. ఉక్రెయిన్‌పై దాడులను రష్యా ఆపడం లేదు. దక్షిణ ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరంపై తాజాగా డ్రోన్లతో మాస్కో విరుచుకుపడింది. ఈ దాడిలో అనేక అపార్ట్‌మెంట్లు, విద్యుత్ గ్రిడ్లు ధ్వంసమయ్యాయి. ఓ శిశువు, ఇద్దరు చిన్నారులు సహా మొత్తం ఆరుగురు గాయపడ్డారు. యుద్ధం మొదలై వచ్చే ఫిబ్రవరితో నాలుగేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో రష్యా కొన్నాళ్లుగా ఉక్రెయిన్‌పై దీర్ఘశ్రేణి దాడుల్ని తీవ్రం చేసింది.

పుతిన్ నివాసంపై దాడికి యత్నం.. వీడియో బయటపెట్టిన రష్యా



రష్యా సైనికులు ధ్వంసం చేసిన డ్రోన్

ఇంటర్నెట్ డెస్క్: తమ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసంపై డ్రోన్లతో దాడి చేసేందుకు ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం ప్రయత్నం జరిగిన వీడియోను రష్యా రక్షణ శాఖ బుధవారం బయటపెట్టింది. కూలిన డ్రోన్ ఒకటి ఆ వీడియో ప్రారంభంలో కనిపించింది. నొవ్‌గొరోడ్ ప్రాంతంలోని పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ 91 దీర్ఘశ్రేణి డ్రోన్లతో దాడికి యత్నించిందని రష్యా ఆరోపించిన సంగతి తెలిసిందే.

కొత్త లక్ష్యాల సాధనకు నూతన సంవత్సరం ప్రేరణ

గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: నూతన సంవత్సరం మనకు ఉజ్వల భవిష్యత్తుతో పాటు కొత్త అవకాశాలను అన్వేషిస్తూ.. కొత్త లక్ష్యాలు సాధించేందుకు ప్రేరణ ఇస్తుందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. గురువారం నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ బుధవారం సందేశమిచ్చారు. '2026 నూతన సంవత్సరం మనందరికీ ఉల్లాసం, ఆనందం, శాంతి, శ్రేయస్సు కలగజేయాలి' అని ఆకాంక్షించారు.

నూతన సంవత్సరం అందరి ఇళ్లలో ఆనందం నింపాలి

మాజీ ముఖ్యమంత్రి జగన్

ఈనాడు, అమరావతి: నూతన సంవత్సరం-2026 ప్రతి ఒక్కరి ఇంట్లో ఆనందం నింపాలి.. అందరికీ ఆరోగ్యం అందించాలి అని మాజీ ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలి, ప్రతి ఒక్కరి రైతన్నకు దైవానుగ్రహం కలగాలని ఆకాంక్షించారు.

ప్రొఫెసర్ల సీనియారిటీ జాబితా విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వైద్య విద్యలో 2025-26 ప్యానెల్ సంవత్సరానికి ప్రొఫెసర్ల సీనియారిటీ జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. వైద్య విద్యలో కాళీగా ఉన్న ఏడీఎంఈలు, ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్ పోస్టుల భర్తీకి పదోన్నతులు కల్పించేందుకు వీలుగా ఈ జాబితా విడుదల చేస్తూ వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఏడాది పాటు డిప్యుటేషన్ పొడిగింపు..


రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో ఎన్సీడీ ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ జె.సరసిజాక్షి, మెట్రోపాలిటన్ హెల్త్ డివిజన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సీహెచ్ శిరీష డిప్యుటేషన్లను మరో ఏడాది పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

పీఎం జన్మన్ పనులకు రూ.54 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు ఉద్దేశించిన పీఎం జన్మన్ పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.54.50 కోట్లు విడుదల చేసింది. పథకం కింద భాగంగా రాష్ట్రంలో ఈ పథకం కింద రూ.555 కోట్ల అంచనాతో 206 రోడ్ల పనులు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో అత్యధిక పనులు ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి.

విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తాం

- మూడేళ్లలో కొనుగోలు వ్యయం తగ్గించే యత్నం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వెల్లడి



ఏపీట్రాన్స్‌కో డైరీని ఆవిష్కరిస్తున్న సీఎస్ విజయానంద్. చిత్రంలో జి.విజయలక్ష్మి, ఎం.కమలాకరబాబు, పి.పుల్లారెడ్డి, సూర్యసాయి ప్రవీణ్ చంద్, ఎస్.నాగలక్ష్మి, ఎల్.శివశంకర్, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్లు

ఈనాడు-అమరావతి: రాబోయే మూడేళ్లలో (2029 నాటికి) యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని రూ.4 లోపు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేర్కొన్నారు. యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.5.19గా ఉండేది.. దాన్ని 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.4.90కు తగ్గించామని చెప్పారు. కొనుగోలు వ్యయం యూనిట్‌కు 29 పైసలు చొప్పున తగ్గడం వల్ల ట్రూడౌన్ (ఛార్జీల తగ్గింపు) చేశామని.. నవంబరు బిల్లులో యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీలు తగ్గించామని పేర్కొన్నారు. విజయవాడలో బుధవారం విద్యుత్ సంస్థల డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమానికి సీఎస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, నెడ్‌క్యాప్, ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ డైరీలు, క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'విద్యుత్ వినియోగదారులకు ఛార్జీలు తగ్గించాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన. 2026-27లో యూనిట్ కొనుగోలు వ్యయం రూ.4.60కు తగ్గించాలనేది లక్ష్యం' అని ఆయన పేర్కొన్నారు.

ఐదేళ్ల లక్ష్యాన్ని దాటేశాం

'గత ఏడాది గుజరాత్‌లో నిర్వహించిన ఎనర్జీ సమ్మిట్‌లో రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో 76 గిగావాట్ల సౌర, పవన, హైబ్రిడ్, పీఎస్పీ, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల అభివృద్ధి చేస్తామని కేంద్రానికి ప్రతిపాదించాం. ఏడేళ్లలో సాధించాల్సిన లక్ష్యాన్ని ఆధిగమించి ఇప్పటికే 90 గిగావాట్ల పునరుత్పాదక ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చాం. వాటిని గ్రౌండింగ్ చేసే లక్ష్యంతో ఉన్నాం. 2029 నాటికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం' అని సీఎస్ అన్నారు.

నూరుశాతం విద్యుదీకరణ

'రాష్ట్రంలో నూరు శాతం విద్యుదీకరణ సాధించాం. మారుమూల గిరిజన ప్రాంతాలకూ ఎప్పుడో నేడు విద్యుత్ సరఫరా జరుగుతోంది. సరఫరా, పంపిణీ నష్టాలను 9.6 శాతానికి తగ్గించాం. ఆర్డీఎస్ఎస్ కింద వీడర్ల విభజన పనులు పూర్తయితే ఓవర్‌లోడ్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. గ్రామాలకు అంతరాయం లేకుండా త్రీఫేజ్ విద్యుత్ అందించడం సాధ్యం అవుతుంది' అని సీఎస్ విజయానంద్ తెలిపారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న ఏపీ

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

ఈనాడు, అమరావతి: 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో రాష్ట్రం దూసుకుపోతోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సుల్లో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు 690 కంపెనీలు ఒప్పందాలు చేసుకున్నాయని, తద్వారా రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని వెల్లడించారు.

ప్రగతిలో ముందడుగు వేశాం: దినకర్

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 2025లో పెట్టుబడుల ఆకర్షణ, సూపర్ సిక్స్ పథకాల అమలు ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం, అమరావతి, పోలవరం పనుల ప్రగతి, విద్య, వైద్యంలో ముందడుగు తదితర విజయాలను సాధించిందని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. సచివాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కొత్త ఏడాదిలో స్వర్ణాంధ్రప్రదేశ్, వికసిత్ భారత్ లక్ష్యసాధన దిశగా అడుగులు వేస్తామన్నారు.

క్రమబద్ధీకరణ జీవోపై పిల్.. ప్రతివాదులకు నోటీసులు

ఈనాడు, అమరావతి: అనధికారిక, అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించే నిమిత్తం 2025 నవంబర్ 12న పురపాలకశాఖ జారీ చేసిన జీవో 225, ఏపీ పురపాలక (మూడో సవరణ) చట్టాన్ని సవాలు చేస్తూ ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురానికి చెందిన సీహెచ్ హరిశ్చంద్ర వేసిన పిల్‌పై హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పురపాలకశాఖ, పంచాయతీరాజ్‌శాఖ, జీహెచ్ఎంసీ ముఖ్య కార్యదర్శులు, టౌన్, కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్లకు నోటీసులు జారీచేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ ఉత్తర్వులిచ్చింది.

15లోపు క్రీడా యాప్‌లో క్రీడాకారులు ధ్రువపత్రాలు పొందుపరచాలి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: శాప్ రూపొందించిన క్రీడా యాప్‌లో ఈ నెల 15వ తేదీలోపు క్రీడాకారులు తమ ధ్రువపత్రాలను పొందుపరచాలని శాప్ వైస్ ఛైర్మన్, ఎండీ ఎస్.భరణి సూచించారు. నిర్ణీత గడువు లోపు పొందుపరచకపోతే శాప్ ద్వారా అందించే క్రీడా ప్రోత్సాహకాలు, క్రీడా కోటా నియామకాలకు అనర్హులుగా పరిగణిస్తామన్నారు.

లీజుదారులకు పర్మిట్ల కష్టాలు

- ఇ-పర్మిట్ల జారీ పోర్టల్ అప్‌గ్రేడేషన్‌తో చిక్కులు

ఈనాడు, అమరావతి: గనులశాఖకు చెందిన ఆన్‌లైన్ మినరల్ ఇ-పర్మిట్ సిస్టమ్ పోర్టల్ అప్‌గ్రేడేషన్ చేయడంలో కొంత జాప్యం కావడంతో.. లీజుదారులకు మూడు రోజులుగా పర్మిట్లు జారీ కావడం లేదు. ఈ పోర్టల్‌ను గతంలో టీసీఎస్ సంస్థ నిర్వహించేది. కొంతకాలం కిందట సీఎఫ్ఎస్ఎస్‌కు అప్పగించారు. ఈ సంస్థ తాజాగా 2.0 వెర్షన్‌తో అప్‌గ్రేడ్ చేస్తోంది. కానీ ఇది పూర్తయినా, ఐడీలు, పాస్‌వర్డ్‌లు సహా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. దీంతో లీజుదారులు పర్మిట్లు పొందలేకపోయారు. బుధవారం సాయంత్రం తర్వాత కొంత కొలిక్కి వచ్చేలా చూశారు. గురువారానికి పూర్తిస్థాయిలో అప్‌గ్రేడేషన్ పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

ఏసీబీ కోర్టు దస్త్రాలు మీకెందుకు?

- పిటిషనర్‌ను ప్రశ్నించిన హైకోర్టు
- వివరాలు సమర్పించాలని సీఐడీకి ఆదేశం

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో తెదేపా అధినేత చంద్రబాబు తదితరులపై సీఐడీ నమోదు చేసిన ఫైబర్‌నెట్, ఉచిత ఇసుక పాలసీ, మద్యం విధానానికి సంబంధించిన కేసుల కోసం మీకెందుకు అని పిటిషనర్, ఎమ్మార్పీఎస్ ఏపీ అధ్యక్షుడు దాసరి సువర్ణరాజును హైకోర్టు ప్రశ్నించింది. ఈ కేసుల్లో మీరు థర్డ్ పార్టీ.. ఆ కేసుల్లో మధ్యంతర దరఖాస్తు దాఖలు చేసే అర్హత మీకెక్కడిది అని అడిగింది. వైకాపా హయాంలో చంద్రబాబు, తదితరులపై సీఐడీ నమోదు చేసిన ఆ కేసులను విజయవాడ ఏసీబీ కోర్టు మూసివేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వుల ప్రతులివ్వాలని కోరితే నిరాకరించిందంటూ సువర్ణరాజు హైకోర్టులో మూడు రివిజన్ పిటిషన్లు వేశారు. దస్త్రాలు ఇచ్చేలా ఏసీబీ కోర్టును ఆదేశించాలని కోరారు. బుధవారం వీటిపై హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'నిందితులు, రాష్ట్రప్రభుత్వం ఏకమై ఏసీబీ కోర్టులో కేసులను మూసివేయించుకుంటున్నారు. ఇప్పటికే ఐదారు కేసులు మూసివేసినట్టు సమాచారం ఉంది. మూసివేత ఉత్తర్వు కాపీలను ఇవ్వాలని అడిగితే మూడోపక్షం కోరడానికి వీల్లేదని ఏసీబీ కోర్టు నిరాకరించింది. అది పబ్లిక్ దస్త్రాలు. వాటిని పొందే అర్హత మూడోపక్షానికి ఉంటుంది' అన్నారు. న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు స్పందిస్తూ థర్డ్ పార్టీగా ఉన్న మీకు ఆ కాపీలు ఇవ్వాలని ప్రశ్నించారు. పొన్నవోలు బదులిస్తూ.. 'ఏసీబీ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేయడం కోసం వాటి కాపీలను కోరుతున్నాం'మన్నారు. సీఆర్‌పీసీ సెక్షన్ 363(3) ప్రకారం కోర్టు దస్త్రాలు పొందే అర్హత మూడో పక్షానికి ఉంటుందని చెప్పారు. సీఐడీ తరఫున అదనపు పీపీ పాణిని సోమయాజి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ మూడోపక్షమని, ఏసీబీ కోర్టు నుంచి ఉత్తర్వు కాపీలు పొందే అర్హత ఆయనకు లేదని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి వ్యాజ్యాలను విచారణకు స్వీకరించారు. వివరాలు సమర్పించాలని సీఐడీని ఆదేశిస్తూ విచారణను జనవరి రోజులకు వాయిదా వేశారు.

మహిళా సాధికారతపై పార్లమెంటరీ కమిటీ సమీక్షలు

హాజరైన ఛైర్మన్ పురందేశ్వరి, ఇతర సభ్యులు

ఈనాడు, అమరావతి: రక్షణ, ఇస్రో, బ్యాంకింగ్ తదితర రంగాల ప్రతినిధులతో బెంగళూరు, తిరువనంతపురం నగరాల్లో.. మహిళా సాధికార కమిటీ ఛైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి, కమిటీ సభ్యులు నాలుగు రోజులుగా ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించారు. వీటిలో సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, సురక్షిత ఆవకాశాల సృష్టి తదితర అంశాలపై చర్చించినట్టు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలను ఆర్థిక, సామాజిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ సంస్థల్లో 'పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ-నిషేధం-పరిష్కారం చట్టం (పీఓఎస్‌హెచ్-2013)' అమలు తీరుపై సమగ్రంగా చర్చించారు. స్త్రీల సంక్షేమం, గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించాలని నిర్దేశించారు.

ఐఏపీటీఎఫ్ దక్షిణాది సమన్వయకర్తగా షౌకత్ అలీ

ఈనాడు, దిల్లీ: అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య (ఏఐపీటీఎఫ్) దక్షిణాది రాష్ట్రాల సంఘాల సమన్వయకర్తగా తెలంగాణకు చెందిన సయ్యద్ షౌకత్ అలీ నియమితులయ్యారు. ఈమేరకు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు సుశీల్ కుమార్ పాండే బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరిలోని ఏఐపీటీఎఫ్ అనుబంధ సంఘాల వ్యవహారాలను సమన్వయకర్తగా షౌకత్ అలీ వ్యవహరిస్తారు.

తెలంగాణ మ్యూజియంలో వస్తువుల పంపిణీకి కమిటీ

ఈనాడు,అమరావతి: తెలంగాణలోని రాష్ట్ర మ్యూజియంలోని పురాతన వస్తువులను రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 నిబంధనల ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య పంపిణీ కోసం ప్రత్యేక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కమిటీ ఛైర్‌పర్సన్‌గా రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్విని, కన్వీనర్‌గా రాష్ట్ర పురావస్తు, మ్యూజియంశాఖ కమిషనర్ వ్యవహరిస్తారు.

18 నెలల్లో 90 శాతం హామీల అమలు: అశోక్‌బాబు

ఈనాడు, అమరావతి: అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే కూటమి ప్రభుత్వం 90 శాతం హామీల్ని అమలు చేసిందని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా నేత అశోక్‌బాబు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి దిశగా రాష్ట్రం పురోగమిస్తోందని వెల్లడించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందన్నారు.

ఉద్యోగ ఉన్నతిలో విశ్వసనీయ మార్గం

కార్పొరేట్ సంస్థలలో పనిని సమర్థంగా పూర్తి చేయగలిగితే విజయం సాధించవచ్చని యువ ఉద్యోగులు భావిస్తారు. అప్పగించిన బాధ్యతలు, లక్ష్యాలను అధికారులు తరచూ గుర్తు చేయాల్సిన అవసరం లేకుండా పూర్తి చేయగలగాలి. ఈ విషయంలో మీపై నమ్మకం ఏర్పడితే కొలువులో ఉన్నత స్థాయికి ఎదగొచ్చు. ఇది కంటికి సాధారణంగా కనిపించని, బహిరంగంగా వ్యక్తీకరించని పరిశీలన. ఇదే డిపెండబిలిటీ. ఈ లక్షణం గురించి పరిశీలించడానికి మార్కుల జాబితా, ధ్రువపత్రాలు సరిపోవు. ఇంటర్వ్యూల్లోనూ కనిపెట్టడం సాధ్యం కాదు.



కార్పొరేట్ స్కిల్స్

కార్పొరేట్ సంస్థలు నిర్వహించే ఎన్నో వడపోతలను దాటుకుని ఉద్యోగిగా అడుగుపెట్టినవారి సమర్థతపై సందేహాలుండవు. కానీ ఆ ఉద్యోగంలో ఎదగాలంటే సంస్థలో నమ్మదగిన వారిగా నిరూపించుకోవాలి. స్మార్ట్‌గా మాట్లాడేవారికన్నా నమ్మకంగా పనిచేసే ఉద్యోగులే విజయం సాధించి ఉన్నత స్థాయికి ఎదగగలరు.

నమ్మకం

టైర్ వన్ బిజినెస్ స్కూల్‌లో చదివి, ప్రపంచ స్థాయి వ్యాపార సంస్థలో ఉద్యోగం పొందినా, నమ్మకం కోల్పోతే మనుగడ సాగించలేరు. ఉద్యోగుల నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానానికి అదనంగా ప్రతి సంస్థా వారి నుంచి నమ్మకాన్ని ఆశిస్తాయన్న విషయం గుర్తుంచుకోవాలి. విద్యార్థి దశలో చేయాల్సిన అసైన్‌మెంట్లు ఆలస్యమైతే పెద్ద సమస్యలుండకపోవచ్చు. కానీ కార్పొరేట్ సంస్థలలో అప్పగించిన ప్రాజెక్టు గడువు దాటితే సంస్థ ప్రతిష్ఠ, విశ్వసనీయతలపై ప్రభావం చూపుతుంది. ఫలితంగా ఉద్యోగి ఎదుగుదల ప్రశ్నార్థకమవుతుంది.



విశ్వసనీయత

అప్పగించిన బాధ్యతను టీమ్ లీడర్ తరచూ గుర్తు చేయాల్సిన అవసరం రాకూడదు. నాణ్యతలో రాజీ పడకుండా, సమయానికి పూర్తి చేయడమే విశ్వసనీయత. క్లయింట్‌కు అందించాల్సిన ప్రాజెక్టు లేదా సేవలు ఆలస్యమైతే మార్కెట్‌లో సంస్థపై విశ్వసనీయత తగ్గిపోతుంది. అలాగే క్లయింట్ నుంచీ విమర్శలు ఎదుర్కోవలసి వస్తుంది.

ఎంబీఏలో గోల్డ్ మెడల్ సాధించి, ఐటీ సంస్థలో ట్రెయినీగా చేరాడు వెంకట్. అందరికంటే గొప్ప ప్రొఫైల్ ఉన్న వృత్తి నిపుణుడినని భావించేవాడు. సరైన ప్రణాళిక లేకుండా సెలవులు ఎక్కువగా తీసుకునేవాడు. పని వేళలు పాటించేవాడు కాదు. ఉద్యోగాన్ని క్యాజువల్‌గా తీసుకున్నాడు. ఈ పరిణామాలతో టీమ్ లీడర్‌కు అతడిపై నమ్మకం కలగలేదు. క్లయింట్ నుంచి వచ్చిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాకేత్‌కు కేటాయించారు. దీన్ని వెంకట్ జీర్ణించుకోలేకపోయాడు. టీమ్ లీడర్‌ని కలిసి సాకేత్ కంటే తెలివైన వాడినని, ఈ ప్రాజెక్టు తనకు ఎందుకు కేటాయించలేదని అడిగాడు. అతడి నైపుణ్యాలపై నమ్మకం ఉన్నా, డెలివరబుల్స్, టైమ్ లైన్స్ కమిట్‌మెంట్స్ పైన విశ్వాసం లేదన్నారు. మీరు 'డిపెండబుల్' కానందున, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ, ఉద్యోగాన్ని బాధ్యతగా తీసుకున్న సాకేత్‌కు ఈ ప్రాజెక్టు అసైన్ చేశామన్నారు. టైమ్ లైన్స్‌లో పూర్తి చేయాలంటే అతడి లాంటి నమ్మకమైన ఉద్యోగులతోనే సాధ్యమవుతుందని టీమ్ లీడర్ వెంకట్‌కు క్లారిటీ ఇచ్చారు.

✦ డిపెండబుల్ కానివాళ్లు కార్పొరేట్ సంస్థలలో మనుగడ సాగించలేరు. ఎన్ని విలువైన నైపుణ్యాలున్నా.. స్థిరత్వం, నమ్మకాన్ని నిలబెట్టే మనోవైఖరి ఉన్న ఉద్యోగులకే ఎదిగే అవకాశాలు ఉంటాయి.

మాటలు సరిపోవు

ఐటీ సంస్థలో మేనేజ్‌మెంట్ ట్రెయినీగా చేరింది స్నేహ. టీమ్ మీటింగ్‌లలో హడావిడి చేస్తూ.. సూచనలు, సలహాలిచ్చేది. టీమ్ మెంబర్స్‌తో పాటు సీనియర్స్ దృష్టినీ ఆకర్షించింది. దీంతో ముఖ్యమైన ప్రాజెక్టు బాధ్యతను ఆమెకు మేనేజర్ అప్పగించారు. అయితే ప్రాజెక్టు పురోగతి, తాజా సమాచారాన్ని ఆమె మేనేజర్‌కు చెప్పేది కాదు. గుర్తుచేసిన ప్రతి సందర్భంలోనూ మాటలతో మేనేజ్ చేసేది. ఈ పరిణామాలతో అనుమానం వచ్చిన మేనేజర్ ఆ ప్రాజెక్ట్‌ను సమీక్షించారు. అందులో ఎలాంటి పురోగతీ లేదని, ఆమె కేవలం మాటలతో కాలం గడిపే ఉద్యోగి అని తెలుసుకున్నారు. ఆమెను టీమ్ నుంచి తప్పించి, మరొక ఉద్యోగితో గడువులోగా ప్రాజెక్ట్ పూర్తి చేసి కస్టమర్‌కు అందించారు.

✦ నైపుణ్యంతో ఉద్యోగం సంపాదించినా, అందులో ఎదిగి విజయం సాధించాలంటే, నమ్మకాన్ని పెంచుకోవాలి.



– దొరైరాజ్,
సీనియర్ జనరల్ మేనేజర్,
ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

ముందే పసిగట్టాలి

కామేష్ ఐటీ సంస్థలో ట్రెయినీ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరాడు. టీమ్ లీడర్ కేటాయించిన ప్రాజెక్టు పూర్తి చేయడానికి వారం రోజులు సమయం కావాలన్నాడు. అయితే ఇది పూర్తి కావడానికి పది రోజులు కూడా సరిపోవని రెండు రోజుల తర్వాత తెలుసుకున్నాడు. టీమ్ లీడర్‌ని కలిసి ఈ ప్రాజెక్టు అనుకున్న సమయానికి పూర్తి కాదని, అందులోని సమస్యను వివరించి సహాయం కోరాడు. ఈ వివరణతో అప్రమత్తమైన టీమ్ లీడర్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కామేష్ పని పూర్తి చేయలేకపోయినా, టీమ్ లీడర్ దృష్టిలో నమ్మదగిన ఉద్యోగిగా పేరు సంపాదించాడు. సమస్యను గుర్తించి, టీమ్ లీడర్‌కు ముందుగానే వివరించడంతో రాబోయే నష్టాన్ని నివారించి, సంస్థలో డిపెండబుల్ ఉద్యోగి అయ్యాడు కామేష్.

✦ కార్పొరేట్ సంస్థలలో అడుగుపెట్టే యువ గ్రాడ్యుయేట్లకు ఉండవలసిన అత్యంత ముఖ్యమైన లక్షణం 'డిపెండబిలిటీ'. అంటే నమ్మదగిన ఉద్యోగిగా ఉండటం. యాజమాన్యాలు యువ ఉద్యోగుల నుంచి నమ్మకాన్నే ఎక్కువగా ఆశిస్తాయి.

Q పదో తరగతి చదువుతున్నాను. నా లక్ష్యం సివిల్ సర్వీసెస్. ఇందుకు ఇంటర్, డిగ్రీల్లో ఏ గ్రూపు తీసుకుంటే ప్రయోజనం? ఇంటర్ నుంచే ఏదైనా అకాడెమీలో శిక్షణ తీసుకుంటే మేలేనా? - డి.అభినవ్ రెడ్డి

సివిల్స్ కోసం ఏ గ్రూపు బాగు?

■ పదోతరగతి చదువుతూనే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌ను లక్ష్యంగా పెట్టుకోవడం అభినందనీయం. సివిల్ సర్వీసెస్‌కు ఇంటర్ లేదా డిగ్రీలో తప్పనిసరిగా ఫలానా గ్రూప్ మాత్రమే తీసుకోవాలి, ఫలానా సబ్జెక్ట్ మాత్రమే చదవాలి అనే నిబంధన ఏమీ లేదు. గత కొన్నేళ్ల ఫలితాలను గమనిస్తే, అన్ని సబ్జెక్టులు చదివినవారూ సివిల్స్‌లో రాణిస్తున్నారు. ఇంటర్/డిగ్రీలో ఏ గ్రూప్ తీసుకున్నా, సివిల్స్‌కు విస్తృతమైన అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచన, క్రమశిక్షణతో చదవడం అవసరం.



“డిగ్రీలో బీఏ (హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, సైకాలజీ) లాంటి కోర్సులు సివిల్ సర్వీసెస్ సిలబస్‌కు దగ్గరగా ఉంటాయి. అందువల్ల బీఏ విద్యార్థులకు కొంత లాభంగా ఉంటుంది. ఇంజినీరింగ్ చదివిన అనేక మంది ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగాలు చేస్తున్నారు. కాబట్టి డిగ్రీ ఎంపికలో మీ ఆసక్తి, సివిల్స్ సాధించలేకపోతే మరో ప్రత్యామ్నాయ కెరియర్ లాంటి విషయాలనూ దృష్టిలో పెట్టుకోవాలి. సివిల్ సర్వీసెస్ కోసం కొన్ని వందల ఉద్యోగాలకు లక్షల మంది పోటీ పడతారు. మూడు/ నాలుగు ప్రయత్నాల్లో సఫలీకృతం కాకపోతే, మరో మెరుగైన కెరియర్‌ను ప్రారంభించడానికి పేరున్న కళాశాలలో ఇంజినీరింగ్ చదవడం శ్రేయస్కరం.”

◗ ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీల్లో ఏదైనా తీసుకోవచ్చు. మీకు మ్యాథ్స్, సైన్స్‌పై ఆసక్తి ఉంటే ఎంపీసీ మంచిది. ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, మ్యాథ్స్, అకౌంట్స్‌పై ఆసక్తి ఉంటే ఎంఈసీ ఉపయోగపడుతుంది. బయాలజీ మీద ఆసక్తి ఉంటే బైపీసీ కూడా చదవొచ్చు. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే.. మీరు ఏ గ్రూప్‌ను ఎంచుకున్నా ప్రాథమిక అంశాలను బాగా నేర్చుకోవాలి. అప్పుడే భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధత మెరుగ్గా ఉంటుంది.

◗ ఇంటర్ నుంచే పూర్తి స్థాయి కోచింగ్ తప్పనిసరి కాదు. ఈ వయసులో ముందుగా వార్తా పత్రికలు, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదువుతూ అవగాహన పెంచుకోవడం అలవాటు చేసుకోవాలి. ఫౌండేషన్ కోర్సుల రూపంలో వారానికి ఒకటి రెండు రోజులు శిక్షణ ఇచ్చే సంస్థలు దిశానిర్దేశం కోసం ఉపయోగపడతాయి. కానీ, ఇప్పటి నుంచే చదువును భారం చేసుకునేలా, ఎక్కువ ఒత్తిడి తీసుకునేలా శిక్షణ అవసరం లేదు.

చివరిగా ఇంటర్/డిగ్రీలో నచ్చిన గ్రూప్ తీసుకుని, విషయ పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ క్రమంగా సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమవ్వాలి. పట్టుదల, ఓపిక, స్థిరమైన ప్రణాళికతో ముందుకు వెళ్తే, సివిల్స్ లక్ష్యం సాధ్యమే!

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

అగ్రికల్చరల్ రిసెర్చ్ స్టేషన్‌లో..

రీజనల్ అగ్రికల్చరల్ రిసెర్చ్ స్టేషన్, తిరుపతి ఒప్పంద ప్రాతిపదికన రిసెర్చ్ అసోసియేట్ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
● రిసెర్చ్ అసోసియేట్: 02 పోస్టులు
అర్హత: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.61,000 - రూ.67,000.
ఎంపిక: ఇంటర్వ్యూతో. **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 8.
వెబ్‌సైట్: https://angrau.ac.in/

పీజీఐఎంఈఆర్‌లో

పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్(పీజీఐఎంఈఆర్), చండీగఢ్.. ఒప్పంద ప్రాతిపదికన గ్రూప్-ఏ, బీ, సీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● గ్రూప్-ఏ, బీ, సీ: 59 ఖాళీలు
అర్హత: పోస్టులను అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ, బీటెక్, ఫార్మసీ పీజీతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 18-35 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతనం: పోస్టు ప్రకారం నెలకు రూ.18,000 - 2,08,700 వరకు.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1500, ఎస్సీ, ఎస్టీలకు రూ.800. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 16. **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ)తో. **వెబ్‌సైట్:** https://pgimer.edu.in/PGIMER_PORTAL/

గ్రాడ్యుయేట్ ట్రెయినీలు

మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్, నాగ్‌పుర్.. ఒప్పంద ప్రాతిపదికన పలు విభాగాల్లో 67 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● గ్రాడ్యుయేట్ ట్రెయినీ: 49 పోస్టులు
● మేనేజ్‌మెంట్ ట్రెయినీ: 15 పోస్టులు
● మేనేజర్: 03 పోస్టులు
విభాగాలు: మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్, జియాలజీ, ప్రాసెస్, మెటీరియల్స్, కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, సిస్టమ్, సర్వే.. మొదలైనవి.
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంటెక్, డిగ్రీ, ఎంబీఏ, డిప్లొమా/పీజీ డిప్లొమా, పీజీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వేతన శ్రేణి: ట్రెయినీలకు నెలకు రూ.40,000 - రూ.1,40,000. మేనేజర్ పోస్టుకు రూ.50,000- రూ.1,60,000.
వయసు: 20.01.2026 నాటికి గ్రాడ్యుయేట్/మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టులకు 30 ఏళ్లు; మేనేజర్ పోస్టుకు 35 సంవత్సరాలు మించరాదు. **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్టు, ఇంటర్వ్యూలతో. **దరఖాస్తు ఫీజు:** జనరల్/ ఈడబ్ల్యూఎస్/ ఓబీసీలకు రూ.590. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20-01-2026. **వెబ్‌సైట్:** www.moil.nic.in/

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్) 132 వర్క్‌మెన్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. డిప్లొమాతో దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షతో నియామకాలుంటాయి.

షిప్‌యార్డ్‌లో వర్క్‌మెన్ అవుతారా!



పోస్టు: సీనియర్ షిప్ డ్రాఫ్ట్స్‌మెన్ (మెకానికల్)
ఖాళీలు: 20
అర్హత: మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా. సంబంధిత రంగంలో రెండేళ్ల అనుభవం ఉండాలి. 3డీ మోడలింగ్, క్యాడ్ సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలు ఉన్నవారికి ప్రాధాన్యం.
ఎంపిక: రెండు దశల్లో జరుగుతుంది. ఫేజ్-1లోని ఆబ్జెక్టివ్ టైప్ ఆన్‌లైన్ టెస్ట్‌కు 70 మార్కులు. జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లిష్, రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లలో ఒక్కో విభాగం నుంచి ఐదేసి ప్రశ్నలు వస్తాయి. సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు 50 ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. రుణాత్మక మార్కులు లేవు. వ్యవధి 75 నిమిషాలు.

● ఫేజ్-1లో అన్ రిజర్వ్‌డ్ 50 శాతం, ఓబీసీ 45 శాతం, ఎస్సీ/ఎస్టీ, దివ్యాంగులు 40 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.

● పరీక్షలో ప్రతిభావంతులను ధ్రువపత్రాల పరిశీలన అనంతరం 1:6 నిష్పత్తిలో ప్రాక్టికల్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. దీనికి 30 మార్కులు. కొచ్చిన్‌లో ఈ పరీక్ష నిర్వహిస్తారు.

పోస్టు: జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ (మెకానికల్)
ఖాళీలు: 36
అర్హత: మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా 60 శాతంతో పూర్తిచేయాలి. సంబంధిత రంగంలో నాలుగేళ్ల అనుభవం ఉండాలి.

పోస్టు: జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ (ఎలక్ట్రికల్)
ఖాళీలు: 11
అర్హత: ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డిప్లొమా 60 శాతంతో పూర్తిచేయాలి. సంబంధిత రంగంలో నాలుగేళ్ల అనుభవం ఉండాలి.

వివరాలు

వయసు: 12.01.2026 నాటికి 35 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.700. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు.

వేతన శ్రేణి: జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్లకు నెలకు రూ.23,500-77,000. అసిస్టెంట్‌లకు నెలకు రూ.22,500-73,750. మూలవేతనానికి అదనంగా హెచ్‌ఆర్‌ఏ, డీఏ, ఇతర అలవెన్స్‌లు, ఇన్స్యూరెన్స్, వైద్య సదుపాయాలు ఉంటాయి.

● ధ్రువపత్రాల పరిశీలన/ ప్రాక్టికల్ టెస్టులకు హాజరయ్యే ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు స్లీపర్‌క్లాస్ రైలు చార్జీలను చెల్లిస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12.01.2026

వెబ్‌సైట్: www.cochinshipyard.in/

పోస్టు: అసిస్టెంట్
ఖాళీలు: 34
అర్హత: 60 శాతం మార్కులతో ఆర్ట్స్/ సైన్స్/ కామర్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్/ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిగ్రీ. ఎంఎస్-ఆఫీస్, ఎక్సెల్, ట్యాలీ, ఎస్ఏపీ నైపుణ్యాలు ఉన్నవారికి ప్రాధాన్యం. సంబంధిత రంగంలో నాలుగేళ్ల అనుభవం ఉండాలి.

ఎంపిక: ఈ పోస్టులకు ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ఆన్‌లైన్ టెస్టులు 100 మార్కులకు ఉంటాయి. ఆబ్జెక్టివ్ టెస్టు 70 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ నాలెడ్జ్, రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లిష్‌లలో ఒక్కో విభాగం నుంచి ఐదేసి ప్రశ్నలు వస్తాయి. సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు 50 ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. రుణాత్మక మార్కులు లేవు. వ్యవధి 75 నిమిషాలు.

● డిస్క్రిప్టివ్ పరీక్షకు 30 మార్కులు. వ్యవధి 60 నిమిషాలు.

● ఆబ్జెక్టివ్ పరీక్షలో జనరల్, ఈడబ్ల్యూఎస్‌లు 50 శాతం, ఓబీసీలు 45 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 40 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. ఇందులో అర్హత పొందినవారిని డిస్క్రిప్టివ్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

● సిలబస్ వివరాలు ప్రకటనలో ఉన్నాయి. వాటి నుంచే ప్రశ్నలు వస్తాయి. ఆన్‌లైన్ టెస్టులన్నీ కేరళలోని పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తారు. దరఖాస్తు సమయంలోనే వీటిని ఎంచుకోవాలి.

● నిర్దేశిత విద్యార్హతలు లేకుండా బీటెక్, ఎమ్మెస్సీ లాంటి ఉన్నత విద్యార్హతలు ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.

ఏజీఐసీఎల్‌లో

అమరావతి అభివృద్ధి, మౌలిక సదుపాయాల సంస్థ.. ఒప్పంద ప్రాతిపదికన పలు విభాగాల్లో 4 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● చీఫ్ ప్లానర్: 01 ● సీనియర్ ప్లానర్/ఆర్కిటెక్ట్స్: 01 ● ప్లానర్స్: 02
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం ఉండాలి. **వేతనం:** నెలకు చీఫ్ ప్లానర్‌కు రూ.3,00,000, సీనియర్ ప్లానర్‌కు రూ.1,75,000, ప్లానర్స్‌కు రూ.1,00,000.
పని ప్రదేశం: అమరావతి/ఏజీఐసీఎల్. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 19. **వెబ్‌సైట్:** https://www.agicl.org/careers

బెల్‌లో ఇంజినీర్లు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్), బెంగళూరు.. తాత్కాలిక ప్రాతిపదికన 51 ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● ట్రెయినీ ఇంజినీర్-1: 50 (ఎలక్ట్రానిక్స్: 30, మెకానికల్: 17, ఎలక్ట్రికల్: 01, సివిల్: 02)
● ట్రెయినీ ఆఫీసర్-1 (ఫైనాన్స్): 01
అర్హత: ట్రెయినీ ఇంజినీర్ పోస్టుకు సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉండాలి. ట్రెయినీ ఆఫీసర్‌కు ఎంబీఏ/ఎంకాం అవసరం.
వేతనం: మొదటి ఏడాది నెలకు రూ.30,000. రెండో ఏడాది రూ.35,000. మూడో ఏడాది రూ.40,000. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** విద్యార్హతలు, ఇంటర్వ్యూ/రాత పరీక్షలతో.
దరఖాస్తు ఫీజు: రూ.150. ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు ఫీజు ఉండదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15-01-2026. **రాత పరీక్ష/ ఇంటర్వ్యూ తేదీ:** 25.01.2026.
ఇంటర్వ్యూ వేదిక: భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, కొద్వారా, పౌడీ గఢ్వాల్. **వెబ్‌సైట్:** https://bel-india.in/

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో

ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్
సంస్థ: గ్రారీ ప్రై.లి.
నైపుణ్యాలు: మాంగోడీబీ, నెక్స్ట్.జేఎస్, నోడ్.జేఎస్, పైతాన్, రియాక్ట్, టైప్‌స్క్రిప్ట్
స్టైపెండ్: రూ.15,000
దరఖాస్తు గడువు: జనవరి 22
☛ https://tinyurl.com/3nxa3rsa

ఇండస్ట్రియల్ డిజైన్
సంస్థ: మేకర్‌వెర్స్ నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఆటోడెస్క్ ఫ్యూజన్ 360, కీషాట్, సాలిడ్‌వర్క్స్ స్టైపెండ్: రూ.12,000
దరఖాస్తు గడువు: జనవరి 17
☛ https://tinyurl.com/2b7emcz5

సోషల్ మీడియా మార్కెటింగ్
సంస్థ: ఆడిమ్ లైఫ్‌సైన్సెస్
నైపుణ్యాలు: కంటెంట్ రైటింగ్, కాపీ రైటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: జనవరి 17
☛ https://tinyurl.com/uu6ehyur

కన్సల్టెంట్
సంస్థ: ఏఐ సెర్ట్స్
నైపుణ్యాలు: కొలాబరేషన్, కన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్, క్రిటికల్ థింకింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, నెగోషియేషన్, ప్రయారిటైజేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, స్టేక్‌హోల్డర్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.15,000-20,000
దరఖాస్తు గడువు: జనవరి 22
☛ https://tinyurl.com/39redry6

విజయవాడలో

హెచ్‌ఆర్ కన్సల్టెంట్
సంస్థ: పింక్‌మూన్ టెక్నాలజీస్
నైపుణ్యం: ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.5,000-7,500
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/5n7nm38r

జావా డెవలప్‌మెంట్
సంస్థ: యాప్ జెనిసిస్ సాఫ్ట్ సొల్యూషన్స్ ప్రై.లి. నైపుణ్యాలు: హైబర్‌నేట్ ఓఆర్ఎం (జావా), జే2ఈఈ, జావా, జేఎస్‌పీ, మైఎస్‌క్యూఎల్, స్ప్రింగ్ ఎంవీసీ
స్టైపెండ్: రూ.11,000-20,000
దరఖాస్తు గడువు: జనవరి 14
☛ https://tinyurl.com/4bmajcv5

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: డిజిటల్ వెర్టో
నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, డిజిటల్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, గూగుల్ అనలిటిక్స్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఈఓ)
స్టైపెండ్: రూ.3,000-6,000
దరఖాస్తు గడువు: జనవరి 18
☛ https://tinyurl.com/zfdsbkbk

విశాఖపట్నంలో

మ్యూచువల్ ఫండ్ అనాలిసిస్
సంస్థ: ఆర్కే అండ్ కంపెనీ
నైపుణ్యాలు: ఇంగ్లిష్ రాయడం, ఎంఎస్-ఆఫీస్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్
స్టైపెండ్: రూ.2,000
దరఖాస్తు గడువు: జనవరి 17
☛ https://tinyurl.com/mbaymh3t

ఎంఎస్ఎంఈలో

మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్, విశాఖపట్నం.. ఒప్పంద ప్రాతిపదికన పలు విభాగాల్లో ట్రెయినర్, ప్రోగ్రామర్ కమ్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 19. **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ (బీఎస్సీ/ బీఈ/ బీటెక్)తోపాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** 35 ఏళ్లలోపు ఉండాలి.
పని ప్రదేశం: ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్, విశాఖపట్నం.
ఇంటర్వ్యూ తేదీలు: జనవరి 8, 9.
వేదిక: ఎంఎస్ఎంఈ - డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆఫీస్(డీఎఫ్ఓ), ఆటోనగర్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్.
వెబ్‌సైట్: https://www.msmetcvizag.org/

నిట్ వరంగల్‌లో

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), వరంగల్ ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రిసెర్చ్ ఫెలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్): 01
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, ఎంటెక్‌తో పాటు పని అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.37,000 - రూ.42,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 18.01.2026 **ఎంపిక:** ఇంటర్వ్యూతో
వెబ్‌సైట్:https://nitw.ac.in/page/?url=/careersnitw/Jobs/

చదువు

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా? మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: చదువు
ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ 501 512, edc@eenadu.in